
'సంక్షేమ పథకాల అమలే
సర్కారు పని తీరుకు కొలమానం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 14+10 వెల: ₹ 5.50
సంపుటి: 15
సంచిక: 360

బుధవారం 22-3-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




ఈ ఉగాది ఇంటింటా అవతరిస్తుంది
ఇక నిరాశ రాష్ట్రంలో అంతరిస్తుంది
సంక్షేమం ప్రతి గడపలో అవధరిస్తుంది
HAPPY UGADI
సంక్షేమ ప్రదాతకు ఉగాది శుభాకాంక్షలు
చెవిరెడ్డి మోహిత్ రెడ్డి M.S



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+10 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 360

బుధవారం 22-3-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | BANGALORE | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

సోనోవిజన్‌లో కొనుగోలుదారుల సందడి

ఉగాది డిస్కౌంట్ సేల్‌లో అన్ని పెద్ద కంపెనీలకు చెందిన కొత్త 2023 ఎయిర్ కండీషనర్ మోడల్స్ అత్యంత విస్తృతశ్రేణిలో లభిస్తున్నాయి. అంతే కాకుండా 10% వరకు లభించే క్యాష్‌బ్యాక్ పట్ల కొనుగోలుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మొబైల్స్, ల్యాప్‌టాప్స్ ముందెన్నడూ లేనంత ఎక్కువ డిస్కౌంట్‌తో లభించడం ఈ సంవత్సరం ప్రత్యేకత.



తెలుగు వారి తొలి పండగ ఉగాది శుభాకాంక్షలతో...
సోనోవిజన్ ఉగాది డిస్కౌంట్ సేల్
30
LG Life's Good 10 Years Compressor WARRANTY 5 Years PCB WARRANTY
Starting EMI : 3100/-
SAMSUNG Starting EMI : 3100/-
VOLTAS Starting EMI : 2875/-
LLOYD Starting EMI : 2875/-
HITACHI Starting EMI : 3100/-
DAIKIN Starting EMI : 3200/-
LG Life's Good Side by Side 694 Ltrs Refrigerator EMI : 12000/-
SAMSUNG Side by Side 700 Ltrs Refrigerator EMI : 6800/-
Whirlpool Frost Free Double Door 260 Ltrs Refrigerator EMI : 1958/-
VOLTAS beko Direct Cool Single Door 190 Ltrs Refrigerator EMI : 1000/-
Haier 256 Ltrs BMR Refrigerator EMI : 1958/-
LLOYD Frost Free Double Door 276 Ltrs Refrigerator EMI : 1900/-
Haier Side by Side 682 Ltrs Refrigerator EMI : 5250/-
LLOYD Side by Side 590 Ltrs Refrigerator EMI : 4625/-
SAMSUNG Frost Free Double Door 253 Ltrs Refrigerator EMI : 2041/-
Godrej Direct Cool Single Door 190 Ltrs Refrigerator EMI : 1116/-
LG Life's Good Direct Cool Single Door 215 Ltrs Refrigerator EMI : 1375/-
Haier Direct Cool Single Door 190 Ltrs Refrigerator EMI : 992/-
Chest Freezer 230 Ltrs EMI:1625/-
BAJAJ Air Cooler 67 Litres EMI : 1450/-
Crompton Air Cooler 55 Litres EMI : 1335/-
VOLTAS Air Cooler 72 Litres EMI : 1635/-
USHA Air Cooler 70 Litres EMI : 1634/-
orient Air Cooler 65 Litres EMI : 1568/-
KENSTAR Air Cooler 70 Litres EMI : 1535/-
SONY 108 Cm (43") 4K Anroid EMI : 1850/-
LG Life's Good 108 Cm (43") 4K Smart LED EMI : 1999/-
Panasonic 108 Cm (43") Smart LED EMI : 1875/-
SAMSUNG 80 Cm (32") Smart LED EMI : 990/-
LLOYD 108 Cm (43") Smart LED EMI : 1890/-
TCL 108 Cm (43") Google LED EMI : 916/-
SONY Sound Bar EMI : 1044/-
LG Life's Good Front Load Washing Machine 10.5 KGS EMI : 5200/-
SAMSUNG Front Load Washing Machine 9 KGS EMI : 3500/-
BOSCH Front Load Washing Machine 6 KGS EMI : 2475/-
IFB Top Load Washing Machine 6.5 KGS EMI : 1635/-
Whirlpool Top Load Washing Machine 7.0 KGS EMI : 1559/-
Convection Microwave Oven Rs : 10,800/- Onwards
Microwave Oven Rs : 6000/- Onwards
Chimney Rs : 9700/- Onwards
2 Burner Glass Manual Gas Stove Rs : 2700/- Onwards
Water Dispenser Rs : 8200/- Onwards
Water Purifier RO Rs : 13200/- Onwards
Water Geyser Rs : 3300/- Onwards
Wet Grinder Rs : 3300/- Onwards
Rice Cooker Rs : 1700/- Onwards
Mixer Rs : 3000/- Onwards
* T & C Apply
amazon pay Upto 1000/- క్యాష్ బ్యాక్ (షరతులు వర్తిస్తాయి)
visit : www.sonovision.in మా టీమ్ ఆన్‌లైన్ & ఆఫ్‌లైన్ సేవలను అందించడానికి సిద్ధంగా ఉన్నారు.
LG Life's Good SAMSUNG SONY Haier Whirlpool LLOYD Panasonic Godrej DAIKIN HITACHI VOLTAS Carrier IFB BOSCH BAJAJ
VOLTAS beko TCL V-GUARD Amirthaa Preethi EUREKA FORBES KENT ULTRA Butterfly FABER Crompton orient KEELINE AO Smith hp vivo oppo iPhone ONEPLUS ONIDA mi morphy richards
అందరికన్న తక్కువ ధరలు, నమ్మకమైన సర్వీస్‌తో అందరి అభిమానం పొందిన షోరూం సోనోవిజన్
విశాఖపట్నం
డైమండ్‌పార్క్ - 1 ద్వారకా నగర్, వైజాగ్ 9390006608, 8333924946
డైమండ్‌పార్క్ - 2 ద్వారకా నగర్, వైజాగ్ 9246667474, 8333924929
9246667575, 9154281127
9440804187, 9100991705
9100991704, 9154281129
9246666214, 9390006613
తూర్పు గోదావరి
9246662288, 9246666212
9100991700, 9154281119
9154281197, 98, 99
9246665511, 9246666201
7331149376, 77, 78
శ్రీ పొట్టి శ్రీరాములు జిల్లా
9246666206, 9154279913
నెల్లూరు - 8712600519, 20, 21
పశ్చిమ గోదావరి
8333924936, 9154281175
9246666205, 9154281172
9390006620, 9154281112
8333924938, 9154281115
విజయనగరం
9246666208, 9390006630
8712600523, 8712600535
శ్రీకాకుళం
శ్రీకాకుళం - 9154281140, 41
విజయవాడ ఎన్.టి.ఆర్. జిల్లా, కృష్ణా జిల్లా.
రామ మందిరం దగ్గర, ఏలూరు రోడ్, విజయవాడ. 9440804182, 9246666202
9440804183, 9246666209
9246666203, 9154281640
9246661616, 9100991702
8712600531, 532, 533
ఏలూరు రోడ్, విజయవాడ. 9154281648, 649, 650.
9100991701, 8333924945
9100991703, 9154281626
8333924930, 9154281628
8712600536, 8712600537
9154281645, 46, 47
గుడివాడ
ఏలూరు రోడ్, గుడివాడ. 9100991708, 9154281178, 79
మచిలీపట్నం
మచిలీపట్నం - 7331149379, 80, 81
గుంటూరు జిల్లా
9154279910, 9440804185
9246667373, 9154867822, 23, 24
లక్ష్మీపురం, గుంటూరు. 9246666204, 9154279905
9246666215, 9100991706
8333924937, 9154279903
9246666211, 9154279901
9390006609, 9154281200
7331149366, 367, 368
ఒంగోలు
9246666329, 9154279918
రాయలసీమ
తిరుపతి - 7331149370, 371, 372
తిరుపతి - 9100991707, 9154279918
9440804186, 9154279916
కర్నూలు - 9154281642, 43,
కర్నూలు - 8333924947, 48
అనంతపురం - 9154281191, 92
కడప - 9154281194, 96
8712600528, 8712600530
8712600525, 526, 527
హైదరాబాద్
పంజాగుట్ట, హైదరాబాద్. 9246663535, 9440804181
9154281180, 9154281181
హైదర్ నగర్, హైదరాబాద్. 7331149363, 364, 365
8333924932 / 933
8333924943, 9154281188
ఖమ్మం
9246666319, 9154281634
9100991709, 9154281635
8333924931, 9154281637, 38
9154867825, 26, 27

సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14+10 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 360

బుధవారం 22-3-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | BANGALORE | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండగ రోజు'

క్లుప్తంగా...

పంట నష్టాలను అంచనా వేయండి

వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది ఆదేశం

సాక్షి, అమరావతి: అకాల వర్షాలు, వడగండ్లు, గాలుల వల్ల ఏర్పడిన పంట నష్టం అంచనాలను ఈ–క్రాప్ ఆధారంగా చేపట్టాలని వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యాన శాఖ కమిషనర్లు చేవూరు హరికిరణ్, ఎస్ఎస్ శ్రీధర్‌తో కలిసి అన్ని జిల్లాల వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులతో మంగళవారం మంగళగిరిలోని వ్యవసాయ శాఖ క్యాంప్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ద్వివేది మాట్లాడుతూ.. ఈ నెల 30 నాటికి పంట నష్టం జాబితాలను తయారు చేయాలన్నారు. వాటిని ఏప్రిల్ 1 నుంచి 3 వరకు సోషల్ ఆడిట్ కోసం ఆర్బీకేల్లో ప్రదర్శించాలన్నారు. అభ్యంతరాల పరిష్కారం అనంతరం మార్చి 4న జిల్లాల వారీగా ప్రతిపాదనలను కమిషనర్ కార్యాలయానికి పంపించాలన్నారు.

మార్చి 31 నాటికి ఈ–కేవైసీ పూర్తి చేయండి

పీఎం కిసాన్ లబ్ధిదారులకు 14వ విడత సాయం కోసం మార్చి 31వ తేదీకల్లా ఈ–కేవైసీ చేయించాలని ద్వివేది కోరారు. బ్యాంక్ అకౌంట్, ఆధార్ అనుసంధానం లేని లబ్ధిదారులంతా సత్వరమే ఆ ప్రక్రియ పూర్తి చేసి ఎన్‌పీసీఐతో అనుసంధానం చేయ్యాలన్నారు. మిగిలిన 4,200 ఆర్బీకేల్లో వైఎస్సార్ యంత్రసేవా కేంద్రాల ఏర్పాటును ఏప్రిల్ 5 నాటికి పూర్తి చేయాలన్నారు. 2023–24లో ఆర్బీకేల ద్వారా కనీసం 10 లక్షల టన్నుల ఎరువుల పంపిణీకి చర్యలు చేపట్టాలన్నారు. ఎరువుల నిల్వకు ఆర్బీకే స్థాయిలో గోదాములను సిద్ధం చేసుకోవాలన్నారు. ప్లాంట్ హెల్త్ డయాగ్నోస్టిక్ సెంటర్లను తొలి విడతలో మండలానికి ఒకటి ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో కనీసం 10 ఆర్బీకేల్లో కియోస్క్‌లు 24 గంటలూ పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

రిషికొండ తవ్వకాలపై నివేదికకు గడువు పెంపు



సాక్షి, అమరావతి: రిషికొండ తవ్వకాలపై సర్వే నిమిత్తం కేంద్ర ప్రభుత్వ అధికారులతో హైకోర్టు ఏర్పాటు చేసిన కమిటీ ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపిందని కేంద్ర ప్రభుత్వం తరఫున డిప్యూటీ సొలిసిటర్ జనరల్ (డీఎస్‌జీ) ఎన్.హరినాథ్ మంగళవారం హైకోర్టుకు నివేదించారు. కమిటీ ప్రస్తుతం నివేదిక తయారు చేసే పనిలో నిమగ్నమై ఉందని, నివేదిక సమర్పణకు కొంత గడువు కావాలని కోర్టును కోరారు. ఈ అభ్యర్థనపై సానుకూలంగా స్పందించిన హైకోర్టు తదుపరి విచారణను ఏప్రిల్ 12వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖ జిల్లా యండాడలోని సర్వే నంబర్–19 పరిధిలోని కోస్టల్ రెగ్యులేషన్ జోన్‌లో చెట్ల నరికివేత, భూమి తవ్వకాలకు అధికారులు అనుమతులు ఇవ్వడం వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్‌కు విరుద్ధమంటూ జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఇదే అంశంపై విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ కూడా పిల్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై సీజే ధర్మాసనం ఇటీవల విచారణ జరిపి తవ్వకాలపై సర్వే చేసి నివేదిక ఇవ్వాలంటూ కేంద్ర ప్రభుత్వ అధికారులతో ఓ కమిటీ ఏర్పాటు చేసింది. ఈ వ్యాజ్యాలు మంగళవారం మరోసారి విచారణకు రాగా.. నివేదిక సమర్పించేందుకు గడువు కావాలని డీఎస్‌జీ కోరడంతో ధర్మాసనం అంగీకరిస్తూ విచారణను వాయిదా వేసింది.

రైల్వే పనుల పురోగతిపై నివేదిక ఇవ్వండి

రైల్వే అధికారులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: విజయవాడ మధురానగర్‌లో అప్రోచ్ రోడ్, రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులను పూర్తి చేయకపోవడం వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులపై వివరణ ఇచ్చేందుకు దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌జైన్, విజయవాడ డీఆర్ఎం షివేంద్ర మోహన్, విజయవాడ మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ మంగళవారం హైకోర్టు ఎదుట హాజరయ్యారు. ప్రజల ఇబ్బందులను తొలగించేందుకు వీలైనంత త్వరగా పనులను పూర్తి చేస్తామని హైకోర్టుకు హామీ ఇచ్చారు. దీనిని పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు పనుల పురోగతిపై నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అప్రోచ్ రోడ్డు, రైల్వే అండర్ బ్రిడ్జి పనులను పూర్తి చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారంటూ జవ్వాజి సూర్యానారాయణ అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై ఇటీవల విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ దేవానంద్ పనుల్లో జాప్యంపై వివరణ ఇచ్చేందుకు రైల్వే జీఎం, డీఆర్ఎం వ్యక్తిగత హాజరుకు ఆదేశాలివ్వగా.. రైల్వే జీఎం, డీఆర్ఎం కోర్టు ముందు హాజరయ్యారు. పనుల పురోగతిపై నివేదిక ఇవ్వాలని ఆదేశించిన న్యాయమూర్తి తదుపరి విచారణను ఏప్రిల్ 4వ తేదీకి వాయిదా వేశారు.



వెల్త్.. హెల్త్!

వీటికే దక్షిణాది ఓటు

ఆరోగ్య పరిరక్షణ, సామాజిక బాధ్యత వంటివీ ప్రధాన లక్ష్యాలుగా గుర్తింపు

ప్రజల దృష్టికోణాన్ని కరోనా మార్చినట్లు వెల్లడి

దక్షిణాది రాష్ట్రాల్లోని వారి జీవిత లక్ష్యాలు, ప్రాధాన్యతలపై అధ్యయనం

'ఇండియాస్ లైఫ్ గోల్స్ ప్రిపేర్డ్‌నెస్–2023'సర్వే

సాక్షి, హైదరాబాద్

కుటుంబ ఆర్థిక భద్రతకే దక్షిణాది రాష్ట్రాల పౌరులు అధికంగా మొగ్గుచూపుతున్నారు. దేశంలోని మిగతా ప్రాంతాలతో పోలిస్తే ఈ విషయంలో వారు మరింత జాగ్రత్తగా, ఆ లక్ష్యాల సాధన దిశగా కృషిచేస్తున్నారు. తమ జీవిత అత్యున్నత లక్ష్యాల్లో 'కుటుంబ ఆర్థిక పరిపుష్టి' సాధన ముఖ్యమని 74 శాతం మంది భావిస్తున్నారు. అలాగే, ఆరోగ్య పరిరక్షణ, సామాజిక బాధ్యత కింద సేవా కార్యక్రమాలు, ఇతర ప్రాంతాలకు ప్రయాణాలు వంటి వాటిని వీరు ఇతర ప్రధాన లక్ష్యాలుగా నిర్దేశించుకున్నారు. 'ఇండియాస్ లైఫ్ గోల్స్ ప్రిపేర్డ్‌నెస్–2023'పేరిట ఓ ప్రైవేట్ బీమా సంస్థ నిర్వహించిన అధ్యయనంలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. దక్షిణాది రాష్ట్రాల్లోని వారి జీవిత లక్ష్యాలు, వాటి సాధన ప్రాధాన్యతలపై ఈ సంస్థ అధ్యయనం చేసింది. దేశవ్యాప్తంగా 13 మెట్రోలు, ప్రథమ, ద్వితీయ శ్రేణి నగరాల్లో 22–55 ఏళ్ల వయసు మధ్య వారితో ఈ సర్వే నిర్వహించింది. దక్షిణాదికి సంబంధించి.. గుంటూరు, మదురై, బెంగళూరు, చెన్నైల్లో ఈ అధ్యయనం చేశారు.



జీవిత బీమాలో పెట్టుబడులు

'దక్షిణ భారత ప్రజల జీవిత లక్ష్యాలు, ఆశలు, లక్ష్యాల సాధనకు సంబంధించి 40 అంశాలపై పరిశీలన చేశాం. ఇందులో అనేక ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి. కుటుంబ ఆర్థిక భద్రతకు దక్షిణాది వారు పెద్దపీట వేశారు. తమ జీవిత లక్ష్యాల సాధనకు జీవిత బీమాలో పెట్టుబడులు పెట్టడమే సరైన మార్గమని అధికశాతం అభిప్రాయపడ్డారు. కరోనా మహమ్మారి జీవితం, కెరీర్, ఆరోగ్యం, కుటుంబం పట్ల దృష్టికోణాన్ని మార్చింది. కుటుంబభద్రత, సామాజికంగా మంచి సంబంధాలు కలిగి ఉండటం, సామాజిక–ఆర్థిక పరిస్థితులు తదితర అంశాలన్నింటిని కలిపి మొత్తంగా జీవితాన్ని ప్రతిబింబించేలా ఆలోచనలు మారాయి'అని బీమా సంస్థ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ చంద్రమోహన్ మెహ్రా చెప్పారు.

సర్వేలో కీలకాంశాలు

- వయసు, లింగ భేదంతో సంబంధం లేకుండా అంతా లక్ష్యాలు నిర్దేశించుకుంటున్నారు
- ఇతర లక్ష్యాల కంటే కుటుంబ ఆర్థిక భద్రత తమ ప్రాధాన్యమన్న 74 శాతం మంది
- ఆరోగ్యపరిరక్షణ, సేవా కార్యక్రమాలు, ప్రయాణాలు ఇతర ప్రధాన లక్ష్యాలని అధిక శాతం వెల్లడి
- ఆరోగ్యం, ఫిట్‌నెస్‌కు సంబంధించిన లక్ష్యాలు నిర్దేశించుకున్న వారు 73 శాతం
- ప్రతీ ఇద్దరిలో ఒకరు శారీరకంగా, మానసికంగా ఫిట్‌గా ఉండాలనేది కోరిక
- తమను ప్రభావితం చేసే వాటిలో సోషల్ మీడియా పాత్ర పెరిగిందని ఎక్కువ మంది చెప్పారు
- సోషల్ మీడియా టాప్–3 లైఫ్‌గోల్స్ ఇన్‌ఫ్లుయెన్సర్లలో ఒకటిగా ఉంది
- కోవిడ్ అనంతర పరిస్థితుల్లో సామాజికసేవ, దాతృత్వం వైపు 61 శాతం మంది మొగ్గు
- ప్రతీ ముగ్గురిలో ఒకరు సామాజికంగా ప్రభావం చూపే వాటికి విరాళాలిచ్చేందుకు ఆసక్తి
- బాగా డబ్బు సంపాదించి ఉద్యోగాల నుంచి రిటైర్ కావాలనే భావనలో 30 శాతం
- లక్ష్యాల సాధనలో సందిగ్ధత వ్యక్తంచేసిన వారు 52 శాతం
- తమ జీవిత కాలంలో కనీసం ఐదు లక్ష్యాలనైనా చేరుకోవాలని ఆశిస్తున్నారు
- పిల్లలకు మంచి చదువు, సొంత ఇంటి కోసం ఎక్కువ మంది మొగ్గుచూపుతున్నారు
- మిగిలిన ప్రాంతాలతో పోలిస్తే మెట్రో నగరాల్లో నివసిస్తున్న వారిలో ఈ ఆశలు, ఆశయాలు మరింత ఎక్కువగా కనిపించాయి
- నవయువతరం మాత్రం వ్యక్తిగత ప్రయోజనాల సాధనకు ఆసక్తి చూపింది. హెల్త్, ఫిట్‌నెస్, విదేశీ ప్రయాణం వైపు మొగ్గు చూపింది.

కుంభకోణాల్లో ఘనాపాఠి చంద్రబాబు

సైబర్ నేరగాళ్లకు కూడా తెలియని విద్యలు బాబుకు తెలుసు

- 2014లో అధికారంలో రాగానే రూ.371 కోట్లను మింగేశారు
- టెండర్ లేకుండానే సీమెన్స్‌కు ప్రాజెక్టు
- బాబు అక్రమాల నిగ్గు తేలుస్తాం
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: అవినీతి కుంభకోణాల్లో ఆరితేరిన ఘనాపాఠి చంద్రబాబు అని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని తీవ్ర విమర్శలు చేశారు. సైబర్ నేరగాళ్లకు సైతం తెలియని విద్యలు బాబుకు తెలుసన్నారు. వారికి కూడా చంద్రబాబు పాఠాలు నేర్పగలరని తెలిపారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో మంగళవారం మంత్రి రజిని మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు హయాంలో సీమెన్స్ స్కామ్ గురించి శాసనసభలో సీఎం వైఎస్ జగన్ అరటిపండు వలిచిపెట్టినట్లు వివరాలు వెల్లడించారన్నారు. 2014లో చంద్రబాబు అధికారంలోకి వచ్చిన రెండు నెలలకే దోపిడీని మొదలు పెట్టారని విమర్శించారు. వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని కాపాడటానికి సీఎం జగన్ రివర్స్ టెండరింగ్ విధానం ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. చంద్రబాబు మాత్రం అసలు టెండర్ అనే మాటే లేకుండా దోచేశారన్నారు.

వినేవాళ్లు వెర్రి వెంగళప్పలయితే.. చెప్పేవాడు చంద్రబాబు



స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు మొత్తం ఖర్చు రూ.3,356 కోట్లు అయితే.. ఇందులో ప్రభుత్వ వాటా పది శాతమని నాడు చంద్రబాబు చెప్పారన్నారు. సీమెన్స్ వాటా 90 శాతం అన్నారని.. ఇదెలా సాధ్యమని రజిని ప్రశ్నించారు. ప్రైవేటు సంస్థ అయిన సీమెన్స్.. గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద రూ.3 వేల కోట్లు ఎందుకిస్తుందని.. ప్రజలు లాజిక్‌గా ఆలోచించాలని కోరారు. వినేవాళ్లు వెర్రి వెంగళప్పలయితే చెప్పేది చంద్రబాబు అన్నట్లు ఉందని ఎద్దేవా చేశారు. ఏ మాత్రం బుర్ర ఉన్న ప్రభుత్వమైనా ఎవరి పెట్టుబడి ఎంత? ఖర్చు ఎలా చేస్తారు? ప్రాజెక్టు ఎప్పటికి పూర్తవుతుంది? ఇలా అన్ని కోణాల్లో ఆలోచించి, అధ్యయనం చేసిన తర్వాతే ఏ ప్రాజెక్టుకైనా అంగీకారం తెలుపుతుందన్నారు. అయితే సీమెన్స్ వ్యవహారంలో ఈ అంశాల్లో దేన్నీ పట్టించుకోలేదని తెలిపారు. తద్వారా ఇది చంద్రబాబు దోపిడీకి ఉద్దేశించిన ప్రాజెక్టు అని స్పష్టంగా తెలిసిపోయిందన్నారు. ఉన్నతాధికారులను ఓవర్ లుక్ చేసి.. కేబినెట్‌లో ఓకే చేయించుకుని జీవో విడుదల చేశారని ఆరోపించారు. రూ.371 కోట్లను చంద్రబాబు కాజేసిన విధానం చూస్తే... క్రైమ్ సినిమాలకు కూడా బాబు స్క్రిప్ట్ ఇవ్వగలరని రుజువు అవుతోందన్నారు. ప్రజాధనాన్ని ఎలా దోచుకోవచ్చో సినిమా రచయితలు చంద్రబాబు నుంచి కథలు తీసుకోవచ్చన్నారు. ఆదాయ పన్ను అధికారుల్లా నటించి దోపిడీలు చేసే ముఠా చిత్రవిచిత్రాలు ఈ మధ్య విడుదలైన ఒక సినిమాలో కనిపిస్తాయని, చెప్పాలంటే అంతకు మించిన ప్రణాళికతో చంద్రబాబు సీమెన్స్ స్కామ్‌కు పాల్పడ్డారని విమర్శించారు.

దోచుకోవడంలో చంద్రబాబు స్టైలే వేరు

చంద్రబాబు యువతను వంచించడం ఇదే మొదటిసారి కాదని, ఇంటికో ఉద్యోగం పేరిట 2014 ఎన్నికల్లో మోసం చేశారని మంత్రి రజిని విమర్శించారు. దోచుకోవడంలో చంద్రబాబు స్టైలే వేరన్నారు. దోచుకున్న విషయం బట్టబయలైనా సరే ఆయన ఏ మాత్రం సిగ్గుపడరన్నారు. పైగా దాన్ని సమర్థించుకోవడానికి ఎల్లో మీడియా ద్వారా అడ్డగోలు వాదనలు వినిపిస్తారని విమర్శించారు. బాబు తప్పుడు వాదనే కరెక్టు అని ముద్రవేయటానికి దుష్టచతుష్టయం సిద్ధంగా ఉంటుందన్నారు. ఎంతటి నేరగాడైనా ఎక్కడో ఒక చోట తప్పులో కాలేస్తాడని, చంద్రబాబు కూడా అలాగే అన్నీ మాయం చేశాననుకున్నారన్నారు. ప్రస్తుతం సీమెన్స్ కుంభకోణంపై సీఐడీ, జీఎస్టీ, ఐటీ, ఈడీ, తదితర విభాగాలన్నీ దర్యాప్తు ప్రారంభించాయని.. బాబు అక్రమాల నిగ్గు తేలుస్తామని తెలిపారు.

ఆ ఆశ్రమం..'మమత'ల కోవెల

- ఎన్టీఆర్ జిల్లా లచ్చపాలెంలో వృద్ధాశ్రమం ఏర్పాటు
- ప్రకృతి ఒడిలో 50 సెంట్ల విస్తీర్ణంలో ఏర్పాటు
- ఆత్మీయుల ఆదరణ కరువైన వారిని అక్కునచేర్చుకున్న నిర్వాహకులు


ప్రకృతి ఒడిలో అందంగా కనిపిస్తున్న ఆశ్రమం

నందిగామ: కన్నబిడ్డలకు భారమై, ఆత్మీయుల ఆదరణకు దూరమై క్షణం ఒక యుగంలా గడుపుతున్న అవ్వాతాతలను అక్కున చేర్చుకుని 'మమత'ను పంచుతోంది ఎన్టీఆర్ జిల్లా లచ్చపాలెంలోని వృద్ధాశ్రమం. పచ్చని చెట్ల నడుమ ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆశ్రమం నడుస్తోంది. మలిదశలో ఉన్న వారి మనస్సుకు ప్రశాంతతను ఇస్తోంది. సేవే లక్ష్యంగా ఆశ్రమాన్ని నిర్వహిస్తూ పలువురికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం లింగాలపాడు గ్రామానికి చెందిన వేముగంటి మమత. ఆహ్లాదకర వాతావరణంలో ఆత్మీయతలను పంచే వృద్ధాశ్రమంపై ప్రత్యేక కథనం..

సొంతూరుకు ఏదో చేయాలని..

ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం లింగాలపాడు గ్రామానికి చెందిన వేముగంటి మమత ప్రస్తుతం హైదరాబాదులో బుక్ డిజైనింగ్ కంప్యూటర్ వర్క్ చేస్తుంటారు. ఆమె భర్త చక్రవర్తి వ్యాపారి. వీరు హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. చిన్నతనం నుంచి సేవా దృక్పథం కలిగిన మమత హైదరాబాద్‌లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తాను పెరిగిన గ్రామానికి ఏదో ఒకటి చేయాలన్న ఆలోచనతో లింగాలపాడు సమీపంలోని లచ్చపాలెం గ్రామంలో 2020 సంవత్సరంలో 50 సెంట్ల స్థలంలో సుమారు రూ.90 లక్షల వరకు వెచ్చించి ఆశ్రమాన్ని ఏర్పాటు చేశారు. అభయం సొసైటీ ద్వారా పి.వి.ఆర్.కె.ప్రసాద్ శేష సదన్ పేరుతో ఏర్పాటు చేసిన ఈ ఆశ్రమంలో వృద్ధులకు అవసరమైన అన్ని సదుపాయాలు సమకూర్చారు. సాయంత్రం వేళ ఆహ్లాదం కోసం పచ్చని గార్డెన్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆశ్రమంలో 22 మంది ఆశ్రయం పొందుతున్నారు.


ఆశ్రమంలో వృద్ధులకు సూచనలిస్తున్న మమత

నందిగామ ప్రాంత వాసుల సహకారం..

సేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న మమత తన దగ్గర ఉన్న నగదుతో పాటు మరో రూ.30 లక్షల వరకు బ్యాంక్ ద్వారా రుణం తీసుకొని మొత్తం సుమారు రూ.90 లక్షలతో ఆశ్రమ నిర్మాణం పూర్తి చేశారు. ఆమె ఆలోచనకు పలువురు దాతలు సహకారం అందించారు. ఆశ్రమానికి తరచూ వచ్చి వెళుతూ వృద్ధుల బాగోగులు చూసుకుంటున్నారు. నందిగామ చుట్టు పక్కల ప్రాంతాల వారు ఆశ్రమంలో జన్మదిన వేడుకలు, వివాహ మహోత్సవ వేడుకలు జరుపుకుంటూ ఆశ్రమానికి మరింత అండగా నిలుస్తున్నారు.

రెండేళ్ల నుంచి ఇక్కడే



నా భర్త 30 ఏళ్ల కిందట చనిపోయాడు. ప్రస్తుతం నాకు 70 సంవత్సరాలు. పిల్లలు ఉన్నప్పటికీ వాళ్లు నన్ను పెద్దగా పట్టించుకోవడం లేదు. దీంతో రెండేళ్ల నుంచి ఇక్కడే ఉంటున్నా. ఇక్కడ నన్ను సొంత తల్లి లాగా చూసుకుంటున్నారు. నాకు ఇక్కడ ఎంతో ప్రశాంతంగా ఉంటోంది.

–కన్నూరి రాజేశ్వరమ్మ, తిరువూరు

మరింత అభివృద్ధి చేయాలి



చిన్నతనం నుంచి ఎదుటి వారికి సేవ చేయడమంటే ఇష్టం. ఈ ఉద్దేశంతోనే సొంత ఊరిలో ఆశ్రమం ఏర్పాటు చేశా. రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చేయాలి. ఆశ్రమంలో ఉండేవాళ్లు ప్రశాంతంగా ఉండాలన్న లక్ష్యంతో ప్రకృతి ఒడిలో ఆశ్రమాన్ని నిర్మించాం.

–వేముగంటి మమత, ఆశ్రమ నిర్వాహకురాలు

ఏపీ ఇన్ పార్లమెంట్

రూ.1.49 లక్షల కోట్లకు ఆయుష్ మార్కెట్

రాజ్యసభలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్రం సమాధానం

రాజ్యసభ



సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఆయుష్ పరిశ్రమ మార్కెట్ రూ.1.49 లక్షల కోట్లకు చేరిందని ఆయుష్ మంత్రి సర్బానంద సోనోవాల్ తెలిపారు. భారతీయ సంప్రదాయ వైద్యవేదిక నివేదిక ప్రకారం 2014–15లో రూ.23,532 కోట్లు ఉన్న మార్కెట్ 2020 నాటికి రూ.1.49 లక్షల కోట్లకు చేరిందని చెప్పారు. రాజ్యసభలో మంగళవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు. ఆయుష్ రంగంలో అంతర్జాతీయ సహకారాన్ని పెంపొందించేందుకు తమ శాఖ ఒక పథకాన్ని రూపొందించిందన్నారు. అందులో భాగంగా భారతీయ ఆయుష్ తయారీదారులు, సర్వీస్ ప్రొవైడర్లు ఎగుమతులను మరింత వృద్ధిచేసుకునేందుకు వీలుగా పలు చర్యలు చేపడుతోందన్నారు. వాణిజ్య, పరిశ్రమలశాఖ సహకారంతో ఆయుర్వేద, యునాని, సిద్ధ, హోమియోపతి, తదితర వైద్య విధానాలకు సంబంధించిన ఔషధాలు, ఇతర ఉత్పాదనల ఎగుమతుల కోసం ఆయుష్ ఎక్స్‌పోర్ట్ కౌన్సిల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయుష్ వైద్య విధానాన్ని అంతర్జాతీయంగా ప్రోత్సహించేందుకు వేర్వేరు దేశాలతో 24 ఒప్పందాలను చేసుకున్నట్లు చెప్పారు. ఆయుష్ విధానాలపై పరిశోధనలు, అధ్యయనంపై సహకారం నిమిత్తం వివిధ అంతర్జాతీయ సంస్థలతో 40 ఒప్పందాలు చేసుకున్నామని, ఆయుష్ అకడమిక్ చైర్స్ నెలకొల్పేందుకు 15 ఎంవోయూలు, 35 దేశాల్లో ఆయుష్ సమాచార కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు 39 ఒప్పందాలు చేసుకున్నామని వివరించారు. 31 ఆయుర్వేద డ్రగ్ మాన్యుఫ్యాక్చరర్స్ ఆయుర్వేద, సిద్ధ, యునాని, హోమియో మందులను ఎగుమతి చేసుకునేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) గుడ్ మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాక్టీస్ (జీఎంపీ) ధ్రువపత్రం ఇచ్చిందని మంత్రి చెప్పారు.

దేశంలో రెండు డబ్ల్యూహెచ్‌వో కొలాబొరేటివ్ సెంటర్లు

ఆయుష్ వైద్య విధానంలో ప్రపంచ ఆరోగ్యసంస్థ సహకారంతో దేశంలో రెండు కొలాబొరేటివ్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు ఆయుష్ మంత్రి సర్బానంద సోనోవాల్ తెలిపారు. విజయసాయిరెడ్డి మరో ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. ఢిల్లీలోని మొరార్జీదేశాయ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగా, గుజరాత్ జామ్‌నగర్‌లో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టీచింగ్ అండ్ రీసర్చ్ ఇన్ ఆయుర్వేదలో ఇవి ఉన్నట్లు చెప్పారు. ప్రపంచ ఆరోగ్యసంస్థతో కలిసి ప్రాజెక్ట్ కొలాబొరేషన్ ఒప్పందంలో భాగంగా నాలుగు డబ్ల్యూహెచ్‌వో బెంచ్‌మార్క్ డాక్యుమెంట్లను రూపొందించడం ప్రారంభించిందని తెలిపారు.

జేఎన్‌టీయూ–కాకినాడ బైక్ అంబులెన్స్ యోచన



గిరిజన ప్రాంతాల్లో బైక్ అంబులెన్స్‌ను వినియోగించాలన్న ఆలోచనతో కాకినాడ జేఎన్‌టీయూ ముందుకొచ్చిందని కేంద్ర ఆరోగ్యశాఖ సహాయమంత్రి భారతి ప్రవీణ్ తెలిపారు. ఏపీ గిరిజన సంక్షేమశాఖకు కేంద్ర గిరిజన వ్యవహారాలశాఖ రూ.4.90 కోట్ల ఆర్థిక సాయం అందించినట్లు వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి ప్రశ్నకు సమాధానమిచ్చారు. నేషనల్ హెల్త్‌మిషన్ కింద హిమాచల్‌ప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్ర, తెలంగాణల్లో 131 బైక్ అంబులెన్స్‌లకు మద్దతు ఇచ్చినట్లు తెలిపారు.

ఏపీలో 17,330.91 మిలియన్ యూనిట్ల పునరుత్పాదక ఇంధన వనరులు

2022–23లో జనవరి వరకు ఆంధ్రప్రదేశ్‌లో 17,330.91 మిలియన్ యూనిట్ల పునరుత్పాదక ఇంధన వనరుల ఉత్పత్తి జరిగిందని కేంద్ర విద్యుత్‌శాఖ మంత్రి ఆర్.కె.సింగ్ తెలిపారు. ఇది భారత దేశ ఉత్పత్తిలో 5.47 శాతమని వైఎస్సార్‌సీపీ ఎంపీ పరిమళ్ నత్వానీ ప్రశ్నకు సమాధానమిచ్చారు.

లోక్‌సభ

హోదాపై పాత పాటే

- రాష్ట్రాలకు రెవెన్యూ లోటు గ్రాంట్లు ఇస్తున్నాం
- లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ ఎంపీల ప్రశ్నకు కేంద్రం సమాధానం

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాపై కేంద్రం పాత మాటే పునరుద్ఘాటించింది. 14వ ఆర్థికసంఘం సూచనల మేరకు రాష్ట్రాల వనరుల అంతరాన్ని సాధ్యమైనంతగా పూరించడానికి రెవెన్యూ లోటు గ్రాంట్లు ఇస్తున్నామని పేర్కొంది. లోక్‌సభలో మంగళవారం వైఎస్సార్‌సీపీ ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, బాలశౌరి ప్రశ్నకు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్ సమాధానమిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌తో సహా పలు రాష్ట్రాల నుంచి ప్రత్యేకహోదా అభ్యర్థనలు వచ్చాయన్నారు. 14వ ఆర్థికసంఘం పన్నుల క్షితసమాంతర పంపిణీలో సాధారణ కేటగిరీ, ప్రత్యేక కేటగిరీ రాష్ట్రాల మధ్య వ్యత్యాసం చూపలేదని చెప్పారు. ఈ ఆర్థికసంఘం సిఫార్సుల మేరకు రాష్ట్రాలకు పన్నుల్లో వాటాను 2015–2020 కాలానికి 32 శాతం నుంచి 42 శాతానికి పెంచినట్లు తెలిపారు. 2020–21, 2021–26 కాలానికి 15వ ఆర్థికసంఘం కూడా పన్నుల్లో 41 శాతం వాటా ఇవ్వాలని సూచించిందని చెప్పారు. ఏపీ విభజన చట్టంలోని పలు నిబంధనలు అమలు చేశామని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. మౌలికసదుపాయాలు, విద్యాసంస్థలకు చెందిన కొన్నింటికి చట్టంలో పదేళ్ల కాలపరిమితి విధించారని పేర్కొన్నారు.

ఏపీలో 350 ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 350 ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు గుర్తించిందని కేంద్ర మత్స్యశాఖ మంత్రి పురుషోత్తం రూపాలా తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ ఎం.వి.వి.సత్యనారాయణ ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. వీటిలో 38 సెంటర్లను ఫిషింగ్ హార్బర్లు, ఫిష్ ల్యాండింగ్ సెంటర్లుగా వివిధ కేంద్ర పథకాల ద్వారా అభివృద్ధి చేయాలని ఏపీ ప్రభుత్వం ప్రతిపాదనలు పంపిందన్నారు. విశాఖపట్నం, కాకినాడ, నిజాంపట్నం, భావనపాడు, మచిలీపట్నాల్లో ఫిషింగ్ హార్బర్లు, మరో 21 ఫిష్ ల్యాండింగ్ సెంటర్లను రూ.85.42 కోట్లతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించిందని వివరించారు. రాష్ట్రంలో బ్లూ రివల్యూషన్ పథకం అమలు నాటినుంచి రూ.2,956.16 కోట్లతో 13 ఫిషింగ్ హార్బర్లు/ఫిష్ ల్యాండింగ్ కేంద్రాల ప్రతిపాదనలకు అనుమతించామన్నారు. ఆయా నిర్మాణాల వల్ల 55 వేలమందికి ఉపాధి లభిస్తుందని చెప్పారు. 12 ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల వద్ద ఫ్లోటింగ్ జెట్టీలను రూ.279.5 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించినట్లు తెలిపారు. దీంతోపాటు 26 జిల్లాల్లో 200 ఫిష్ ల్యాండింగ్ కేంద్రాల్లో (168 మెరైన్, 32 రిజర్వాయర్లు) మౌలికవసతుల అభివృద్ధి చేయాలని, మూడు ఫిష్ ల్యాండింగ్ కేంద్రాల్లో ప్రధానమంత్రి మత్స్యసంపద యోజనలో భాగంగా మౌలికవసతులు అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిందని మంత్రి వివరించారు.

ఎఫ్ఐడీఎఫ్‌లో 4 ఫిషింగ్ హార్బర్లకు అనుమతి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదనల మేరకు రాష్ట్రంలో నాలుగు ఫిషింగ్ హార్బర్లకు ఫిషరీస్, ఆక్వాకల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ (ఎఫ్ఐడీఎఫ్) ద్వారా అనుమతించినట్లు కేంద్ర మత్స్యశాఖ మంత్రి పురుషోత్తం రూపాలా తెలిపారు. ఉప్పాడ, వాడ్రేవు, మచిలీపట్నం, నిజాపట్నాల్లో రూ.1,291.40 కోట్లతో నిర్మించే ఈ ప్రాజెక్టులను కాలపరిమితితో పూర్తిచేయడానికి అనుమతించినట్లు వైఎస్సార్‌సీపీ ఎంపీలు మాగుంట శ్రీనివాసులురెడ్డి, వంగా గీతావిశ్వనాథ్ ప్రశ్నకు జవాబిచ్చారు.

బెజవాడలో మరో చైన్‌లింక్ మోసం

- సురక్ష ట్రేడర్స్, ఆభరణ జ్యూయలర్స్ పేరుతో భారీగా వసూళ్లు
- రెట్టింపు డబ్బులిస్తామంటూ డిపాజిటర్లకు వల
- తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటకలోనూ వేలల్లో బాధితులు
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు


సాక్షి ప్రతినిధి, విజయవాడ: చైన్ లింక్ తరహాలో మరో మోసం విజయవాడలో వెలుగులోకి వచ్చింది. తమ కంపెనీల్లో పెట్టుబడి పెట్టిన వారికి రెట్టింపు డబ్బులిస్తామంటూ అమాయకుల నుంచి భారీగా వసూళ్లు చేసుకుని బోర్డు తిప్పేశారు. సురక్ష ట్రేడర్స్, ఆభరణ జ్యూయలర్స్, దూపాటి ఫైనాన్స్ పేరుతో ఆశ్యాశ చూపి రూ.కోట్లు కాజేశారు. 'సంకల్ప సిద్ధి' తరహాలో కంపెనీ ప్రతినిధులు కుచ్చు టోపీ పెట్టారు. తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటకలోనూ వేల సంఖ్యలో బాధితులున్నట్లు సమాచారం. గుంటూరు జిల్లాకు చెందిన దూపాటి సుధాకర్‌కు గుంటూరులోని బ్రాడీపేటలో ఆభరణ జ్యూయలర్స్, లక్ష్మీపురంలో సురక్ష ట్రేడర్స్, విజయవాడ సీతారామపురంలో దూపాటి ఫైనాన్స్ సంస్థ మెయిన్ బ్రాంచ్‌లున్నాయి. విశాఖ, విజయనగరం, రాజమహేంద్రవరం, కాకినాడ, ఏలూరు, విజయవాడ, గుంటూరు, తిరుపతి, నెల్లూరు, నరసరావుపేట, చిలకలూరిపేట, పొన్నూరుతో పాటు హైదరాబాద్, నిజామాబాద్, ఆదిలాబాద్, కామారెడ్డి, మేడ్చల్, ఖమ్మం తదితర చోట్ల వీటి బ్రాంచ్ ఆఫీసులున్నాయి.

బాధితుల ఫిర్యాదు

గుంటూరు, విజయవాడకు చెందిన బాధితులు కె.బాలాజీసింగ్, ఎం.నాగరాజు, ఎం.రవీంద్రబాబు, చంద్రశేఖర్ ఈ నెల 20వ తేదీన ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణాకు ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దూపాటి సుధాకర్ కంపెనీల్లో రూ.50 లక్షలు పెట్టుబడి పెట్టినట్లు బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. అత్యధికంగా పాస్టర్లను, క్రైస్తవులను సుధాకర్ మోసం చేశాడంటూ బాధితులు చెబుతున్నారు. వేలాది మందిని వంచించిన సుధాకర్‌పై కఠిన చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై కొద్ది రోజులుగా బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ఫిర్యాదులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా తెలిపారు.

మోసం ఇలా..

సురక్ష ట్రేడర్స్ ద్వారా రెండేళ్లుగా డిపాజిట్లు సేకరించి అంతర్జాతీయ షేర్లు కొంటామని నమ్మించారు. పెట్టుబడి పెట్టిన నగదుకు ఆర్నెళ్లలో రెట్టింపు ఇస్తామని ఆశ పెట్టారు. కొన్నాళ్లు సక్రమంగా చెల్లించినా పెట్టుబడిదారుల నుంచి భారీగా వసూళ్లు చేసుకుని ఆ తరువాత నిలిపివేశారు. రష్యా, ఉక్రెయిన్ యుద్ధం కారణంగా షేర్లు పతనమై నష్టాలు వచ్చాయంటూ నమ్మ బలికారు. తాజాగా బోర్డు తిప్పేశారు. కాసు బంగారానికి నగదు చెల్లిస్తే ఆర్నెల్లలో రెండు కాసులిస్తామంటూ నమ్మించి మోసం చేశారని బాధితులు వాపోతున్నారు.



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+10 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 360

బుధవారం 22-3-2023

పాఠకులు, ఏజెంట్లు, ప్రకటనకర్తలు, శ్రేయోభిలాషులకు
సాక్షి ఉగాది శుభాకాంక్షలు

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



అమృత్ పరారీ నిఘా వైఫల్యమే

అమృత్‌సింగ్ తప్పించుకోవడం నిఘా వైఫల్యమేనని పోలీస్ శాఖకు పంజాబ్–హరియాణా హైకోర్టు మొట్టికాయలు వేసింది.

వివరాలు 6లో ▸



ప్రపంచంలోనే బీజేపీ కీలక పార్టీ

బీజేపీ ప్రపంచంలోనే అత్యంత కీలకమైన రాజకీయ పార్టీ అని అమెరికన్ మ్యాగజైన్ వాల్‌స్ట్రీట్ జర్నల్‌లో వ్యాసం ప్రచురితమైంది.

వివరాలు 6లో ▸



కోర్టుకు వస్తే చంపేస్తారేమో!

కోర్టుకు వస్తే తనను చంపేసే ప్రమాదమున్నందున.. వర్చువల్‌గా కేసులను విచారించాలని పాకిస్తాన్ సుప్రీంకోర్టును ఇమ్రాన్ కోరారు.

వివరాలు 6లో ▸



ట్రంప్ అరెస్టయితే..

యూఎస్ మాజీ అధ్యక్షుడు ట్రంప్ అరెస్ట్ అయితే కల్లోలం రేగుతుందా? అధ్యక్ష పదవికి పోటీ చేస్తారా? అని చర్చ జరుగుతోంది.

వివరాలు 6లో ▸

చదువులకు 'బలం'

జగనన్న గోరుముద్దలో మరో పోషకాహారం: సీఎం జగన్

బడి పిల్లలకు ఉదయం పూట రాగి జావ

- సమృద్ధిగా ఐరన్, కాల్షియంతో బాల్యానికి బలం
- ఏటా రూ.86 కోట్ల అదనపు వ్యయంతో 38 లక్షల మందికి రాగి జావ.. గర్భవతుల నుంచి చిన్నారుల దాకా పౌష్టికాహారాన్ని అందిస్తున్నాం
- ప్రభుత్వ స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్ఈ సిలబస్, బైలింగ్యువల్ బుక్స్
- ఆరో తరగతి నుంచి ఐఎఫ్‌పీ ప్యానెల్స్‌తో డిజిటల్ బోధన..
- నాడు–నేడు పూర్తైన స్కూళ్లలో జూన్ నుంచి అమలు
- 8వ తరగతి పిల్లలకు ట్యాబ్‌లు
- అమ్మ ఒడి, విద్యాకానుక.. ప్రతి అడుగులోనూ పిల్లలను చేయిపట్టి నడిపిస్తున్నాం



> మన ప్రభుత్వం రాకముందు పరిస్థితులు ఎలా ఉన్నాయి? ఇప్పుడెలా ఉన్నాయి? ఒక్కసారి తేడాను గమనించండి. మధ్యాహ్న భోజనానికి గతంలో ఏటా రూ.450 కోట్లు కూడా ఇవ్వని దుస్థితి. ఇప్పుడు గోరుముద్దకు ఏడాదికి రూ.1,824 కోట్లు.. రాగి జావకు అదనంగా మరో రూ.86 కోట్లు ఖర్చు చేస్తున్నాం. పిల్లలు ఏం తింటున్నారని ఓ ముఖ్యమంత్రి ఆలోచించిన పరిస్థితి గతంలో లేదు. కానీ ఇప్పుడు మంచి మేనమామలా 15 రకాల పదార్థాలతో పిల్లలకు రుచికరమైన ఆహారాన్ని అందిస్తున్నాం.
>
> – సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: మన విద్యార్థులంతా భావి ప్రపంచంతో పోటీపడి రాణించేలా ప్రతి అడుగులోనూ వారికి అండదండలు అందిస్తూ అడుగులు ముందుకు వేస్తున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. పిల్లలకు మంచి మేనమామలా వారికి అందించే ఆహారం నుంచి ఉన్నత చదువులు, ఉద్యోగాల దాకా అన్ని విషయాల్లోనూ వారి బాగోగులే లక్ష్యంగా నడుస్తున్నామన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రీ కూడా పిల్లల బాగు కోసం ఇంత తపన పడలేదన్న విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. 'మన ప్రభుత్వం రాకముందు పరిస్థితులు ఎలా ఉన్నాయి? ఇప్పుడెలా ఉన్నాయి..? ఒక సారి తేడాను గమనించండి. పిల్లలు ఏం తింటున్నారు? అని ఒక ముఖ్యమంత్రి ఆలోచన చేసిన పరిస్థితి గతంలో ఎప్పుడూ లేదు. మనం చేయకపోతే ఇంకెవరు చేస్తారన్న మంచి ఆలోచనతో గోరుముద్దను చేపట్టాం. పిల్లలకు మంచి మేనమామలా 15 రకాల ఆహార పదార్థాలతో రుచికరమైన ఆహారాన్ని అందిస్తున్నాం. మధ్యాహ్న భోజనానికి గతంలో ఏడాదికి కేవలం రూ.450 కోట్లు కూడా ఖర్చు చేయని దుస్థితి. ఇప్పుడు గోరుముద్ద కోసం ఏడాదికి రూ.1,824 కోట్లు ఖర్చు చేస్తున్నాం' అని తెలిపారు. ఇప్పుడు దీనికి అదనంగా రాష్ట్రవ్యాప్తంగా 44,392 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదివే 37,63,698 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుస్తూ

మిగతా 2వ పేజీలో ▶

ఉన్నత విద్యలో హెరిటేజ్, కల్చర్

- ముసాయిదా మార్గదర్శకాలు విడుదల చేసిన యూజీసీ
- ఫ్లెక్సిబుల్ హైబ్రిడ్ విధానంలో అమలు
- నిరంతర సమగ్ర అంచనా మూల్యాంకనం ద్వారా క్రెడిట్లు



సాక్షి, అమరావతి: దేశంలోని ఉన్నత విద్యా సంస్థల్లో ఇండియన్ హెరిటేజ్ (భారతీయ వారసత్వం), కల్చర్ (సంస్కృతి) ఆధారిత కోర్సుల అమలుకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) శ్రీకారం చుడుతోంది. శాస్త్రీయ నృత్యం, ఆయుర్వేదం, భారతీయ భాషలు, సంగీతం, సంస్కృతం, మానవ విలువలు, వేద గణితం, యోగా తదితర కోర్సులను ప్రవేశపెట్టనుంది. ఇందుకు సంబంధించి ముసాయిదా మార్గదర్శకాలను ఇటీవల విడుదల చేసింది. బహుళ ప్రవేశ నిష్క్రమణలతో స్వల్పకాలిక క్రెడిట్–ఆధారిత కోర్సులుగా వీటిని అమలు చేయనున్నట్లు పేర్కొంది. జాతీయ నూతన

మిగతా 3వ పేజీలో ▶

ఉత్తరాదిన భూకంపం



ఇళ్ల నుంచి బయటకు వచ్చిన జనం

ఢిల్లీ సహా ఉత్తర భారతదేశంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం రాత్రి భారీ భూ ప్రకంపనలు సంభవించాయి. దీని తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 6.6గా రికార్డయ్యింది. రాత్రి సమయంలో ప్రకంపనలు రావడంతో జనం ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. భయాందోళనలతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

చంద్రబాబు డైరెక్షన్‌లోనే దాడి



అసెంబ్లీలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలపై టీడీపీ ఎమ్మెల్యేలు దాడి చేయడంపై రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా, దళిత, బహుజన, అధ్యాపక, విద్యార్థి సంఘాలు మంగళవారం ధర్నాలు, ఆందోళనలు నిర్వహించాయి. ఈ దాడికి కారకుడైన చంద్రబాబుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశాయి.

వివరాలు 7 ▸

ఉగాది వేడుకల నిర్వహణకు సర్వం సిద్ధం



శ్రీ శోభకృత్ నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా బుధవారం తాడేపల్లిలోని సీఎం జగన్ నివాసంలో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు పరిఢవిల్లేలా ఏర్పాట్లు పూర్తయ్యాయని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చెప్పారు.

వివరాలు 2 ▸

చోక్సీపై రెడ్‌కార్నర్ నోటీస్ ఎత్తివేత!



పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు రూ.13,000 కోట్లు ఎగ్గొట్టి విదేశాలకు పారిపోయిన వజ్రాల వ్యాపారి మెహుల్ చోక్సీపై ఇంటర్‌పోల్ గతంలో జారీ చేసిన రెడ్‌కార్నర్ నోటీసును ఇటీవల ఎత్తేసిన విషయం వెలుగులోకి రావడంతో కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ విమర్శలు గుప్పించింది.

వివరాలు 6 ▸

సలహాదారులపై నిర్దిష్ట విధానం

నియామకాలకు ముఖ్యమంత్రి ఆమోదం తప్పనిసరి

- సలహాదారులు ఇకపై ఆయా మంత్రిత్వ శాఖలకే..
- అవసరమనుకుంటే మంత్రులు రాతపూర్వకంగా కోరాలి.. నిర్దిష్ట కాలపరిమితితో అర్హతలపై సమీక్ష
- విధాన నిర్ణయాలకే పరిమితం
- సలహాదారులు పీసీ చట్టం కింద పబ్లిక్ సర్వెంట్ పరిధిలోకి వస్తారు
- మార్గదర్శకాలను మంత్రి మండలి ఆమోదం కోసం పంపి త్వరలో జీవో ఇస్తాం
- హైకోర్టుకు నివేదించిన రాష్ట్ర ప్రభుత్వం.. అదనపు అఫిడవిట్ దాఖలు



సాక్షి, అమరావతి: సలహాదారుల నియామకాల విషయంలో నిర్దిష్ట విధానాన్ని రూపొందించాలని నిర్ణయించినట్లు రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు నివేదించింది. ఇకపై సలహాదారులుగా, ప్రత్యేక సలహాదారులుగా నియమితులయ్యే వారు ఆయా మంత్రిత్వ శాఖలకు సలహాదారులుగా వ్యవహరిస్తారని తెలిపింది. ఆయా సబ్జెక్టుల్లో వారి నైపుణ్యాలను బట్టి నియామకాలు ఉంటాయని పేర్కొంది. తమకు సలహాదారు కావాలని ఎవరైనా మంత్రి భావిస్తే అదే అంశాన్ని లిఖితపూర్వకంగా ముఖ్యమంత్రికి తెలియచేసి ఆమోదం పొందనున్నట్లు హైకోర్టుకు వెల్లడించింది. సలహాదారుల కాల వ్యవధి రెండేళ్ల వరకు ఉంటుంది. తరువాత అవసరాన్ని బట్టి పొడిగింపు మరో రెండేళ్లు ఉంటుంది. నిర్దిష్ట విధానాన్ని మంత్రిమండలి ఆమోదం కోసం పంపి త్వరలోనే దీనికి సంబంధించిన జీవో జారీ కానుందని హైకోర్టు దృష్టికి తెచ్చింది.

నియామకాలపై వ్యాజ్యాలు...

దేవదాయశాఖ సలహాదారుగా జ్వాలాపురపు శ్రీకాంత్, ఉద్యోగ వ్యవహారాల సలహాదారుగా

మిగతా 2వ పేజీలో ▶



సముద్రంలో 'పవన విద్యుత్'

- దేశ, విదేశాల్లో విస్తరిస్తున్న ఆఫ్‌షోర్ విండ్ పవర్ ప్లాంట్స్.. ప్రస్తుతం కొండలు, మైదాన ప్రాంతాల్లోనే పవన విద్యుత్ ఉత్పత్తి
- నీటిలోనూ ఏర్పాటుతో మరిన్ని ప్లాంట్లు విస్తరించే అవకాశం
- 2026 నాటికి దాదాపు 20 గిగావాట్ల సముద్ర పవన విద్యుత్
- నిర్వహణకు ధ్వని ఆధారిత సెన్సార్ సిస్టమ్ అభివృద్ధి

3లో

జనసేనతో పొత్తు ఉన్నా లేనట్లే

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతు కోరినా పవన్ కళ్యాణ్ స్పందించలేదు
- బీజేపీ రాష్ట్ర పదాధికారుల సమావేశంలో ఇదే అంశంపై సుదీర్ఘ చర్చ
- సమావేశంలో మాట్లాడిన ఎమ్మెల్సీ మాధవ్ నోటా ఇదే మాట
- క్షేత్రస్థాయిలో కలిసి పనిచేసే స్థితిలేనప్పుడు పొత్తు ఉండి ప్రయోజనం ఏంటని ప్రశ్న



- పొత్తు కొనసాగాలని బీజేపీ కోరుకుంటోందని వెల్లడి
- కలిసి పనిచేస్తే టీడీపీ, వైఎస్సార్‌సీపీలకు బీజేపీ–జనసేనే ప్రత్యామ్నాయం
- మేం నమ్ముతున్నాం.. పవన్‌కళ్యాణ్ కూడా నమ్మాలి అంటూ సూచన

- వివరాలు 7లో

గుడ్ మార్నింగ్..
ఇదొక్క అందమైన మార్నింగ్!

ఈ శుభోదయపు పలకరింపుతోనే సరిగ్గా పదిహేనేళ్ల క్రితం.. రంగుల హరివిల్లులా.. 'సాక్షి' దిన పత్రిక ఆవిర్భవించింది. 'సత్యమేవ జయతే..' అంటూ నిఖార్సైన జర్నలిజానికి శంఖం పూరించింది. నాటి నుంచీ అంచెలంచెలుగా ఎదుగుతూ విలువలకు కట్టుబడిన పాత్రికేయ ధర్మాన్ని నిబద్ధతతో కొనసాగిస్తూ వస్తోంది. ఈ మహాయజ్ఞం ఇప్పుడు పదహారవ యేటలోకి ప్రవేశిస్తున్న సందర్భంలో 'సాక్షి' తన పాఠకులకు చిన్న క్విజ్ పెట్టి, కానుకలను ఇవ్వదలచింది. వివరాల కోసం ఇప్పుడే sakshi.com ఓపెన్ చేయండి, జవాబు చెప్పండి.. బహుమతి గెలుచుకోండి అన్న లింకును క్లిక్ చేయండి.

ఈరోజు ప్రశ్న

సాక్షి ప్రారంభ సంచికలో ప్రత్యేక సంపాదకీయం రాసినవారు?

ఎ) పీవీ నరసింహారావు బి) సీతారామ్ ఏచూరి
సి) మన్మోహన్ సింగ్ డి) వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి

ఉగాది వేడుకల నిర్వహణకు సర్వం సిద్ధం

- సీఎం జగన్ నివాసంలోని గోశాలలో ఉదయం 9 గంటలకు కార్యక్రమాలు ప్రారంభం
- తెలుగు సంస్కృతి , సంప్రదాయాలు పరిఢవిల్లేలా ఏర్పాట్లు
- తిరుమల ఆనందనిలయం తరహాలో నమూనాలు
- పంచాంగ శ్రవణంలో పాల్గొననున్న సీఎం జగన్ దంపతులు
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, కార్యక్రమాల నిర్వాహకుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వెల్లడి

సాక్షి, అమరావతి: శ్రీ శోభకృత్ నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా బుధవారం తాడేపల్లిలోని సీఎం జగన్ నివాసంలో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, కార్యక్రమాల నిర్వాహకుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చెప్పారు. సీఎం జగన్ నివాసంలోని గోశాలలో ఉదయం 9 గంటలకు కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. ఆయన మంగళవారం తాడేపల్లిలో ఈ వివరాలు తెలిపారు. తెలుగు ప్రజల సంస్కృతి, సంప్రదాయాలు పరిఢవిల్లేలా సెట్టింగ్‌లు ఉన్నాయన్నారు. తిరుమల ఆనందనిలయం తరహాలో ఆలయ నమూనాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పంచాంగ శ్రవణంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దంపతులు పాల్గొంటారని తెలిపారు. తెలుగు ప్రజల సంప్రదాయం, ఆచారాల ప్రకారమే ఈ ఉగాది సంబరాలు ఉంటాయన్నారు. ఇక్కడ పూర్తిగా పల్లె వాతావరణం కన్పిస్తుందన్నారు. ప్రారంభంలో గ్రామ ముఖద్వారం ఉంటుందని చెప్పారు. సీఎం జగన్ దంపతులు విఘ్నేశ్వర ఆలయంలో పూజతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని తెలిపారు. అనంతరం పక్కనే ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి ఆనందనిలయం నమూనా ప్రాంగణంలోకి చేరుకుంటారని చెప్పారు. అక్కడ స్వామికి సీఎం వైఎస్ జగన్ దంపతులు.. శోభకృత్ నామ సంవత్సరంలో రాష్ట్ర ప్రజలకు అన్నీ శుభాలు జరగాలని, సమృద్ధిగా వానలు కురవాలని, పంటలు బాగా పండాలని, రైతులకు మేలుకలగాలని, సకల వృత్తులవారు ఆనందంగా ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, పల్లెల్లో, పట్టణాల్లో ప్రతి ఇల్లు కళకళలాడాలని, మన సంస్కృతీసంప్రదాయాలు కలకాలం వర్ధిల్లాలని కోరుతూ పూజలు నిర్వహిస్తారని వివరించారు. అనంతరం పంచాంగ శ్రవణం ప్రారంభమవుతుందన్నారు. చిరుధాన్యాలతో నవరత్నాల పథకాలు ప్రతిబింబించేలా నేలపై ఒక బొమ్మను ఏర్పాటు చేశామన్నారు. నవరత్నాల మధ్యలో రంగులతో వేసిన సీఎం జగన్ ఫొటో ఉంటుందని తెలిపారు. తెలుగు ప్రజలు దేనికైనా తిరుమల పంచాంగాన్ని ఫాలో అవుతారని, ఆ ప్రకారమే కార్యక్రమాలు చేస్తారని చెప్పారు. స్వామి దశావతారాల బొమ్మలు, భూదేవి, శ్రీదేవి బొమ్మలను కూడా మండపంలోని గోడలపై చిత్రీకరించినట్లు తెలిపారు. తిరుమలలో ఉన్నట్లు బంగారు తాపడంతో ఉన్న గంటలు, ధ్వజస్తంభం, కోనేరు కూడా ఇక్కడ చూడవచ్చన్నారు. కొన్ని సంప్రదాయ నృత్యాలు, ప్రదర్శనలు, ఉగాది పాటలకు నృత్యాలు ఉంటాయని చెప్పారు. ఈ సందర్భంగా సీఎం దంపతులను టీటీడీ వేదపండితులు, శ్రీదుర్గామల్లేశ్వరస్వామి ఆలయ వేదపండితులు ఆశీర్వదిస్తారని తెలిపారు. సీఎం జగన్ ప్రధాన లక్ష్యం సామాన్యుడు బాగుండాలనేదేనని చెప్పారు. పేదల బాగుకోసం సీఎం జగన్ అహర్నిశలు శ్రమిస్తున్నారని తెలిపారు. సీఎం తన పాలనాకాలంలో ఇప్పటికి బటన్ నొక్కి రూ.2 లక్షల కోట్లను నేరుగా పేదల అకౌంట్‌లలోకి వెళ్లేలా చేశారని చెప్పారు. సీఎం ఆశయాలు, ఆకాంక్షలు ప్రతిబింబించేలా, నాడు–నేడు పాఠశాల భవనాల సెట్టింగ్‌లు భారీగా ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

ప్రజలకు గవర్నర్ ఉగాది శుభాకాంక్షలు



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రజలకు ఏపీ గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. శోభకృత్ నామ సంవత్సరం రాష్ట్ర ప్రజలకు కొత్త ఉత్తేజాన్ని, ఉల్లాసాన్ని, ఉజ్వల భవిష్యత్‌ను ప్రసాదించాలని ఆకాంక్షించారు. సమాజంలో అన్ని వర్గాలకు శాంతి, శ్రేయస్సును అందిస్తుందని గవర్నర్ ఆశిస్తున్నట్లు రాజ్‌భవన్ వర్గాలు మంగళవారం తెలిపాయి.

ప్రజలకు అన్నీ శుభాలు జరగాలి
సీఎం వైఎస్ జగన్ ఆకాంక్ష

సాక్షి,అమరావతి: శోభకృత్ నామ సంవత్సరంలో రాష్ట్ర ప్రజలకు అన్నీ శుభాలు జరగాలని, సమృద్ధిగా వానలు కురవాలని, పంటలు బాగా పండాలని, రైతులకు మేలు కలగాలని, సకల వృత్తుల వారు ఆనందంగా ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, పల్లెల్లో, పట్టణాల్లో ప్రతి ఇల్లూ కళకళలాడాలని, మన సంస్కృతీ సంప్రదాయాలు కలకాలం వర్ధిల్లాలని సీఎం వైఎస్ జగన్ అభిలషించారు. శ్రీ శోభకృత్ నామ సంవత్సరాది సందర్భంగా రాష్ట్ర ప్రజలకు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ సీఎం శుభాకాంక్షలు తెలిపారు. షడ్రుచుల సమ్మేళనంతో ప్రారంభమయ్యే ఉగాది, తెలుగు లోగిళ్ళలో నూతన సంవత్సర శోభను తెస్తూ, కొత్త లక్ష్యాలకు, కొత్త ఆలోచనలకు, ప్రతి ఒక్కరి ఉజ్వల భవిష్యత్తుకు, తద్వారా రాష్ట్ర సమగ్రాభివృద్ధికి దోహదపడాలని ఆకాంక్షించారు. శోభకృత్ నామ సంవత్సరంలో ఇంటింటా ఆయురారోగ్యాలు, సిరిసంపదలు, ఆనందాలు నిండాలని అభిలషించారు.

విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు
డీఎంఈ డాక్టర్ వినోద్ కుమార్

సాక్షి, అమరావతి: కాకినాడ, విశాఖ, తిరుపతి బోధనాస్పత్రుల్లో కొందరు వైద్యులు పనివేళల్లో విధులకు డుమ్మా కొడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని డీఎంఈ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించామన్నారు. ఆస్పత్రుల్లో కావాల్సినంత మంది వైద్యులు, వైద్య సిబ్బందిని నియమించామన్నారు. ఈ ఫలితంగా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందాలన్నారు. ఆ మేరకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు. విజిలెన్స్ బృందాల ద్వారా ఆస్పత్రుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామన్నారు. హెచ్‌వోడీలు, సూపరింటెండెంట్‌లు, ప్రిన్సిపాళ్ల ఆదేశాలను బేఖాతరు చేసే వారిపై నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు.


బహుళత్వంలో ఏకత్వమే భారత సమాజతత్వం
ఇండియన్ మైనారిటీస్ ఫౌండేషన్ కార్యక్రమంలో ఏపీ గవర్నర్ జస్టిస్ నజీర్



ప్రసంగిస్తున్న ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్

సాక్షి, న్యూఢిల్లీ: బహుళత్వంలో ఏకత్వమే భారత సమాజతత్వం అని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ చెప్పారు. భారతదేశం పలు మతాలు, సంస్కృతులతో ఏర్పడిన హరివిల్లు వంటిదని పేర్కొన్నారు. మంగళవారం ఢిల్లీలో ఇండియన్ మైనారిటీస్ ఫౌండేషన్ ప్రారంభ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. జాతి, కుల, మతవివక్ష లేకుండా రాజ్యాంగం అందరికీ సమాన ప్రాథమిక హక్కులు కల్పించిందని చెప్పారు. దేశ ఐక్యత, సమగ్రతకు రాజ్యాంగమే రక్షణ కవచమన్నారు. రాజ్యాంగ స్ఫూర్తి పరిరక్షణ, అమలులో న్యాయవ్యవస్థ ఎంతో కీలకమని చెప్పారు. సబ్‌కా సాత్ – సబ్‌కా వికాస్ – సబ్‌కా విశ్వాస్ – సబ్‌కా ప్రయాస్ అనే సమతా నినాదంతో ప్రధానమంత్రి మోదీ అందరి అభివృద్ధికి పాటుపడుతున్నారని కొనియాడారు. అల్పసంఖ్యాకులు వివిధ రంగాల్లో అత్యున్నత స్థానాలను అధిరోహించారని గుర్తుచేశారు. దేశ బహుళత్వానికి సూచికైన కశ్మీర్‌లో ఉగ్రవాదం తగ్గుముఖం పడుతోందన్నారు. 'వివక్ష' ద్వారా భారత విచ్ఛిన్నానికి కొన్ని అరాచక, దేశవ్యతిరేక శక్తులు కుట్రచేస్తున్నాయని చెప్పారు. ఇండియన్ మైనారిటీస్ ఫౌండేషన్ అల్పసంఖ్యాకులను ఐక్యపరచి, దేశ ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడంలో కీలకపాత్ర పోషిస్తుందనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

రాష్ట్ర శ్రేయస్సు కోసం లక్ష్మీసుదర్శన రాజశ్యామల యజ్ఞం
ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



సాక్షి, అమరావతి: రాష్ట్ర శ్రేయస్సు కోసం విజయవాడలో లక్ష్మీసుదర్శన రాజశ్యామల, సుదర్శన సహిత మహాలక్ష్మి యజ్ఞం నిర్వహించాలని సంకల్పించామని ఉప ముఖ్యమంత్రి (దేవదాయశాఖ) కొట్టు సత్యనారాయణ తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో మంగళవారం ఉప ముఖ్యమంత్రి అధ్యక్షతన ధార్మిక పరిషత్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పండితులను అడిగి లక్ష్మీ సుదర్శన రాజ శ్యామల సుదర్శన సహిత మహాలక్ష్మి యజ్ఞం నిర్వహణకు సంబంధించి సూచనలు, సలహాలు తెలుసుకున్నారు. వర్చువల్‌గా పాల్గొన్న పెద్ద జీయంగార్ పీఠాధిపతి, పుష్పగిరి పీఠాధిపతి, టీటీడీ ఈవో ధర్మారెడ్డి పలు సూచనలు చేశారు. ఈ యజ్ఞం నిర్వహణకు తేదీ, ముహూర్తం నిర్ణయించి ఏర్పాట్లు చేస్తామని కొట్టు సత్యనారాయణ తెలిపారు. హిందూ ధర్మ పరిరక్షణే లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా దేవదాయ శాఖ పరిధిలోని ఏడు ప్రధాన ఆలయాల ప్రచార రథాల ద్వారా పెద్ద ఎత్తున ధర్మ ప్రచార కార్యకమాన్ని చేపడతామని చెప్పారు. సనాతన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన అంశంపై పురాణ, ఇతిహాసాలకు సంబంధించి చిన్న పుస్తకాలను ప్రచురించి ప్రజలకు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు అజేయ కల్లం, దేవదాయ శాఖ కమిషనర్ హరిజవహర్‌లాల్, పలువురు ఆగమ పండితులు, ఆగమ సలహాదారులు, ధార్మిక పరిషత్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

చదువులకు 'బలం'



విద్యార్థులకు రాగిజావ అందించే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు

▶ మొదటి పేజీ తరువాయి

ఏటా రూ.86 కోట్ల అదనపు వ్యయంతో ఉదయం పూట రాగిజావ అందించే కార్యక్రమాన్ని మంగళవారం తన క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వర్చువల్‌గా ప్రారంభించారు. ఏప్రిల్‌లో పదో తరగతితో పాటు మిగిలిన పిల్లలకు పరీక్షలు జరగనున్న నేపథ్యంలో వారందరికీ ఓ మేనమామగా ఆల్ ద వెరీ బెస్ట్ చెబుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే...

మొదటి రోజు నుంచే..

దేవుడి దయతో ఈరోజు మరో మంచి కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ కార్యక్రమంలో పాల్గొంటున్న ప్రతి ఒక్క పాప, బాబు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, బోధనేతర సిబ్బందికి, గోరుముద్దలో భాగంగా పరిశుభ్రంగా, రుచికరంగా వండి పెడుతున్న అమ్మలకు.. ప్రతి ఒక్కరికీ నా అభినందనలతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నా. అధికారంలోకి వచ్చిన మొట్టమొదటి రోజు నుంచి చదువులను సంస్కరించడంపై దృష్టి పెట్టాం. బడి మానేసే పిల్లల సంఖ్యను ఎలా తగ్గించాలి? స్కూళ్లలో సదుపాయాలు మెరుగుపర్చడం ఎలా? పిల్లల మేధో వికాసానికి కావాల్సిన వాతావరణాన్ని కల్పించడం ఎలా? పెద్ద చదువులు చదివేలా ప్రోత్సహించడమెలా? అనే అంశాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టి ప్రతి అడుగులోనూ మార్పులు తీసుకొచ్చాం. అందులో భాగంగానే గర్భిణులు, బాలింతలు, ఆరేళ్ల లోపు చిన్నారులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ ద్వారా పౌష్టికాహారాన్ని అందిస్తున్నాం.

అడుగడుగునా ప్రోత్సాహం..

చదువుకునే విద్యార్థులను ప్రోత్సహిస్తూ అమ్మ ఒడి, విద్యా కానుక, నాడు–నేడు, ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్ఈ సిలబస్, బైలింగ్యువల్ పాఠ్య పుస్తకాలు అందిస్తున్నాం. 8వ తరగతిలోకి వచ్చిన వెంటనే పిల్లలకు ట్యాబ్‌లు ఇస్తున్నాం. ఇక 6వ తరగతి నుంచి ప్రతి తరగతి గదిలోనూ ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ (ఐఎఫ్‌పీ ప్యానెల్స్) ద్వారా డిజిటల్ బోధనను ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు నాడు – నేడు పూర్తైన స్కూళ్లలో జూన్ నుంచి అమలులోకి తీసుకొస్తాం. ఇలా ప్రతి అడుగులోనూ పిల్లలను చేయి పట్టి నడిపిస్తున్నాం.

సమున్నత మార్పులు..

ఉన్నత విద్యలో సమూల మార్పులు చేపట్టి జాబ్ ఓరియెంటెడ్ కరిక్యులమ్ తీసుకొచ్చాం. ఇంటర్న్‌షిప్ తప్పనిసరి చేస్తూ ఆన్‌లైన్ వర్టికల్స్‌ని కరిక్యులమ్‌కు అనుసంధానం చేస్తున్నాం. విద్యాదీవెన, వసతి దీవెన కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. మన పిల్లలంతా భావి ప్రపంచంతో పోటీ పడి నెగ్గుకొచ్చేలా ప్రతి అడుగు వేస్తున్నాం. అందులో భాగంగానే విద్యాకానుక అమలు చేస్తున్నాం.

మరింత బలవర్ధకంగా గోరుముద్ద

గోరుముద్దను ఇప్పటికే రోజుకొక మెనూతో రుచికరంగా అమలు చేస్తున్నాం. ఇప్పుడు మరింత బలవర్ధకంగా అమలు చేసేలా చర్యలు చేపట్టాం. అందులో భాగంగా ఇవాళ్టి నుంచి పిల్లలకు రాగిజావ కూడా అందిస్తూ గోరుముద్దను మరింత పుష్టికరంగా తీర్చిదిద్దుతున్నాం. రాగి జావ పిల్లల్లో సమృద్ధిగా ఐరన్, కాల్షియం కంటెంట్ పెరిగేలా దోహదపడుతుంది.

వారానికి 15 రకాలతో మెనూ...

గోరుముద్ద మెనూలో ప్రతి సోమవారం వేడిగా పొంగలి, ఉడికించిన గుడ్డు దగ్గర నుంచి కూరగాయల పలావ్, గుడ్డు కూర, వేరుశెనగ చిక్కీ అందిస్తున్నాం. మంగళవారం రోజు పులిహోర, టమోట పచ్చడి, దొండకాయ పచ్చడి, ఉడికించిన గుడ్డు ఇస్తుండగా బుధవారం నాడు కూరగాయలు అన్నం, బంగాళదుంప కుర్మా, ఉడికించిన గుడ్డు, వేరుశెనగ చిక్కీ ఇస్తున్నారు. గురువారం మెనూలో సాంబార్ బాత్ లేదా లెమన్‌రైస్ విత్ టమోట పచ్చడి, ఉడికించిన గుడ్డు ఉంటాయి. శుక్రవారం నాడు అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, వేరుశెనగ చిక్కీ అందిస్తున్నారు. శనివారం నాడు పప్పు, ఆకుకూర అన్నం, తీపి పొంగల్ ఇస్తున్నాం. ఇలా వారంలో మొత్తం 15 రకాల ఆహార పదార్థాలను గోరుముద్దలో భాగంగా పిల్లలకు అందిస్తున్నాం. వారంలో ఐదు రోజులపాటు ఉడికించిన గుడ్లు, మూడు రోజులు చిక్కీ ఇస్తున్నాం. చిక్కీ ఇచ్చే మూడు రోజులు కాకుండా మిగిలిన మూడు రోజుల పాటు మంగళ, గురువారం, శనివారాల్లో ఇప్పుడు రాగి జావ అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం.

నాడు అధ్వాన్నం.. నేడు నోరూరేలా

మిడ్ డే మీల్స్ అంటూ గత ప్రభుత్వ హయాంలో మొత్తం సంవత్సరం అంతా కలిపినా కూడా ఏడాదికి రూ.450 కోట్లు కూడా మధ్యాహ్న భోజనానికి ఖర్చు చేయని దుస్థితి. వండి పెట్టే ఆయాలకు రూ.1,000 ఇస్తూ అది కూడా 8–10 నెలలు బకాయిలు పెట్టిన పరిస్థితి ఉంది. చివరకు సరుకులు కూడా 6–8 నెలలుగా బకాయిలు పెట్టే పరిస్థితి. ఇలా బకాయిలు పెడితే క్వాలిటీ అనేది ఉండదు. అలాంటి అధ్వాన్నమైన పరిస్థితుల నుంచి గోరుముద్ద అనే కార్యక్రమం ద్వారా రోజుకొక మెనూతో పూర్తిగా మార్చి ప్రతిష్ఠాత్మకంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టాం. గతంలో రూ.450 కోట్లు మాత్రమే ఉన్న బడ్జెట్‌ను ఇప్పుడు ఏడాదికి రూ.1,824 కోట్లకు పెంచి గోరుముద్ద కోసం ఖర్చు చేస్తున్నాం. ఇప్పుడు రాగి జావ కోసం అదనంగా మరో రూ.86 కోట్లు ఇస్తున్నాం. రోజుకో మెనూతో పిల్లలకు రుచికరమైన భోజనం అందిస్తున్నాం.

సత్యసాయి ట్రస్టు సహకారంతో..

పిల్లలకు రాగిజావ అందించే కార్యక్రమంలో సత్యసాయి ట్రస్టు భాగస్వామి కావడం నిజంగా మంచి పరిణామం. ఈ కార్యక్రమానికి శ్రీసత్యసాయి స్వామి వారి ఆశీస్సులు తప్పకుండా ఉంటాయి. ఏటా దాదాపు రూ.86 కోట్లు ఖర్చయ్యే రాగి జావ కోసం సత్యసాయి ట్రస్టు రూ.42 కోట్లు అందిస్తుండగా మిగిలిన రూ.44 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం ద్వారా సమకూరుస్తూ మంచి కార్యక్రమానికి ముందడుగు వేస్తున్నాం. ఇందుకు సత్యసాయి ట్రస్టుకు ప్రత్యేకంగా హృదయ పూర్వకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నా. పిల్లలకు మంచి జరగాలని తపన పడుతున్న మనందరి ప్రభుత్వానికి దేవుడి చల్లని దయ, తల్లిదండ్రుల దీవెనలు ఉండాలని మనసారా కోరుకుంటూ రాగిజావ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నా.

ప్రైవేట్ స్కూల్స్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

సీఎం ఆలోచన మేరకు జగనన్న గోరుముద్దలో రోజుకొక మెనూతో సుమారు 15 రకాలతో పాటు వారానికి మూడ్రోజులు రాగిజావ ఇవ్వాలని నిర్ణయించడం శుభపరిణామం. దీనికి సత్యసాయి ట్రస్ట్ కూడా భాగస్వామి కావడం సంతోషకరం. వారికి ధన్యవాదాలు. ఏ ఒక్క విద్యార్థి కూడా పేదరికంవల్ల చదువుకు దూరం కాకూడదనే విద్యాసంస్కరణలను ప్రభుత్వం అమలుచేస్తోంది. చదువుతోపాటు పౌష్టికాహారం ఇవ్వాలన్న ఆలోచనతో చేస్తున్న ప్రయత్నం ఇది. తల్లిదండ్రుల కంటే మిన్నగా సీఎం వైఎస్ జగన్ విద్యార్థుల గురించి ఆలోచిస్తున్నారన్నారు. విద్య విషయంలో గతంలో కేరళ, తర్వాత ఢిల్లీ కానీ ఇప్పుడు ఏపీ గురించి మాట్లాడుకుంటున్నారు. సీఎంగారికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు, ధన్యవాదాలు.

– బొత్స సత్యనారాయణ, విద్యా శాఖ మంత్రి

ఇలాంటి కార్యక్రమాలు మరింతగా కొనసాగాలి



శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ తరఫున ఈ గొప్ప కార్యక్రమంలో మేం భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉంది. బాబా భక్తులు కూడా సంతోషం వ్యక్తంచేస్తున్నారు. సీఎంగారి నాయకత్వంలో ఏపీ ప్రభుత్వం చేపడుతున్న అనేక కార్యక్రమాలు పిల్లలకు చాలా తోడ్పాటుగా ఉంటున్నాయి. ఇలాంటి అనేక గొప్ప కార్యక్రమాలు మరింతగా కొనసాగాలని కోరుకుంటున్నా.

– ఆర్జే రత్నాకర్, మేనేజింగ్ ట్రస్టీ, శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్

రాగిజావ చాలా బాగుంది



సీఎం సార్.. రాగి జావ చాలా బాగుంది. గోరుముద్దలో 15 వెరైటీలు, గుడ్లు, చిక్కీ ఇలా అన్నీ ఇస్తున్నారు. మా స్కూల్స్‌లో టాయిలెట్స్ చక్కగా ఉన్నాయి, నిర్వహణ బాగుంది. బాలికలకు శానిటరీ నాప్కిన్స్ కూడా ఇస్తున్నారు. నేను బాగా చదువుకుని ఈ ప్రభుత్వంలో పనిచేయాలని భావిస్తున్నాను. థాంక్యూ జగన్ మామయ్య.

– ధనుశ్రీ, 8వ తరగతి విద్యార్థిని, జెడ్పీహెచ్ఎస్, కొత్తచెరువు, శ్రీసత్యసాయి జిల్లా

ఇప్పుడు రోజుకో రకంగా మెనూ



నమస్తే సార్.. నేను ఈ రోజు ఉదయమే రాగి జావ రుచి చూశాను, నా చిన్నప్పుడు మా నాన్నమ్మ ఇలా తాగించేది. నేను చదువుతున్న స్కూల్‌లో గతంలో ఇన్ని సౌకర్యాలు లేవు. ఇప్పుడు విశాలమైన తరగతి గదులు, చక్కని టాయిలెట్స్, బాగున్నాయి. భోజనం మెనూ చూస్తే అప్పట్లో పప్పు, రసం మాత్రమే కానీ ఇప్పుడు రోజుకో రకమైన మెనూ. థ్యాంక్యూ సార్.

– హైమావతి, 9వ తరగతి, రామభద్రాపురం హైస్కూల్, విజయనగరం జిల్లా

అడగకుండానే అన్నీ చూసుకుంటున్నారు



మీరు కొన్ని లక్షల మంది పిల్లలకు మేనమామ అయ్యారు, మిమ్మల్ని ఏం అడగకుండానే అన్నీ చూసుకుంటున్నారు. ఇంటి నుంచి క్యారేజ్ పనిలేకుండా చక్కటి పోషక విలువలతో కూడిన ఆహారం ఇస్తున్నారు. దీనివల్లే మా అబ్బాయి నేషనల్ ప్లేయర్‌గా ఎదిగాడు. ఆడపిల్లలకు బ్లడ్‌టెస్ట్‌లు చేసి ఐరన్ ట్యాబెట్స్ ఇస్తున్నారు. తల్లికడుపులో ఉన్నప్పటినుంచి మీరు రక్షణ కల్పిస్తున్నారు.

– కాంచన, విద్యార్థి తల్లి, నరసరావుపేట, పల్నాడు జిల్లా

సలహాదారులపై నిర్దిష్ట విధానం

▶ మొదటి పేజీ తరువాయి

చంద్రశేఖర్‌రెడ్డి నియామకాన్ని సవాలు చేస్తూ హైకోర్టులో వేర్వేరుగా ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలైన విషయం తెలిసిందే. వీటిపై విచారణ జరుపుతున్న ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా ధర్మాసనం పలు ప్రశ్నలు లేవనెత్తిన నేపథ్యంలో సలహాదారుల నియామకాలపై రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలను రూపొందించింది. సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) ముఖ్య కార్యదర్శి రేవు ముత్యాలరాజు వీటిని అదనపు అఫిడవిట్ రూపంలో హైకోర్టు ముందుంచారు. దీన్ని పరిగణలోకి తీసుకుని తగిన ఉత్తర్వులు జారీ చేయాలని ధర్మాసనాన్ని అభ్యర్థించారు.

అదనపు అఫిడవిట్‌లో ముఖ్యాంశాలు..

- సలహాదారుల వివరాలను సమగ్రంగా పరిశీలించిన తరువాతే నియామకం.
- సలహాదారు పాత్ర, బాధ్యతలను స్పష్టంగా నిర్దేశించాలి.
- ఆయా మంత్రిత్వ శాఖల అవసరాన్ని బట్టి సలహాదారుల నియామకం ఉంటుంది. నిర్దిష్ట అవసరాలకే నియామకం ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.
- అవసరం, ఆవశ్యకతతో పాటు సలహాదారుగా నియమించే వ్యక్తి అర్హతలపై నిర్దిష్ట కాల పరిమితితో సమీక్ష చేయాలి.
- సలహాదారు అన్నది పోస్టు కాదు. దానిని ఓ కార్యాలయంగా భావిస్తారు. సలహాదారు నిర్వర్తించేది పబ్లిక్ డ్యూటీ. అందువల్ల అవినీతి నిరోధక చట్టం కింద సలహాదారు పబ్లిక్ సర్వెంట్ నిర్వచన పరిధిలోకి వస్తారు.
- సలహాదారుగా నియమితులయ్యే ప్రతి వ్యక్తి ఓ అఫిడవిట్‌పై సంతకం చేయాల్సి ఉంటుంది.
- గోప్యతను పాటిస్తూ ప్రభుత్వ రహస్యాలను వెల్లడించబోనని అందులో సంతకం చేయాలి.
- గోప్యత పాటించే విషయంలో సలహాదారు బాధ్యతలు ఏమిటో ఆ అఫిడవిట్‌లో స్పష్టంగా పేర్కొనాలి.
- రహస్య సమాచారం అంటే ఏమిటి? ఏ సమాచారం దీని కిందకు వస్తుంది? దానిని గోప్యంగా ఉంచడంలో సలహాదారు బాధ్యత ఏమిటి? ఏ సమాచారం రహస్య సమాచారం కిందకు రాదు.. తదితర వివరాలు అందులో పొందుపరచాలి.
- మంత్రులు తీసుకునే విధానపరమైన నిర్ణయాల వరకే సలహాదారు పాత్ర పరిమితం అవుతుంది. రోజువారీ నిర్ణయాల్లో వారికి ఎలాంటి పాత్ర ఉండరాదు.
- కన్సల్టెంట్ల విషయానికొస్తే గతంలో మాదిరిగా కాంట్రాక్ట్ పద్ధతిలో కన్సల్టెంట్స్, కన్సల్టింగ్ ఏజెన్సీల ద్వారా నియమించుకోవచ్చు.
- ప్రస్తుతం సలహాదారులుగా ఉన్న వారిని సబ్జెక్టుల వారీగా ఆయా మంత్రిత్వ శాఖలకు సలహాదారులుగా, ప్రత్యేక సలహాదారులుగా మారుస్తారు.
- ఇప్పటివరకు తమ పాత్ర, బాధ్యతలు స్పష్టంగా నిర్దేశించని సలహాదారులకు సంబంధించి ప్రభుత్వం వాటిని రూపొందిస్తుంది.
- ముఖ్యమంత్రికి సలహాదారులుగా వ్యవహరించే వారికి సైతం పైన పేర్కొన్న నియమ, నిబంధనలే వర్తిస్తాయి.

పర్యావరణహితం.. సురక్షితం..

ప్రయాణికులు, సరకు రవాణా సేవల్లో అత్యుత్తమంగా వాల్తేరు రైల్వే డివిజన్



తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర): పర్యావరణానికి హానికలిగించే కర్బన ఉద్గారాలను 2030 నాటికి సున్నాస్థాయికి తీసుకొచ్చేందుకు రైల్వేశాఖ వాల్తేర్ డివిజన్ దార్శనికతతో ముందుకు సాగుతోంది. పర్యావరణహిత, సమర్థమైన, తక్కువ ఖర్చు, సమయపాలనతో కూడిన సేవలందించే పట్టాలపై దూసుకెళుతోంది. ప్రయాణికులను, సరకును గమ్యస్థానాలకు చేరుస్తోంది. ఇందుకు ఉన్నత ప్రమాణాలు పాటించేందుకు అవసరమైన విద్యుదీకరణ పనులను వాల్తేర్ డివిజన్ పరిధిలో 2021–22లోనే పూర్తిచేసింది. అనంతరం హెడ్ ఆన్ జనరేషన్ సిస్టం, బయో టాయిలెట్లు, ఎల్ఈడీ లైట్లను రైళ్లలో అమర్చి విద్యుత్‌ను ఆదా చేస్తోంది.

3 రాష్ట్రాలు.. 9 జిల్లాల్లో సేవలు

బ్లూ చిప్ డివిజన్‌గా వెలుగొందుతున్న వాల్తేరు డివిజన్ మూడు రాష్ట్రాలు, తొమ్మిది జిల్లాల్లో విస్తరించింది. ప్రధాన ప్రయాణికుల కారిడార్‌గా పిలిచే దువ్వాడ–పలాస సెక్షన్ 213 కిలోమీటర్లు, విజయనగరం–రాయగడ సెక్షన్‌లో 139 కిలోమీటర్ల మేర ఉన్నాయి. సరకు రవాణాలో కొత్తవలస–కిరండూల్ 446 కిలోమీటర్ల పరిధిలో ఉంది. కోరాపుట్–రాయగడ సింగిల్ లైన్ 167 కిలోమీటర్లు విస్తరించి ప్రయాణికులు, సరకు రవాణాలో విశేష సేవలందిస్తోంది.

పూర్తి విద్యుదీకరణ

వాల్తేర్ డివిజన్ తన పూర్తి పరిధిలోగల 1,106.4 రూట్ కిలోమీటర్లు, 2,438.42 ట్రాక్ కిలోమీటర్ల మొత్తాన్ని విద్యుదీకరించే పనులు 2020–21లోనే పూర్తిచేసినట్లు వాల్తేర్ డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి తెలిపారు. డివిజన్ పరిధిలో విద్యుదీకరణ పనులు పూర్తయినందున రైల్వేలో కాలుష్యకారకాలు తగ్గి పర్యావరణ హిత రవాణా చేరువైంది. క్రూడాయిల్ దిగుమతి చేసుకునే ఖర్చులు తగ్గాయి. పూర్తి విద్యుదీకరణతో డివిజన్‌కు ఏటా సుమారు రూ.793 కోట్ల చమురు ఖర్చు తగ్గడమేగాక.. ఏటా సుమారు 42 వేల టన్నుల కర్బన ఉద్గారాలను తగ్గించగలిగింది. వీటితోపాటు హెచ్‌వోజీ, హెచ్ఎస్‌డీ ఆయిల్స్ వల్ల ఏటా రూ.35.49 కోట్లు ఆదా అవుతుండగా.. సుమారు 11 వేల మెట్రిక్ టన్నుల కర్బన ఉద్గారాలు తగ్గుతున్నాయి.

రూ.62,22,887 ఆదా

వాల్తేర్ డివిజన్ పర్యావరణహిత ప్రత్యామ్నాయ పద్ధతులను అభివృద్ధిపరుస్తూ, కాలుష్య రహిత సమాజాన్ని సృష్టించే దిశగా ప్రయత్నాలు చేస్తోంది. వివిధ రైల్వేస్టేషన్లు, కార్యాలయాల వద్ద విద్యుత్‌ను ఆదాచేసే దిశగా సోలార్ పవర్‌ప్లాంట్లను ఏర్పాటుచేసి 2022–23 జనవరి నెలాఖరు వరకు సుమారు రూ.62,22,887 ఆదా చేసింది. వాల్తేర్ డివిజన్‌లోని డీజిల్ లోకోషెడ్, ఎలక్ట్రికల్ లోకోషెడ్‌లలో అవలంబిస్తున్న పలు పర్యావరణహిత పద్ధతులకుగాను గ్రీన్‌కో సర్టిఫికెట్లు, సిల్వర్ రేటింగ్స్, ఐఎస్‌వో సర్టిఫికెట్లు అందుకుంది. ఇంధన సంరక్షణ చర్యలు, పునరుత్పాదక ఇంధన వినియోగం, గ్రీన్‌హౌస్ ఉద్గారాల తగ్గింపు, నీటిసంరక్షణ, వ్యర్థాల నిర్వహణ, మెటీరియల్ భద్రత, రీసైక్లింగ్ మొదలైన అంశాల్లో వాల్తేర్ డివిజన్ చేపడుతున్న ప్రమాణాలను పరిగణనలోకి తీసుకుని గ్రీన్ సర్టిఫికెట్‌ను జాతీయసంస్థ వాల్తేర్ డివిజన్‌కు అందజేసింది. వాల్తేర్ డివిజన్ పరిధిలోని ఏడు రైల్వేస్టేషన్లు కాలుష్య నియంత్రణ మండలి ద్వారా ఐఎస్‌వో సర్టిఫికెట్లు పొందాయి.

పీఆర్సీ పేస్కేల్ ఉత్తర్వుల మంజూరుపై హర్షం


విసుకొండ రాజారావు

గుంటూరు మెడికల్: ప్రభుత్వం 11వ పీఆర్సీకి సంబంధించిన పేస్కేల్ డిపార్ట్‌మెంట్ వారీగా, క్యాడర్ వారీగా ప్రకటించడం హర్షణీయమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వినుకొండ రాజారావు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగికి కనీస మూల వేతనం రూ. 20 వేలు ఉండాలని, అంతకంటే తక్కువ ఉండరాదన్నారు. గరిష్ట మూలవేతనం రూ.1.79 లక్షలుగా ఉండాలని ఇచ్చిన ఉత్తర్వులను ఉద్యోగ లోకం హర్షిస్తోందని తెలిపారు. మరోసారి ప్రభుత్వం ఉద్యోగుల పక్షపాతని నిరూపించుకుందని పేర్కొన్నారు. కొన్ని ఉద్యోగ సంఘాల నాయకులు సమస్యలను పరిష్కారం కాకుండా జటిలం చేసి, చాంపియన్ కావాలని, ఉద్యోగుల హక్కులతో ఆడుకుందామని, ఆశించి భంగపడ్డారన్నారు. ఇప్పటికైనా ఉద్యోగులకు, ప్రభుత్వానికి మధ్య ఘర్షణ వాతావరణం పెంచాలనుకున్న నాయకుల విధానం మార్చుకోవాలని హితవు పలికారు. ఏ నాయకుడి ప్రమేయం లేకుండానే 11వ పీఆర్సీ పేస్కేల్ మంజూరు చేసిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

సముద్రంలో 'పవన విద్యుత్'

దేశ, విదేశాల్లో విస్తరిస్తున్న ఆఫ్‌షోర్ విండ్ పవర్ ప్లాంట్స్

సాక్షి, అమరావతి: పర్యావరణాన్ని పరిరక్షిస్తూనే... సహజ ఇంధన వనరులను వినియోగించుకుని విద్యుత్ ఉత్పత్తి చేయడానికి ప్రపంచ వ్యాప్తంగా అనేక ప్రయోగాలు జరుగుతున్నాయి. ప్రజల విద్యుత్ అవసరాలను తీర్చడంతోపాటు వాతావరణంలో కర్బన ఉద్గారాలను తగ్గించాలనేది వాటి లక్ష్యం. ఈ క్రమంలోనే పునరుత్పాదక ఇంధన (విద్యుత్) ఉత్పత్తికి ప్రాధాన్యత పెరుగుతోంది. స్వచ్ఛ ఇంధనాన్ని వినియోగించాల్సిన ఆవశ్యకతపై ప్రపంచ దేశాలన్నీ కలిసి ఇప్పటికే ఒక తీర్మానాన్ని కూడా చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో సౌర విద్యుత్‌తోపాటు పవన విద్యుత్ ఉత్పత్తి, వినియోగంలో సరికొత్త ఆవిష్కరణలు వెలుగులోకి వస్తున్నాయి. ఇప్పటివరకు కొండలు, మైదాన ప్రాంతాల్లోనే పవన విద్యుత్ ప్లాంట్లు ఉండగా.. కొద్దికాలంగా సముద్రంలోనూ పవన విద్యుత్



ఉత్పత్తి కేంద్రాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి.

2026 నాటికి దాదాపు 20 గిగావాట్లు

పవన విద్యుత్ సామర్థ్యం ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా పెరుగుతూనే ఉంది. గ్లోబల్ విండ్ ఎనర్జీ కౌన్సిల్ (జీడబ్ల్యూసీ) తాజా నివేదిక ప్రకారం... 2021లో ప్రపంచ పవన విద్యుత్ పరిశ్రమ కొత్తగా 93.6 గిగావాట్లు వృద్ధిని నమోదు చేసింది. దీంతో మొత్తం పవన విద్యుత్ పరిశ్రమ సామర్థ్యం 837 గిగావాట్లకు చేరింది. ఇది ఏటా 1.2 బిలియన్ టన్నుల కార్బన్ డయాక్సైడ్‌ను నివారించడంలో సహాయపడుతోంది. మన దేశంలో మొత్తం విద్యుత్ డిమాండ్ సగటు వృద్ధి రేటు 6 %గా ఉంది. ప్రస్తుతం దేశంలో దాదాపు 40 గిగావాట్ల ఆన్‌షోర్ విండ్ కెపాసిటీ ఉన్నప్పటికీ, గాలి విస్తరణ వేగం మందగించడంతో ఉత్పత్తి ఆశించినంతగా ఉండటం లేదు. 2012–2016 మధ్య 13 శాతంగా ఉన్న వార్షిక పవన విద్యుత్ సగటు వృద్ధి రేటు... 2016–21 మధ్య 5 శాతానికి తగ్గింది. గ్లోబల్ విండ్ ఎనర్జీ కౌన్సిల్ విశ్లేషణ ప్రకారం ఈ వృద్ధి రేటు రానున్న దశాబ్దంలో 15శాతానికి పెరగాలి. ఇందుకోసం పవన విద్యుత్ ప్లాంట్ల స్థాపన పెరగాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. దీంతో సముద్రతీరంలో 2026 నాటికి దాదాపు 20 గిగావాట్ల పవన విద్యుత్ ప్లాంట్లను స్థాపించే ప్రయత్నం జరుగుతోంది.

నిర్వహణకు సెన్సార్ సిస్టమ్

భూమి మీద కంటే సముద్రంలో గాలి వేగం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల ఆఫ్‌షోర్ విండ్ పవర్ ప్లాంట్లతో అధికంగా విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది. సముద్రంలో ఏర్పాటు చేసే విండ్ పవర్ టర్బైన్లను బ్లేడ్‌లు, ఫైబర్ గ్లాస్ మిశ్రమంతో తయారు చేస్తారు. వందల అడుగుల పొడవు, అనేక టన్నుల బరువు ఉంటాయి. బ్లేడ్‌ల అంచులలో పగుళ్లు, రంధ్రాల వల్ల టర్బైన్ విఫలమై, విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం ఏర్పడుతుంటుంది. ఈ నేపథ్యంలో వాటిని పర్యవేక్షించడానికి ధ్వని ఆధారిత సెన్సార్ సిస్టమ్‌ను అభివృద్ధి చేశారు. దీనిలో భాగంగా బ్లేడ్‌లో వైర్‌లెస్ మైక్రోఫోన్‌లను అమర్చుతారు. దీనివల్ల సమస్యను వెంటనే గుర్తించి బాగుచేసే వీలు కలుగుతుంది. అంతేకాదు ఈ టర్బైన్లు తీరానికి దూరంగా ఉంటాయి. కాబట్టి రిమోట్ మానిటరింగ్ టెక్నాలజీని వాడతారు. ఇతర దేశాల్లో ఈ విధానం ఇప్పటికే ప్రాచుర్యంలోకి రాగా, మన దేశంలో ఇప్పుడిప్పుడే విస్తరిస్తోంది. దేశంలో వేగంగా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్, డీకార్బనైజేషన్ లక్ష్యాలను చేరుకోవడానికి శిలాజ ఇంధనాలకు ప్రత్యామ్నాయంగా స్వచ్ఛమైన, చవకైన సహజ వనరులను వినియోగించుకోవాల్సిన అవసరం ఉంది. అందులో సముద్రతీర గాలి మన దేశ విద్యుత్ వ్యవస్థకు ప్రధానమైనదిగా మారుతోంది. థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రానికి అయ్యే ఖర్చు కంటే తక్కువకే పవన విద్యుత్ ప్లాంట్లను నెలకొల్పవచ్చు. ఈ విద్యుత్‌కు ఓపెన్ యాక్సెస్, ఇంటర్–స్టేట్ ట్రాన్స్‌మిషన్ సిస్టమ్ చార్జీల మినహాయింపులు వంటి ప్రోత్సాహకాలు కూడా లభిస్తాయి.

చంద్రబాబును వెంటనే అరెస్టు చేయాలి

- మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ



రామచంద్రపురం: స్కిల్ డెవలప్‌మెంటు పేరుతో రూ.371 కోట్ల ప్రజాధనం దోచుకున్న చంద్రబాబునాయుడిని ప్రధాన ముద్దాయిగా గుర్తించి, వెంటనే అరెస్టు చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ డిమాండ్ చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలు, దోపిడీల గురించి శాసన సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధారాలతో సహా తెలియజేస్తే, తమ బండారం ఎక్కడ బయట పడిపోతుందోనని టీడీపీ శాసన సభ్యులు స్పీకర్ చైర్‌ను అవమానపరిచే విధంగా ప్రవర్తించటం బాధాకరమని అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో చంద్రబాబు అడ్డంగా దొరికిపోయారని తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులను మోసం చేసేందుకు చంద్రబాబు స్కిల్ గొప్పగా పని చేసిందన్నారు. సీమెన్స్ ఉద్యోగితో లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకుని స్కామ్‌కు పాల్పడ్డారని, తమకు సంబంధం లేదని ఆ సంస్థే చెప్పినా కూడా చంద్రబాబు సిగ్గు లేకుండా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. చంద్రబాబు సాగించిన ఈ ప్రజా దోపిడీపై అవసరమైతే ఈడీ ఎంక్వయిరీ చేయాలని, ఈ స్కామ్‌లో ఉన్న వారిని కూడా విచారించాలని మంత్రి డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన దోపిడీపై ఎల్లో మీడియా కానీ, ప్రశ్నిస్తానని అంటున్న పవన్ కల్యాణ్ కానీ ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. చంద్రబాబును మోయడమే పనిగా పెట్టుకోకుండా వాస్తవ విషయాలను ప్రజలకు తెలియజేయాలని ఎల్లో మీడియాకు సూచించారు.

తవ్వేకొద్దీ బయటపడుతున్న
మార్గదర్శి మోసాలు

రూ.459.98 కోట్లను దారి మళ్లించినట్లు ఇప్పటికే ఆడిట్‌లో నిర్ధారణ

- తాజాగా మరిన్ని అక్రమాలు బట్టబయలు
- ప్రతి గ్రూపులో పాడుకునే రెండో నెల పాటకు ఎటువంటి చందా కట్టని వైనం
- ఖాళీ చిట్లకు చెల్లించాల్సిన చందాలకు ఎగనామం
- ఇవేమీ చెల్లించకుండానే ప్రతి గ్రూపుపైనా ప్రతి నెలా 5 శాతం కమీషన్ స్వీకరణ
- గుంటూరు, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో వెలుగులోకి
- ఈ ఉల్లంఘనలపై ఆయా బ్రాంచ్‌ల వివరణ కోరిన రిజిస్ట్రేషన్ల శాఖ



సాక్షి, అమరావతి: ఈనాడు సంస్థల అధిపతి రామోజీరావుకు చెందిన మార్గదర్శి చిట్‌ఫండ్స్ మోసాలు తవ్వే కొద్దీ బయటపడుతూనే ఉన్నాయి. ఇప్పటికే రూ.459.98 కోట్ల సొమ్మును చట్టవిరుద్ధంగా మ్యూచువల్ ఫండ్స్, షేర్లు, తదితరాల్లోకి మళ్లించినట్లు ఆడిటింగ్‌లో అధికారులు నిర్ధారించారు. తద్వారా చందాదారుల సొమ్మును తమ వ్యక్తిగత లబ్ధి కోసం రామోజీరావు, ఆయన కోడలు, మార్గదర్శి ఎండీ శైలజ వినియోగించుకున్నట్లు స్పష్టమైంది. తాజాగా ప్రతి చిట్ గ్రూపులో ఖాళీ చిట్లు, కంపెనీ పాడుకునే రెండో నెల చిట్ల లావాదేవీల్లోనూ భారీగా అవకతవకలకు పాల్పడినట్లు తేలింది. మార్గదర్శి మేనేజర్లు సమర్పించిన మినిట్స్‌ను విశ్లేషించిన ఆడిట్ అధికారులు ఈ మోసాలను గుర్తించారు. ఖాళీ చిట్లకు గానీ, ప్రతి చిట్ గ్రూపులో కంపెనీ పాడుకునే రెండో నెల చిట్‌కు సంబంధించి గానీ ఎటువంటి సొమ్ము (నెల వారీ చందా) చెల్లించలేదని వెల్లడైంది. ప్రతి చిట్ గ్రూపులో రెండో నెల చిట్ పాటను కంపెనీయే పాడుకునే అవకాశం ఉంది. అందుకోసం అందరి చందాదారుల మాదిరిగానే కంపెనీ కూడా చందా కట్టాలి. కానీ చందా కట్టకుండానే ఆ రెండో నెల చిట్‌ను పాడుకుని కంపెనీ జమ చేసుకుంటోంది. కంపెనీ తరఫున కట్టాల్సిన ఎటువంటి చందాలు కట్టకుండానే ప్రతి నెలా ప్రతి గ్రూపు నుంచి 5 శాతం కమీషన్‌ను తీసుకుంటోంది.

ఆధారాలతో సహా వెలుగుచూసిన అక్రమాలు..

గుంటూరు, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని పలు మార్గదర్శి యూనిట్లలో ఈ మోసాలు ఆధారాలతో సహా బయటపడ్డాయి. గుంటూరు జిల్లాలో ఐదు చిట్ గ్రూపులను విశ్లేషించగా వాటి ద్వారా రూ.1.18 కోట్లను చిట్ కమీషన్‌గా, రూ.1.73 కోట్లను రెండో నెల పాడుకున్న చిట్ సొమ్ముగా కంపెనీ జమ చేసుకుంది. కానీ పాడుకున్న రెండో నెల చిట్ చందా.. అలాగే ఆ గ్రూపులో తన పేరు (ఫోర్‌మెన్) మీద ఉంచుకున్న ఖాళీ చిట్లకు చెల్లించాల్సిన చందా సొమ్ము రూ.6.98 కోట్లు చెల్లించలేదని అధికారులు గుర్తించారు. విజయనగరం జిల్లాలో 12 చిట్ గ్రూపులను విశ్లేషించినప్పుడు ఫోర్‌మెన్ కమీషన్ రూ.60.50 లక్షలు, రెండో నెల పాడుకున్న చిట్ మొత్తం రూ.1.05 కోట్లను కంపెనీ ఖాతాలో వేసుకున్నారు. కానీ వాటికి సంబంధించి కట్టాల్సిన రెండో నెల చిట్ చందాలు, కంపెనీ పేరు మీద ఉన్న ఖాళీ చిట్ల చందాల మొత్తం రూ.54.85 లక్షలు కట్టలేదని తేలింది. అలాగే శ్రీకాకుళం జిల్లాలో 28 చిట్ గ్రూపులను పరిశీలించినప్పుడు వాటికి ఫోర్‌మెన్ కమీషన్ రూ.3.47 కోట్లు, రెండో నెల పాడుకున్న చిట్ల మొత్తం రూ.2.73 కోట్లను కంపెనీ తీసుకుంది. కానీ వాటికి సంబంధించి కట్టాల్సిన రూ.2.88 కోట్ల చందా సొమ్మును కట్టలేదు.

భారీగా ఉల్లంఘనలు..

నెల వారీగా చందాదారులతోపాటు కట్టాల్సిన సొమ్మును కట్టకుండానే కమీషన్ తీసుకోవడం, ప్రతి గ్రూపులోనూ చందా కట్టకుండానే రెండో నెల చిట్‌ను పాడుకుని ఆ సొమ్మును తీసుకోవడం ద్వారా మార్గదర్శిలో చిట్లు వేసిన వారిని రామోజీరావు, ఆయన కోడలు శైలజ మోసం చేసినట్లు స్పష్టమైంది. చిట్‌ఫండ్ చట్టానికి విరుద్ధంగా చందాదారుల సొమ్మును పణంగా పెట్టి భారీగా ఉల్లంఘనలకు పాల్పడినట్లు ఆడిట్ అధికారులు గుర్తించారు. ఖాళీగా ఉన్న చిట్లకు సంబంధించి ఎటువంటి చందా చెల్లించకుండా మిగిలిన చందాదారులను మభ్యపెట్టినట్లు తేలింది. ఈ ఉల్లంఘనలకు సంబంధించి వివరణ ఇవ్వాలని సంబంధిత మార్గదర్శి బ్రాంచ్‌లను ఆదేశించినట్టు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్ అండ్ ఐజీ రామకృష్ణ తెలిపారు.

సీఆర్డీఏ ప్రాంతంలోనూ పేదలకు ఇళ్లు

- ఏపీ సీఆర్డీఏ పరిధిలో ఆర్–5 జోన్ ఏర్పాటు
- గెజిట్ జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ఏపీ సీఆర్డీఏ) పరిధిలో నిరుపేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సీఆర్డీఏ మాస్టర్ ప్లాన్‌లో ఆర్–5 జోన్ ఏర్పాటు చేస్తూ మంగళవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు మంగళగిరి మండలం కృష్ణాయపాలెం, నిడమర్రు, కురగల్లు, తుళ్లూరు మండలంలోని మందడం, ఐనవోలులో 900.97 ఎకరాలను ఆర్–5 జోన్‌గా నిర్ణయించింది. సీఆర్డీఏ పరిధిలోని ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు, నిరుపేదలకు అక్కడ ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు మార్గం సుగమమైంది. సీఆర్డీఏ చట్టంలోని నిబంధనల ప్రకారం మొత్తం ల్యాండ్ పూలింగ్ ద్వారా సేకరించిన భూమిలో ఐదు శాతం నిరుపేదల గృహాల కోసం కేటాయించవచ్చు. ఈ ప్రాంతంలో పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు గతంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోగా, హైకోర్టు ద్వారా అడ్డుకునే యత్నం చేశారు. అయితే, సీఆర్డీఏ అధికారులు కోర్టు ఆదేశాల మేరకు స్థానిక గ్రామాల్లో సభలు నిర్వహించి అభిప్రాయాలు తీసుకుని నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించారు. దీనిని పరిశీలించిన ప్రభుత్వం నిరుపేదలకు మేలు చేకూరేలా ఐదు గ్రామాల పరిధిలో ఆర్–5 జోన్ ఏర్పాటు చేసింది.

నెలరోజుల్లో లేఅవుట్ సిద్ధం!

రాష్ట్ర ప్రభుత్వ తాజా నిర్ణయంతో రాజధాని ప్రాంతంలోని ఆర్–5 జోన్‌లో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు సీఆర్డీఏ సిద్ధమవుతోంది. నెల రోజుల్లో 900.97 ఎకరాల్లో లేఅవుట్ సిద్ధం చేసి కలెక్టర్లకు అప్పగించనున్నట్లు సమాచారం. గతంలో ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పరిధిలో దాదాపు 54 వేల మంది లబ్ధిదారులను గుర్తించారు. వారందరికీ ఆర్–5 జోన్‌లో ఇళ్లు లేదా ఇళ్ల స్థలాలు ఇవ్వనున్నారు. అమరావతి ప్రాంతంలో ఆర్–5 జోన్ ఏర్పాటుపై ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

ఉన్నత విద్యలో
హెరిటేజ్, కల్చర్

▶ మొదటి పేజీ తరువాయి

విద్యావిధానం–2020 ప్రకారం భారతీయ వారసత్వం, సంస్కృతీ, సంప్రదాయాలను ప్రోత్సహించడానికి వీలుగా భారతీయ సనాతన వారసత్వ సంపద ఎంత గొప్పదో ప్రపంచానికి తెలియచేయడమే లక్ష్యంగా ఈ కోర్సులను ప్రవేశపెట్టాలని భావిస్తున్నట్లు యూజీసీ పేర్కొంది. ఆయుర్వేదం, శాస్త్రీయ నృత్య రూపాలు, భారతీయ భాషలు, సంగీతం, సంస్కృతం, సార్వజనీన మానవ విలువలు, వేద గణితం, యోగా వంటి కోర్సుల కోసం కరిక్యులమ్ ఫ్రేమ్‌వర్కును రూపొందించనుంది. ఈ కోర్సులతో విదేశీ విద్యార్థులను భారతదేశానికి ఆకర్షించడమే లక్ష్యంగా మార్గదర్శకాలు విడుదల చేసింది. 3 విభాగాలుగా ఈ కోర్సులను యూజీసీ ప్రతిపాదించింది. పరిచయ స్థాయి, మధ్యంతర స్థాయి, అధునాతన స్థాయిగా వీటిని విభజించనుంది. కోర్సులను అందించే సంబంధిత ఉన్నత విద్యాసంస్థలు వాటికి నిర్దిష్ట అర్హత పరిస్థితులను నిర్ణయించడానికి యూజీసీ అనుమతించింది. ఆయా ప్రోగ్రాములు ఫ్లెక్సిబుల్ హైబ్రిడ్ (ఆన్‌లైన్–ఆఫ్‌లైన్ కాంబినేషన్) కింద అందించనున్నారు. ఆయా ఉన్నత విద్యాసంస్థలు కోర్సులకు సంబంధించి సంబంధిత ముఖ్యమైన సాహిత్యం గ్రంథాలు నేర్చుకున్న పండితుల సహకారం తీసుకుని పాఠ్యాంశాలను అభివృద్ధి చేయాలని సూచించింది. ఆయా ప్రోగ్రాములను రూపొందించేటపుడు బోధనా విధానాల్లోనూ ఆధునిక నాలెడ్జ్ సిస్టమ్‌తో అనుసంధానం ఉండాలని స్పష్టం చేసింది. బోధన వివిధ మాధ్యమాల్లో ఉంటుంది. ఉపన్యాసాలు, ఆడియో–వీడియో కంటెంట్, గ్రూపు చర్చలు, ఆచరణాత్మక సెషన్‌లు, విహారయాత్రలు కూడా బోధనలో భాగంగా ఉంటాయి. అభ్యాసకులకు క్రెడిట్‌లను అందించడానికి రెండు రకాల మూల్యాంకన విధానాలు పాటిస్తారు. నిరంతర, సమగ్ర అంచనా (సీసీఏ), పీరియాడికల్ మూల్యాంకనాలను అనుసరించనున్నారు. కోర్సును విజయవంతంగా పూర్తి చేసిన తర్వాత విద్యార్థులకు ఆయా ఉన్నత విద్యా సంస్థలే సర్టిఫికెట్‌లను మంజూరు చేస్తాయి. ఆ సర్టిఫికెట్లు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన నేషనల్ అకడమిక్ డిపాజిటరీ (ఎన్ఏడీ)లో డిజిటల్ రూపంలో అందుబాటులో ఉంటాయి.



మనసు పవిత్రంగా ఉన్నప్పుడు, సంతోషం అనేది ఎన్నటికీ విడువని నీడలాగా వెంట వస్తుంది.
– బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, మార్చి, 22

భౌగోళిక రాజకీయ బంధం

పర్యటన పట్టుమని రెండే రోజులు. అలాగని తేలిగ్గా తీసుకుంటే పొరపాటే. మార్చి 20, 21ల్లో జపాన్ ప్రధాన మంత్రి ఫుమియో కిషిదా జరిపిన భారత పర్యటన గురించి ప్రత్యేకించి చెప్పుకొనేది అందుకే. ఇండియా జీ20కీ, జపాన్ జీ7 దేశాల కూటమికీ సారథ్యం వహిస్తున్న వేళ ఇరు దేశాల నేతలూ సమావేశం కావడం కచ్చితంగా విశేషమే. ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణను తీవ్రంగా తప్పుబడుతున్న జీ7 అజెండా జపాన్‌ది కాగా, అదే ఉక్రెయిన్ అంశం కారణంగా జీ20లో ఏకాభిప్రాయం రాక ఇబ్బంది పడుతున్న పరిస్థితి భారత్‌ది. ఈ పరిస్థితుల్లో ఇరు దేశాధినేతల సమావేశం, స్నేహపూర్వక సంభాషణలు – పానీపూరీ చిరుతిళ్ళతో ఛాయాచిత్రాలు, భారత్‌లో లక్షల కోట్లలో పెట్టుబడులు పెడతామని కిషిదా ప్రకటన, చైనా కట్టడికి 'ఫ్రీ అండ్ ఓపెన్ ఇండో – పసిఫిక్' అవసరం అంటూ కొత్త పల్లవిని ఎత్తుకోవడం – ఇలా 27 గంటల సుడిగాలి పర్యటనలో గుర్తుండే ఘటనలు అనేకం. సరిగ్గా చైనా అధ్యక్షుడు రష్యాలో పర్యటిస్తున్న వేళ జపాన్ ప్రధాని భారత్‌కు రావడం ప్రచ్ఛన్న యుద్ధానంతర ప్రపంచంలో మారుతున్న భౌగోళిక రాజకీయాలకు మచ్చుతునక.

పదిహేనేళ్ళ క్రితం 2008లో అప్పటి జపాన్ ప్రధాని షింజో అబే భారత్‌లోనే తన సిద్ధాంతమైన పసిఫిక్, హిందూ మహాసముద్రాల సంగమాన్ని వ్యూహాత్మక దర్శనం చేశారు. ఇప్పుడు కిషిదా 'క్వాడ్' కూటమిలో ఇతర భాగస్వామ్య దేశాలైన ఆస్ట్రేలియా, అమెరికాల్లో కాక భారత్‌లో 'స్వేచ్ఛా వాణిజ్యంతో కూడిన ఓపెన్ ఇండో–పసిఫిక్' అంటూ సైద్ధాంతిక ప్రకటన చేయడం విశేషం. భారత, జపాన్ ప్రధానుల ద్వైపాక్షిక సమావేశాలు 2006 నుంచి జరుగుతూనే ఉన్నాయి. ప్రోటోకాల్ ప్రకారం ఈసారి మోదీ జపాన్‌కు వెళ్ళాలి. అయితే, కిషిదా తానే హడావిడిగా భారత్‌కు రావడానికి కారణం ఉంది. మార్చి మొదట్లో భారత్‌లో జీ20 విదేశాంగ మంత్రుల సమావేశానికి జపాన్ విదేశాంగ మంత్రి హాజరు కాలేదు. ప్రతినిధిని పంపారు. అమెరికా, చైనా, ఆస్ట్రేలియా, రష్యా, బ్రిటన్ తదితర దేశాల విదేశాంగ మంత్రులు పాల్గొన్న అరుదైన కలయికకు హాజరవడం ఎంత ముఖ్యమో ఒకప్పటి విదేశాంగ మంత్రి కిషిదాకు తెలుసు. భౌగోళిక – రాజకీయ పటంలో తన స్థానాన్నీ, ప్రాధాన్యాన్నీ పెంచుకోవాలనుకొంటున్న తమ దేశం పక్షాన ఆయన తక్కున తప్పు దిద్దుకొన్నారు.

నిజానికి, భారత – జపాన్‌లు ఏడు దశాబ్దాల సుదీర్ఘ స్నేహాన్ని గడచిన 2022లోనే ఘనంగా జరుపుకొన్నాయి. ఒకప్పుడు మామూలు ప్రపంచ భాగస్వామ్యంగా మొదలై నేడు వ్యూహాత్మక ప్రపంచ భాగస్వామ్యంగా అది పెంపొందింది. అయితే, ఇప్పటికీ ఆర్థిక భాగస్వామ్యంలో, జనం మధ్య సంబంధాల్లో అంతరాలున్నాయి. వాటి భర్తీకి కిషిదా తాజా పర్యటన దోహదకారి. అలాగే, ఈ పర్యటనను కేవలం దౌత్య తప్పిదాన్ని సరిదిద్దే యత్నంగానే చూడనక్కర లేదు. జీ20లో అన్ని దేశాలూ కలసి చేయాల్సిన ప్రకటనకు చిక్కులు విడిపోలేదు గనక ప్రస్తుత జీ20, జీ7 సారథులిద్దరూ వివరంగా మాట్లాడుకొనడానికి ఇది సదవకాశమైంది. హిరోషిమాలో జరిగే జీ7 సదస్సులో పరిశీలకుడిగా పాల్గొనాలంటూ కిషిదా ఆహ్వానం, మోదీ అంగీకారం చెప్పుకోదగ్గవే. అయిదేళ్ళలో తమ సంస్థలు భారత్‌లో 5 లక్షల కోట్ల యెన్లు (4200 కోట్ల డాలర్లు) పెట్టుబడి పెడతాయని గత మార్చిలో మాటిచ్చిన జపాన్ నెమ్మదిగా అయినా ఆ దిశగా అడుగులు వేస్తోంది.

కిషిదా వెల్లడించిన భౌగోళిక రాజకీయాల్లో, వ్యూహాల్లో కీలకమైన 'ఫ్రీ అండ్ ఓపెన్ ఇండో – పసిఫిక్' ప్రతిపాదన భారత్‌కూ లాభదాయకమే. ఇండో– పసిఫిక్‌లో చైనాకు ముకుతాడు వేయడానికి పొరుగు దేశంతో కలసి నడవ్వచ్చు. కాకపోతే ప్రచ్ఛన్న యుద్ధం ముగిసినా – తన గడ్డపై అమెరికన్ సైనిక స్థావరాలను కొనసాగనిస్తూ, పాశ్చాత్య ప్రపంచంతో సైద్ధాంతిక స్నేహాన్ని కొనసాగిస్తున్న జపాన్ రక్షణ సామగ్రి, సాంకేతిక పరిజ్ఞాన సహకారంపై ఆరు విడతల చర్చల అనంతరం కూడా భారత్‌తో సంయుక్త భాగస్వామ్యానికి అడుగేయలేదు. రక్షణ ఉత్పత్తుల తయారీలో 'సహ–ఆవిష్కరణ, సహ–రూపకల్పన, సహ–సృష్టి' అవసరమంటూ తాజా పర్యటనలో కిషిదాకు మోదీ చెప్పాల్సి వచ్చింది. మూడో దేశంతో కలసి రక్షణ విన్యాసాలు అనేకం చేస్తున్నప్పటికీ, రక్షణ రంగంలో భారత్, జపాన్‌లు చేతులు కలపనిదే సంపూర్ణ 'ఫ్రీ అండ్ ఓపెన్ ఇండో–పసిఫిక్' సాధ్యం కాదని కిషిదాకూ తెలుసు. అలాగే, భారీ భారత విపణిలో భాగస్వామ్యానికి ఆసక్తిగా ఉన్నప్పటికీ, భారత్‌లో వస్తూత్పత్తి రంగంలో పెట్టుబడులకు జపాన్‌లో తటపటాయింపు పోవాల్సి ఉంది. ఉక్రెయిన్ యుద్ధం అంశంలో భేదాభిప్రాయాలను పక్కన పెట్టాల్సి ఉంది.

మొత్తానికి ఉమ్మడి బెడదైన చైనా వల్ల భారత్, జపాన్‌లు మరింత సన్నిహితం కావచ్చు. నిరుడు 3 సార్లు, ఈ ఏడాది ఇకపై మరో 3 సార్లు ఇరువురు ప్రధానులూ కలవనుండడంతో ఇండో– పసిఫిక్ భౌగోళిక రాజకీయాల్లో మరిన్ని అడుగులు ముందుకు పడవచ్చు. భారత్‌కు కూడా రానున్న నెలలు కీలకం. భారత ప్రధాని మేలో జీ7 సదస్సులో, ఆ తర్వాత ఆస్ట్రేలియాలో 'క్వాడ్' సమావేశంలో పాల్గొంటారు. అటుపైన అమెరికాను సందర్శించనున్నారు. రాగల కొద్ది నెలల్లోనే ఎస్‌సీఓ, జీ20 సదస్సుల నిమిత్తం రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధినేత షీ జిన్‌పింగ్‌లకు రెండు సార్లు ఆతిథ్యమిచ్చే అవకాశం భారత్‌కు రానుంది. వీటన్నిటి నేపథ్యంలో కిషిదా పర్యటన రానున్న సినిమాకు ముందస్తు ట్రైలర్. ప్రపంచం మారుతున్న వేళ మన భౌగోళిక రాజకీయ స్థానాన్ని పునర్నిర్వచించుకోవడానికి ఇది మంచి తరుణం కావచ్చు. విశ్వవేదిక సిద్ధమైంది. మరి, మనమూ సంసిద్ధమేనా?

ఇది డిజిటల్ చెల్లింపుల విప్లవం

డిజిటల్ చెల్లింపుల ఆవిష్కరణ భారత ఆర్థిక వ్యవస్థలో సమూల మార్పును తీసుకొచ్చింది. పెద్దనోట్ల రద్దు తర్వాత ఆర్థిక లావాదేవీలన్నింటినీ పరివర్తన చెందించిన గొప్ప విప్లవ ఆవిష్కరణే ఈ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ. దేశీయంగా మొదలైన ఈ సరికొత్త సాంకేతిక వ్యవస్థ కోట్లాదిమందిని సాంప్రదాయిక ఆర్థిక వ్యవస్థ చట్రం నుంచి బయటకు లాగడమే కాదు... దేశీయ వాణిజ్యాన్ని పునర్నిర్మించింది. మన ఆర్థిక వ్యవస్థకు సంబంధించి ఇది ఒక గేమ్ ఛేంజర్‌లా పనిచేసింది. ప్రజా జీవితంలో, బ్యాంకింగ్ రంగంలో, నగదు లావాదేవీల్లో సరికొత్త మార్పును తీసుకొచ్చిన భారతీయ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ ఈరోజు ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలందుకుంటోంది.


ఆధునిక ఆర్థిక వ్యవస్థకు భారతదేశం అందించిన అధునాతన సాంకేతిక విప్లవం– డిజిటల్ పేమెంట్ సిస్టమ్. భారత్ రూపొందించిన దేశీయ తక్షణ చెల్లింపుల వ్యవస్థ వాణిజ్య కార్యకలాపాలను పునర్నిర్మించడమే కాదు, కోట్లాదిమంది ప్రజలను సాంప్రదాయిక ఆర్థిక వ్యవస్థ నుంచి బయటపడేసింది. కేంద్ర ప్రభుత్వం దృఢమైన ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంలో దీన్ని రూపొందించింది. ఇది రోజువారీ జీవితాన్ని సౌకర్యవంతం చేసింది. రుణాలు, పొదుపులు వంటి బ్యాంకింగ్ సేవలను మరింతగా విస్తరింపజేసింది. కోట్లాది మంది భారతీయులకు ప్రభుత్వ కార్యక్రమాలను మరింతగా అందుబాటులోకి తీసుకొచ్చింది. పన్నుల సేకరణను కూడా సులభతరం చేసింది.

ప్రధాని నరేంద్రమోదీ జీ20 ఆర్థిక మంత్రులతో ముచ్చటిస్తూ, డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ పాలనను మౌలికంగానే మార్చివేసిందని చెప్పారు. డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను అతి తక్కువ ఖర్చుతో ఏర్పర్చిన సాంకేతిక ఆవిష్కరణగా చూడవచ్చు. దీంతో మునుపెన్నడూ కనీవినీ ఎరగని స్థాయిలో అభివృద్ధి చెందిన దేశాలను సైతం ఎలా ప్రభావితం చేయవచ్చో భారత్ నిరూపించింది. భౌతిక మౌలిక వసతుల వ్యవస్థ వెనుకంజ వేస్తున్న పరిస్థితుల్లో కూడా ఇది ఆర్థిక పురోగతికి దోహదం చేస్తుంది. ప్రపంచంలోకెల్లా నిరుపేద దేశాలను కూడా పైకి లేపేటటు వంటి ఆలోచనల ఇంక్యుబేటర్‌గా భారత్ ఎగుమతి చేయాలనుకుంటున్న పబ్లిక్–ప్రైవేట్ మోడల్ ఇది.

భారత్ ప్రారంభించిన ఈ గొప్ప ఆవిష్కరణ కేంద్ర భాగంలో 'జేఏఎమ్' త్రయం ఉన్నాయి. అవి: జన్ ధన్ ఖాతాలు, ఆధార్, మొబైల్. ఈ మూడు మూలస్తంభాలూ భారత ఆర్థిక పర్యావరణ వ్యవస్థను సమూలంగా విప్లవీకరించాయి. మొదటి స్తంభమైన ప్రధాన్ మంత్రి జన్ ధన్ యోజన ప్రతి వయోజన భారతీయుడికి ఒక బ్యాంక్ ఖాతాను గ్యారంటీగా అందించే ఆర్థిక కార్యక్రమం. 2022 నాటికి, ఈ పథకం కింద 46.25 కోట్ల బ్యాంక్ ఖాతాలను తెరిచారు. వీటిలో 56 శాతం మహిళల ఖాతాలు కాగా, 67 శాతం ఖాతాలు గ్రామీణ, అర్ధ పట్టణ ప్రాంతాల్లో తెరిచారు. ఈ ఖాతాల్లో రూ. 1,73,954 కోట్లు జమ అయ్యాయి.

ఇక రెండో మూలస్తంభం: ఆధార్ పరివర్తిత ఐడెంటిటీ సేవలు. ఆధార్ ఐడీని రెండు అంశాల ప్రామాణీకరణ లేదా బయోమెట్రిక్ ద్వారా ఉపయోగించవచ్చు. ఆధార్ ప్రామాణీకరణ బ్యాంకులు, టెల్కో వంటి సంస్థలకు మూలాధారంగా మారింది. ఈరోజు దేశంలోని 99 శాతం వయోజనులు బయోమెట్రిక్ గుర్తింపు నంబర్‌ను కలిగి ఉన్నారు. ఇంతవరకు 1.3 బిలియన్ ఐడీలు జారీ అయ్యాయి. ఈ ఐడీలు బ్యాంక్ ఖాతాల రూపకల్పనను సరళతరం చేసి సత్వర చెల్లింపుల వ్యవస్థకు పునాదిగా మారాయి.

ఇక మూడో మూలస్తంభం: మొబైల్. ఇది భారతీయ టెలికామ్ రంగంలో కీలకమైన డిజిటల్ ఆవిష్కరణ. 2016లో రిలయెన్స్ జియో



టెలికామ్ రంగంలోకి దూసుకొచ్చిన తర్వాత డేటా ఖర్చు 95 శాతం వరకు పడిపోయింది. ప్రతి భారతీయుడికి ఇంటర్నెట్‌ను అతి తక్కువ ఖర్చుతో అందుబాటులోకి తెచ్చింది. ఈ–కామర్స్, ఫుడ్ డెలివరీ, ఓటీటీ కంటెంట్ వంటి సమాంతర వ్యవస్థలకు జీవం పోసింది. ఇంకా ముఖ్యమైనది ఏమిటంటే, అత్యంత మారుమూల ప్రాంతాల్లోని చిట్టచివరి వ్యక్తికి కూడా డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చింది.

ఇంటర్నెట్ అందుబాటు, స్మార్ట్ ఫోన్ల వ్యాప్తిని టెలిఫోన్ కంపెనీలు వేగవంతం చేయడం; ఆధార్ ప్రామాణీకృత జన్ ధన్ ద్వారా భారతీయ చెల్లింపుల పర్యావరణ వ్యవస్థ సమూల మార్పునకు గురైంది. ఈ సమూల మార్పు బ్యాంక్ ఖాతాకు నగదు రహిత చెల్లింపులను అనుసంధానించే 'ఏకీకృత చెల్లింపుల మధ్యవర్తి' (యూపీఐ) భావనకు దారితీసింది. యూపీఐ ఒక ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) వ్యవస్థ. ఇది నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్పీసీఐ) నేతృత్వంలో పనిచేసే వేదిక. ఈ వేదిక వందలాది బ్యాంకులు, డజన్లకొద్దీ మొబైల్ పేమెంట్ యాప్స్ నుంచి సేవలను అందిస్తుంది. దీనికి ఎలాంటి ట్రాన్సాక్షన్ ఫీజులు ఉండవు. ఫిన్‌టెక్, బ్యాంకులు, టెల్కోలు ఈ వేదికను స్వీకరించాయి. పైగా 'మర్చంట్ పాయింట్ ఆఫ్ సేల్స్' (పీఓఎస్) వద్ద క్యూఆర్ కోడ్ ప్లేస్‌మెంట్ల వల్ల యుపీఐ భావన మరింత పురోగమించింది.

ఎన్పీసీఐ మేనేజింగ్ డైరెక్టర్ దిలీప్ అస్బె ప్రకారం – ఈ యేడాది జనవరిలో రెండు లక్షల కోట్ల రూపాయల విలువైన 800 కోట్ల లావాదేవీలు యూపీఐ ద్వారా జరిగాయి. ఈరోజు అన్ని రకాల చెల్లింపుల్లో 40 శాతం డిజిటల్‌గా జరుగుతున్నాయి. గత సంవత్సరం భారత్‌లో జరిగిన తక్షణ డిజిటల్ లావాదేవీల విలువ అమెరికా, బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్ దేశాల మొత్తం డిజిటల్ లావాదేవీల కంటే ఎక్కువని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఈ జనవరిలో వరల్డ్ ఎకనామిక్ ఫోరంలో తెలిపారు.

దేశంలోని 30 కోట్లమంది వ్యక్తులు, 5 కోట్లమంది వర్తకులు యూపీఐని ఉపయోగిస్తున్నారని దిలీప్ అస్బె తెలిపారు. అత్యంత చిన్న లావాదేవీలను కూడా డిజిటల్ చెల్లింపుల ద్వారా చేస్తున్నారు. 10 రూపాయల విలువ చేసే కప్పు పాలు లేదా రూ.200 విలువ చేసే సంచీడు తాజా కూరగాయలు వంటి లావాదేవీలు కూడా డిజిటల్ ద్వారానే జరుగుతున్నాయి. సుదీర్ఘకాలంగా నగదు చెల్లింపులు సాగుతున్న ఆర్థికవ్యవస్థలో ఇది గణనీయమైన మార్పు. నల్లధనం నిర్మూలనకు తీసుకొచ్చిన పెద్ద నోట్ల రద్దు, కోవిడ్ మహమ్మారి కాలంలో సామాజిక దూరం పాటించడం వంటివి కూడా డిజిటల్ పేమెంట్ వ్యవస్థను మరింతగా ముందుకు నెట్టాయి.

భారత ప్రభుత్వం గోప్యత, సృజనాత్మక ఆవిష్కరణ మధ్య సరైన సమతూకాన్ని తీసుకొచ్చిందని జీ20 షేర్పా అమితాబ్ కాంత్ వ్యాఖ్యానించారు. డిజిటల్ చెల్లింపులను ఇంకా అమలు పర్చని రంగాల్లో కూడా, ఉదాహరణకు కేరళలోని మత్స్య పరిశ్రమలో ఐడెంటిటీ సంఖ్య, బ్యాంక్ ఖాతాలు, మొబైల్ ఫోన్ యాప్‌ల వంటి డిజిటల్ ప్రాథమిక పునాదులు సేవల సులభ పంపిణీకి వీలు కల్పిస్తున్నాయి. డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ విజయం డిజిటల్ పేమెంట్ మౌలిక వసతుల దృఢత్వంపై మాత్రమే ఆధారపడలేదు... అది నగదు నుంచి డిజిటల్‌కు మారడానికి ప్రజల్లో తెచ్చిన ప్రవర్తనాపరమైన ప్రోత్సాహంపై కూడా ఆధారపడి ఉంది.

టీ స్టాల్స్ వంటి వాటి వద్ద అమర్చిన పేమెంట్ యాప్స్ ద్వారా అందించిన చిన్న వాయిస్ బాక్సుల వంటి ఆసక్తికరమైన ఆవిష్కరణల్లో కూడా వీటి విజయం దాగి ఉంది. వీటి ద్వారా ప్రతి చిన్న లావాదేవీ తర్వాత అమ్మకందారులు ఫోన్ మెసేజ్‌లు తనిఖీ చేస్తూ బిజీగా ఉంటున్నారు. క్యూఆర్ కోడ్ ద్వారా ప్రతి పేమెంట్‌తో తక్షణం అందుకునే డబ్బు ఎంతో సిరి వంటి వాయిస్ ప్రకటిస్తుంది. నగదు లావాదేవీలను దీర్ఘకాలంగా ఉపయోగిస్తున్న వర్తకులలో ఏర్పడే అవిశ్వాసాన్ని తొలగించడంలో ఇది సాయపడుతుంది.

'కౌంటర్‌పాయింట్' ప్రకారం, భారత్‌లో 120 డాలర్ల సబ్ ఫోన్లకు మార్కెట్ వాటా రెండేళ్లకు ముందు 41 శాతం ఉండగా, 2022లో అది 26 శాతం పడిపోయింది. ఇదే కాలానికి 30 వేల రూపాయల (360 డాలర్లు) పైబడిన ధర కలిగిన ప్రీమియం ఫోన్ల వాటా రెట్టింపై 11 శాతానికి చేరుకుంది. ఫోన్లకోసం రుణాలు వంటి ఫైనాన్స్ ప్రాడక్ట్ ఆవిష్కరణలు ప్రీమియం ఫోన్లను చిన్న చిన్న పట్టణాలలోని సామాన్య ప్రజానీకానికి అందుబాటులోకి తీసుకొచ్చాయి. ఆధార్ ప్రామాణికత, మొబైల్ ఇంటర్నెట్ ఉపయోగంపై ఆధారపడిన సమీకృత ఆర్థిక వ్యవస్థ కారణంగా ఇది సాధ్యమైంది.

ఇవన్నీ దేశంలో వ్యాపారాన్ని, ఆంట్రప్రెన్యూర్‌షిప్‌ని, వినియోగ నమూనాలను విప్లవీకరించి భారతీయ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను గేమ్ ఛేంజర్‌గా చేయడమే కాకుండా, ప్రపంచానికే స్ఫూర్తిగా నిలిపాయి.

– బీఎస్/'పీఐబీ' రీసెర్చ్ వింగ్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

పెద్ద సమస్య



కోవిడ్ ఎంఆర్ఎన్ఏ టీకాలు సురక్షితమైనవి, ప్రభావవంతమైనవి అని చెబుతున్న అబద్ధాలన్నీ చూస్తుంటే– 'మానవ హనన ఆయుధాలు', 'వాటర్ గేట్' లాంటివి కూడా పిల్లలాటల్లా కనబడుతున్నాయి. మనం నిజంగా, నిజంగా ఒక భయానకమైన అంశంతో వ్యవహరిస్తున్నాం.

– అసీమ్ మల్హోత్రా, కార్డియాలజిస్ట్

మనమంతా ఒక్కటే!



భారతీయులకు సంబంధించి కొన్ని విషయాల్లో మరో మాటకు తావు లేదు. సరిహద్దు సమగ్రత, సార్వభౌమత్వం అలాంటివే. ఈ అంశం వచ్చినప్పుడు ఆ రాష్ట్రానికి(పంజాబ్) ప్రతీ ఒక్కరూ మద్దతిస్తారు.

– కుశల్ మెహరా, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

ఉస్తాద్‌కు వందనం



భారతరత్న ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్‌ను ఆయన జయంతి (మార్చ్ 21) నాడు స్మరించుకుంటున్నాను. 'సుర్(స్వరం) ఒక్కటే అయినట్టుగా, దేవుడు కూడా ఒక్కరేనని ఉస్తాద్ అనేవారు. మొహర్రం నాడు విషాదాంత రాగాలను చెమర్చిన కళ్లతో ఆలపించేవారు; హోలీ రోజున 'కాఫీ' రాగంతో హుషారెక్కించేవారు.

– దయానంద్ కాంబ్లే, మహారాష్ట్ర ఉన్నతాధికారి

మరింత శ్రమ



మార్చ్ 21ని సింగిల్ పేరెంట్స్ డేగా జరుపుతున్నారు. ఎంపిక వల్ల కావొచ్చు, పరిస్థితుల వల్ల కావొచ్చు... సింగిల్ పేరెంట్స్ తమ పిల్లల్ని పెంచడానికి సంబంధించిన ప్రతి విషయంలోనూ డబుల్ డ్యూటీ చేస్తున్నారు. వాళ్లకు హేట్సాఫ్!

– సుజాతా పరాశర్, 'గోయింగ్ సోలో' రచయిత్రి

గొప్ప గౌరవం



ఈ యేటి సంగీత కళానిధి పురస్కారానికి 'మ్యూజిక్ అకాడెమీ' నన్ను ఎంపిక చేయడం నాకు గౌరవాన్నీ, పులకరింతనూ కలిగిస్తోంది.

– బాంబే జయశ్రీ, గాయని

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఇన్‌బాక్స్

నీటిని వృథా చేయకండి!

భూమిపై మానవ మనుగడకు అవసరమైన ప్రధాన అవసరాలలో నీరు ఒకటి. నీటి వనరు లేకుండా, ఏ ప్రాణికీ మనుగడే ఉండదు. కొందరు నీరు లేక అల్లాడిపోతుంటే.. కొందరు మాత్రం నీటిని చాలా వృథా చేస్తున్నారు. పచ్చని చెట్లతో, పారే నదులతో, అందమైన పక్షులు, అలరించే జంతువులతో, ఎన్నో జీవుల్ని కలిగి ఉన్న గ్రహం భూమి. ఈ జీవుల మనుగడకు కావలసింది నీరు. అటువంటి నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాల్సిన ఆవశ్యకతను గూర్చి ప్రజలకు అవగాహన కల్పించటానికి 1993లో ఐక్యరాజ్య సమితి మార్చి 22ను 'ప్రపంచ జల దినోత్సవం'గా ప్రకటించింది. భూమి ఏర్పడినపుడు ఎంతయితే నీరు ఉందో ఇప్పుడు కూడా అంతే నీరు ఉంది. కాని ప్రపంచ జనాభా నిత్యం పెరుగుతూనే ఉంది. అందువల్ల కోట్లాదిమంది నీటి కోసం కటకటలాడుతున్నారు.

భూమి మీద ఉన్న నీటిలో 97 శాతం ఉప్పు నీరు. కేవలం 3 శాతం మాత్రమే మంచి నీరు ఉంది. నీటిని పొదుపుగా వినియోగించుకోవాల్సిన బాధ్యత ప్రతి వ్యక్తిపై ఉంది. ప్రపంచంలో భారీ యుద్ధాల వల్ల చనిపోయిన వారి కన్నా కలుషిత నీరు తాగడం వల్ల మరణించిన వారి సంఖ్య ఎక్కువ. సంవత్సరానికి నలభై లక్షల మంది కలుషిత నీరు తాగడం ద్వారా మరణిస్తున్నారని గణాంకాలు చెబుతున్నాయి.

పాఠశాల స్థాయి నుండే నీటి పొదుపు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించాలి. నీటి ప్రాముఖ్యతను, పొదుపును గూర్చి సెమినార్లు, వ్యాసరచన పోటీలు నిర్వహించాలి. నీటిని నిల్వచేసే పద్ధతులు, జలకాలుష్య కారణాల వల్ల కలిగే నష్టాలను గూర్చి వివరించినపుడే భవిష్యత్తులో భావిపౌరులు నీటి వనరులు మరింత కలుషితం కాకుండా కాపాడుకోగలుగుతారు.

– సుధాకర్. ఎ. వి.,
ప్రభుత్వ ఉపాధ్యాయుడు, రంగారెడ్డి జిల్లా
(నేడు అంతర్జాతీయ జల దినోత్సవం)

శోభస్కరం కావాలి!

సందర్భం



పి. విజయబాబు

'మత్సరాల వత్సరమా... ఇంక నీకు సెలవు! నవ వర్షాగమ పథమిది కలల పూల నెలవు' అంటూ ఆశల మోసులతో కోరికల ఈరికెలతో కొత్త సంవత్సరాన్ని ఆహ్వానించటం మనకు పరిపాటి. నూతన సంవత్సరం రోజు ఏ శుభ కార్యాలు చేస్తే సంవత్సరం అంతా అవే శుభాలు కలుగుతాయని విశ్వాసం. కానీ ఈ సంకల్పానికి కార్యాచరణ ఉన్నప్పుడే కదా అది సాధ్యపడేది? అయితే మనిషి అలా ఆలోచించడు. పండుగల పరమార్థం కోరికలు మాత్రమే కాకూడదు. అవి సిద్ధించడానికి కావలసిన కార్యాచరణను కూడా సిద్ధం చేసుకోవాలి. కొత్త సంవత్సరం రోజు కొంగొత్త నిర్ణయాలు తీసుకుని వాటిని త్రికరణశుద్ధిగా ఆచరించే ప్రయత్నం చేసినప్పుడు మాత్రమే జీవితం కొత్త మలుపులు తిరుగుతుంది.

కాలం, ప్రకృతి, మనిషి, సమాజం మధ్య విడదీయరాని సంబంధం ఉంది. తెలుగు వారికి ఉగాది కాల సంబంధమైన పండుగ. అందుకే తెలుగు సంవత్సర– ఆది అనీ, యుగ–ఆది అనీ అంటాం. శిశిర విషమారుత విశీర్ణ వృక్షాంగనలకు హరిత వసనాల నందిస్తూ వచ్చే పండుగ ఉగాది. ఇది శ్రీ 'శోభకృత్' నామ సంవత్సర 'ఉగాది'. 'శోభకృత్' అంటే శోభను కలిగించేది అని అర్థం. చైత్రమాస శుక్ల పక్ష పాడ్యమి రోజు 'శోభకృత్' ఆగమనం.

వసంత రుతువు శోభను వర్ణిస్తూ కవులూ, సాహితీమూర్తులూ ఎన్నెన్ని రచనలు చేశారో! కృష్ణరాయల ఆముక్తమాల్యద రుతు శోభకు అద్దం పడుతుంది. విశ్వనాథ సైతం ప్రకృతి సోయగాలను అద్భుతంగా ఆవిష్కరించారు. బమ్మెర పోతనదీ అదే దారి– 'బాలరసాల సాల నవపల్లవ కోమల కావ్య కన్యక'గా తన భాగవతాన్ని భావన చేశాడు. కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి 'తెలుగు వెలుగుల ఉగాది' మకుటంతో విలక్షణ శైలిలో ఉగాది గురించి చెప్పిన కొన్ని వాక్యాలు ఆయన సామాజిక స్పృహకు అద్దం పడతాయి. 'ఆంధ్రులు ఇద్దరు కలిసినప్పుడు తీయని తెలుగులో మాట్లాడుకునిన తీపి ఉగాది', 'కులమతాల కుళ్ళు విడివడి జాతి పరిమళించిన నాడే భవ్య ఉగాది.' 'పూరిళ్ల సౌధాల పొరుగున తలయెత్తి నిలుచున్న ఆనాడే నిక్కమైన ఉగాది' అన్నారు కరుణశ్రీ. ఆయన భావించినట్టు ఇటువంటి ఉగాదిని ఆవిష్కరించడానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తూ ఉంటే పూరిళ్ల సౌధాల పొరుగున ఉంటే సమతౌల్యం దెబ్బతింటుందని కోర్టుకు వెళ్లే ప్రబుద్ధులు తయారయ్యారు నేడు.

యుగమునకు ఆది యుగాది, అలాగే ఈ పండుగకు ఇతిహాస ప్రాముఖ్యం కలిగి ఉండటం విశేషం. త్రేతా యుగంలో శ్రీరామచంద్రుడు అరణ్యవాసం ముగించుకుని



అయోధ్యకు చేరి, ఉగాది రోజున పట్టాభిషేకం జరుపుకున్నట్టు ఇతిహాసాలు చెబుతున్నాయి. అలాగే శాలివాహన శకారంభం కుడా ఇదే రోజున ప్రారంభమైనదని చరిత్ర చెబుతోంది. చైత్ర శుద్ధ పాడ్యమి రోజునే బ్రహ్మ సృష్టిని నిర్మించడం ప్రారంభించారని నమ్ముతారు. మత్స్యావతారం ధరించిన విష్ణువు సోమకుని సంహరించి, వేదాలను బ్రహ్మకప్పగించిన సందర్భంగా 'ఉగాది' ఆచరణలోకి వచ్చిందని పురాణ ప్రతీతి. బ్రహ్మదేవుడు ఈ జగత్తును చైత్ర మాస శుక్లపక్ష ప్రథమ దినాన సూర్యోదయ వేళ సమగ్రంగా సృష్టించాడంటారు. అంటే కాలగణాన్ని గ్రహ, నక్షత్ర, రుతు, మాస, వర్ష, వర్షాధికులను బ్రహ్మదేవుడు ఈనాడు ప్రవర్తింప చేశాడన్నది పెద్దల భావన.

తీపి ఆనందానికి సంకేతం. ఉప్పు జీవితంలో ఉత్సాహంగా ఉండేందుకూ, చేదు జీవితంలో ఎదుర్కొనే బాధలకూ సంకేతం. పులుపు నేర్పుతో చాకచక్యంగా వ్యవహరింపవలసిన పరిస్థితులను తట్టుకుని నిలబడే ఆత్మస్థైర్యాన్నీ, వగరు కొత్త సవాళ్ళు ఎదుర్కోగలగడం, కారం – సహనం కోల్పోయేలా చేసే పరిస్థితులు నివారించే శక్తి... వంటి గుణాది విశేషాలూ కలగలిపిన షడ్రుచుల సమ్మేళనం ఉగాది పచ్చడి. ఇదొక దివ్య ఔషధం. వసంత మాసంలో దీన్ని పుచ్చుకోవడం ద్వారా శరీరంలో పేరుకుని ఉన్న వాత, పిత్త, శ్లేష్మ, కఫాదులను దునుమాడి మనిషిని ఆరోగ్యంగా ఉంచేందుకు దోహదపడుతుందని ఆయుర్వేద వైద్య నిపుణులు నొక్కి వక్కాణిస్తున్నారు.

ఇక ఉగాది రోజు ముఖ్యమైన అంశం 'పంచాంగ శ్రవణం.' ఉగాది రోజు దేవాలయంలో గానీ, గ్రామ చావడిలో గానీ, కూడలిలో గానీ పంచాంగ శ్రవణాన్ని చేయడం ఆచారం. 'పంచాంగం' అంటే ఐదు అంగాలని అర్థం. తిథి, వారం, నక్షత్రం, యోగం, కరణం అనేవి ఆ ఐదు అంగాలు! ఈ ఐదింటితో కూడిన 'పంచాంగాన్ని– ఉగాది రోజున వివిధ దేవతలతోపాటు పూజించి, పంచాంగ శ్రవణం చేయాలి. 'పంచాంగ శ్రవణం' చేసేటప్పుడు ఉత్తరాభిముఖంగా కూర్చుని వింటే మంచిదని పండితులు చెబుతుంటారు.

కాగా ఇప్పుడు పంచాంగ శ్రవణం అర్థం మారిపోయింది. రాజకీయాలకు అద్దం పడుతోంది. ఏ పార్టీ వారు పిలిపించుకొని పంచాంగ శ్రవణం చేయించుకుంటారో గ్రహరాసులన్నీ వారికి అనుకూలంగా అలవోకగా మారిపోతాయి! ఇదీ ఇప్పటి పంచాంగ శ్రవణం. అదీ గాక ఇప్పటి 'పంచాంగ శ్రవణం'లో ప్రధాన అంశం సంవత్సర ఫలితాలు. ఈ సంవత్సర ఫలితాలు తెలుసుకోవాలన్న ఆత్రుత చాలా మందిలో ఎక్కువైంది. వెరసి పంచాంగ శ్రవణం అర్థం పూర్తిగా మారిపోయింది. ఏది ఏమైనప్పటికీ ఈ శోభకృత్ ప్రతి ఒక్కరికీ శుభస్కరంగా, శోభస్కరంగా, శ్రేయస్కరంగా సాగాలని ఆశిద్దాం!

వ్యాసకర్త ఏపీ అధికార భాషా సంఘం అధ్యక్షులు

శుభమయం కావాలంటే...

తన పేరుకు తగ్గట్టుగా శుభాలు వర్షించి వెళ్ళిందని చెప్పలేం గానీ, గడిచిపోయిన శుభకృత్తు నామ సంవత్సరం, అంతకుముందు వచ్చిన కరోనా–గ్రస్త సంవత్సరాలతో పోలిస్తే కొంత సజావుగా, సాధారణంగా నడిచింది. కలి కాలం గనక కలి విలాసాలూ, ఈతి బాధలూ తప్పకపోయినా, మహమ్మారులతో, మహోపద్రవాలతో మాత్రం దేశాన్ని బాధించలేదు.



జ్యోతిర్మయం

శుభకృత్తు తరవాత శోభకృత్తు. పేరు బాగుంది. కానీ అనుభవాన్ని బట్టి చూస్తే, పేరులో ఏమీ ఉన్నట్టు కనిపించదు. ఉదాహరణకు 1983లో రుధిరోద్గారి వచ్చింది, ప్రశాంతంగానే గడిచి పోయింది. 1962లో శుభకృత్తు నడిచినప్పుడు, చైనా దురాక్రమణ వల్ల దేశం బాగా నష్టపోయింది. కాబట్టి సంవత్సరం పేరుకూ దాని ప్రభావానికీ సంబంధం నేతి బీర కాయలో నెయ్యి.

అయితే సంవత్సరం పేరేదయినా, మరో ఉగాది మైలు రాయి వచ్చిందంటే, ఒక విధంగా దాని పాటికదే ఒక శుభ సమాచారం. ఆత్మవినాశానికి మానవజాతి అనేక విధాలుగా కృషి చేస్తున్నట్టు కనిపిస్తున్నా, జగత్తును జనింపజేసే ఈశ్వరుడికి మనం మారతామన్న విశ్వాసం ఇంకా అంతరించలేదనేందుకు ప్రతి నూతన ప్రభాతమూ, ప్రతి ఉగాది శుభోదయమూ ఒక దాఖలా. మానవాళిలో మార్పు రావడానికి మరి కొంత వ్యవధి ఇచ్చేందుకు సృష్టికర్త సుముఖంగానే ఉన్నాడన్న మాట.

నిజానికి శుభకృత్తు శుభమయం కావాలన్నా, శోభకృత్తు శోభస్కరం కావాలన్నా అది దానంతటదే జరగదు. ఆ దిశగా కృషి జరిగితేనే అది సాధ్యమవుతుందని ఎవరో చెప్పాల్సిన పని లేదు. వ్యక్తి గానీ, సమాజం గానీ అతి సంకుచిత స్వార్థాలకూ, అవధి లేని పర్యావరణ విధ్వంసానికీ, విద్వేషాలకూ, కావేశాలకూ, హింసకూ దూరంగా, వివేకంతో, నిగ్రహంతో వర్తించుకోగలిగితే, సంవత్సరం పేరేదయినా అది ఆ వ్యక్తికీ, ఆ సమాజానికీ శాంతి సౌభాగ్యాలను చేకూరుస్తుంది.

ఆత్మ సంయమనం మీదా, ధర్మా ధర్మాల మీదా, కర్తవ్యపాలన మీదా, పరస్పర ప్రేమాదరాల మీదా, భావ వైశాల్యం మీదా, బాధ్యతాయుత ప్రవర్తన మీదా... దృష్టి ఉంచే వ్యక్తికీ, సమాజానికీ అన్ని సంవత్సరాలూ శుభకృత్తులే, శోభకృత్తులే! వాస్తవానికి, మనిషికి శుభకృత్తూ, శోభకృత్తూ మనిషే! వేప పూత పచ్చడులూ, మామిడాకుల తోరణాలూ, పండుగ వేడుకలూ ఇత్యాదులు సకారాత్మకమైన సద్భావనలకు దోహదం చేసే శక్తిమంతమైన సంప్రదాయాలు. శోభకృత్తుకు స్వాగతం. అందరికీ ఉగాది శుభాకాంక్షలు!

– ఎం. మారుతిశాస్త్రి
(నేడు ఉగాది)



గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, తిథి: తిథి శు.పాడ్యమి రా.9.54 వరకు, తదుపరి విదియ, నక్షత్రం: ఉత్తరాభాద్ర సా.4.57 వరకు, తదుపరి రేవతి, వర్జ్యం: తె.4.35 నుండి 6.10 వరకు (తెల్లవారితే గురువారం), దుర్ముహూర్తం: ప.11.44 నుండి 12.31 వరకు, అమృతఘడియలు: ప.12.22 నుండి 1.54 వరకు, ఉగాది; రాహుకాలం: ప.12.00 నుండి 1.30 వరకు, యమగండం: ఉ.7.30 నుండి 9.00 వరకు, సూర్యోదయం: 6.13, సూర్యాస్తమయం: 6.06.

స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్‌పర్సన్‌గా రత్నకుమారి



కలకడ: స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్‌పర్సన్‌గా ఆచార్య శెట్టిపల్లె రత్నకుమారి నియమితులయ్యారు. విద్యారంగంలో విశేష కృషి చేసిన ఆమె 1952లో అన్నమయ్య జిల్లా పీలేరు సమీపంలోని జాండ్ల గ్రామంలో జన్మించారు. తిరుపతి ఎస్వీయూలో దాదాపు 12 సంవత్సరాలు ప్రొఫెసర్‌గా పనిచేశారు. అనంతరం శ్రీపద్మావతి యూనివర్సిటీకి వీసీగా నియమితులయ్యారు. అక్కడ ఎన్నో నూతన కోర్సులను ప్రవేశపెట్టారు. క్యాంపస్‌లో మరెన్నో మార్పులు తీసుకువచ్చి పరిపాలనలో తనదైన ముద్రను వేశారు.

బొమ్మకు 'అపురూప' ఆదరణ

చిన్నారుల చేతుల్లో అద్భుత చిత్రాలు

చిత్రలేఖనంలో రాణిస్తున్న గురుకులం విద్యార్థులు

చదువుతో పాటు డ్రాయింగ్‌లో ప్రత్యేక తర్ఫీదు





విశాఖ విద్య : తమ చిత్రకళా నైపుణ్యంతో అందుబాటులో ఉన్న సహజ వనరులను వినియోగించి చూడముచ్చటైన చిత్రాలను గీస్తున్నారు నగరంలోని శ్రీకృష్ణాపురం గురుకులం విద్యార్థులు. గురుకులం ప్రాంగణంలో లభించే చీపురు పుల్లలతో విద్యార్థులు సృష్టిస్తున్న అందమైన ఆకృతులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. చదువుతో పాటు ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రోత్సహించేలా గురుకులం చేపడుతున్న వినూత్న కార్యక్రమాలు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు దోహదపడుతున్నాయి.

పోటీల్లో పాల్గొంటే పతకం గ్యారంటీ

శ్రీకృష్ణాపురం విద్యార్థులు వేసిన చిత్రాలకు ఇప్పటికే జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో బంగారు పతకాలు లభించాయి. గతేడాది విజయవాడలో డ్రీమ్ ఆర్ట్ ఆధ్వర్యంలో ఆలిండియా స్థాయిలో జరిగిన పోటీల్లో 12 బంగారు, 8 రజత పతకాలు సొంతమయ్యాయి. ఆన్‌లైన్ విధానంలో పుణే ఆర్ట్స్ అకాడమీ నిర్వహించిన పోటీల్లో బెస్ట్ ఆర్టిస్టు అవార్డుతో పాటు, 32 మందికి ప్రోత్సాహక ప్రశంసా పత్రాలు, ఆరుగురు విద్యార్థులు షీల్డ్స్ అందుకున్నారు. ఇటీవల కోనసీమ జిల్లా అమలాపురంలో నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీల్లో 10 బంగారు, 6 రజత పతకాలు దక్కాయి. చిత్రకళా నైపుణ్యతను ప్రోత్సహించేలా ఇక్కడి విద్యార్థులను తీర్చిదిద్దుతున్న ప్రిన్సిపాల్, ఆర్ట్ టీచర్‌కు నిర్వాహకులు విశ్వగురువు అవార్డులను ప్రదానం చేశారు.



విద్యార్థులు గీసిన చిత్రాలు



విద్యార్థులు గీసిన పల్లె జీవన చిత్రం

ఉన్నతాధికారుల సహకారంతోనే..



విద్యార్థులు చదువుతో పాటు, ఆసక్తి ఉన్న రంగాల్లో రాణించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ఇందుకు ఉన్నతాధికారుల సహకారం ఎంతో ఉంది. పేద పిల్లల భవిష్యత్‌కు పటిష్టమైన పునాదులు వేసేలా గురుకులంలో విద్యాభ్యాసం సాగుతోంది. – తాళ్లూరి మేరీ ఫ్లోరెన్స్, ప్రిన్సిపాల్, శ్రీకృష్ణాపురం గురుకులం

బీచ్ రోడ్‌లో ఎగ్జిబిషన్ ఏర్పాటే లక్ష్యం



విద్యార్థులు చిత్రలేఖనంపై మంచి ఆసక్తి చూపుతున్నారు. ప్రతి తరగతిలో 5 నుంచి 10 మంది విద్యార్థులు అద్భుతమైన బొమ్మలు గీస్తున్నారు. బొమ్మలు వేసేందుకు వర్క్‌షాపు ప్రత్యేకంగా ఏర్పాటు చేశాం. పిల్లలువేసిన బొమ్మలతో బీచ్‌రోడ్‌లో ఎగ్జిబిషన్ ఏర్పాటే లక్ష్యం. – పిడమర్తి సుధాకర్, ఆర్ట్స్ టీచర్

మంత్రి మేరుగు ప్రశంసలు



బొమ్మలు గీయడం అంటే ఎంతో ఇష్టం. మా గురువులు ఎంతో ప్రోత్సహిస్తున్నారు. బొమ్మలు గీసేందుకు అన్ని రకాల వస్తువులు సమకూరుస్తున్నారు. మా గురుకులానికి మంత్రి మేరుగు నాగార్జున వస్తే, ఆయన బొమ్మ గీసి ఇచ్చాను. నన్ను ఎంతో మెచ్చుకున్నారు. మంచి ఆర్టిస్టు అవ్వాలనేది కోరిక. – రాజ్‌కుమార్, విద్యార్థి

'తెనాలి రామన్'కు జాతీయ అవార్డు



తెనాలి: గుంటూరు జిల్లా అంగలకుదురులో ఎక్స్‌ట్రా డిటర్జంట్ సోప్స్ ఫ్యాక్టరీ వ్యవస్థాపకుడు గణేష్ నాడార్ ఏకైక కుమారుడు రామన్ కేజీడీఎస్ ఉత్తమ యువపారిశ్రామికవేత్త అవార్డును అందుకున్నారు. ఎకనమిక్ టైమ్స్ ఆఫ్ ఇండియా మీడియా పార్ట్‌నర్‌గా వ్యవహరించిన 'స్టార్ ఆఫ్ ఇండస్ట్రీ' అవార్డుల ప్రదానోత్సవం మంగళవారం న్యూఢిల్లీలోని తాజ్ అంబాసిడర్ హోటల్‌లో జరిగింది. జాతీయ స్థాయిలో ఉత్తమ యువ పారిశ్రామికవేత్త అవార్డును అందుకున్న రామన్, ఇక్కడే ఎంబీఏ చేశాక, అమెరికాలో ఎంఎస్ చేశారు. ప్రస్తుతం చెన్నైలో కల్యాణ్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్‌కు సీఈవోగా వ్యవహరిస్తున్నారు. రామన్‌కు తెనాలిలోని వైష్ణవి జూనియర్ కాలేజి డైరెక్టర్ పాటిబండ్ల శ్రీనివాసరావు, అంగలకుదురు ఫ్యాక్టరీ సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఏపీలో బీపీసీఎల్ తొలి ఈవీ స్టేషన్ ప్రారంభం

గన్నవరం: భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(బీపీసీఎల్) సంస్థ ఆంధ్రప్రదేశ్‌లో తొలి ఎలక్ట్రిక్ వెహికల్ చార్జింగ్ స్టేషన్‌ను కృష్ణాజిల్లా గన్నవరంలో ప్రారంభించింది. స్థానిక భారత్ పెట్రోలియం బంక్‌లో ఏర్పాటు చేసిన ఈవీ చార్జింగ్ స్టేషన్‌ను మంగళవారం ఆ సంస్థ ఏపీ, తెలంగాణ హెడ్ అచ్యుంత్రెహాన్, సౌత్ ఇంజనీరింగ్ జీఎం రాజశేఖర్, డీజీఎం రేష్మీదేవస్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ హితమైన ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సాహించేందుకు దక్షిణ భారత్‌లో ఈవీ చార్జింగ్ స్టేషన్లు విస్తరిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే బెంగళూరు–చెన్నై, బెంగళూరు–మైసూర్–కూర్గ్ హైవే, మదురై–చెన్నై కారిడర్లలో ఈవీ స్టేషన్లను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఏపీలో చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారిపై ప్రతి 50 నుంచి 100 కిలోమీటర్లకు ఒక ఈవీ స్టేషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ స్టేషన్లలో ఈవీ చార్జింగ్‌తో పాటు జీ–కేఫ్, టాయిలెట్స్, రెస్టరూమ్స్ తదితర సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఇక్కడ 30 కిలోవాట్స్ సామర్థ్యంతో ఏర్పాటు చేసిన ఈవీ స్టేషన్ ద్వారా కేవలం 30 నిమిషాలలో 20 నుంచి 80 శాతం ఫాస్ట్ చార్జింగ్ అవుతుందన్నారు. ఈ చార్జింగ్ స్టేషన్‌ను ఎలక్ట్రిక్ వాహనదారులు వినియోగించుకోవాలని కోరారు. టీఎం ప్రసాద్‌రాజీవాడ్, ప్రాంతీయ అధికారి నిఖిల్, బంక్ డీలర్ కోనేరు వెంకటేశ్వరరావు(బాబు) తదితరులు పాల్గొన్నారు.



ఈవీ చార్జింగ్ స్టేషన్ ప్రారంభోత్సవంలో బీపీసీఎల్ ప్రతినిధులు

కోటిరుద్రాక్ష అభిషేకాన్ని విజయవంతం చేయాలి

త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి



రుద్రాక్షలను పరిశీలిస్తున్న చినజీయర్, గౌతంరెడ్డి

మధురానగర్ (విజయవాడ సెంట్రల్): లోక కళ్యాణార్థం ఈనెల 28వ తేదీన విజయవాడ ముత్యాలంపాడులోని శ్రీషిరిడీ సాయిబాబా మందిరంలో తలపెట్టిన కోటిరుద్రాక్ష అభిషేకాన్ని విజయవంతం చేయాలని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి సూచించారు. ఆయన మంగళవారం ముత్యాలంపాడులోని శ్రీషిరిడీ సాయిబాబా మందిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి మంచి కార్యక్రమం తలపెట్టారని అభినందించారు. నేపాల్‌లోని రుద్రాక్షలన్నీ ఇక్కడే ఉన్నట్లుగా అనిపిస్తోందన్నారు. ఎంతో వ్యయప్రయాసలతో కోటిరుద్రాక్షలు సేకరించి అభిషేకం చేయటం అభినందనీయమన్నారు. తాను ఈనెల 28న అందుబాటులో ఉండనని, అందువల్ల ఇప్పుడే ఇక్కడకు వచ్చానని చెప్పారు. పాలకులు బాగుంటే అందరూ బాగుంటారన్నారు. సమాజం అంతా బాగుండాలని అందరూ కోరుకోవాలన్నారు. కరోనాతో ప్రపంచం అతలాకుతలం అయిందని, భయంతో ప్రజలు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని చెప్పారు. నూతన సంవత్సరంలో రాష్ట్రానికి మంచి జరగాలని, కోటిరుద్రాక్ష అభిషేకం విజయవంతం కావాలని ఆయన ఆకాంక్షించారు. కోటిరుద్రాక్ష అభిషేకం వివరాలను గౌతంరెడ్డి చినజీయర్‌స్వామికి తెలిపారు. తొలుత ఆలయ మర్యాదలతో చినజీయర్‌స్వామికి ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పొన్నలూరి లక్ష్మణరావు, కుంచనపల్లి రవిశంకర్, కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి, మందిర కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైవీయూ ప్రొఫెసర్‌కు పేటెంట్

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయం (వైవీయూ) జియాలజీ విభాగం ఆచార్యులు ప్రొఫెసర్ కె.రఘుబాబు చేసిన పరిశోధనకు భారత ప్రభుత్వం నుంచి పేటెంట్ లభించింది. 'జియోస్ ఫేషియల్ టెక్నాలజీ' అనే కొత్త సాంకేతిక విధానాన్ని ఉపయోగించి ఎడారీకరణను ఆయన గుర్తించారు. దీనికి భారత ప్రభుత్వ వాణిజ్యం, పరిశ్రమల మంత్రిత్వశాఖ, పేటెంట్స్, డిజైన్స్, ట్రేడ్ మార్క్స్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండస్ట్రియల్ పాలసీ, ప్రమోషన్ కంట్రోలర్ జనరల్ పేటెంట్ ఇస్తూ ఉత్తర్వులు జారీచేశారు. కాగా, ప్రొఫెసర్ కె.రఘుబాబు గతంలో వాయుకాలుష్యాన్ని తగ్గించడంలో జియోలైట్స్‌ను తొలిసారిగా వినియోగించి పేటెంట్ పొందారు. రఘుబాబుకు స్కాలర్లు బి.ప్రదీప్‌కుమార్, బీఎస్ అనూష, పి.పద్మశ్రీ సహకారం అందించారు.

● రాజధాని పేరుతో చంద్రబాబు చేసిన నిర్వాకంతో 29 గ్రామాల్లోని 50 వేల మంది కూలీలు, పేద రైతులు రోడ్డున పడ్డారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెంలో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 905వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో మంగళవారం పలువురు మాట్లాడారు. చంద్రబాబును నమ్మి ఐదేళ్లు అధికారమిస్తే 33 వేల ఎకరాల్లో తాత్కాలిక భవనాలు మినహా ఏమీ నిర్మించలేదని విమర్శించారు.

శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుమల ఆలయంలో నేడు ఉగాది ఆస్థానం



తిరుమల ఆలయంలోని ధ్వజస్తంభాన్ని శుద్ధి చేస్తున్న టీటీడీ ఈవో

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనాన్ని మంగళవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆనంద నిలయం మొదలుకుని బంగారువాకిలి వరకు, శ్రీవారి ఆలయం లోపల ఉప దేవాలయాలు, ఆలయ ప్రాంగణం, పోటు, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను నీటితో శుభ్రం చేశారు. ఈ సమయంలో మూలవిరాట్టును వస్త్రంతో పూర్తిగా కప్పి, శుద్ధి అనంతరం సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర పరిమళజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. మూలవిరాట్టుకు కప్పిన వస్త్రాన్ని తొలగించి ప్రత్యేక పూజ చేసి, నైవేద్యాన్ని సమర్పించారు. కాగా, బుధవారం ఉగాది ఆస్థానం సందర్భంగా బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది. టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి, బోర్డు సభ్యులు ఎం.రాములు, మారుతి ప్రసాద్, మధుసూదన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆలయంలో ఉగాది ఆస్థానం

శ్రీవారి ఆలయంలో బుధవారం ఉదయం 6 గంటలకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారి, విష్వక్సేనుల వారికి విశేష సమర్పణ చేస్తారు. అనంతరం విమాన ప్రాకారం, ధ్వజస్తంభం చుట్టూ ఊరేగింపుగా ఆలయంలోనికి ప్రవేశిస్తారు. ఆ తరువాత శ్రీవారి మూలవిరాట్టుకు, ఉత్సవ మూర్తులకు నూతన వస్త్రాలను ధరింపజేస్తారు. అనంతరం పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు. ఉగాది ఆస్థానాన్ని బంగారు వాకిలి వద్ద ఆగమ పండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. కాగా, తిరుమల క్యూకాంప్లెక్స్‌లో 4 కంపార్ట్‌మెంట్లు నిండాయి. హుండీలో భక్తులు రూ.4.96 కోట్లు వేశారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన వారికి సకాలంలో, దర్శన టికెట్లు లేని వారికి 15 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు ఉన్నవారికి 3 గంటల్లో దర్శనమవుతోంది.

క్లుప్తంగా

కేంద్రం వివక్షపై మమత ధర్నా



కోల్‌కతా: పశ్చిమబెంగాల్ రాష్ట్రాన్ని పట్టించుకోకుండా బీజేపీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం వివక్ష చూపుతోందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. కేంద్రం వివక్షకు నిరసనగా ఈనెల 29, 30 తేదీల్లో రాష్ట్రంలో ధర్నా చేపట్టనున్నట్లు ఆమె ప్రకటించారు. ' కేంద్రం నుంచి ఎలాంటి నిధులు పొందని రాష్ట్రం ఏదైనా ఉందంటే అది పశ్చిమబెంగాల్ మాత్రమే. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంసహా పలు ప్రాజెక్టులకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులను బీజేపీ సర్కార్ మంజూరు చేయట్లేదు. అందుకు నిరసన తెలుపుతూ కోల్‌కతాలో 29, 30 తేదీల్లో ధర్నాకు దిగుతున్నా' అని మమత మంగళవారం ప్రకటించారు.


ఉక్రెయిన్‌లో జపాన్ ప్రధాని

కీవ్: జపాన్ ప్రధాని ఫ్యుమియో కిషిదా మంగళవారం హఠాత్తుగా ఉక్రెయిన్ రాజధాని కీవ్‌కు చేరుకున్నారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ రష్యా పర్యటించిన ప్రారంభించిన మరుసటి రోజే కిషిదా ఉక్రెయిన్‌కు రావడం చర్చనీయాంశంగా మారింది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో కిషిదా భేటీ కానున్నారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధం, తాజా పరిణామాలపై చర్చించనున్నట్లు తెలుస్తోంది. రష్యాలో జిన్‌పింగ్, ఉక్రెయిన్‌లో కిషిదా దౌత్యం ఫలిస్తే యుద్ధం ముగింపు దశకు వచ్చే అవకాశాలను కొట్టిపారేయలేమని పరిశీలకులు చెబుతున్నారు. యుద్ధం మొదలైన తర్వాత ఉక్రెయిన్‌కు జపాన్ ఇప్పటిదాకా 7 బిలియన్ డాలర్ల సాయం అందించింది. 2,000 మందికిపైగా ఉక్రెయిన్ శరణార్థులకు తమ దేశంలో ఆశ్రయం కల్పించింది.

2 లక్షల డాలర్ల కానుకలను వెల్లడించని ట్రంప్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడిగా ఉన్న సమయంలో అందుకున్న సుమారు 2.50 లక్షల డాలర్ల విలువైన బహుమతుల వివరాలను డొనాల్డ్ ట్రంప్ వెల్లడించలేదు. ఇందులో భారత ప్రధాని మోదీ, రాష్ట్రపతి కోవింద్, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ సహా పలువురు భారతీయ నేతలు అందించిన 47 వేల డాలర్ల విలువైన కానుకలూ ఉన్నాయి. అధికార డెమొక్రాటిక్ పార్టీ కంగ్రెషనల్ కమిటీ రూపొందించిన ఒక నివేదిక ఈ విషయాలను వెల్లడించింది. ఫారెన్ గిఫ్ట్స్ అండ్ డెకొరేషన్స్ చట్టం ప్రకారం పలు విలువైన కానుకల వివరాలను వెల్లడించటంలో ట్రంప్ యంత్రాంగం విఫలమైందని పేర్కొంది. గోల్ఫ్ క్లబ్బులు, ఎల్ సాల్వడార్ ప్రభుత్వం అందించిన ట్రంప్ నిలువెత్తు భారీ చిత్రపటం వంటివి, ఇంకా నమోదు చేయని 100కు పైగా బహుమతులు ఉన్నట్లు తెలిపింది.

ట్రంప్ అరెస్టయితే వాట్ నెక్ట్స్?



నన్ను అరెస్ట్ చేస్తారంటూ మాజీ అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రకటనతో ఒక్కసారిగా కల్లోలం రేగింది. శృంగార తారతో లైంగిక సంబంధాల్ని పెట్టుకొని 2016 ఏడాదిలో అధ్యక్ష ఎన్నికల సమయంలో ఆమె నోరెత్తకుండా ట్రంప్ భారీగా డబ్బులు ముట్టజెప్పారన్న కేసును న్యూయార్క్ జ్యూరీ గత కొన్ని వారాలుగా రహస్య విచారణ సాగిస్తోంది. కేసు విచారణ తుది దశకు చేరుకోవడంతో ఆయనపై నేరాభియోగాలు నమోదవుతాయనే అనుమానాలు బలపడుతున్నాయి.

ట్రంప్ మీద వచ్చిన ఆరోపణలు క్రిమినల్ కేసుకి దారి తీస్తాయా?
అరెస్టయితే దేశంలో కల్లోలం రేగుతుందా?
మళ్లీ అధ్యక్ష ఎన్నికల బరిలో నిలబడగలరా?
ఇప్పుడివే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ట్రంప్‌పైనున్న కేసు ఏమిటి?



డొనాల్డ్ ట్రంప్ లైంగిక సంబంధాల ఆరోపణలపై కేసు విచారణ జరుగుతోంది. 2006 ఏడాదిలో తనకు 27 ఏళ్ల వయసున్నప్పుడు ట్రంప్ తనతో లైంగిక సంబంధం పెట్టుకున్నారని పోర్న్ సినిమాల్లో నటించే స్టార్మీ డేనియెల్స్ ఒకప్పుడు సంచలన ఆరోపణలు చేశారు. ఈ విషయాన్ని బయట ఎక్కడా వెల్లడించవద్దని బెదిరించేవారని డేనియెల్స్ ఆరోపించారు. ట్రంప్ నిర్వహించే రియాల్టీ షో 'ది అప్రెంటీస్'లో అవకాశం ఇస్తానని ఆశ కల్పించి తనతో గడిపారని ఆరోపణలు గుప్పించారు. అప్పుడప్పుడు తనకి ఫోన్ చేసి హనీబంచ్ అని ముద్దుగా పిలిచేవారని చెప్పుకొచ్చారు. 2016లో ట్రంప్ అమెరికా అధ్యక్ష బరిలో ఉన్నప్పుడు ఆమె ఈ విషయాలపై నోరెత్తకుండా ఉండేందుకు లక్షా 30 వేల డాలర్లు ముట్టజెప్పారట. ట్రంప్ మాజీ లాయర్ మైఖేల్ కొహెన్ తొలుత ఈ డబ్బులు డేనియెల్స్‌కు చెల్లిస్తే, ఆ తర్వాత ట్రంప్ మైఖేల్‌కి డబ్బులు ఇచ్చారు. మైఖేల్ తనకు డబ్బులు ఇచ్చినట్టుగా డేనియల్స్ చెబుతూ ఉంటే, అవి లాయర్‌కి ఫీజు చెల్లించినట్టుగా ట్రంప్ చెప్పుకుంటున్నారు.

ఏం జరగబోతోంది ?

డబ్బులిచ్చి పోర్న్ స్టార్ నోరుమూయించారన్న ఆరోపణలపై న్యూయార్క్ గ్రాండ్ జ్యూరీ ఆధారాలన్నీ సేకరించినట్టు తెలుస్తోంది. ట్రంప్‌కు వ్యతిరేకంగా ఆయన మాజీ లాయర్ కోహెన్ సాక్ష్యమిచ్చారు. డేనియెల్స్‌కు డబ్బులు ఇచ్చినట్టుగా కోర్టు ఎదుట అంగీకరించారు. మైఖేల్ కోహెన్‌కు లీగల్ అడ్వైజర్‌గా పని చేసిన రాబర్ట్ కోస్టెల్లో ఇన్నాళ్లు ట్రంప్‌కు వ్యతిరేకంగా జ్యూరీలో మాట్లాడి ఇప్పుడు ఎదురు తిరిగినట్టుగా తెలుస్తోంది. ట్రంప్‌కి అనుకూలంగా సాక్ష్యమిచ్చినట్టుగా సమాచారం. ట్రంప్ కోర్టుకి హాజరు కాకూడదని నిర్ణయించుకోవడంతో విచారణ ప్రక్రియ పూర్తయిన తర్వాత గ్రాండ్ జ్యూరీ ఏం చెయ్యాలన్న దానిపై నిర్ణయం తీసుకుంటుంది. ఒక కేసులో నిందితుడిని దోషిగా లేదంటే నిరపరాధిగా తేల్చే అధికారం గ్రాండ్ జ్యూరీకి ఉండదు. కేవలం ఆధారాలు సేకరించి నేరాభియోగాలు మోపగలదు. అయితే మన్‌హటన్ జిల్లా అటార్నీ అల్విన్ బ్రాగ్ తీసుకున్న నిర్ణయమే ఫైనల్. ఆధారాలుంటే నిందితుడ్ని అరెస్ట్ చేసి క్రిమినల్ కేసుని నమోదు చేస్తారు. అదే జరిగితే తొలిసారి క్రిమినల్ కేసులు ఎదుర్కొన్న మాజీ అధ్యక్షుడు ట్రంప్ అవుతారు. ఈ అభియోగాలు రుజువై ట్రంప్ దోషిగా తేలితే నాలుగేళ్ల జైలు శిక్ష పడే అవకాశం ఉంది.

అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయొచ్చా?

రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిగా పోటీ పడతానని ప్రకటించిన ట్రంప్ ఇప్పటికే విస్తృత ప్రచారం చేస్తున్నారు. దేశాధ్యక్షుడిగా పోటీ పడే వ్యక్తి నేరచరిత్ర, జైలు జీవితం వంటి అంశాలపై అమెరికా రాజ్యాంగంలో ఎక్కడా ప్రస్తావన లేదు. దీంతో జైలు శిక్ష అనుభవిస్తూ అధ్యక్షుడయ్యే అవకాశం అభ్యర్థికి ఉంది. సాంకేతికంగా ఎలాంటి అడ్డంకులు లేకపోయినప్పటికీ ఈ నేరారోపణలు నైతికంగా ట్రంప్‌ను తీవ్రంగా దెబ్బతీసే అవకాశాలు కనిపిస్తున్నాయి. క్రిమినల్ కేసులో ఇరుక్కున్న వ్యక్తి ఓట్లు అడగడం, చర్చా కార్యక్రమంలో పాల్గొనడం వంటివి ప్రజల ఎదుట ఆయన స్థాయిని తగ్గిస్తాయన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

క్యాపిటల్ దాడుల్ని తలపిస్తాయా?

ట్రంప్ అరెస్టయితే దేశంలో ఆయన అనుచరులు ఎలాంటి పరిస్థితులు సృష్టిస్తారోనన్న ఆందోళనలు ఉన్నాయి. ఇప్పటికే ట్రంప్ తాను అరెస్ట్ అవుతానని, అందరూ నిరసనలకు దిగాలంటూ రెచ్చగొట్టే ప్రకటనలు చేస్తున్నారు. 'బైడెన్ ప్రభుత్వం అశాంతిని రేపుతోంది. దేశాన్నే చంపేస్తోంది. ఇదే తగిన సమయం. మనందరం మేల్కోవాలి. గట్టిగా నిరసనకు దిగాలి' అని ట్రంప్ సోషల్ మీడియా వేదికగా పిలుపునిచ్చారు. 2021 జనవరిలో అధ్యక్ష ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక ఎన్నికల్లో అక్రమాల కారణంగానే తాను ఓడిపోయాయని ట్రంప్ భావించడం, ఆయన అనుచరులు అమెరికా క్యాపిటల్ భవనంపై దాడి, హింసాకాండతో దేశం అట్టుడికిపోయింది. ఈసారి ట్రంప్ అనుచరులు న్యూయార్క్ కోర్టుపై దాడులకు తెగబడతారన్న అనుమానాలున్నాయి. మన్‌హటన్ న్యాయవాది బ్రాగ్ న్యూయార్క్ పోలీసులతో మాట్లాడి కోర్టుకు కట్టుదిట్టమైన భద్రత కల్పించాల్సిందిగా రాసిన లేఖ ఒకటి మీడియాకు లభ్యమైంది. కోర్టులు, ఇతర కార్యాలయాలపై ఎవరి కన్ను పడినా, వారిని పూర్తిగా విచారించే ప్రయత్నంలో పోలీసు యంత్రాంగం ఉంది.

ట్రంప్ ఎదుర్కొంటున్న ఇతర కేసులు

డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ప్రభుత్వ రహస్య పత్రాలను ఫ్లోరిడాలో తన ఎస్టేట్‌కు తీసుకుని వెళ్లారన్న ఆరోపణలపై కేసు విచారణ కొనసాగుతోంది.

అధ్యక్ష ఎన్నికల ఫలితాల తర్వాత ఓటమిని జీర్ణించుకోలేని ట్రంప్ అనుచరులు 2021 జనవరి 6న అమెరికన్ క్యాపిటల్ భవనంపై దాడి చేసి హింసాకాండ సృష్టించిన కేసు.

2020 అధ్యక్ష ఎన్నికలను ప్రభావితం చేసేలా ట్రంప్, ఆయన అనుచరుల బృందం నడుచుకున్నట్టు నమోదైన కేసు.

సాక్షి, నేషనల్ డెస్క్

ఉత్తరాదిన పెను భూకంపం

ఢిల్లీ సహా పలు ప్రాంతాల్లో తీవ్ర ప్రకంపనలు ● రిక్టర్ స్కేల్‌పై 6.6గా నమోదు



మంగళవారం రాత్రి నోయిడాలో భయంతో వీధుల్లోకి వచ్చిన స్థానిక ప్రజలు

న్యూఢిల్లీ: దేశ రాజధాని ప్రాంతం ఢిల్లీ సహా ఉత్తర భారతదేశంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం రాత్రి భారీ భూప్రకంపనలు సంభవించాయి. భూకంప తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 6.6గా రికార్డయ్యింది. అఫ్గానిస్తాన్‌లోని హిందూకుష్‌లో భూఉపరితలం నుంచి 180 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు పాకిస్తాన్ వాతావరణ శాఖ తెలియజేసింది. రాత్రి 10.20 గంటల సమయంలో భూకంపం సంభవించడంతో జనం ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. తీవ్ర భయాందోళనకు గురై ఇళ్లనుంచి బయటకు పరుగులు తీశారు. హరియాణా, పంజాబ్, రాజస్తాన్, కశ్మీర్ తదితర రాష్ట్రాల్లో ప్రకంపనలు నమోదయ్యాయి. ప్రాణ, ఆస్తి నష్టం సంభవించినట్లు తెలియరాలేదు. భూకంపం వల్ల జమ్మూలో కొన్ని ప్రాంతాల్లో మొబైల్ ఫోన్ల సేవలకు అంతరాయం కలిగింది. అఫ్గానిస్తాన్‌లోని ఫైజాబాద్‌కు ఆగ్నేయంగా 133 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉన్నట్లు వెల్లడయ్యింది.

పాక్, అఫ్గాన్‌లో భారీ ప్రకంపనలు

ఇస్లామాబాద్: భారత్ పొరుగు దేశాలైన పాకిస్తాన్, అఫ్గానిస్తాన్‌లో మంగళవారం రాత్రి బలమైన భూప్రకంపనలు నమోదయ్యాయి. ఇది రిక్టర్ స్కేల్‌పై 6.8గా రికార్డయ్యింది. పాకిస్తాన్‌లోని లాహోర్, ఇస్లామాబాద్, పెషావర్, జీలం, షేక్‌పురా, స్వాత్, ముల్తాన్, షాంగ్లా తదితర ప్రాంతాల్లో భూప్రకంపనలు సంభవించినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. ప్రాణ, ఆస్తి నష్టంపై సమాచారం అందలేదు. పాకిస్తాన్ భూకంప ప్రభావిత దేశమే. దేశంలో 2005లో సంభవించిన భూకంపం వల్ల 74,000 మంది మృతిచెందారు.

ప్రపంచంలో అత్యంత కీలకమైన పార్టీ బీజేపీ

- వాల్‌స్ట్రీట్ జర్నల్



న్యూఢిల్లీ: ప్రపంచంలోనే భారతీయ జనతా పార్టీ అత్యంత ముఖ్యమైన రాజకీయ పార్టీ అని, ప్రఖ్యాత అమెరికన్ మ్యాగజైన్ వాల్ స్ట్రీట్ జర్నల్‌లో ప్రచురితమైన ఒక వ్యాసం పేర్కొంది. వాల్టర్ రసెల్ మెడ్ రాసిన ఈ వ్యాసంలో భారత్‌లో అధికార బీజేపీ అమెరికా జాతీయ ప్రయోజనాల దృక్కోణంలో గమనిస్తే అత్యంత ముఖ్యమైనపార్టీగా అభివర్ణించారు. ఇంకా అందులో ఏం రాశారంటే..''2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో వరుసగా గెలిచిన బీజేపీ 2024లో మరోసారి విజయాన్ని దక్కించుకోవడం ఖాయం. జపాన్‌తో సమానమైన ఆర్థిక శక్తిగా భారత్ ఎదుగుతోంది. శక్తిమంతమైన చైనాతో సమతుల్యత సాధించడానికి అమెరికా కృషి చేస్తూ ఉంటే, ఎవరి సాయం లేకుండా బీజేపీ తాను కోరుకున్న భవిష్యత్ కోసం చర్యలు తీసుకుంటోంది. బీజేపీ శక్తి ఏమిటో ప్రపంచ దేశాలు చాలా తక్కువగా అర్థం చేసుకున్నాయి. ఎందుకంటే ఆ పార్టీకున్న చరిత్ర, సంస్కృతి భారతీయులు కానివారికి అంతగా తెలీదు. చైనాలో కమ్యూనిస్ట్ పార్టీ మాదిరిగానే వంద కోట్లకు పైగా జనాభాని పాలించి గ్లోబల్ సూపర్ పవర్‌గా ఎదగాలన్నదే బీజేపీ ధ్యేయం'' అంటూ ఆ వ్యాసం సాగింది.

కోర్టుకు వస్తే చంపేస్తారేమో!: ఇమ్రాన్



లాహోర్: కోర్టుకు వస్తే తనను చంపేసే ప్రమాదం ఉన్నందున, వర్చువల్‌గానే కేసుల విచారణకు హాజరయ్యేందుకు అనుమతించాలని పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ సుప్రీంకోర్టును కోరారు. ఈ మేరకు మంగళవారం జస్టిస్ బందియాల్‌కు ఇమ్రాన్ లేఖ రాశారు. తనపై నమోదైన కేసులన్నిటినీ మూకుమ్మడిగా విచారించాలన్నారు. 'శనివారం తోషఖానా కేసు విచారణ జరిగిన ఇస్లామాబాద్‌లోని ఫెడరల్ జ్యుడీషియల్ కాంప్లెక్స్‌లో నాకోసం మృత్యువు పొంచి ఉంది. సుమారు 20 మంది గుర్తు తెలియని వ్యక్తులు నన్ను చంపేందుకు మాటువేశారు. వారు అక్కడికి ఎలా రాగలిగారు అని ప్రశ్నించారు.

వాహనాలు, దుస్తులు మార్చి.. పోలీసులను ఏమార్చి

నాటకీయ ఫక్కీలో అమృత్‌పాల్ పరారీ ● వెలుగులోకి సీసీ కెమెరా దృశ్యాలు

అమృత్‌సర్/చండీగఢ్: వివాదాస్పద 'వారిస్ పంజాబ్ దే' సంస్థ అధినేత, ఖలిస్తానీ నాయకుడు అమృత్‌పాల్ సింగ్ వాహనాలు, దుస్తులు మారుస్తూ నాటకీయ ఫక్కీలో పోలీసులను ఏమార్చాడు. తన కోసం పంజాబ్‌వ్యాప్తంగా పోలీసుల వేట ముమ్మరంగా కొనసాగుతుండడంతో ఇద్దరు అనుచరులతో కలిసి మోటార్ సైకిల్‌పై గుర్తుతెలియని ప్రాంతానికి పరారయ్యాడు. ఈ మేరకు సీసీ కెమెరా దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 18న అమృత్‌పాల్ కోసం వేట మొదలయ్యింది. ఆ సమయంలో అతడు జలంధర్‌లో బెంజ్ కారులో అనుచరులతో ఉన్నాడు. పోలీసుల రాకను గుర్తించి ఆ కారు దిగి, బ్రెజా కారులో షాకోట్ కొచ్చాడు. ఓ గురుద్వారాలో దుస్తులు మార్చుకున్నాడు. తర్వాత ఇద్దరు అనుచరులతో కలిసి బైక్‌పై పరారయ్యాడు. గులాబీ రంగు తలపాగా ధరించి ఉన్నాడు. ముఖం స్పష్టంగా కనిపించకుండా ముసుగు వేసుకున్నాడు. సోమవారం బ్రెజా కారులో అమృత్‌పాల్ సింగ్ దుస్తులు లభించాయని పోలీసులు చెప్పారు. అతడు ఇప్పటికే రాష్ట్ర సరిహద్దు దాటేసి ఉంటాడని అనుమానిస్తున్నారు.

దిబ్రూగఢ్ జైలుకు అమృత్‌పాల్ మామ

ఇదిలా ఉండగా, అమృత్‌పాల్ సింగ్‌ను అదుపులోకి తీసుకోవడానికి పోలీసులు ప్రారంభించిన భారీ ఆపరేషన్ మంగళవారం నాలుగో రోజుకు చేరుకుంది. ఆచూకీ మాత్రం ఇంకా కనిపెట్టలేకపోయారు. అమృత్‌పాల్ అనుచరులుగా చెబుతున్న కొందరిని పోలీసులు ఇప్పటికే అరెస్టు చేశారు. ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. 100 మందికిపైగా అరెస్టయినట్లు సమాచారం. అమృత్‌పాల్ మామ హర్‌జీత్‌సింగ్‌తోపాటు పలువురు అనుచరులను మంగళవారం అస్సాంలోని దిబ్రూగఢ్ సెంట్రల్ జైల్‌కు తరలించారు.

జాతీయ భద్రతా చట్టం కింద కేసు

అమృత్‌పాల్‌తో సంబంధాలున్న ఐదుగురిపై పోలీసులు కఠినమైన జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఏ) కింద తాజాగా కేసు నమోదు చేశారు. ఈ ఐదుగురికి పాకిస్తాన్ నిఘా సంస్థ ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్(ఐఎస్ఐ) తోనూ సంబంధాలు ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అమృత్‌పాల్‌పై ఇదే చట్టం కింద ఇప్పటికే కేసు నమోదయ్యింది. ఈ నెల 18న అతడిపై నాన్-బెయిలబుల్ వారెంటు జారీ చేశారు. పంజాబ్‌లోని కొన్ని ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలను పాక్షికంగా పునరుద్ధరించనున్నట్లు అధికారులు వెల్లడించారు. సున్నితమైన ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలపై ఆంక్షలు కొనసాగుతాయన్నారు.



బైక్‌పై పారిపోతున్న అమృత్‌పాల్(వెనక వ్యక్తి)

నలుగురి అరెస్టు

అమృత్‌పాల్ సింగ్ పరారయ్యేందుకు సహకరించిన నలుగురు వ్యక్తులు మన్‌ప్రీత్ సింగ్ అలియాస్ మన్నా, గురుదీప్ సింగ్ అలియాస్ దీపా, హర్‌ప్రీత్ సింగ్ అలియాస్ హ్యాపీ, గుర్‌భేజ్ సింగ్ అలియాస్ భేజాను అరెస్టు చేసినట్లు పంజాబ్ పోలీసులు మంగళవారం చెప్పారు. కారులో పారిపోయేందుకు అమృత్‌పాల్‌కు వారు సహకరించారని తెలిపారు. జలంధర్ జిల్లా నాంగల్ అంబియాన్ గ్రామంలోని గురుద్వారాలో అతడు కొంతసమయం తలదాచుకున్నట్లు విచారణలో తేలిందని వెల్లడించారు. అక్కడే బట్టలు మార్చుకొని బైక్‌లో పరారయ్యాడని పోలీసు అధికారి సుఖ్‌చైన్‌సింగ్ గిల్ పేర్కొన్నారు. వేర్వేరు వేషధారణల్లో ఉన్న అమృత్‌పాల్ ఫొటోలను పోలీసులు విడుదల చేశారు.

అది పూర్తిగా నిఘా వైఫల్యమే

అమృత్‌పాల్ పరారీపై పంజాబ్ హైకోర్టు అసంతృప్తి

అమృత్‌పాల్ తప్పించుకోవడంపై పంజాబ్ హరియాణా హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. నిఘా వైఫల్యమే ఇందుకు కారణమని పోలీసు శాఖకు మొట్టికాయలు వేసింది. వేలాది మంది పోలీసులుండగా అతడు పరారయ్యాడంటే నమ్మలేకపోతున్నామని వ్యాఖ్యానించింది. అమృత్‌పాల్‌పై కఠినమైన జాతీయ భద్రతా చట్టం కింద కేసు నమోదు చేసినట్లు పంజాబ్ ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. పోలీసు కస్టడీలో ఉన్న అమృత్‌పాల్‌ను విడుదల చేయాలంటూ 'వారిస్ పంజాబ్ దే'తరఫున లాయర్ ఇమాన్ ఖారా వేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌పై పంజాబ్, హరియాణా హైకోర్టు విచారణ జరిపింది. పోలీసు వ్యూహం నుంచి అమృత్‌పాల్ ఎలా తప్పించుకున్నాడని జస్టిస్ షెకావత్ పంజాబ్ అడ్వొకేట్ జనరల్ వినోద్ ఘాయ్‌ను ప్రశ్నించారు. ఇది నిఘా వైఫల్యమని, ఇలా జరిగిందంటే నమ్మడం కష్టంగా ఉందని ఆయన వ్యాఖ్యానించినట్లు ఒక లాయర్ వెల్లడించారు. అమృత్‌పాల్‌ను పోలీసులు పట్టుకోలేదని అతడు పరారీలో ఉన్నాడని ఏజీ చెప్పారు. అమృత్‌పాల్‌ను పట్టుకునేందుకు పోలీసులు శాయశక్తులా ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. అతడిపై ఎన్ఎస్ఏతో పాటు 6 కేసులు నమోదు చేసినట్లు ఏజీ అన్నారు. అమృత్‌పాల్‌ను, అతడి అనుచరులను పట్టుకునేందుకు పంజాబ్ పోలీసులు శనివారం నుంచి పెద్ద ఎత్తున సోదాలు చేపట్టారు. జలంధర్ జిల్లాలో పోలీసుల భారీ ఛేజింగ్ నుంచి అతడు తప్పించుకున్న విషయం తెలిసిందే.

అరెస్టు చేయలేదు

అమృత్‌పాల్‌ను జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఏ) కింద అదుపులోకి తీసుకోవాలని ఆదేశిస్తూ అమృత్‌సర్ జిల్లా మేజిస్ట్రేట్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారని పంజాబ్ పోలీసులు వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం పంజాబ్ అండ్ హరియాణా హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేశారు. అమృత్‌పాల్‌ను అరెస్టు చేయలేదని, బంధించలేదని వెల్లడించారు. ప్రస్తుతం పరారీలోనే ఉన్నాడని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అమృత్‌పాల్‌ను అరెస్టు చేశారంటూ పిటిషన్ చేసిన వాదనను ఖండించారు.

పార్లమెంట్‌లో అదే ప్రతిష్టంభన



పార్లమెంట్ కారిడార్‌లో నిరసన తెలుపుతున్న విపక్షాల సభ్యులు

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ అక్రమాలపై విచారణ కోసం జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) ఏర్పాటు చేయాలన్న తమ డిమాండ్ నుంచి విపక్షాలు ఏమాత్రం వెనక్కి తగ్గడం లేదు. మరోవైపు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విదేశీ గడ్డపై భారత ప్రజాస్వామ్యాన్ని కించపర్చారని, క్షమాపణ చెప్పాలని బీజేపీ పట్టుబడుతోంది. దీంతో పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు మంగళవారం స్తంభించాయి. లోక్‌సభ మంగళవారం ప్రారంభమైన తర్వాత ప్రతిపక్ష ఎంపీలు నినాదాలు ప్రారంభించారు. అదానీ అంశంపై జేపీసీ ఏర్పాటు చేయాలన్నారు. దీంతో స్పీకర్ బిర్లా జోక్యం చేసుకున్నారు. అయినా ప్రతిపక్ష ఎంపీలు వెనక్కి తగ్గకపోవడంతో సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. సభ మళ్లీ ప్రారంభమైన తర్వాత విపక్ష సభ్యులు నినాదాలు కొనసాగించారు. శాంతించాలంటూ సభాపతి స్థానంలో ఉన్న రాజేంద్ర అగర్వాల్ విన్నవించారు. అయినా ఎవరూ వినిపించుకోలేదు. దీంతో సభను గురువారానికి వాయిదా వేస్తున్నట్లు రాజేంద్ర ప్రకటించారు. రాహుల్ క్షమాపణ చెప్పాలన్న బీజేపీ సభ్యుల నినాదాలతో రాజ్యసభ దద్దరిల్లింది. ప్రజల ఆకాంక్షలను వమ్ము చేయొద్దని సభ్యులకు రాజ్యసభ చైర్మన్ ధన్‌ఖడ్ హితవు పలికారు. అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం తీవ్రస్థాయికి చేరడంతో సభను గురువారానికి వాయిదా వేస్తున్నట్లు చైర్మన్ వెల్లడించారు. ప్రతిష్టంభనకు తెరదించడమే లక్ష్యంగా లోక్‌సభ స్పీకర్ మంగళవారం అఖిలపక్ష భేటీ నిర్వహించారు. సమస్యను పరిష్కరించే విషయంలో ఏకాభిప్రాయం రాకపోవడంతో అఖిలపక్ష సమావేశం విఫలమైంది.

లోక్‌సభలో మాట్లాడేందుకు అవకాశం ఇవ్వండి

పలువురు కేంద్ర మంత్రులు లోక్‌సభలో తనపై పూర్తి నిరాధారమైన, అసంబద్ధమైన ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ విమర్శించారు. వాటిపై సభలో సమాధానం చెప్పే హక్కు తనకు ఉందని అన్నారు. ఈ మేరకు ఆయన లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు ఓ లేఖ రాశారు.

కారిడార్లలో విపక్షాల నిరసన

అదానీ గ్రూప్ నిర్వాకంపై విచారణకు జేపీసీని ఏర్పాటు చేయాలని ప్రతిపక్ష నేతలు డిమాండ్ చేశారు. వివిధ పార్టీల ఎంపీలు, నాయకులు మంగళవారం పార్లమెంట్ హౌస్ కారిడార్లలో నిరసన చేపట్టారు. జేపీసీ కావాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. బ్యానర్లు ప్రదర్శించారు. అదానీ అంశంపై ప్రధాని నరేంద్ర మోదీ నోరు విప్పాలంటూ తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు నిరసన తెలిపారు. రూ.లక్ష కోట్ల కుంభకోణంలో భాగస్వామి అయిన అదానీని రక్షించేందుకు మోదీ ప్రయత్నిస్తున్నారని వారు ఆరోపించారు. అంతకంటే ముందు విపక్ష నేతలు సమావేశమయ్యారు. జేపీసీ కోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని నిర్ణయించుకున్నారు. కాంగ్రెస్, డీఎంకే, ఆర్జేడీ, జేడీయూ, జేఎంఎం, ఆప్ తదితర పార్టీల నాయకులు ఈ భేటీకి హాజరయ్యారు.

రూ.1.48 లక్షల కోట్ల అనుబంధ పద్దుకు ఆమోదం

న్యూఢిల్లీ: ప్రస్తుత 2022-23 ఆర్థిక సంవత్సరంలో అదనంగా రూ.1.48 లక్షల కోట్ల అదనపు నిధుల ఖర్చుకు సంబంధించిన అనుబంధ పద్దుకు మంగళవారం లోక్‌సభ ఆమోదముద్ర వేసింది. అదానీ షేర్ల వివాదంపై విపక్ష పార్టీల నిరసనల నినాదాల మధ్యే ఈ పద్దుకు సభ ఆమోదం తెలిపింది. దీనికి సంబంధించిన మొత్తం రూ.2.7 లక్షల కోట్ల అదనపు పద్దును 13వ తేదీనే ఆర్థికశాఖ సహాయ మంత్రి పంకజ్ లోక్‌సభలో ప్రవేశపెట్టిన విషయం తెల్సిందే. అదనపు పద్దుకు సంబంధించి రూ.36,325 కోట్లను ఎరువుల సబ్సిడీ కోసం కేంద్రం ఖర్చుచేయనుంది. వన్ ర్యాంక్ వన్ పెన్షన్ సంబంధిత మాజీ సైనికులకు కేంద్రప్రభుత్వం ఇవ్వాల్సిన రూ.33,718 కోట్ల బకాయిలను ప్రభుత్వం మొత్తం పద్దులో కలిపింది.

రాహుల్.. రాజకీయాల్లో మరో మీర్ జాఫర్: బీజేపీ

న్యూఢిల్లీ: భారతదేశంలో బ్రిటిష్ పాలనకు బాటలు పరిచిన బెంగాల్ సైన్యాధ్యక్షుడు మీర్ జాఫర్ మాదిరిగా రాహుల్ గాంధీ ప్రవర్తిస్తున్నారని బీజేపీ ఆరోపించింది. 'బెంగాల్ పాలకుడు సిరాజుద్దౌలాను వంచించి బ్రిటిష్ సేనల సాయంతో ప్లాసీ యుద్ధంలో గెలిచి మీర్ జాఫర్.. నవాబు అయ్యాడు. ఇదే తరహాలో దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందంటూ విదేశీ శక్తుల సాయంతో భారత్‌కు 'నవాబు' అవ్వాలని రాహుల్ ఆశపడుతున్నారు. రాహుల్ ప్రస్తుత దేశ రాజకీయాల్లో మరో మీర్ జాఫర్' అని బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా ఆరోపించారు.



లండన్‌లో దాడికి గురైన భారత హైకమిషన్‌కు సంఘీభావంగా మంగళవారం అక్కడికి చేరుకున్న వందలాది మంది భారతీయ సంతతి పౌరులు

కాన్సులేట్‌పై దాడి ఘటనలో అమెరికా ఆగ్రహం

వాషింగ్టన్: అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్కోలో ఉన్న భారతీయ కాన్సులేట్‌పై ఖలిస్తానీవాదులు దాడికి తెగబడిన ఘటనను అమెరికా ప్రభుత్వం తీవ్రంగా తప్పుబట్టింది. 'ఇలాంటి ఘటనలు ఏమాత్రం ఆమోదనీయంకాదు' అని వైట్‌హౌజ్‌లో జాతీయ భద్రతా మండలి సంధానకర్త(వ్యూహాత్మక సంబంధాలు) జాన్ కిర్బీ ఆక్షేపించారు. ఆదివారం తెల్లవారుజామున కాన్సులేట్‌కు ఇద్దరు ఖలిస్తానీ సానుభూతిపరులు నిప్పుపెట్టేందుకు విఫలయత్నం చేసిన సంగతి తెల్సిందే. ఆదివారం మధ్యాహ్నం మళ్లీ అక్కడికి చేరుకున్న ఇంకొందరు ఖలిస్తానీవాదులు ఖలిస్తాన్ జెండాలు పాతి, ఇనుప కడ్డీలతో తలుపు, కిటికీలు బద్దలుకొట్టారు. ఈ దాడి ఘటనలో కాన్సులేట్ సిబ్బందిలో ఒకరికి గాయాలయ్యాయి. 'ఈ ఘటనపై లోతైన దర్యాప్తు చేస్తాం. భారత కాన్సులేట్‌కు భద్రత, సిబ్బందికి పూర్తిస్థాయి రక్షణ కల్పిస్తాం' అని కిర్బీ ప్రకటించారు. దాడికి పాల్పడిన వారిని ఉపేక్షించేదిలేదంటూ అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జాక్ సలివాన్ ట్వీట్ చేశారు. కాన్సులేట్ ఎదుట నిరసనలు చేస్తున్న ఖలిస్తాన్ వేర్పాటువాదులపై స్థానిక పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని భారతీయ అమెరికన్లు ఆగ్రహం వ్యక్తంచేయడంతో సలివాన్ పైవిధంగా స్పందించారు. పాస్‌పోర్టులు, వీసాల కోసం కాన్సులేట్‌కు వచ్చిన పౌరులను వేర్పాటువాదులు వేధించారని భారతీయ అమెరికన్లు ఆరోపించారు.

మెహుల్ చోక్సీపై రెడ్‌కార్నర్ నోటీస్ ఎత్తివేత !

కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు పెంచిన కాంగ్రెస్



న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు రూ.13,000 కోట్లు ఎగ్గొట్టి విదేశాలకు పారిపోయిన వజ్రాల వ్యాపారి మెహుల్ చోక్సీపై ఇంటర్‌పోల్ గతంలో జారీచేసిన రెడ్‌కార్నర్ నోటీసును ఇటీవల ఎత్తేసిన విషయం తాజాగా వెలుగులోకి రావడంతో విపక్ష కాంగ్రెస్ పార్టీ కేంద్రప్రభుత్వంపై విమర్శలు గుప్పించింది. ' విపక్షాలపైకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సీబీఐను కేంద్రం ఉసిగొల్పుతూ తమ మిత్రుడిని వదిలేసింది. ఇలాంటి వ్యక్తులను పరిరక్షించే బీజేపీ పెద్దలు దేశభక్తి గురించి మాట్లాడటం.. నిజంగా ఒక పెద్ద జోక్' అని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యానించారు. కాగా, ఇంటర్‌పోల్ తన డాటాబేస్ నుంచి చోక్సీ పేరును తొలగించడాన్ని సీబీఐ తప్పుబట్టింది. ఆయన పేరును మళ్లీ చేర్చి రెడ్‌కార్నర్ నోటీసును పునరుద్ధరించాలని ఇంటర్‌పోల్‌ను కోరింది. పేరు తొలగించాలని పలుమార్లు చోక్సీ కోరడంతో ఇంటర్‌పోల్‌లోని స్వతంత్ర సీసీఎఫ్ విభాగం ఆ పనిచేసింది.

హిందుత్వపై కన్నడ నటుడు చేతన్ వివాదాస్పద ట్వీట్



బెంగళూరు: హిందుత్వను గురించి వివాదాస్పద ట్వీట్ చేసిన కన్నడ నటుడు చేతన్ అహింసను మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 'అబద్ధాలపై హిందుత్వ నిర్మితమైంది. సత్యమే దానిని ఓడిస్తుంది. సమానత్వమే సత్యం'అంటూ ఈ నెల 20న ఆయన ఒక ట్వీట్ చేశారు. దీనిపై శివకుమార్ అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు చేతన్‌పై ఐపీసీ సెక్షన్లు 293ఏ(మతాన్ని, మత విశ్వాసాలను ఉద్దేశపూర్వకంగా కించపరచడం), 505(2) విద్వేషాలను పెంచేలా అటువంటి వాటిని ప్రచారం చేయడం)కింద కేసులు నమోదు చేసి, అరెస్ట్ చేసినట్లు బెంగళూరులోని శేషాద్రిపురం పోలీసులు తెలిపారు. అతడికి మేజిస్ట్రేట్ 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించారన్నారు. ప్రభుత్వ బడుల్లో హిజాబ్ నిషేధంపై కేసును విచారిస్తున్న జడ్జిపై అనుచిత ట్వీట్ చేసినందుకు గాను గత ఏడాది ఫిబ్రవరిలో చేతన్‌ను అరెస్ట్ చేశారు.

తెలంగాణ

ఫోన్ల వాడకంపైనే ప్రశ్నలు!

వరుసగా రెండో రోజూ కవితను విచారించిన ఈడీ

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత వరుసగా రెండో రోజు మంగళవారం కూడా ఈడీ విచారణకు హాజరయ్యారు. పలు అంశాలపై సుమారు పది గంటల పాటు అధికారులు ఆమెను ప్రశ్నించారు. ప్రధానంగా పది ఫోన్లు వినియోగించారన్న ఆరోపణలపై కవితను ప్రశ్నించినట్లు సమాచారం. మంగళవారం ఉదయం 11.30 గంటలకు ఆమె ఈడీ కార్యాలయానికి బయలుదేరి వెళ్లారు. ఈడీ తన చార్జిషీటులో కవిత 6209999999 నంబరును ఆరు వేర్వేరు ఐఎంఈఐ నంబర్లున్న ఆరు ఫోన్లలో, 8985699999 నంబరును నాలుగు వేర్వేరు ఐఎంఈఐ నంబర్లున్న నాలుగు ఫోన్లలో వినియోగించారని ఆరోపించింది. దీంతో ఆ పది ఫోన్లను కవిత మంగళవారం ఈడీకి అందజేశారు. కవిత నుంచి తీసుకున్న ఫోన్లను క్లోనింగ్ నిమిత్తం పంపినట్లు సమాచారం.

మూడు వాంగ్మూలాలపై సంతకాలు

దర్యాప్తు అధికారి జోగిందర్, ఓ మహిళా అధికారి సహా మరో ముగ్గురు అధికారులు కవితను ప్రశ్నించినట్లు తెలిసింది. ఏ ఫోనును ఎప్పుడు వినియోగించారు? ఏ రోజు నుంచి ఏ రోజు వరకు వినియోగించారు? తక్కువ కాలంలో ఎక్కువ ఫోన్లు వినియోగించాల్సిన అవసరం ఎందుకొచ్చింది? అనే కోణంలో ప్రశ్నలు సంధించినట్లు సమాచారం. మొత్తం మూడుసార్లు విచారణ సందర్భంగా మూడు వాంగ్మూలాలు నమోదు చేసిన ఈడీ అధికారులు వాటిపై కవితతో పాటు ఆమె న్యాయవాది సంతకాలు కూడా తీసుకున్నట్టు సమాచారం. ఇదిలా ఉండగా ఇంతకుముందే ఒక ఫోన్‌ను ఈడీకి ఇచ్చిన కవిత.. తాజాగా 10 ఫోన్లు ఇవ్వడంతో మొత్తం 11 ఫోన్లు ఇచ్చినట్టయ్యింది. విచారణ అనంతరం రాత్రి 9.40 గంటలకు ఈడీ కార్యాలయం నుంచి బయటకు వచ్చిన కవిత.. విజయ సంకేతం చూపుతూ, చిరునవ్వుతో శ్రేణులకు అభివాదం చేస్తూ నివాసానికి చేరుకున్నారు. తదుపరి విచారణ తేదీని ఈడీ ఇంకా ప్రకటించలేదు.

మార్గదర్శిపై బలవంతపు చర్యలొద్దు

రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: మార్గదర్శి చిట్‌ఫండ్స్‌పై తదుపరి ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దని తెలంగాణ హైకోర్టు ఏపీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. మార్గదర్శి బ్రాంచ్‌లన్నీ ఏపీ సహా ఇతర రాష్ట్రాల్లో ఉన్నా కేంద్ర కార్యాలయం మాత్రం హైదరాబాద్‌లో ఉందని తెలంగాణ హైకోర్టు పేర్కొంది. ఖాతాదారుల నగదంతా ఇక్కడి నుంచే మ్యూచువల్ ఫండ్లు, షేర్లలోకి వెళుతోందని అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో పిటిషన్‌పై విచారణ జరిపే పరిధి తెలంగాణ హైకోర్టుకు ఉందని స్పష్టం చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో తమ సంస్థకు చెందిన పలు బ్రాంచ్‌లపై నమోదైన కేసులను కొట్టివేయాలని లేదా దర్యాప్తుపై స్టే ఇవ్వాలని కోరుతూ మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థ తెలంగాణ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. విచారణను ఏపీ కాకుండా మరో రాష్ట్రంలోని దర్యాప్తు సంస్థకు బదిలీ చేయాలని, అప్పటి వరకు ఎలాంటి బలవంతపు చర్యలు చేపట్టకుండా ఆదేశాలు ఇవ్వాలని మార్గదర్శి తన పిటిషన్‌లో కోరింది. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ సురేందర్ విచారణ చేపట్టారు. ఇదే కోర్టులో ఇదే అంశంపై విచారణ సాగుతున్నందున వాటికి ఈ పిటిషన్లను జత చేయడం కోసం.. పిటిషన్లకు నంబర్ వేసి సీజే ధర్మాసనం ముందు ఉంచాలని రిజిస్ట్రీని ఆదేశించారు.

కస్టమ్ మిల్లింగ్‌పై స్పెషల్ ఫోకస్

రేషన్ బియ్యం దందాను అరికట్టే దిశగా చర్యలు

- విద్యుత్ వినియోగం, మిల్లింగ్ పరిమాణాన్ని బేరీజు వేస్తున్న పౌర సరఫరాల శాఖ
- 8 జిల్లాల్లోని 46 మిల్లుల్లో విద్యుత్ వాడకం కంటే మిల్లింగ్ ఎక్కువ
- ఆ మిల్లులను తనిఖీ చేయాలని జేసీలకు ఆదేశం



తగ్గిన అక్రమ రవాణా

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రేషన్ బియ్యం రీసైక్లింగ్ దందాను పూర్తిగా అరికట్టేందుకు పౌర సరఫరాల శాఖ చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలోనే కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)పై పటిష్ట నిఘాను ఏర్పాటు చేసింది. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించి వాటిని బియ్యంగా మార్చే ప్రక్రియలోకి పీడీఎస్ బియ్యం వచ్చి చేరకుండా జాగ్రత్త పడుతోంది. దేశంలోనే తొలిసారిగా ఏపీలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా సీఎంఆర్ మిల్లుల విద్యుత్ వినియోగం, కస్టమ్ మిల్లింగ్ జరిగిన బియ్యం పరిమాణాన్ని ఎప్పటికప్పుడు బేరీజు వేస్తోంది. ఇందులో భాగంగానే 8 జిల్లాల్లో సుమారు 46 మిల్లుల్లో సీఎంఆర్ బియ్యం పరిమాణం కంటే విద్యుత్ వినియోగం చాలా తక్కువగా ఉండటాన్ని గుర్తించింది. తక్కువ విద్యుత్ వాడి ఎక్కువ మొత్తంలో మిల్లింగ్ చేయడం ఎలా సాధ్యమైందన్న అంశంపై ఆరా తీస్తోంది. ఇందులో భాగంగా ఆయా మిల్లులను వెంటనే తనిఖీ చేసి సమగ్ర నివేదిక ఇవ్వాలని సంబంధిత జిల్లాల జాయింట్ కలెక్టర్లను ఆదేశించింది.

మరోవైపు విజిలెన్స్ బృందాలతో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తుండటంతో చాలావరకు రేషన్ బియ్యం అక్రమ రవాణా తగ్గింది. దీనికి తోడు 6ఏ కేసులను త్వరగా విచారించి పట్టుబడ్డ బియ్యాన్ని తిరిగి బహిరంగ వేలం ద్వారా మార్కెట్‌లోకి తీసుకొస్తోంది. ఇందుకు ప్రత్యేకంగా ప్రతి జిల్లాలో జాయింట్ కలెక్టర్, డీసీఎస్‌వో, పౌర సరఫరాల శాఖ ఏఎం, మార్కెటింగ్ శాఖ ఏడీలతో ప్రత్యేక కమిటీలను నియమించింది. వీరు సంబంధిత తహసీల్దార్ ఆధ్వర్యంలో బియ్యం నాణ్యత, రకాన్ని బట్టి అప్‌సెట్ ధరను నిర్ణయించి బహిరంగ వేలానికి వెళ్తున్నారు. అక్రమ రవాణాలో దొరికిన బియ్యాన్ని ఎప్పటికప్పుడు బయటకు పంపించేలా ప్రతి నెలలో రెండుసార్లు బహిరంగ వేలం నిర్వహిస్తున్నారు. సాధారణంగా రేషన్ దుకాణంలో రికార్డులకు మించి స్టాక్ ఉంటే దానిని సీజ్ చేసి కేసు నమోదు చేస్తారు. ఇటువంటి నిల్వలకు మోక్షం కల్పించి పీడీఎస్ ధరకే ప్రజా పంపిణీలోకి తీసుకొస్తున్నారు. సరైన పత్రాలు లేకుండా ప్రైవేట్ గోడౌన్లు, దుకాణాలు, లారీల్లో స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని మాత్రం బహిరంగ వేలానికి పెడుతున్నారు.

నిల్వలతో సమస్య

అక్రమంగా తరలిస్తూ పట్టుబడ్డ బియ్యాన్ని స్వాధీనం చేసుకుంటున్న అధికారులు కేసులు నమోదు చేసి ఎక్కడికక్కడ ఎంఎల్ఎస్ పాయింట్లలో సరుకును నిల్వ చేస్తున్నారు. అయితే, కేసుల విచారణ జాప్యంతో నిల్వలు పేరుకుపోయి బియ్యం ముక్కిపోవడం, రంగు మారడం, పురుగులు పట్టి ప్రజా వినియోగానికి పనికిరావట్లేదు. వీటి ప్రభావం ఎంఎల్ఎస్ పాయింట్లలోని తాజా సరుకులపైనా పడుతోంది. ఒక్కోసారి ఈ నిల్వలు సాధారణ పీడీఎస్‌లో కలిసిపోతుండటంతో సరైన లెక్కలు ఉండట్లేదు. వీటిని అరికట్టేందుకు జిల్లాల్లో ఒకట్రెండు ఎంఎల్ఎస్ పాయింట్లను గుర్తించి వాటిలో మాత్రమే అక్రమంగా తరలిస్తూ పట్టుబడ్డ చౌక బియ్యాన్ని నిల్వ చేస్తున్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా కేసుల్లో సరుకు విలువ రూ.50 లక్షలకు పైబడి ఉంటే కలెక్టర్, రూ.50 లక్షలు లోపు ఉంటే జాయింట్ కలెక్టర్ విచారించనున్నారు. కోర్టు పరిధిలో ఉన్న కేసులు మినహా మిగిలిన వాటిని జిల్లా స్థాయిలో వేగవంతంగా పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నారు.

జిల్లాల వారీగా వ్యత్యాసాలు ఇలా

జిల్లా	వ్యత్యాసాలను గుర్తించిన మిల్లుల సంఖ్య
పార్వతీపురం మన్యం	4
శ్రీకాకుళం	7
విజయనగరం	7
కాకినాడ	5
డా.అంబేడ్కర్ కోనసీమ	2
తూర్పు గోదావరి	5
పశ్చిమ గోదావరి	6
ఏలూరు	10

సీఎంఆర్‌పై ప్రత్యేక దృష్టి



పౌరసరఫరాల శాఖలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా మిల్లుల కరెంటు వాడకం, వారిచ్చిన కస్టమ్ మిల్లింగ్ బియ్యం పరిమాణాన్ని పోల్చి చూస్తున్నాం. కొన్ని మిల్లుల్లో సీఎంఆర్ చేసి ఇచ్చిన బియ్యానికి, వాడిన కరెంట్‌కు పొంతన లేదు. తక్కువ కరెంట్‌తో ఎక్కువ బియ్యం సీఎంఆర్ చేసినట్టు చూపిస్తున్నారు. దీనిపై ఆయా జిల్లాల జేసీలను తనిఖీ చేయాలని ఆదేశించాం. వారిచ్చిన నివేదిక ప్రకారం చర్యలు తీసుకుంటాం.

– హెచ్.అరుణ్‌కుమార్, పౌరసఫరాల శాఖ కమిషనర్

వేగంగా కేసులను డిస్పోజ్ చేస్తున్నాం



రాష్ట్రంలో పేదలకు నాణ్యమైన బియ్యం అందిస్తుండటంతో చాలా వరకు రేషన్ అక్రమ రవాణా తగ్గింది. దీనితో పాటు ఇప్పటివరకు నమోదైన 6ఏ కేసులను కూడా త్వరగా విచారించేలా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశాం. కొన్నేళ్లుగా విచారణకు నోచుకోని కేసులు, భారీగా పేరుకుపోయిన నిల్వలను క్లియర్ చేస్తున్నాం. సరైన పత్రాలు లేకుండా తరలిస్తూ పట్టుబడ్డ బియ్యానికి బహిరంగ వేలం నిర్వహించి ప్రజా వినియోగంలోకి తీసుకొస్తున్నాం.

– విజయ సునీత, పౌరసరఫరాల శాఖ డైరెక్టర్

స్మార్ట్ టౌన్‌షిప్‌లలో ఎక్కడైనా ప్లాట్ కొనుక్కోవచ్చు

- ప్రభుత్వ ఉద్యోగులకు అవకాశం
- రాష్ట్రంలోని 22 పట్టణాల్లో ఎంఐజీ లేఅవుట్లు
- ప్లాట్ ధరలో 20 శాతం తగ్గింపు
- జీవో నంబరు 38 విడుదల చేసిన ప్రభుత్వం

సాక్షి, అమరావతి: ప్రభుత్వ ఉద్యోగులు జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్ ప్రాజెక్టుల్లో ఎక్కడైనా ప్లాట్ కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. రాష్ట్రంలో ఎక్కడ పనిచేస్తున్నవారైనా.. వారు కోరుకున్నచోట ప్లాట్ తీసుకోవచ్చు. గతంలో ఉద్యోగులు పనిచేస్తున్న ప్రాంతంలో ఉన్న జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌ల్లో మాత్రమే కొనుగోలు చేసేందుకు వీలుండేది. ఉద్యోగుల విజ్ఞప్తుల మేరకు పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ఈ నిబంధనలను సడలించి జీవో నంబరు 38 జారీచేసింది. ఈ కొత్త జీవో ద్వారా ప్లాట్‌ను రాష్ట్రంలో ఎక్కడైనా ఎంపిక చేసుకునే అవకాశం లభించింది. రాష్ట్రంలోని 22 నగరాలు, పట్టణాల్లో అన్ని అనుమతులు, ప్రణాళికలతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌లను అభివృద్ధి చేసింది. వీటిని మార్కెట్ ధర కంటే తక్కువకే అందుబాటులో ఉంచింది. ప్రజలతోపాటు ప్రభుత్వ ఉద్యోగులు కొనుగోలు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. అన్ని లేఅవుట్లలో ప్రభుత్వ ఉద్యోగులకు 10 ప్లాట్లు రిజర్వ్ చేయడంతోపాటు ధరలో 20 శాతం రిబేట్ సౌకర్యం కూడా కల్పించింది. కొత్త నిబంధనలతో మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో రాష్ట్రంలో వివిధ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులు సొంత ఇంటి కలను నెరవేర్చుకునేందుకు మొత్తం 22 జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్ ప్రాజెక్టుల్లో ఎక్కడైనా ప్లాట్ బుక్ చేసుకోవచ్చు. లేఅవుట్స్ వివరాలను https:// migapdtcp. ap. gov. in/ వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

'అంగన్‌వాడీ'లకు ఫిబ్రవరి వరకు జీతాలిచ్చాం

నాలుగు నెలలుగా జీతాలు చెల్లించలేదనే 'ఈనాడు' కథనం అవాస్తవం

- గత ప్రభుత్వం ఐదేళ్లలో వేతనాలకు రూ.2,864.94 కోట్లు మాత్రమే ఇచ్చింది
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇప్పటివరకు రూ.4,234.93 కోట్లకు పైగానే చెల్లించింది
- మహిళా, శిశు సంక్షేమ సంచాలకుడు రవిప్రకాశ్‌రెడ్డి

సాక్షి, అమరావతి: అంగన్‌వాడీ కార్యకర్తలకు నాలుగు నెలలుగా జీతాలు చెల్లించడంలేదంటూ 'ఈనాడు' రాసిన కథనం పూర్తిగా అవాస్తవమని మహిళా, అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ సంచాలకుడు బి.రవిప్రకాశ్‌రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన వాస్తవాలను వివరిస్తూ ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు ఈ ఏడాది ఫిబ్రవరి వరకు జీతాలు చెల్లించామని వివరించారు. ఎవరికీ ఎటువంటి వేతన బకాయిలు లేవన్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు గౌరవ వేతనం కింద ఇప్పటివరకు రూ.1,019 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. అంతేకాకుండా అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వ కార్యక్రమాలను పూర్తిగా అమలు చేసిన కార్యకర్తలకు ప్రోత్సాహకంగా నెలకు రూ.500 చొప్పున అందిస్తున్నామన్నారు. ఇందుకోసం 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు రూ.27.80 కోట్లు విడుదల చేసినట్టు రవిప్రకాశ్‌రెడ్డి వెల్లడించారు.

గత ప్రభుత్వం కంటే అధికంగా..

అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు గత



ప్రభుత్వం కంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే అత్యధిక గౌరవ వేతనం ఇస్తోంది. గత ప్రభుత్వం ఐదేళ్లలో గౌరవ వేతనంగా మొత్తం రూ.2,864.94 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2019 నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు రూ.4,234.93 కోట్లకు పైగా వేతనాల కోసం వెచ్చించింది. అంతేకాకుండా అధికారంలోకి రాగానే అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు వేతనాలు పెంచింది. ప్రస్తుతం అంగన్‌వాడీ కార్యకర్తలకు నెలకు రూ.11,500, ఆయాలకు నెలకు రూ.7,000 చొప్పున అందిస్తోంది.

అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు ప్రభుత్వం కల్పించిన ప్రయోజనాలు ఇవి..

రాష్ట్రంలో 55,607 అంగన్‌వాడీ కేంద్రాల్లో పని చేస్తున్న కార్యకర్తలు, సహాయకులకు ప్రభుత్వం అనేక ప్రయోజనాలు కల్పించింది.

సెలవులు: అంగన్‌వాడీ కేంద్రాల సేవలను ఒకే గొడుగు కిందకు తెచ్చి పర్యవేక్షించడంతోపాటు కార్యకర్తలు, సహాయకులకు ఏడాదికి 20 రోజుల వార్షిక సెలవులను ప్రభుత్వం ఇస్తోంది. గరిష్ఠంగా రెండు పర్యాయాలు 180 రోజులపాటు ప్రసూతి సెలవులు మంజూరు చేస్తోంది. గర్భస్రావం జరిగినప్పుడు 45 రోజులు సెలవు ఇస్తోంది. ఏటా అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు 15 రోజులు వేసవి సెలవులు మంజూరు చేస్తోంది.

పదోన్నతులు: అర్హులైన అంగన్‌వాడీ వర్కర్లను సూపర్‌వైజర్ గ్రేడ్–2 పోస్టుల్లో నియమిస్తున్నారు. పరీక్ష ద్వారా 100 శాతం కోటాతో భర్తీ చేస్తున్నారు. అలాగే విస్తరణ అధికారి, గ్రేడ్ 2 సూపర్‌వైజర్ పోస్టుల భర్తీకి వయోపరిమితి 50 ఏళ్ల వరకు ఉండొచ్చని వెసులుబాటు కల్పిస్తూ 2021 డిసెంబర్‌లో ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. అదేవిధంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల పదోన్నతులకు వయోపరిమితిని 45 ఏళ్లకు పెంచింది.

'అంగన్‌వాడీ'ల వేతనాల కోసం ఏడాదికి వెచ్చిస్తున్న మొత్తం ఇలా..

ఆర్థిక సంవత్సరం	గౌరవ వేతనం (రూ.లక్షల్లో)
2014-15	23,555.40
2015-16	40,068.55
2016-17	48,520.75
2017-18	86,799.65
2018-19	87,550.13
2019-20	95,097.45
2020-21	1,07,325.19
2021-22	1,19,189.48
2022-23(ఫిబ్రవరి)	1,01,881.62

బీమాతో ధీమా: ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన (పీఎంజేజేబీవై) ద్వారా 18 నుంచి 50 ఏళ్ల వయసు గల అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు రూ.2 లక్షల జీవిత బీమా సదుపాయం ఉంది. ఏదైనా కారణం వల్ల ప్రాణాపాయం, మరణం సంభవించినప్పుడు ఇది వర్తిస్తుంది. అలాగే ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన (పీఎంఎస్‌బీఐ) కింద 18 నుంచి 59 ఏళ్ల వయసు ఉన్న కార్యకర్తలు, సహాయకులకు ప్రమాద మరణానికి, శాశ్వత వైకల్యానికి రూ.2 లక్షలు, పాక్షిక వైకల్యానికి రూ.లక్ష బీమా వర్తిస్తుంది. అంగన్‌వాడీ కార్యకర్త బీమా యోజన (ఏకేబీవై) కింద 51 నుంచి 59 ఏళ్ల వయసు గల కార్యకర్తలు, సహాయకులు మరణిస్తే రూ.30 వేలు బీమా వస్తుంది.

పదవీ విరమణ ప్రయోజనాలు: అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు గరిష్ఠంగా 60 ఏళ్లు వచ్చే వరకు పనిచేయవచ్చు. 60 ఏళ్ల తర్వాత పదవీ విరమణ చేసే కార్యకర్తలకు రూ.50 వేలు, సహాయకులకు రూ.20 వేలు ప్రభుత్వం అందిస్తుంది.

'స్కిల్' స్కామ్‌లో బాబు జైలుకెళ్లడం ఖాయం

- రూ.371 కోట్ల కుంభకోణానికి పాల్పడిన చంద్రబాబు
- కీలక పత్రాలన్నీ మాయం చేసిన ఘనుడు బాబు
- ఈ కుంభకోణంలో లోకేశ్ కూడా పాత్రధారే
- మంత్రి గుడివాడ అమర్‌నాథ్

సాక్షి, విశాఖపట్నం: యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించే ముసుగులో రూ.371 కోట్ల కుంభకోణానికి చంద్రబాబు, ఆయన తనయుడు లోకేశ్ పాల్పడ్డారని.. ఇది దేశంలోనే అతిపెద్ద కుంభకోణమని తండ్రీ కొడుకులిద్దరూ అతిత్వరలో జైలుకెళ్లడం ఖాయమని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. విశాఖలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. యువతకు నైపుణ్యాలను కల్పిస్తామన్న సాకు చూపి కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని చంద్రబాబు తన జేబులో వేసుకున్నాడని ఆరోపించారు. పరిశ్రమల్లో పనిచేసే యువతకు అవసరమైన నైపుణ్యాన్ని కల్పించనున్నామని చంద్రబాబు అప్పట్లో మాయమాటలు చెప్పి సీమెన్స్ అనే సంస్థతో ఒప్పందం కుదుర్చుకు



న్నట్లు ప్రకటించారన్నారు. దీనికోసం క్లస్టర్లను ఏర్పాటుచేస్తున్నట్లు, ఒక్కో క్లస్టర్‌కు రూ.560 కోట్ల చొప్పున సుమారు రూ.3,300 కోట్లు ఖర్చు చేయనున్నామని చెప్పారని మంత్రి గుర్తుచేశారు. కానీ, ఇందులో 10 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తే మిగిలిన 90 శాతం మొత్తాన్ని సీమెన్స్ సంస్థ ఏర్పాటుచేస్తుందని చంద్రబాబు నాటి కేబినెట్‌లో చెప్పారన్నారు. అలాగే, ఈ కుంభకోణంలో సింగపూర్‌కు చెందిన స్కిల్లర్, ఇన్‌వెబ్ సొల్యూషన్స్ వంటి ఆరు కంపెనీలను చూపించి రూ.371.25 కోట్లను ఆయా కంపెనీలకు చంద్రబాబు అండ్ కో తరలించారని చెప్పారు. ఇందులో స్కిల్లర్ కంపెనీ పేరట రూ.185 కోట్లు బదలాయించారని.. రాష్ట్ర ప్రభుత్వ ఖజానా నుంచి డబ్బులు నేరుగా ఈ కంపెనీలకు చేర్పించిన చంద్రబాబు దీనికి సంబంధించిన కీలక పత్రాలను మాత్రం మాయం చేశారని వివరించారు. అసలు చంద్రబాబు ప్రభుత్వంతో తాము ఒప్పందం కుదుర్చుకోలేదని సీమెన్స్ యాజమాన్యం 2021లోనే లిఖితపూర్వకంగా తెలియజేసిందన్నారు. చివరికి ఒప్పందంలోని సంతకాలు కూడా ఫోర్జరీ అని తేలినట్లు మంత్రి వెల్లడించారు.

స్కిల్ స్కాంలో బాబు పాత్ర ఉంటే జనసేన దూరంగా ఉండాలి

కాపు సంక్షేమసేన వ్యవస్థాపకుడు, మాజీ ఎంపీ చేగొండి హరిరామజోగయ్య

పాలకొల్లు సెంట్రల్: స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో విద్యార్థుల పేరుతో చంద్రబాబు అతిపెద్ద అవినీతికి పాల్పడ్డారని అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి చేసిన ఆరోపణలు నిజమైతే రాబోయే ఎన్నికల్లో జనసేన పార్టీ టీడీపీకి దూరంగా ఉండాలని కాపు సంక్షేమసేన వ్యవస్థాపకుడు, మాజీ ఎంపీ చేగొండి హరిరామజోగయ్య పేర్కొన్నారు. ఆయన మంగళవారం పాలకొల్లులో ఒక ప్రకటన విడుదల చేశారు. రూ.370 కోట్లు చంద్రబాబు, ఆయన మనుషులు తినేశారన్న ఆరోపణలకు మద్దతుగా అసెంబ్లీ సాక్షిగా అనేక సాక్ష్యాలను బహిర్గతం చేశారని గుర్తు చేశారు. దీనిపై చంద్రబాబు తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలన్నారు. ప్రజలు పవన్‌కళ్యాణ్ నీతిమంతమైన పాలన అందిస్తారని ఆశతో ఉన్నారని తెలిపారు. ఇటువంటి సమయంలో స్కాంలు, ఆరోపణలు ఎదుర్కొంటున్న టీడీపీతో పొత్తులేకుండా జనసేన ఒంటరిగా ముందుకెళ్లాలని సూచించారు.

జనసేనతో పొత్తు ఉన్నా లేనట్లే

బీజేపీ రాష్ట్ర పదాధికారుల సమావేశంలో ఇదే అంశంపై సుదీర్ఘ చర్చ

సాక్షి, అమరావతి : ఉత్తరాంధ్ర పట్టభద్రుల (గ్రాడ్యుయేట్) ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేస్తున్న తనకు మద్దతుగా బహిరంగ ప్రకటన చేయాలని స్వయంగా మిత్రపక్ష జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌ను కోరినా ఆయన స్పందించలేదని.. క్షేత్రస్థాయిలో కలిసి పనిచేసే పరిస్థితి లేనప్పుడు బీజేపీ–జనసేన కలిసి ఉన్నా లేనట్లే అని శాసనమండలిలో బీజేపీ పక్ష నాయకుడు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీవీఎన్ మాధవ్ ఘాటుగా స్పందించారు. పొత్తులో కొనసాగుతున్నప్పటికీ జనసేన ఎక్కడా బీజేపీ అభ్యర్థులకు మద్దతు తెలపని అంశంపై మంగళవారం విజయవాడలో జరిగిన బీజేపీ రాష్ట్ర పదాధికారులు, జిల్లాల పార్టీ అధ్యక్షులు, ఇన్‌చార్జిల సమావేశంలో సుదీర్ఘ చర్చ జరిగింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు అధ్యక్షతన సాగిన ఈ సమావేశంలో కేంద్ర పార్టీ నుంచి జాతీయ సహ సంఘటనా ప్రధాన కార్యదర్శి శివప్రకాష్ పాల్గొన్నారు. సమావేశంలో చర్చించిన అంశాలను మాధవ్‌తో పాటు మరో రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి వేటుకూరి సూర్యనారాయణరాజు, పార్టీ అధికార ప్రతినిధి చందు సాంబశివరావు మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు జనసేనతో పొత్తుపై కీలక వ్యాఖ్యలు చేశారు. 'మేం జనసేనతో కలిసి ఉన్నా లేనట్లేనన్న వాతావరణం ఉంది. ఇటీవల పవన్ కూడా జనసేన–బీజేపీ పొత్తు ఉంది అన్నారు. అయితే, క్షేత్రస్థాయిలో కలిసి పని చేయడం లేదన్నది వాస్తవం. నిజంగా పొత్తులో ఉంటే క్షేత్రస్థాయిలో కూడా కలిసి పనిచేయాలని కోరుతున్నాం. ఆ విధంగా వెళ్తేనే ప్రజలలో మనం కలిసి వెళ్తున్నామన్న మాటకు అర్థం ఉంటుంది. నామ్‌కే వాస్తేగా పొత్తుతో ఉపయోగం లేదని మా అందరి అభిప్రాయం'.. అని మాధవ్ వ్యాఖ్యానించారు.

ఇప్పటికీ పొత్తు కొనసాగాలనే కోరుకుంటున్నాం..

'బీజేపీ–జనసేన కలిసి రాష్ట్రంలో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగాలని బీజేపీ ఇప్పటికీ కోరుకుంటోంది. కలిసి పనిచేస్తే ప్రజా మద్దతు రెండు పార్టీలకు ఉంటుంది. ఆయనా (పవన్) నమ్మాలి. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులకు మద్దతుగా ప్రకటన చేయాలని రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు సోము వీర్రాజు కోరారు. పోటీలో ఉన్న అభ్యర్థిగా నేనూ అడిగాను. చాలా సార్లు కోరాం. కానీ, ప్రకటన రాలేదు. మరోవైపు.. ఉత్తరాంధ్రలో పీడీఎఫ్ అభ్యర్థి తమకు జనసేన మద్దతు ఉందని ప్రచారం చేసుకున్నారని, దానిని ఖండించమని కోరినా ఖండించలేదు'.. అని మాధవ్ చెప్పారు. కలిసి పనిచేసే విషయంలో బీజేపీ నుంచే స్పందనలేదని పవన్‌కళ్యాణ్ అంటున్నారని విలేకరులు ప్రశ్నించగా.. 'ఆయన వైపు నుంచే స్పందనలేదు' అని బదులిచ్చారు.

అందుకే సొంతంగా ఎదగాలని నిర్ణయించుకున్నాం..

'జనసేనతో కలిసి ఉన్నా లేనట్లేనన్న వాతావరణం నేపథ్యంలో పార్టీ తనంతట తాను ఎదిగేలా అన్ని ఏర్పాట్లుచేసుకోవాలని అనుకున్నాం. ఇందులో భాగంగా ఏప్రిల్ 1–14 వరకు బూత్ స్వశక్తీకరణ అభియాన్ కార్యక్రమం చేస్తున్నాం. మే ఒకటి తర్వాత ప్రభుత్వ వైఫల్యాలపై ఛార్జిషీటు వేసే కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించాం. ఏదైనా పొత్తు నిర్ణయం ఉంటే కేంద్ర పార్టీ ఆలోచిస్తుంది' అని మాధవ్ చెప్పారు.

చంద్రబాబు డైరెక్షన్‌లోనే వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలపై దాడి



విజయవాడలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యేఎమ్మెల్సీ రుహుల్లా, ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాస్, మల్లాది విష్ణు, వైఎస్సార్‌సీపీ నాయకులు



గుంటూరులో నిరసన తెలియజేస్తున్న దళిత, బహుజన సంఘాలు



విశాఖలో ఏయూ మెయిన్ గేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు

- సొంత ఎజెండాతోనే టీడీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వచ్చారు
- ఎమ్మెల్యేలు వెలంపల్లి, మల్లాది విష్ణు
- విజయవాడలో భారీ నిరసన కార్యక్రమం
- విశాఖ ఏయూలో అధ్యాపకులు, విద్యార్థుల ఆందోళన
- చంద్రబాబును తక్షణమే అరెస్టు చేయాలి: గుంటూరులో దళిత, బహుజన సంఘాల ధర్నా

సాక్షి నెట్‌వర్క్: అసెంబ్లీలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలపై టీడీపీ ఎమ్మెల్యేలు దాడి చేయడంపై రాష్ట్రవ్యాప్తంగా ప్రజా, దళిత, బహుజన, అధ్యాపక, విద్యార్థి సంఘాలు మంగళవారం నిరసన కార్యక్రమాలు, ధర్నాలు, ఆందోళనలు నిర్వహించాయి. ఈ దాడికి కారకుడైన చంద్రబాబుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశాయి. లేకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళన చేపడతామని హెచ్చరించాయి. చంద్రబాబు డైరెక్షన్‌లో సొంత ఎజెండాతోనే టీడీపీ ఎమ్మెల్యేలు శాసనసభలో తమ పార్టీ ఎమ్మెల్యేలపై దాడి చేశారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు విమర్శించారు. టీడీపీ ఎమ్మెల్యేలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని ధ్వజమెత్తారు. అసెంబ్లీలో టీడీపీ ఎమ్మెల్యేల దౌర్జన్యాన్ని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్, నగర ఎస్సీ సెల్ అధ్యక్షులు పోలిమెట్ల శరత్‌బాబు, బూదాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో విజయవాడలో తుమ్మలపల్లి కళాక్షేత్రం సమీపంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, దివంగత సీఎం వైఎస్సార్ విగ్రహాల వద్ద మంగళవారం భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. వైఎస్సార్‌సీపీ నేతలు ప్లకార్డులు పట్టుకుని చంద్రబాబుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చంద్రబాబు చిత్రపటాన్ని చెప్పులతో కొట్టి, ఫ్లెక్సీని కిందపడేసి కాళ్లతో తొక్కారు. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ దేవాలయం వంటి అసెంబ్లీలో టీడీపీ సభ్యులు వైఎస్సార్‌సీపీ ఎస్సీ సభ్యులపై దాడి చేయటం హేయమన్నారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ.. స్పీకర్ తమ్మినేని సీతారామ్‌ను అవమానిస్తూ పోడియంను చుట్టుముట్టడం టీడీపీ గూండా ఎమ్మెల్యేల అరాచకత్వానికి నిదర్శనమని నిప్పులు చెరిగారు. బీసీలు, ఎస్సీ, ఎస్టీలు అంటే పడని చంద్రబాబు అసెంబ్లీ వేదికగా చేస్తున్న కుటిల రాజకీయాలను రాష్ట్ర ప్రజలు చూస్తున్నారని అన్నారు. ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా మాట్లాడుతూ టీడీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు చట్ట సభలంటే గౌరవం లేదని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు బొప్పన భవకుమార్ మాట్లాడుతూ అసెంబ్లీలో టీడీపీ సభ్యులు వ్యవహరించిన తీరు సభ్య సమాజం సిగ్గు పడేలా ఉందన్నారు. వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, ఎస్సీ నాయకులు పాల్గొన్నారు.

గుంటూరులో ధర్నా..

అసెంబ్లీలో దళిత ఎమ్మెల్యేలపై దాడి చేయించడం ద్వారా తనకు అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంపై ఏమాత్రం గౌరవం లేదని చంద్రబాబు మరోసారి చాటుకున్నారని నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పరిశపోగు శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. స్పీకర్ తమ్మినేని సీతారాం, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు సుధాకర్‌బాబు, ఎలీజాపై టీడీపీ ఎమ్మెల్యేలు దాడి చేయడంపై మంగళవారం గుంటూరులో దళిత, బహుజన సంఘాలు భగ్గుమన్నాయి. టీడీపీ ఎమ్మెల్యేలు, చంద్రబాబు తీరును నిరసిస్తూ లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేశాయి. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, దివ్యాంగుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ ముంతాజ్, జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పి.మహేష్‌బాబు పాల్గొన్నారు.


ఏయూలో నిరసన

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే విధంగా టీడీపీ ఎమ్మెల్యేలు ప్రవర్తిస్తున్నారని విశాఖపట్నంలోని ఆంధ్రా విశ్వవిద్యాలయం ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు మండిపడ్డారు. అసెంబ్లీలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే సుధాకర్‌పై దాడిని ఖండిస్తూ ఏయూ మెయిన్‌గేట్ వద్ద నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏయూ విద్య విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు, డాక్టర్ పేటేటి ప్రేమానందం, డాక్టర్ జి.శాంతారావు, డాక్టర్ ఎం.మోహన్‌బాబు, డాక్టర్ ఎం.కళ్యాణ్, డాక్టర్ తుల్లి చంద్రశేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఒంగోలులోని హెచ్‌సీఎం కాలేజీ సమీపంలోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. బ్లాక్‌డే అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించి టీడీపీ శ్రేణులకు మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుకున్నారు. సంతనూతలపాడు నేతలు చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేశారు. శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలోనూ మహాత్మా గాంధీ విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ నేతలు శాంతియుతంగా నిరసన తెలిపారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794.



Cell Point
23 Years
MOST TRUSTED BRAND
1.5 Ton 3 Star Split Inverter AC
₹ 47,990
₹ 28,999
EMI PER DAY ₹ 75
2 Ton 3 Star Split Inverter AC
₹ 56,900
₹ 35,999
EMI PER DAY ₹ 96
శ్రీ శోభకృత్ నామ సంవత్సర
ఉగాది
శుభాకాంక్షలతో...
aiwa
LED Smart TV 32 Inch (80cm)
₹ 8,999 EMI PER DAY ₹ 30
LED Smart TV 43 Inch (80cm)
₹ 16,999 EMI PER DAY ₹ 55
mi
itel
Upto ₹ 5,000* Direct Discount
Upto ₹ 3,000* Cashback
ఇప్పుడు...మన విజయవాడ నగరంలో
మరో సెల్ పాయింట్ నూతన బ్రాంచ్
గవర్నర్ పేట, మ్యూజియం రోడ్, ఫోన్: 0866 6647789
నేడే గొప్ప ప్రారంభం
Upto 10%* CASH BACK
DEBIT CARD EMI
Upto ₹ 10,000 DIRECT DISTOUNT
New Arrival
moto
E22S
4GB, 64 GB
₹ 9,999
₹ 7,999
EMI PER DAY ₹ 46
vivo
V27
₹ 3000 Cash Back
EMI PER DAY ₹ 68
Y100
₹ 1500 Cash Back
EMI PER DAY ₹ 52
oppo
RENO 8T
10% Cash Back
EMI PER DAY ₹ 65
N2
New Arrival
EMI PER DAY ₹ 161
Blaze Pro
6GB, 128 GB
₹ 11,999
₹ 8,999
Upgrade 3000
EMI PER DAY ₹ 65
iPhone
14 PLUS
₹ 4000 Instant Cash Back
EMI PER DAY ₹ 114
14
₹ 4000 Instant Cash Back
EMI PER DAY ₹ 100
JODI OFFER
S115 ₹ 1,699
X415 ₹ 1,799
X513 PLUS ₹ 2,199
X708 ₹ 2,399
X778 ₹ 2,599
SAMSUNG
A 23 5G
₹ 2000 Instant Cash Back
All Leading Brands cards
EMI PER DAY ₹ 80
A 14 5G
₹ 1500 Instant Cash Back
All Leading Brands cards
EMI PER DAY ₹ 68
mi
Note 12 Pro
₹ 2000 Cash Back
SBI
EMI PER DAY ₹ 58
Note 12
₹ 1000 Cash Back
SBI
EMI PER DAY ₹ 65
11
₹ 1100 Cash Back
one card
11R
₹ 1100 Cash Back
one card
STOCK AVAILABLE
EMI PER DAY ₹ 111
ALL ORIGINAL ACCESSORIES AVAILABLE
Pouches Starts From ₹ 199
Charger, Cable Starts From ₹ 99
Airpods Starts From ₹ 999
Head Phone Starts From ₹ 299
Neckband Starts From ₹ 699
Earphone Starts From ₹ 99
COMBO OFFER
₹ 2999
₹ 7999
₹ 3999
1999
₹ 3999
₹ 1299
₹ 3499
₹ 7999
₹ 2990
Cell Point
BAJAJ FINSERV
HDFC BANK We understand your world
HDB
TVS CREDIT
Pine Labs
IDFC FIRST Bank
Paytm
HOME CREDIT
zest
*Conditions apply
విజయవాడ 0866 6629888, 6672888, 6642888 • మసీద్ స్ట్రీట్, ఏలూరు రోడ్ • విజయ టాకీస్ ఎదురుగా, ఏలూరు రోడ్ • M&M షోరూం ఎదురుగా, ఎమ్.జి రోడ్డు • కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ఎదురుగా, పటమట • పి.టి. కాలనీ ఎదురుగా, బందరు రోడ్
గుడివాడ 08674242066 • ఆంధ్రాబ్యాంక్ ఎదురుగా
హనుమాన్ జంక్షన్ 08656-242635 • పోలీస్ అవుట్ పోస్ట్ ప్రక్కన, విజయవాడ రోడ్డు
Designmouse 9885974411
మా బ్రాంచీలు: • విశాఖపట్నం • శ్రీకాకుళం • పార్వతీపురం • బొబ్బిలి • రాజాం • విజయనగరం • కాకినాడ • రాజమండ్రి • అమలాపురం • తుని • తణుకు • తాడేపల్లిగూడెం • జంగారెడ్డిగూడెం • భీమవరం • ఏలూరు • విజయవాడ • గుంటూరు • గుడివాడ • హనుమాన్‌జంక్షన్ • ఒంగోలు • నెల్లూరు


'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+10 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 360

బుధవారం 22-3-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | BANGALORE | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

సినిమా

● ఉగాది స్పెషల్

పచ్చడి తింటాం.. చేయడం రాదు

– శివాని, శివాత్మిక





ఇంకా మంచి ఆర్టిస్ట్‌గా గుర్తింపు సంపాదించుకోవాలనుకుంటున్నాను. ఇంకా మంచి నటిగా ఎదగాలని ఉంది. అలాగే మంచి డాక్టర్ అవ్వాలన్నది లక్ష్యం. ప్రస్తుతం ఫైనల్ ఇయర్ మెడిసన్ చేస్తున్నాను. ఏం చేసినా నిబద్ధతతో చేయాలనే నిర్ణయం తీసుకున్నాను. వర్కవుట్, మూటింగ్, చదువు, హార్స్ రైడింగ్.. ఏదైనా మరింత క్రమశిక్షణగా చేయాలనుకుంటున్నాను.
– శివాని

ఈ సంవత్సరం చేతినిండా పని ఉండాలని కోరుకుంటున్నాను. తెలుగు, తమిళంలో సినిమాలు చేయాలనుకుంటున్నాను. అలాగే ఇతర భాషల్లోనూ అవకాశాలు రావాలని కోరుకుంటున్నాను. కెరీర్‌పరంగా ఎదగాలన్నదే ప్రస్తుత లక్ష్యం. వీలైతే ఏదైనా స్పోర్ట్ నేర్చుకోవాలని ఉంది. ఏడాది మొత్తం చాలా ప్రశాంతంగా గడిచిపోవాలని ఉంది. ఆరోగ్యం బాగుండాలి.
– శివాత్మిక

హైదరాబాద్‌లో ఉంటే అమ్మ, నాన్న, మేమిద్దరం కలిసి పండగ జరుపుకుంటాం. అమ్మ ఉగాది పచ్చడి, గారెలు, పులిహోర, పాయసం .. ఇలా అన్నీ చేస్తుంది. ఒకవేళ మేం చెన్నైలో ఉంటే... అక్కడి మా బంధువులతో పండగ జరుపుకుంటాం. మా ఇద్దరికీ పచ్చడి తినడం తప్ప చేయడం రాదు. మా చిన్నప్పుడు ఇద్దరం ముగ్గులు వేసేవాళ్లం. పండగ అంటే మాకు ముగ్గులే ఎగ్జయిటింగ్. ఇక పండగ రోజున కొత్త బట్టలంటే అది ఆ రోజు మూడ్‌ని బట్టి ఉంటుంది. ఒక్కోసారి ఫుల్ ట్రెడిషనల్‌గా డ్రెస్ చేసుకుంటాం.. చక్కగా నగలు పెట్టుకుని గుడికి వెళతాం. చీర, లంగా, ఓణీ, చుడీదార్.. ఇలా ఏదో ఒకటి ప్రిఫర్ చేస్తాం. ఇప్పుడు చెన్నైలో ఉన్నాం. ఈసారి ఫుల్ ట్రెడిషనల్‌గా రెడీ అవుతాం. ఈ ఉగాది అందరి జీవితాల్లో ఆనందం నింపాలని కోరుకుంటూ.. అందరికీ ఉగాది శుభాకాంక్షలు.

ఇది స్టన్నింగ్ షో – రాజమౌళి

ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మించిన చిత్రం 'రౌద్రం.. రణం.. రుధిరం' (ఆర్ఆర్ఆర్). ఈ సినిమాలోని 'నాటు నాటు' పాటకు ఆస్కార్ బెస్ట్ ఒరిజినల్ సాంగ్ విభాగంలో అవార్డు దక్కిన విషయం తెలిసిందే. దీంతో 'నాటు నాటు' పాపులారిటీ మరింత పెరిగిపోయింది. తాజాగా పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అధినేత టీజీ విశ్వప్రసాద్ ఆధ్వర్యంలో నార్త్ అమెరికన్ సీమాంధ్ర అసోసియేషన్ సభ్యులు వంశీ కొప్పు రావూరి, ఉజ్వల్ కుమార్ కస్తల న్యూజెర్సీలోని ఎడిసన్ నగరంలో గల పాపియోనా పార్క్‌లో 'నాటు నాటు' పాటకు 150 టెస్లా కార్లతో లైట్ షోను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎడిసన్ నగర మేయర్ సామ్ జోషి, ఆయన బృందం సహకరించారు. ''నాటు నాటు' లైట్ షో సంతోషానిచ్చింది. ఈ షోకు అసోసియేట్ అయిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. ఇది స్టన్నింగ్ షో'' అని రాజమౌళి ట్వీట్ చేశారు.


● 'నాటు నాటు' లైట్ షో


● చిరంజీవి, కీర్తీ సురేష్, తమన్నా

భోళా శంకర్ రాక అప్పుడే...

ఉగాదికి ఫ్యాన్స్‌లో పండగ జోష్ నింపారు చిరంజీవి. ఆయన టైటిల్ రోల్‌లో నటిస్తున్న తాజా చిత్రం 'భోళా శంకర్'. తమన్నా హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో చిరంజీవి చెల్లెలి పాత్రలో కీర్తీ సురేష్ నటిస్తున్నారు. హీరో సుశాంత్ ఓ ప్రత్యేక పాత్రలో కనిపిస్తారు. క్రియేటివ్ కమర్షియల్స్‌తో కలిసి అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న చిత్రం ఇది. కాగా 'భోళా శంకర్' సినిమాను ఆగస్టు 11న రిలీజ్ చేయనున్నట్లు ఉగాది సందర్భంగా చిత్ర యూనిట్ ప్రకటించింది. అయితే ఈ సినిమాను తొలుత ఏప్రిల్ 14న విడుదల చేయాలనుకున్న విషయం గుర్తుండే ఉంటుంది. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కిషోర్ గరికిపాటి.

మనిషి ప్రాణాలతో ఆడుకోకూడదు

– కోట శ్రీనివాసరావు



''జీవితంలో డబ్బు సంపాదించటానికి చండాలపు పనులు బోలెడున్నాయి.. తప్పుడు వార్తలు రాయక్కర్లేదు. మనిషి ప్రాణాలతో ఆడుకోకూడదు. నేను క్షేమంగానే ఉన్నాను'' అని సీనియర్ నటులు కోట శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ వీడియో రిలీజ్ చేశారు. ''అందరికీ ఉగాది శుభాకాంక్షలు. కోట శ్రీనివాసరావు దుర్మరణం అని సోషల్ మీడియాలో వార్త వేశారట. అలాంటి వార్తల గురించి నాకు తెలియదు. ఉగాది పండగ ఎలా చేయాలి? ఏంటి అనుకుంటుంటే ఉదయం 7:30 గంటల నుంచి ఒక్కటే ఫోన్లు. స్వయంగా యాభై కాల్స్ మాట్లాడాను. బందోబస్తు కోసమని ఓ పదిమంది పోలీసులు నా ఇంటివద్దకు రావడం ఆశ్చర్యంగా అనిపించింది. 'మీరు పెద్దాయన, అందరికీ తెలిసినవారు కదా.. పెద్ద పెద్దవాళ్లు మిమ్మల్ని చూసేందుకు వస్తారని బందోబస్తు కోసం వచ్చాం' అన్నారు. 'ఇలాంటి తప్పుడు వార్తలు రాకుండా దయచేసి మీరే చర్యలు తీసుకోండి, అరికట్టండి.. ఎందుకంటే ఎవరైనా పెద్దవాళ్లు ఉంటే గుండె ఆగి చస్తారు' అని వాళ్లకు చెప్పి పంపించాను. ఇలాంటి తప్పుడు వార్తలు మీరు (ప్రజలు) నమ్మవద్దని మనవి చేస్తున్నాను. అలాగే తప్పుడు వార్తలు రాసే వారిపై ప్రజలు కూడా తిరగబడితే వారికి బుద్ధి వస్తుంది'' అన్నారు కోట శ్రీనివాసరావు.

ఆయన నటనలోని మ్యాజిక్‌ని చూశా!

– ప్రకాశ్‌రాజ్


● కృష్ణవంశీ, ప్రకాశ్ రాజ్, బ్రహ్మానందం

ప్రకాశ్‌రాజ్, రమ్యకృష్ణ, బ్రహ్మానందం ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'రంగ మార్తాండ'. కృష్ణవంశీ దర్శకత్వంలో కాలిపు మధు, ఎస్. వెంకట్‌రెడ్డి నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా ప్రకాశ్‌రాజ్ మాట్లాడుతూ– ''మరాఠీ 'నటసామ్రాట్' సినిమా చూశాక ఒక కళాకారుడి జీవితంలో ఉన్న బరువు నాకు అర్థం అయింది. ఇలాంటి కథను నేను చూపించాలని అనుకున్నాను. 'నటసామ్రాట్' గురించి కృష్ణవంశీకి చెప్పగానే బాగుందన్నాడు. ఎమోషన్స్ చక్కగా ప్రెజెంట్ చేయగలడని తనని ఈ సినిమా రీమేక్ 'రంగ మార్తాండ'కు దర్శకత్వం వహించమని కోరాను. బ్రహ్మానందంగారితో కలిసి వర్క్ చేయడం వల్ల ఆయన నటనలోని మ్యాజిక్‌ను చూసే అవకాశం దొరికింది'' అన్నారు. ''ప్రకాశ్‌రాజ్ ఈ సినిమా కోసం ప్రాణం పెట్టారు. ఎన్నో సినిమాల్లో నటించిన అనుభవం ఉన్న అద్భుత నటులు బ్రహ్మానందం ఈ సినిమా కోసం కొత్త ఆర్టిస్టులా నటించారు'' అన్నారు కృష్ణవంశీ. 'ఈ చిత్రం క్లయిమాక్స్‌లో ప్రకాశ్‌రాజ్ నట విశ్వరూపం చూస్తారు. ప్రతి సీన్‌ని కృష్ణవంశీ చక్కగా తెరకెక్కించారు'' అన్నారు బ్రహ్మానందం.

ఓ బేబీ జారిపోమాకే...


● కిరణ్, అతుల్య

'హే అందమెట్టి కొట్టావే.. అందనంటూ పోతావే.. గుండెలోన నీ బొమ్మే పెట్టా చూడవే' అంటూ ప్రేయసి కోసం కిరణ్ అబ్బవరం పాట పాడారు. కిరణ్ అబ్బవరం, అతుల్యా రవి జంటగా రమేష్ కడూరి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'మీటర్'. నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్‌ల సమర్పణలో చిరంజీవి, హేమలత పెదమల్లు నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం ఈ సినిమాలోని 'ఓ బేబీ జారిపోమాకే..' అంటూ సాగే లిరికల్ వీడియోను దర్శకుడు అనిల్ రావిపూడి రిలీజ్ చేశారు. సాయి కార్తీక్ స్వరపరచిన ఈ పాటకు బాలాజీ సాహిత్యం అందించగా ధనుంజయ్ పాడారు.

కథ వెనుక కథేంటి?


● సునీల్, విశ్వంత్, అలీ

విశ్వంత్ దుద్దుంపూడి హీరోగా, శ్రీజిత గౌష్, శుభశ్రీ హీరోయిన్లుగా కృష్ణ చైతన్య దర్శకత్వం వహించిన చిత్రం 'కథ వెనుక కథ'. సునీల్, అలీ కీలక పాత్రలు చేశారు. అవనీంద్ర కుమార్ నిర్మించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ''నా కెరీర్‌లో ఇదొక ప్రయోగాత్మక చిత్రం'' అన్నారు విశ్వంత్. ''భవిష్యత్తులోనూ మా బ్యానర్‌లో కొత్తవారిని ప్రోత్సహిస్తూ సినిమాలు చేస్తాం'' అన్నారు అవనీంద్ర కుమార్. ''సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రమిది'' అన్నారు కృష్ణ చైతన్య. ''నిర్మాతలు బావుంటే ఇండస్ట్రీ బావుంటుంది. ఈ చిత్రాన్ని అందరూ ఆదరించాలి'' అన్నారు అలీ. ''అవనీంద్రలాంటి నిర్మాత దొరకటం కృష్ణ చైతన్య అదృష్టం'' అన్నారు సునీల్.

ఆ భయం లేదు!


● ఫరియా

''నటిగా నా జర్నీపై నాకో స్పష్టత ఉంది. అందుకే సినిమాల ఎంపిక విషయంలో నాకు తొందరపాటు లేదు. చాన్స్‌లు వస్తాయా? రావా అనే భయం కూడా లేదు'' అన్నారు ఫరియా అబ్దుల్లా. రవితేజ హీరోగా సుధీర్ వర్మ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'రావణాసుర'. ఈ చిత్రంలో అనూ ఇమ్మాన్యుయేల్, మేఘా ఆకాష్, ఫరియా అబ్దుల్లా, దక్షా నగార్కర్, పూజితా పొన్నాడ హీరోయిన్లుగా నటించారు. రవితేజ, అభిషేక్ అగర్వాల్ నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 7న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఫరియా అబ్దుల్లా మాట్లాడుతూ – ''ఈ చిత్రంలో లాయర్ కనకమహాలక్ష్మి పాత్ర చేశాను. అయితే 'జాతి రత్నాలు'లో చేసిన కామెడీ లాయర్‌లాంటి పాత్ర కాదు. కనకమహాలక్ష్మి సీరియస్‌గా ఉంటుంది. రవితేజగారు నాకు సీనియర్ లాయర్. ప్రస్తుతం తెలుగు, హిందీ, తమిళ్‌లో ఒక్కో సినిమా చేస్తున్నాను'' అన్నారు.

ఆ నమ్మకంతో రిస్క్ చేశాను – విశ్వక్ సేన్

''నేను సినిమాలు చేస్తున్నది డబ్బులు సంపాదించుకోవడానికి కాదు.. సినిమాలు తీయడానికే. 'ధమ్కీ' సినిమాకు చాలా ఖర్చు పెట్టాను. నటనతో పాటు నిర్మాణం, దర్శకత్వం అంశాల్లోనూ చాలా నిజాయితీగా పని చేశాను. ప్రేక్షకులపై నమ్మకంతో చాలా రిస్క్‌లు తీసుకుని నేను చేసిన ఈ సినిమా నా జీవితాన్ని మార్చుతుందనే నమ్మకం ఉంది. ఈ సినిమాలోని సెకండాఫ్‌ను విశ్వక్ మాత్రమే తీయగలడు అనేలా ఉంటుంది. మా నాన్న నన్నెంతో భరించారు. ఆయనకు ఈ సినిమా డబ్బులు తీసుకుని రావాలని కోరుకుంటున్నాను'' అన్నారు నటుడు, దర్శక–నిర్మాత విశ్వక్‌సేన్. ఆయన నటించి, స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'దాస్ కా ధమ్కీ'. నివేదా పేతురాజ్ హీరోయిన్‌గా నటించారు. కరాటే రాజు (విశ్వక్‌సేన్ తండ్రి) నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా జరిగిన ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్‌లో 'కరాటే' రాజు మాట్లాడుతూ– ''బడ్జెట్ మూడింతలు పెరిగినా క్వాలిటీ విషయంలో రాజీ పడలేదు'' అన్నారు.


● 'కరాటే' రాజు, నివేద, విశ్వక్ సేన్

పబ్లిసిటీ ఇన్‌చార్జ్ ప్రమోద్ కుమార్ ఇక లేరు



తెలుగు పరిశ్రమలో ఎన్నో చిత్రాలకు పబ్లిసిటీ ఇన్‌చార్జ్‌గా చేసిన వీరమాచనేని ప్రమోద్ కుమార్ (87) మంగళవారం విజయవాడలో కన్నుమూశారు. సినీ ఇండస్ట్రీలో 38 ఏళ్ల ప్రయాణంలో 300లకు పైగా చిత్రాలకు పబ్లిసిటీ ఇన్‌చార్జ్‌గా వ్యవహరించారు ప్రమోద్ కుమార్. వాటిల్లో 31 సినిమాలు శతదినోత్సవం జరుపుకున్నాయి. అదే విధంగా కొన్ని చిత్రాల్లో అతిథి పాత్రలు చేశారు. మోహన్‌బాబు హీరోగా 'దొంగ పోలీస్', 'గరం మసాలా' సినిమాలు నిర్మించారు ప్రమోద్ కుమార్. అలాగే 'సుబ్బయ్యగారి మేడ' పేరుతో ఓ చారిత్రక నవల రచించారు. తన సినీ అనుభవాలతో 'తెర వెనుక తెలుగు సినిమా' పేరుతో రాసిన పుస్తకం నంది పురస్కారానికి ఎంపికైంది. ప్రమోద్ కుమార్‌కి కొడుకు వి. శ్రీనివాస్ రాయ్, కుమార్తెలు వై. తులసి రాణి, జి. సరోజ ఉన్నారు. 'ఓ వ్యక్తిగా, కొడుకుగా, భర్తగా, తండ్రిగా ఆయన (ప్రమోద్) తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించారు' అన్నారు వి. శ్రీనివాస్ రాయ్.

భవిత

జాబ్ పాయింట్

నల్సార్ యూనివర్సిటీ, హైదరాబాద్‌లో 58 టీచింగ్ పోస్టులు

హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా.. ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 58
» పోస్టుల వివరాలు: ప్రొఫెసర్(లా, మేనేజ్‌మెంట్)–10, అసోసియేట్ ప్రొఫెసర్(లా, మేనేజ్‌మెంట్)–12,అసిస్టెంట్‌ప్రొఫెసర్(లా, మేనేజ్‌మెంట్, పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్)–33, డైరెక్టర్(డైరెక్టరేట్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్)–01, హెడ్, కార్పొరేట్ ఇంటర్‌ఫేస్–01, ప్లేస్‌మెంట్ ఆఫీసర్–01.
» అర్హత: పోస్టును అనుసరించి పీజీ, ఎంఫిల్, పీహెచ్‌డీ, ఐజీడబ్ల్యూఏ, సీఎంఏ ఉత్తీర్ణులవ్వాలి. నెట్/స్లెట్/సెట్ అర్హతతోపాటు పని అనుభవం ఉండాలి.
» ఎంపిక విధానం: పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 31.03.2023.
» వెబ్‌సైట్: www.nalsar.ac.in

న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్, హైదరాబాద్‌లో 124 పోస్టులు

హైదరాబాద్‌లోని న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్.. వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 124
» పోస్టుల వివరాలు: చీఫ్‌ఫైర్ ఆఫీసర్/ఎ–01, టెక్నికల్ ఆఫీసర్/సి(కంప్యూటర్స్) –03, డిప్యూటీ చీఫ్ ఫైర్ ఆఫీసర్/ఎ–02, స్టేషన్ ఆఫీసర్/ఎ–07, సబ్–ఆఫీసర్ /బి–28, డ్రైవర్–కమ్–పంప్ ఆపరేటర్–కమ్ ఫైర్‌మ్యాన్/ఎ–83.
» అర్హత: పోస్టును అనుసరించి 10+2, సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులవ్వాలి. హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి.
» ఎంపిక విధానం: ఖాళీలను అనుసరించి ప్రిలిమినరీ టెస్ట్, అడ్వాన్స్‌డ్ టెస్ట్, ఫిజికల్ అసెస్‌మెంట్ టెస్ట్, కమాండ్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ, డ్రైవింగ్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 10.04.2023.
» వెబ్‌సైట్: www.nfc.gov.in

స్పా విజయవాడలో 14 నాన్ టీచింగ్ పోస్టులు

విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ డైరెక్ట్/డిప్యుటేషన్ ప్రాతిపదికన నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 14
» పోస్టుల వివరాలు: అసిస్టెంట్ రిజిస్ట్రార్(ఫైనాన్స్)–01, జూనియర్ సూపరింటెండెంట్–01, గ్రాఫిక్ డిజైనర్/సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్–01, వర్క్‌షాప్ సూపర్‌వైజర్/సూపరింటెండెంట్–01, జూనియర్ అసిస్టెంట్–09, హాస్టల్ అసిస్టెంట్/కేర్‌టేకర్–01.
» అర్హత: పోస్టును అనుసరించి 10+2, డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: దరఖాస్తును నోటిఫికేషన్ ప్రచురితమైన తేదీ నుంచి 30 రోజుల్లోగా రిజిస్ట్రార్, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, ఐటీఐ రోడ్డు, విజయవాడ చిరునామకు పంపించాలి.
» వెబ్‌సైట్: www.spav.ac.in

మెదక్ జిల్లాలో ఫార్మసిస్ట్ పోస్టులు

హైదరాబాద్‌లోని ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్, మెదక్ జిల్లాలోని ఈఎస్‌ఐ డిస్పెన్సరీలో ఒప్పంద ప్రాతిపదికన ఫార్మసిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 01
» అర్హత: డీ ఫార్మసీ ఉత్తీర్ణులై ఉండాలి.
» వయసు: 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి.
» వేతనం: నెలకు రూ.31,040 చెల్లిస్తారు.
» ఎంపిక విధానం: విద్యార్హతతో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
దరఖాస్తును పోస్టులో లేదా వ్యక్తిగతంగా జాయింట్ డైరెక్టర్(మెడికల్), ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్, హైదరాబాద్, ఈఎస్‌ఐ హాస్పిటల్, సనత్‌నగర్, నాచారం, హైదరాబాద్ చిరునామకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: 27.03.2023.
» వెబ్‌సైట్: www.medak.telangana.gov.in

నారాయణపేట జిల్లాలో 12 స్టాఫ్ నర్సు పోస్టులు

నారాయణపేట జిల్లా వైద్యారోగ్య అధికారి కార్యాలయం నేషనల్ హెల్త్ మిషన్ కింద నారాయణ పేట జిల్లాలోని పీహెచ్‌సీ/డీఎంహెచ్‌వోలలో ఒప్పంద ప్రాతిపదికన స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 12
» అర్హత: బీఎస్సీ నర్సింగ్/జీఎన్ఎం ఉత్తీర్ణులవ్వాలి.
» వయసు: 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి.
» వేతనం: నెలకు రూ.29,900 చెల్లిస్తారు.
» ఎంపిక విధానం: బీఎస్సీ నర్సింగ్/జీఎన్ఎంలో సాధించిన మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జిల్లా వైద్యారోగ్య అధికారి కార్యాలయం, సింగారం ఎక్స్–రోడ్, నారాయణపేట చిరునామకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: 29.03.2023.
» వెబ్‌సైట్: www.narayanpet.telangana.gov.in

సైన్స్‌లో బోధన,పరిశోధనలకు మార్గం.. సీఎస్ఐఆర్ నెట్

» సీఎస్ఐఆర్–యూజీసీ నెట్ డిసెంబర్ 2022/ జూన్ 2023 ప్రకటన
» ఈ స్కోర్‌తో జేఆర్ఎఫ్, లెక్చరర్‌షిప్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా అర్హత
» బ్యాచిలర్, పీజీ ఉతీర్ణులకు దరఖాస్తుకు అవకాశం


సీఎస్ఐఆర్-యూజీసీ నెట్

సైన్స్ పరిశోధనలపై యువతకు ఆసక్తి పెరుగుతోంది. బోధన రంగంలో రాణించాలని ఉవ్విళ్లూరుతున్నారు. ఒకే సమయంలో ఈ రెండు అవకాశాలను అందుకునేందుకు మార్గం.. సీఎస్ఐఆర్–యూజీసీ నెట్. ఈ పరీక్షలో విజయం సాధించిన అభ్యర్థులు సీఎస్ఐఆర్ పరిధిలోని విశ్వవిద్యాలయాల్లో, పరిశోధన కేంద్రాల్లో పీహెచ్‌డీకి దరఖాస్తు చేసుకోవచ్చు. ఆయా పరిశోధన సంస్థల్లో.. పీహెచ్‌డీ చేసేందుకు జేఆర్ఎఫ్(జూనియర్ రీసెర్చ్ ఫెలో) లభిస్తుంది. అధ్యాపక వృత్తిలో అడుగు పెట్టాలనుకునే వారికి లెక్చరర్‌షిప్ లేదా అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్ పేరుతో అర్హత లభిస్తుంది. కెమికల్ సైన్సెస్; ఎర్త్, అట్మాస్పియరిక్ సైన్సెస్, ఓషియన్ అండ్ ప్లానెటరీ సైన్సెస్; లైఫ్ సైన్సెస్; మ్యాథమెటికల్ సైన్సెస్; ఫిజికల్ సైన్సెస్.. ఇలా ఐదు విభాగాల్లో సీఎస్ఐఆర్ యూజీసీ నెట్‌ను నిర్వహిస్తున్నారు.

అర్హతలు

- కనీసం 55 శాతం మార్కులతో ఎమ్మెస్సీ, ఇంటిగ్రేటెడ్ బీఎస్–ఎంఎస్, నాలుగేళ్ల బ్యాచిలర్ ఆఫ్ సైన్స్,బీఈ/బీటెక్/బీఫార్మసీ/ఎంబీబీఎస్, బీఎస్సీ ఆనర్స్ ఉత్తీర్ణులు అర్హులు. ఆయా కోర్సుల చివరి సంవత్సరం విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. రిజర్వ్‌డ్ కేటగిరీ విద్యార్థులు సంబంధిత కోర్సులో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. బీఎస్సీ(హానర్స్) ఉత్తీర్ణులు దరఖాస్తుకు అర్హులు. కానీ ఫైనల్ విద్యార్థులు/ఫలితాల కోసం ఎదురుచూస్తున్న వారికి అర్హత లేదు.
- బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులకు లెక్చరర్‌షిప్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్‌లకు అర్హత లేదని పేర్కొన్నారు.

వయసు

జేఆర్ఎఫ్ అభ్యర్థులకు వయసు జూలై 1, 2022 నాటికి 28 ఏళ్లలోపు ఉండాలి. ఎస్సీ,ఎస్టీ,పీడబ్ల్యూడీ వర్గాల వారికి అయిదేళ్లు, ఓబీసీ వర్గాల వారికి మూడేళ్లు చొప్పున గరిష్ఠ వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది. లెక్చరర్‌షిప్,అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్ అభ్యర్థులకు ఎలాంటి వయో పరిమితి నిబంధన లేదు.

జేఆర్ఎఫ్/అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్

- సీఎస్ఐఆర్–యూజీసీ నెట్ ద్వారా పీహెచ్‌డీ చేసేందుకు అవకాశం కల్పించే జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్(జేఆర్ఎఫ్) లభిస్తుంది. అదే విధంగా కళాశాలల్లో అధ్యాపకులుగా పనిచేసేందుకు వీలుగా లెక్చరర్‌షిప్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్‌లను కేటాయిస్తారు. అభ్యర్థులు దరఖాస్తు సమయంలోనే తమ ప్రాధాన్యం జేఆర్ఎఫ్ లేదా లెక్చరర్‌షిప్ తెలియజేయాలి.
- ఫలితాల వెల్లడి సందర్భంగా జేఆర్ఎఫ్ మెరిట్ లిస్ట్, లెక్చరర్‌షిప్/అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్ మెరిట్ లిస్ట్ పేరుతో రెండు జాబితాలను విడుదల చేస్తారు. జేఆర్ఎఫ్‌కు ఎంపికైన వారికి పరిశోధన లేబొరేటరీలు, ఐఐటీలు, ఎన్ఐటీలలో పీహెచ్‌డీ చేసే అవకాశం లభిస్తుంది. లెక్చరర్‌షిప్ పొందిన అభ్యర్థులకు యూజీసీ నిబంధనల ప్రకారం–కళాశాలల్లో అధ్యాపకులుగా చేరేందుకు ఆమోదం లభిస్తుంది.
- జేఆర్ఎఫ్‌కు ఎంపికైతే తొలి రెండేళ్లు నెలకు రూ.31 వేలు చొప్పున ఫెలోషిప్; ఆ తర్వాత మూడేళ్లు నెలకు రూ.35వేల ఎస్ఆర్ఎఫ్(సీనియర్ ఫెలోషిప్) అందుతుంది.
- యూజీసీ మార్గదర్శకాల ప్రకారం–ఉన్నత విద్యా సంస్థల్లో లెక్చరర్స్, అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకాల్లో సీఎస్ఐఆర్–యూజీసీ నెట్ ఉత్తీర్ణత ప్రామాణికం.

పరీక్ష మూడు విభాగాలుగా

సీఎస్ఐఆర్–యూజీసీ నెట్ పరీక్ష.. ఐదు సబ్జెక్టుల్లో మూడు విభాగాల్లో మూడు గంటల వ్యవధిలో ఉంటుంది. మొత్తం మార్కులు రెండు వందలు. వివరాలు..

కెమికల్ సైన్సెస్

పార్ట్	సబ్జెక్ట్	ప్రశ్నలు	ప్రతి ప్రశ్నకు మార్కులు	మొత్తం మార్కులు
ఎ	జనరల్ ఆప్టిట్యూడ్	20	2	30
బి	సబ్జెక్ట్ పేపర్	40	2	70
సి	సబ్జెక్ట్ పేపర్–2	60	4	100

(పార్ట్–ఎలో 15 ప్రశ్నలు, పార్ట్–బిలో 35 ప్రశ్నలు, పార్ట్–సిలో 25 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి)

జాయింట్ సీఎస్ఐఆర్–యూజీసీ నెట్! ఇది కేంద్ర విద్యాశాఖ పరిధిలోని.. కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్(సీఎస్ఐఆర్), యూజీసీ(యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్).. సంయుక్తంగా నిర్వహించే పరీక్ష!! ఇందులో అర్హత సాధిస్తే పీహెచ్‌డీలో చేరే అవకాశంతోపాటు ఆర్థిక ప్రోత్సాహకాలు కూడా లభిస్తాయి. దీంతోపాటు బోధన రంగంలో అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయి. తాజాగా సీఎస్ఐఆర్–యూజీసీ నెట్–డిసెంబర్ 2022, జూన్–2023లకు ఉమ్మడి నోటిఫికేషన్ వెలువడింది. ఈ నేపథ్యంలో సీఎస్ఐఆర్–యూజీసీ నెట్ వివరాలు, అర్హతలు, పరీక్ష విధానం, విజయం సాధిస్తే లభించే ప్రయోజనాలు తదితర వివరాలు..

ఎర్త్, అట్మాస్ఫియరిక్, ఓసియన్ అండ్ ప్లానెటరీ సైన్సెస్

పార్ట్	సబ్జెక్ట్	ప్రశ్నలు	ప్రతి ప్రశ్నకు మార్కులు	మొత్తం మార్కులు
ఎ	జనరల్ ఆప్టిట్యూడ్	20	2	30
బి	సబ్జెక్ట్ పేపర్	50	2	70
సి	సబ్జెక్ట్ పేపర్–2	80	4	100

(పార్ట్–ఎలో 15 ప్రశ్నలు, పార్ట్–బిలో 35 ప్రశ్నలు, పార్ట్–సిలో 25 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి)

లైఫ్ సైన్సెస్

పార్ట్	సబ్జెక్ట్	ప్రశ్నలు	ప్రతి ప్రశ్నకు మార్కులు	మొత్తం మార్కులు
ఎ	జనరల్ ఆప్టిట్యూడ్	20	2	30
బి	సబ్జెక్ట్ పేపర్	50	2	70
సి	సబ్జెక్ట్ పేపర్–2	75	4	100

(పార్ట్–ఎలో 15 ప్రశ్నలు, పార్ట్–బిలో 35 ప్రశ్నలు, పార్ట్–సిలో 25 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి)

మ్యాథమెటికల్ సైన్సెస్

పార్ట్	సబ్జెక్ట్	ప్రశ్నలు	ప్రతి ప్రశ్నకు మార్కులు	మొత్తం మార్కులు
ఎ	జనరల్ ఆప్టిట్యూడ్	20	2	30
బి	సబ్జెక్ట్ పేపర్	40	3	75
సి	సబ్జెక్ట్ పేపర్–2	60	4.75	95

(పార్ట్–ఎలో 15 ప్రశ్నలు, పార్ట్–బిలో 25 ప్రశ్నలు, పార్ట్–సిలో 20 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి)

ఫిజికల్ సైన్సెస్

పార్ట్	సబ్జెక్ట్	ప్రశ్నలు	ప్రతి ప్రశ్నకు మార్కులు	మొత్తం మార్కులు
ఎ	జనరల్ ఆప్టిట్యూడ్	20	2	30
బి	సబ్జెక్ట్ పేపర్	25	3.5	70
సి	సబ్జెక్ట్ పేపర్–2	30	5	100

(పార్ట్–ఎలో 15 ప్రశ్నలు, పార్ట్–బిలో 20 ప్రశ్నలు, పార్ట్–సిలో 20 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి)

విజయం సాధించాలంటే

పార్ట్–ఎ

ఇది అయిదు కేటగిరీల అభ్యర్థులకు ఉమ్మడి విభాగం. ఇందులో జనరల్ ఆప్టిట్యూడ్‌ను పరీక్షించే విధంగా ప్రశ్నలు ఉంటాయి. తార్కిక విశ్లేషణ, న్యూమరికల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ ఎబిలిటీ, పజిల్స్ తదితర అంశాలపై దృష్టి పెట్టాలి. అదే విధంగా బేసిక్ జనరల్ నాలెడ్జ్/కరెంట్ అఫైర్స్ అంశాలపైనా అవగాహన ఏర్పరచుకోవాలి.

పార్ట్–బి

ఈ విభాగంలో అభ్యర్థులు ఎంపిక చేసుకున్న సబ్జెక్ట్ నుంచి ప్రశ్నలు ఉంటాయి. ఇవి పూర్తిగా మల్టిపుల్ ఛాయిస్ విధానంలో ఉంటాయి. అభ్యర్థులు తమ అకడమిక్ పుస్తకాలను పూర్తిగా అధ్యయనం చేయడం, అన్వయ దృక్పథంతో ప్రాక్టీస్ చేయడం ద్వారా ఇందులో మార్కులు పొందొచ్చు.

పార్ట్–సి

ఈ విభాగంలోనూ అభ్యర్థులు ఎంపిక చేసుకున్న సబ్జెక్ట్ సంబంధిత ప్రశ్నలే ఉంటాయి. వీటి క్లిష్టత స్థాయి అధికంగా ఉంటుంది. అభ్యర్థుల్లోని శాస్త్రీయ భావనలపై అవగాహన, శాస్త్రీయ భావనలను అన్వయించే నైపుణ్యాలను పరీక్షిస్తారు. పూర్తిగా విశ్లేషణాత్మక దృక్పథంతో సమాధానాలను గుర్తించాల్సిన విధంగా ప్రశ్నలు ఉంటాయి.

పీజీ స్థాయి అవగాహన

సీఎస్ఐఆర్–యూజీసీ అభ్యర్థులు తాము ఎంపిక చేసుకున్న సబ్జెక్టులలో పీజీ స్థాయిలో పూర్తి అవగాహన పొందాలి. ముఖ్యంగా రీసెర్చ్ ఓరియెంటేషన్‌తో ప్రిపరేషన్ సాగించాలి. పార్ట్–సిలో రాణించేందుకు ఈ విధానం దోహదపడుతుంది. పార్ట్–ఎలో అడిగే జనరల్ ఆప్టిట్యూడ్‌కు సంబంధించి కూడా శాస్త్ర, సాంకేతిక రంగాల్లో తాజా పరిశోధనలు, వాటి ఫలితాలు, సంబంధిత శాస్త్రవేత్తల గురించి తెలుసుకోవాలి.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: ఏప్రిల్ 10, 2023
- ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ అవకాశం: ఏప్రిల్ 12–18, 2023
- సీఎస్ఐఆర్–యూజీసీ నెట్ తేదీలు: జూన్ 6, 7, 8, 2023
- వెబ్‌సైట్: https://csirnet.nta.nic.in


'ఆర్థిక అసమానతలు తొలగకపోతే
రాజకీయ స్వాతంత్ర్యానికి అర్థం లేదు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+10 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 360

బుధవారం 22-3-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | BANGALORE | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL





శోభాయమానం

ఉగాది మన తొలిపండుగ. ఈసారి ఉగాదికి పేరు శోభకృత్. శోభ అంటే కాంతి. మన జీవితాలకు అవసరమైన... భాగ్యాల, సౌభాగ్యాల కాంతిని ఈ ఉగాది ఇస్తుందని ఆశిద్దాం. ఈసారి వసంత విషువత్ జరిగిన మరుసటి రోజున ఉగాది వచ్చింది. అంటే వసంత విషువత్ మొదలు అయిన మరుసటి రోజున చైత్రమాసం మొదలు అయింది. ఇది ఒక విశేషం. ఇలా జరగడం అరుదు. ఈ అరుదైన సంఘటన మనకు, దేశానికి, ప్రపంచానికి అత్యంత మేలు చెయ్యాలని అపేక్షిద్దాం.

ఉగాదితో చాంద్ర–సౌర (లూని సోలర్) సంవత్సరం మొదలు అవుతుంది. పౌర్ణమి చంద్రుడు చిత్త లేదా చిత్ర నక్షత్రంతో ఉండడం చైత్రమాసం. చైత్రమాసం తొలిరోజు అంటే చైత్రశుక్ల పాడ్యమి రోజు ఉగాది అవుతుంది. చంద్రుడు ఒక నక్షత్రంతో మొదలుపెట్టి, భూమి చుట్టూ తిరిగి మళ్లీ ఆ నక్షత్రం దగ్గరకు రావడానికి పట్టే కాలం నాక్షత్రమాసం అవుతుంది. సూర్యుడు భూమధ్యరేఖను ఉత్తరంవైపుగా దాటడం వసంత విషువత్ అవుతుంది. వసంత విషువత్ మార్చ్ 21న జరుగుతుంది. ఆ రోజు పగలు, రాత్రి సమానంగా ఉంటాయి. సూర్య, చంద్ర గమనాలు ప్రాతిపదిక కాబట్టి చాంద్ర–సౌర సంవత్సరం అవుతుంది.

వ్యావహారిక శకానికి పూర్వం తొలిదశలో సప్త ఋషులు నాక్షత్ర సంవత్సరాన్ని, చాంద్ర–సౌర సంవత్సరాన్ని కలిపి పంచాంగాన్ని అమలులోకి తెచ్చారు. మూడు, ఐదు సంవత్సరాలలో వచ్చే అధికమాసాలను కలుపుకుని ఐదు సంవత్సరాలతో ఒక యుగం అని పంచాంగం పరంగా అమలు చేశారు. అప్పట్లో ఆ యుగం ఆరంభం శరత్ విషువత్, శరత్ ఋతువులో ఉండేది. ఈ ఐదు సంవత్సరాల యుగంలో మొదటి సంవత్సరంలో మొదటి రోజు యుగాది అని అయింది; అదే ఉగాది అయింది. ఈ యుగం జ్యోతిష శాస్త్రానికి అనుగుణ్యంగానూ రూపొందింది. 'జ్యోతి' అంటే నక్షత్రం అనీ 'షం' అంటే సంబంధించిన అనీ అర్థాలు. జ్యోతిషం అంటే నక్షత్రానికి సంబంధించినది అని అర్థం.

> మంచికి తొలి అడుగుగా. ఒక పండుగగా. తొలి పండుగగా ఉగాది మనకు అందివచ్చింది. ఇతర పండుగలా కాకుండా ఉగాది కాలానికి, ప్రకృతికి సంబంధించిన పండుగ. మనిషి కాలానికి, ప్రకృతికి అనుసంధానం అవ్వాలని తెలియజెప్పే ఒక విశిష్టమైన పండుగ ఉగాది.

నాక్షత్ర చాంద్ర– సౌర గమనాల ప్రాతిపదికన మన పంచాంగం నిర్మితమైంది. పంచాంగం ప్రకారం మనకు ఉగాది నిర్ణీతమైంది. సప్త ఋషుల తరువాత విశ్వామిత్ర మహర్షి పంచాంగంలోనూ, కాలగణనంలోనూ కొన్ని ప్రతిపాదనలను, మార్పులను తీసుకువచ్చాడు. ఆ తరువాత కాలక్రమంలో జరుగుతూ వచ్చిన ఖగోళమార్పులకు తగ్గట్లు గర్గ మహర్షి సంవత్సరాదిని వసంత విషువత్ కు మార్చాడు. ఆర్యభట్టు, వరాహమిహిరుడు దాన్నే కొనసాగించారు. అదే ఇప్పటికీ వస్తోంది. వసంత విషువత్‌తో వసంతం మొదలు అవుతుంది; సాంప్రదాయిక సంవత్సరాన్ని లేదా ఆచార వ్యవహారాల కోసం సంవత్సరాన్ని చైత్రమాసంతో మొదలుపెట్టారు.

వసంతాన్ని కుసుమాకరం అనీ, కుసుమాగమం అనీ అంటారు. కుసుమానికి పుష్పం, పండు, ఫలం అని అర్థాలు ఉన్నాయి. ఈ మూడూ మనకు ఎంతో అవసరం అయినవి. తప్పకుండా మనం వీటిని పొందాలి. మన జీవితాలు కూడా నిండుగా పుష్పించాలి, పండాలి, ఫలవంతం అవ్వాలి. వసంతాన్ని ప్రకృతి ఇస్తున్న సందేశంగా మనం గ్రహించాలి. వసంతం ఒక సందేశం దాన్ని మనం అందుకోవాలి, అందుకుందాం.





> వసంత ఋతువు రావడాన్ని వసంతావతారం అని కూడా అంటారు. వసంతావతారం సంవత్సరానికి ఉన్న అవతారాలలో గొప్పది. ఆపై శోభాయామానమైంది. సంవత్సరానికి శోభ వసంతం. వసంతం మనకు వచ్చే ఋతువుల్లో ప్రధానమైంది లేదా కేంద్రభాగం. చెట్లకు కొత్త చివుళ్లు, కోయిలల గానాలు, పచ్చదనం, పువ్వుల కళకళలు. వీటిని వసంతం తెస్తుంది, ఇస్తుంది. వసంతంలో ఎక్కువ వేడి, చలి ఉండవు. వాతావరణం ఉల్లాసకరంగా ఉంటుంది. వసంతం శ్రేష్ఠమైంది కాబట్టే 'అహమృతూనాం కుసుమాకరః' అంటూ కృష్ణుడు భగవద్గీతలో తాను ఋతువుల్లో వసంతాన్ని అని చెప్పాడు.

> సంవత్సరంలో ఉండే మంచితనం వసంతం. వసంతం ప్రకృతి నుంచి మనకు అందివచ్చే మంచితనం. '... సంతో వసంతవల్లోకహితం చరంతః ...' అని వివేకచూడామణిలో ఆదిశంకరాచార్య అన్నారు. అంటే మంచివాళ్లు వసంతంలాగా లోకహితాన్ని ఆచరిస్తారు అని అర్థం. వసంతం వంటి హితం, హితం వంటి వసంతం మనకు, సంఘానికి, దేశానికి, ప్రపంచానికి ఎంతో అవసరం.

ఆరు ఋతువులకు ఆదిగా వచ్చేది ఈ పండుగ. సంవత్సరంలోని ఆరు ఋతువులకు ప్రతీకలుగా తీపి, కారం, చేదు, వగరు, ఉప్పు, పులుపుల్ని తీసుకుని ఆ రుచుల కోసం వేపపువ్వు, బెల్లం, మిరియాలపొడి, చింతపండు, ఉప్పు, మామిడి ముక్కల్ని కలిపి ఉగాది పచ్చడిని మనం తీసుకుంటున్నాం. నింబకుసుమ భక్షణం అని పేరు. ఇది ఉగాది పండుగలో ముఖ్యాంశం. మరో ముఖ్యాంశం పంచాంగ శ్రవణం. ఆదిలోనే ఎవరి రాశి ప్రకారం వారికి సంవత్సరంలో జరగడానికి అవకాశం ఉన్న మేలు, కీడులను వ్యక్తులకు సూచనప్రాయంగా పంచాంగం చెబుతుంది. పంచాంగ శ్రవణానికి ముందుగా మనం అభ్యంగన స్నానం చేసి, మామిడి తోరణాలతో, పుష్పాలతో ఇళ్లను అలంకరించుకుని దైవపూజ చెయ్యాలి; చేద్దాం.

ప్రకృతి ఇచ్చిన సందేశాలుగా అందివచ్చిన ఉగాదిని, వసంతాన్ని ఆకళింపు చేసుకుని, ఆదర్శంగా తీసుకుని, మనం మనకు, ఇతరులకు ఈ ఏడాదిలోని అన్ని ఋతువుల్లోనూ హితకరం అవ్వాలి, అవుదాం.

– రోచిష్మాన్



పండగ ఇలా...


సూర్యోదయానికంటే ముందే నిద్రలేచి గుమ్మానికి మామిడాకుల తోరణాలు కట్టాలి. తలకు నువ్వుల నూనె పట్టించి నలుగు పెట్టుకుని స్నానం చేసి, కొత్త బట్టలు లేదా శుభ్రమైన ఉతికిన దుస్తులు ధరించాలి. తెలుపు రంగు లేదా ఈ సంవత్సరం ఉగాది బుధవారం వచ్చింది కాబట్టి వీలయితే బుధుడికి ఇష్టమైన ఆకుపచ్చ రంగు వస్త్రాలు ధరించడం మంచిది. పాలు పొంగించి, పిండి వంటలు సిద్ధం చేసి. ఇష్టదైవాన్ని పూజించాలి. తయారు చేసుకున్న వంటకాలను నైవేద్యంగా సమర్పించాలి. అల్పాహారం కంటే ముందుగా తీపి, పులుపు, కారం, ఉప్పు, వగరు, చేదు అనే ఆరు రుచులు కలసిన ఉగాది పచ్చడి తినాలి. సంవత్సరం పొడుగునా ఎదురయ్యే మంచి చెడులను, కష్ట సుఖాలను సంయమనంతో స్వీకరించాలన్న సందేశాన్ని ఉగాది పచ్చడి ఇస్తుంది.



ఉగాది రోజున పంచాంగ శ్రవణం వింటే మంచిదని పెద్దలు చెబుతారు. ఆదాయ వ్యయాలు, రాజ పూజ్య అవమానాలు, కందాయ ఫలాలు, రాశి ఫలాలు తెలియజెప్పే పంచాంగం వినటం ఆనవాయితీ. పల్లెల్లో రైతులు ఉగాది రోజున అక్కడి దేవాలయం వద్ద చేరి, పురోహితుడిని రప్పించి, తమ వ్యవసాయానికి ఏ కార్తెలో వర్షం పడుతుంది? గ్రహణాలు ఏమైనా ఉన్నాయా? ఏరువాక ఎప్పుడు సాగాలి? వంటివన్నీ అడిగి తెలుసుకుంటారు. ఉగాది రోజున కవి సమ్మేళనాలు జరగడం పరిపాటి.

ప్రాముఖ్యత

మత్స్యావతారం ధరించిన విష్ణువు సోమకుని సంహరించి వేదాలను తిరిగి బ్రహ్మకు అప్పగించిన సందర్భంగా 'ఉగాది' ఆచరణలోకి వచ్చిందని పురాణప్రతీతి. బ్రహ్మదేవుడు ఈ జగత్తును చైత్ర మాస శుక్లపక్ష ప్రథమ దినాన సూర్యోదయ వేళ సమగ్రంగా సృష్టించాడంటారు. అంటే కాలగణనాన్ని గ్రహ, నక్షత్ర, ఋతు, మాస, వర్ష, వర్షాధికులను బ్రహ్మదేవుడు ఈనాడు ప్రవర్తింపచేసాడన్నది పెద్దల భావన. అంతేకాదు, వసంత ఋతువు కూడా అప్పుడే మొదలవుతుంది. అందుకే కొత్త జీవితానికి గుర్తుగా ఉగాది పండుగను జరుపుకుంటారు.





ఇతర విశేషాలు

- ఈ రోజు కొత్తగా పనులు మొదలు పెట్టడం, కొత్తగా కార్యక్రమాలు ప్రారంభించడం మంచిది
- కృతయుగంలో కార్తీకశుద్ధ అష్టమి రోజున ఉగాది జరుపుకునేవారు.
- త్రేతాయుగంలో వైశాఖ శుద్ధ తదియ రోజున ఉగాది జరుపుకునేవారు.
- ద్వాపరయుగంలో మాఘ శుద్ధ అమావాస్య రోజున ఉగాది జరుపుకునేవారు.
- శ్రీరాముడు, విక్రమాదిత్యుడు, శాలివాహనుడు పట్టాభిషిక్తులయినది చైత్ర శుద్ధ పాడ్యమి రోజుననే.
- వరాహమిహిరుడు పంచాంగాన్ని జాతికి అంకితం చేసింది చైత్ర శుద్ధ పాడ్యమి రోజుననే.



ఇంటికి ఉగాది కళ..



ఏడాది మొత్తం ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని గుర్తు చేసే పండగ ఉగాది. కుటుంబసభ్యుల కలయికలో ఆనందం, షడ్రుచుల పచ్చడితో ఆరోగ్యం తెలియజేసే ఈ పండగ వసంతరుతువు ప్రారంభానికి సూచికగానూ జరుపుకుంటారు. శోభకృత్‌నామ సంవత్సరాన్ని శోభాయమానంగా అలంకరించడానికి..



● స్వాగతించే రంగోలి

అందమైన ముగ్గుల అలంకరణకు ఎంత శ్రద్ధ పెడతామో మనందరికీ తెలిసిందే. మరింత అందంగా తక్కువ సమయంలో అందరినీ ఆకట్టుకునే రంగోలిని తీర్చలేమనుకునేవారు రెడీమేడ్ డిజైనర్ రంగోలీలను కూడా ఎంపిక చేసుకోవచ్చు.

● డోర్ హ్యాంగింగ్స్

మెయిన్ డోర్ ఇంటికి శక్తిని, శుభాన్ని ఆహ్వానిస్తుంది. మనవైన హస్తకళలు లేదా ఛాయా చిత్రాలని ఉపయోగించవచ్చు. సంప్రదాయ వేడుక కాబట్టి ఇత్తడి డోర్‌బెల్స్‌ను అలంకరిస్తే ప్రత్యేక కళతో పాటు ఆ మువ్వల సవ్వడి ఆనందాన్ని ఇస్తుంది.

● మామిడి, వేప

శుభసూచికగా గుమ్మానికి మామిడి, వేప ఆకులతో తోరణం కడతారు. అలాగే, గుమ్మానికి ఒక వైపు చిన్న అరటి చెట్టును జోడించడం ఈ రోజును మరింత శుభ ప్రదంగా మార్చేస్తుంది. లేదంటే ఆర్టిఫిషియల్ అరటి చెట్టును కూడా వాడచ్చు.

● లైటింగ్

పండగ అలంకరణలో ప్రత్యేక స్థానాలు వంటగది, పూజ గది. ఈ రెండు ప్లేసుల్లో లైటింగ్ డల్‌గా ఉండే అవకాశాలు ఉంటాయి. అందుకని, ఈ ప్రత్యేకమైన రోజున లైటింగ్ విషయంలో శ్రద్ధ తీసుకుంటే కాంతిమంతంగా ఉంటాయి.

● హ్యాంగింగ్స్

వాల్ పేపర్లు, సంప్రదాయ వాల్ హ్యాంగింగ్స్, పూల దండలను వేలాడదీయడం వంటి మరిన్ని అందుబాటులో ఉండే అలంకరణ వస్తువులను ఎంచుకోవచ్చు. సువాసన గల ఇండోర్ ప్లాంట్ డెకొరేషన్ కూడా పండగ కళను పెంచుతుంది.

కొంచెం తీపి... కొంచెం చేదు



పచ్చి మామిడికాయ – ఒకటి (మీడియం సైజు); **వేప పువ్వు** – టేబుల్ స్పూన్ (తొడిమలు ఒలిచినది); కొత్త **చింతపండు** – నిమ్మకాయంత (రసం చిక్కగా తీసుకోవాలి); **బెల్లం తురుము** – 2 టేబుల్ స్పూన్‌లు; **ఉప్పు** – పావు టీ స్పూన్; **మిరియాలు లేదా మిరియాల పొడి** – అర టీ స్పూన్.

తయారీ: పచ్చి మామిడి కాయను శుభ్రంగా కడిగి చెక్కు తీయకుండా సన్నగా ముక్కలు తరగాలి. ఇందులో వేప పువ్వు, చింతపండు రసం, బెల్లం తురుము, ఉప్పు, పచ్చిమిర్చి వేసి కలపాలి. షడ్రుచుల ఉగాది పచ్చడి రెడీ. రుచి కోసం టేబుల్ స్పూన్ కొబ్బరి కోరు, ఒక అరటి పండు గుజ్జు కూడా కలుపుకోవచ్చు. ఇది ఆంధ్రప్రదేశ్ ఉగాది పచ్చడి. స్పూన్‌తో అరచేతిలో వేసుకుని తినేటట్లు చిక్కగా ఉంటుంది. తెలంగాణలో ఇదే మోతాదులో తీసుకున్న దినుసులను ఒక పెద్ద పాత్రలో వేసి ముప్పావు వంతు నీటిని పోసి కలపాలి. గ్లాసులో పోసి తాగేటట్లు జారుడుగా ఉంటుంది.

నేడు వరల్డ్ వాటర్ డే

నీటి పాఠాలు

గాలి తర్వాత ప్రాణాధారం నీటిచుక్క. గొంతెండిపోతే నోట్లకట్టలు దాహం తీర్చవు. నీటి చుక్క కోసం... అర్రులు చాచాల్సి వస్తుంది. ధారపోయడానికి చేతిలో డబ్బున్నా సరే... నేలతల్లి కడుపులో చుక్క మంచి నీరుండదు. జాగ్రత్త పడదాం... భవిష్యత్తును కాపాడుకుందామని... దేశాన్ని చైతన్యవంతం చేస్తున్నారు వసంతలక్ష్మి.

"2040 నాటికి నీటి కష్టాలు ఎలా ఉంటాయో తెలుసా? భావి తరాల కోసం ఆస్తులు కూడబెడుతున్నాం, బాగా చదివి పెద్ద ఉద్యోగం చేసి బాగా డబ్బు సంపాదించాలని వాళ్లకు నేర్పిస్తున్నాం. చేతి నిండా డబ్బు ఉండి గొంతు తడుపుకోవడానికి నీటి చుక్క లేని జీవితాలను పిల్లలకు అందిస్తున్నాం. ఇప్పుడు కూడా మేల్కొనకపోతే రాబోయే తరాలు కాదు కదా, మనతరమే నీటి ఇక్కట్లను ఎదుర్కోవాల్సి వస్తుంది. డబ్బు సంపాదనను వ్యసనంలాగ పిల్లల బుర్రల్లోకి ఎక్కించేస్తున్నాం, నీటి వృథాను అరికడదామని మాట మాత్రంగానైనా చెప్తున్నామా?'' ఇలా సాగుతుంది వసంతలక్ష్మి ప్రసంగం. నీటి సంరక్షణ గురించి పాఠం చెప్తోందామె. నేడు వరల్డ్ వాటర్ డే సందర్భంగా తన నీటి ఉద్యమం వివరాలను 'సాక్షి'తో పంచుకున్నారు.



ఉత్తరాఖండ్‌లో నీటి సంరక్షణ పాఠాలు చెప్తున్న వసంతలక్ష్మి

జలమే ధనం

''వర్షాలొస్తే రోడ్లు జలమయం, ఎండకాలం మొదలయ్యే నెల నుంచే రోడ్ల మీద నీటి ట్యాంకుల స్వైరవిహారం. ఆ ట్యాంకర్లను చూస్తే డేంజర్ బెల్స్ మోగించుకుంటూ వెళ్తున్నట్లే అనిపించేది. మనిషి భవిష్యత్తు ఎంతటి ప్రమాదంలో పడుతుందోననే దిశలో నా ఆలోచన సాగడంతో అధ్యయనం మొదలుపెట్టాను. గణాంకాలు భయపెట్టాయి. ఇదే ధోరణిలో నీటిని వృథా చేస్తుంటే మన తరమే నీటికోసం అల్లాడే రోజు వస్తుంది. అందుకే జలాన్ని మించిన ధనం మరొకటి లేదని చైతన్యవంతం చేసే పనిలో ఉన్నాను. కశ్మీర్‌లో మొదలు పెట్టిన 'జల్ ధన్ యాత్ర' ఉత్తరాఖండ్, హరియాణా మీదుగా ఢిల్లీకి చేరింది. వరల్డ్ వాటర్ డే (మార్చి 22) పురస్కరించుకుని గుర్‌గావ్‌లో 20వ తేదీన అవగాహన సదస్సు నిర్వహించాం.

జలగండం!

నీటి గురించిన వివరాల్లోకి వెళ్లేకొద్దీ వెన్నులో నుంచి వణుకు పుడుతుంది. మనదేశంలో మనిషి సగటున ఒక రోజుకి వృథా చేసే నీరు పదకొండు గ్యాలన్‌లుగా ఉంటోంది. జలపొరల్ని చీల్చుకుని మరీ తోడేస్తున్నాం. మహారాష్ట్రలో భూగర్భజలాలు మైనస్‌లోకి వెళ్లిపోయాయి. మూడు వందల అడుగుల వరకు నీటి చుక్క ఆనవాలుకు కూడా అందడం లేదు. తమిళనాడులో ఒకప్పుడు 57 జీవనదులు ప్రవహించేవి. మనిషి భూమి ఆక్రమణ ఆకలికి నదులు కూడా బలయిపోయాయి. ఇప్పుడు ఐదారుకి మించి జీవనదుల్లేవక్కడ. మనకు నీటిని పొదుపు చేయడం, వృథాను అరికట్టడంలో విచక్షణ లేదు. అలాగే పరిశ్రమల వ్యర్థాల కారణంగా నీటి వనరులు కలుషితం కావడం గురించి ఏ మాత్రం ముందుచూపు లేదు. ప్రజల్లో చైతన్యం ఉంటే పరిశ్రమలు నిర్లక్ష్యంగా వ్యవహరించడానికి వెనుకాడతామయనేది నా అభిప్రాయం. పరిశ్రమల నిర్వాహకులు తాము వాడిన నీటిని శుద్ధి చేసి భూమిలోకి వదలాల్సి ఉండగా, ఆ నియమాలేవీ పాటించకుండా నేలకు రంధ్రాలు చేసి వదిలేస్తున్నారు. దాంతో భూగర్భజలాలు కలుషితమైపోతున్నాయి. పంజాబ్‌లో ఒక రైలును స్థానికులు క్యాన్సర్ రైలని పిలుస్తారు. ఆ రైలులో ప్రయాణించే వాళ్లలో... కలుషిత నీటిని తాగడం వల్ల క్యాన్సర్ బారిన పడిన వాళ్లు ఢిల్లీకి వైద్యానికి వెళ్లే వాళ్లే ఎక్కువని చెబుతారు. మనదేశంలో నీటి కాలుష్యానికి ఇంతకంటే ఉదాహరణ ఇంకేం కావాలి. 'ఉదాసీనంగా ఉంటే రాబోయే తరాలు మనల్ని క్షమించవు. మేల్కొండి' అని ఎలుగెత్తి చెబుతున్నాను'' అని చెప్పారు సామాజిక కార్యకర్త చీరాల వసంతలక్ష్మి. వాటర్ షెడ్, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ వంటి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్న వసంతలక్ష్మి గత ఏడాది 'వాటర్ వారియర్' పురస్కారాన్ని అందుకున్నారు. ఇప్పుడు 'జల్ ధన్ యాత్ర' ద్వారా దేశవ్యాప్తంగా పర్యటించి గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో విద్యార్థులు, మహిళలు, రైతులకు గణాంకాలతో సహా నీటి గురించి వివరిస్తున్నారు.

– వాకా మంజులారెడ్డి

సామాజిక 'స్నేహిత'

చీరాల వసంతలక్ష్మి పుట్టింది ఆంధ్రప్రదేశ్, నెల్లూరు నగరంలో. 'అమ్మతనానికి అవమానం జరగకూడదు. బిడ్డలందరూ సమానంగా పుడతారు. ఏ బిడ్డా అన్‌వాంటెడ్ కాదు... కాకూడదు. ఆడపిల్లను వద్దంటే నాకివ్వండి...బతికిస్తాను'... ఈ 'అమ్మ ఒడి'లో ప్రేమ ఉంది. 'ఇదిగో ఊయల'... అని పాతికేళ్ల కిందట నగరంలో 27 ఊయలలు పెట్టారు. 87 మంది పిల్లలకు అమ్మ అయ్యారామె. ఆ ఊయలను ప్రభుత్వం చేపట్టింది. తమిళనాడులో జయలలిత ప్రభుత్వమూ అందుకుంది.



స్పెషల్ కిడ్‌కి మాటలు నేర్పిస్తూ...

- సమాజంలో తల్లులందరూ తమ పిల్లలను అనారోగ్యాల నుంచి సంరక్షించుకోగలిగిన అవగాహన కలిగి ఉండాలనే ఆశయంతో మొదలైన నా సేవలో ఏదీ ముందస్తు ప్రణాళిక ప్రకారం జరగలేదు. ఒక్కొక్కటిగా వచ్చి చేరుతూ నా బాధ్యతలను పెంచుతూ వచ్చాయి. జపనీస్ ఎన్‌సెఫలైటిస్ వచ్చినప్పుడు పిల్లలకు వ్యాక్సిన్ ఇప్పించాలంటే రిజిస్టర్ అయిన సంస్థ ఉండాలన్నారు. అలా నా సేవ 1998లో వ్యవస్థీకృతమైంది.
- స్పెషల్ కిడ్స్ 150 మందిని దత్తత తీసుకున్నాను. వాళ్లతో డీల్ చేయడం కోసం నేను స్పెషల్ బీఈడీ చేసి వాళ్లకు ఎడ్యుకేటర్‌గా మారాను. అలాగే మహిళల సమస్యల గురించి పోరాడే క్రమంలో చట్టాలు తెలుసుకోవడానికి బీఎల్ చదివి... సేవలను ఎనిమిది రాష్ట్రాలకు విస్తరించాను.
- కరాటేలో బ్లాక్‌బెల్ట్, రైఫిల్ షూటింగ్‌లో గోల్డ్ మెడలిస్ట్‌ని కావడంతో బాలికలు, మహిళల మీద జరుగుతున్న అత్యాచారాల నుంచి తమను తాము రక్షించుకోవడానికి కాలేజ్ విద్యార్థినులు, స్వయం సహాయక బృందాల మహిళలు మొత్తం పదిహేను వేల మందికి శిక్షణ ఇవ్వడంతోపాటు ప్రమాదాల బారిన పడకుండా కొన్ని మెళకువలు నేర్పించాను. అలాగే చనిపోవాలనుకున్న వాళ్లకు 'స్నేహిత'నయ్యాను. సర్వీస్ అనే ఉద్దేశంతో మొదలు పెట్టలేదు. కానీ ఎక్కడ అవసరం ఉందనిపిస్తే అక్కడ వాలిపోతూ నా ప్రయాణం నీటి సంరక్షణ దిశగా సాగుతోంది.

– సీహెచ్. వసంతలక్ష్మి, అడ్వొకేట్, వసంతలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ అండ్ రీసెర్చ్ సెంటర్


'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+10 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 360

బుధవారం 22-3-2023



వన్డే విజేత ఎవరో?

నేడు భారత్, ఆస్ట్రేలియా చివరి మ్యాచ్.. గెలిచిన జట్టుకు 'సిరీస్' - 6లో



మళ్లీ లాభాల్లోకి

రెండు రోజుల నష్టాలకు బ్రేక్.. 58 వేల పైకి సెన్సెక్స్ - 6లో

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



పతకానికి విజయం దూరంలో

ప్రపంచ మహిళల బాక్సింగ్ టోర్నీలో నిఖత్ జరీన్ క్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. గెలిస్తే కాంస్య పతకం ఖాయమవుతుంది.

వివరాలు 6లో ▸



అక్టోబర్ 5 నుంచి వన్డే వరల్డ్‌కప్!

భారత్ ఆతిథ్యం ఇవ్వనున్న వన్డే వరల్డ్‌కప్ తేదీలు దాదాపుగా ఖరారయ్యాయి. అక్టోబర్ 5 నుంచి నిర్వహించనున్నట్లు సమాచారం.

వివరాలు 6లో ▸



ఐటీకి బ్యాంకింగ్ షాక్!

అమెరికాలో పలు బ్యాంకులు మూత పడుతున్నాయి. దీంతో దేశీ ఐటీ రంగానికి సమస్యలు ఎదురవ్వచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

వివరాలు 6లో ▸



ఏపీలో భారీ పెట్టుబడులు

ఏపీలో యాంప్లస్ సోలార్ రూ.1,500 కోట్లు, ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థ ఎలిస్టా ఇండియా రూ.250 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నాయి.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

మహా సరస్వతి అలంకారంలో భ్రామరి



శ్రీశైలంలో ఉగాది మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. మంగళవారం శ్రీ భ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్లకు విశేష పూజలు నిర్వహించారు. శ్రీభ్రమరాంబాదేవి మహాసరస్వతి అలంకారంలో కటాక్షించారు.

వివరాలు 2 ▸

గ్రంథాలయ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు



ఏపీ గ్రంథాలయ వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయని.. గ్రంథాలయాలను పాఠకులకు చేరువ చేస్తున్నామని ఏపీ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు చెప్పారు. రాష్ట్రంలోని 10,960 గ్రంథాలయాలను డిజిటలైజ్ చేశామని తెలిపారు. విజయవాడలో మల్లెతీగ ఉగాది పురస్కారాలను ప్రదానం చేశారు.

వివరాలు 2 ▸

ఏయూతో స్వీడన్ వర్సిటీ ఎంవోయూ



ఆంధ్ర విశ్వవిద్యాలయంతో స్వీడన్‌కు చెందిన బ్లెకింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. 2 వర్సిటీలు కలిసి నాలుగేళ్ల వ్యవధితో డబుల్ డిగ్రీ కోర్సును నిర్వహిస్తాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మెషిన్ లెర్నింగ్ కోర్సును అందించే దిశగా ఈ ఎంవోయూ చేసుకున్నారు.

వివరాలు 2 ▸

కేజీ లిక్విడ్ గంజాయి స్వాధీనం



గంజాయిని తరలిస్తున్న ముగ్గురిని ఏలూరు జిల్లా నూజివీడు రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి ఒక కేజీ లిక్విడ్ గంజాయిని, మరో నాలుగు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

వివరాలు 2 ▸



అలాగే ఉగాది పచ్చడి కూడా తినిపించండి సార్! పులుపు, చేదు, తీపి, వగరు రుచులతో ఎంజాయ్ చేస్తారు!

పారిశ్రామికాభివృద్ధికి నవరత్నాలు

తొమ్మిది మిషన్స్‌తో 2023-27 పారిశ్రామిక పాలసీ

- విదేశీ పెట్టుబడుల నుంచి ఎంఎస్ఎంఈల వరకు ఒకే విధమైన ప్రోత్సాహం
- పీపీపీ విధానంలో పారిశ్రామిక, లాజిస్టిక్ పార్కుల ఏర్పాటు
- వాక్ టు వర్క్ తరహాలో పారిశ్రామిక టౌన్‌షిప్స్ అభివృద్ధి
- దరఖాస్తు చేసుకున్న 21 రోజుల్లో 33/66 ఏళ్ల లీజుపై భూములు అప్పగింత
- వాణిజ్య ఉత్పత్తి ప్రారంభించి పదేళ్లు దాటితే భూముల కొనుగోలుకు అవకాశం
- విశాఖ సమ్మిట్‌లో ఎంవోయూ చేసుకున్న సంస్థలు ఆరు నెలల్లో పనులు ప్రారంభిస్తే ఎర్లీబర్డ్ రాయితీలు
- ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలు, ఎంఎస్ఎంఈ యూనిట్లకు ప్రత్యేక రాయితీలు



సాక్షి, అమరావతి: అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడం లక్ష్యంగా మౌలిక వసతులకు పెద్దపీట వేస్తూ 2023 – 27 పారిశ్రామిక పాలసీని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఇందుకోసం తొమ్మిది మిషన్లను నిర్దేశించుకుని పూర్తిస్థాయి పారిశ్రామిక ఎకో సిస్టమ్‌ను అభివృద్ధి చేసేలా పాలసీలో పలు ప్రతిపాదనలు చేశారు. పరిశ్రమలకు తక్కువ వ్యయంతో అన్ని మౌలిక వసతులతో కూడిన భూములను అందుబాటు ధరల్లో అందించనున్నారు. ఇందుకోసం నాలుగేళ్లలో మూడు లక్షల ఎకరాల భూమిని సేకరించాలని నిర్ణయించారు. పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యంతో పారిశ్రామిక పార్కులు, మౌలిక వసతుల అభివృద్ధితో పాటు స్టార్టప్‌లు, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను అందించేలా ప్రత్యేక వ్యవస్థను ప్రోత్సహించనున్నారు. ఇదే సమయంలో అత్యధికంగా ఉపాధి కల్పిస్తున్న ఎంఎస్ఎంఈలతోపాటు మహిళలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేలా పాలసీని రూపొందించారు.

సమానంగా అభివృద్ధి చెందేలా..

నాలుగేళ్ల కాలానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2023 – 27 పారిశ్రామిక పాలసీ ఈ ఏడాది ఏప్రిల్ 1వతేదీ నుంచి అమల్లోకి రానుంది. గత మూడేళ్లలో వచ్చిన మార్పులను పరిగణనలోకి తీసుకుంటూ అంతర్జాతీయ మార్కెట్లకు సేవలు అందించేలా కొత్త పాలసీని రూపొందించినట్లు పరిశ్రమలు, మౌలిక వసతులు పెట్టుబడుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలవన్ తెలిపారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు సమానంగా పారిశ్రామికంగా అభివృద్ధి

మిగతా 2వ పేజీలో ▶



రైతులకు పెరగనున్న రుణపరపతి

భారీగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంపు

- 2023-24 స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను ఖరారుచేసిన స్టేట్ లెవల్ టెక్నికల్ కమిటీ
- గత ఏడాదితో పోల్చుకుంటే 15-20 శాతం మేర పెరుగుదల
- ఏప్రిల్ నుంచి కొత్త రుణాలు.. తొలిసారిగా డ్రాగన్ ఫ్రూట్ సాగుకూ..
- ఆర్బీకేల ద్వారా విస్తృత ప్రచారం

సాక్షి, అమరావతి: వ్యవసాయ, ఉద్యాన, ఔషధ పంటలతో పాటు పాడి, ఆక్వా రైతులకు రుణపరపతి భారీగా పెరిగింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో పంట రుణాలకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను రాష్ట్రస్థాయి సాంకేతిక కమిటీ ఖరారు చేసింది. ఖరీఫ్, రబీ సీజన్‌లలో పంటల వారీగా ఈ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారమే రుణాలు మంజూరు చేస్తారు. అలాగే.. పాడి, మత్స్యరంగాల్లో కూడా రైతులకు ఆర్థిక చేయూతనందిస్తుంటారు. ప్రభుత్వాదేశాలతో ఈ ఏడాది స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను భారీగా పెంచుతూ సోమవారం రాత్రి జరిగిన రాష్ట్రస్థాయి సాంకేతిక కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. 2022-23లో నిర్దేశించిన స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌తో పోల్చుకుంటే 2023-24లో మంజూరుచేసే రుణాలను 15-20 శాతం మేర పెంచారు.

ఆర్బీకేల ద్వారా అవగాహన

ఇక 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 109 వ్యవసాయ, ఉద్యాన, ఔషధ పంటల సాగుతో పాటు పాడి, పౌల్ట్రీ, ఆక్వా రంగాలకు మరింత ఆర్థిక చేయూతనిచ్చేలా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను నిర్దేశించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో 13 రకాల వ్యవసాయ, వాణిజ్య పంటలకు గతేదాది నిర్దేశించిన స్కేల్ ఆఫ్ ఫైనాన్స్

మిగతా 2వ పేజీలో ▶

ఉత్తరాంధ్రలో వర్షాలు.. రాయలసీమలో ఎండలు

- ద్రోణి ప్రభావంతో ఉత్తరాంధ్రలో కురుస్తున్న వర్షాలు
- అనకాపల్లి జిల్లా దేవరపల్లిలో 8.4 సెంటీమీటర్ల వర్షం
- తిరుపతి జిల్లా రాయల్ చెరువులో 39.8 డిగ్రీల ఉష్ణోగ్రత



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మంగళవారం ఉత్తరాంధ్రలో వర్షాలు కురవగా, రాయలసీమ, దక్షిణ కోస్తా జిల్లాల్లో ఎండలు మండాయి. అంతర్గత తమిళనాడు నుంచి మధ్య ఛత్తీస్‌గఢ్ వరకు ఉన్న ద్రోణి దక్షిణ ప్రస్తుతం శ్రీలంక నుంచి ఈశాన్య మధ్యప్రదేశ్ వరకు, అంతర్గత తమిళనాడు, రాయలసీమ, తెలంగాణ మీదుగా సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతోంది. దీని ప్రభావంతో ఉత్తరాంధ్రలో ఇంకా వర్షాలు కురుస్తున్నాయి. అనకాపల్లి జిల్లా దేవరపల్లి మండలం దేవరపల్లిలో అత్యధికంగా 8.4 సెంటీమీటర్ల వర్షం పడింది. విజయనగరం జిల్లా వేపాడలో 6.8 సెంటీ మీటర్లు, గుర్లలో 5.6, పెదనడిపల్లెలో 4.4, శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం గరికిపాలెంలో 3.7 సెంటీమీటర్ల వర్షం కురిసింది. ఉత్తరాంధ్రలో మరో రెండు రోజులు ఇలాగే తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు ఏపీఎస్‌డీపీఎస్ (ఏపీ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ) డైరెక్టర్ శివశంకర్ తెలిపారు.

రాయలసీమలో పెరిగిన ఎండలు

మరోవైపు రాయలసీమ, దక్షిణ కోస్తా జిల్లాల్లో ఒక్కసారిగా ఎండల తీవ్రత పెరిగింది. నాలుగు రోజులు వర్షాలతో చల్లగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. తిరుపతి జిల్లా రాయల్ చెరువులో 39.8 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. నెల్లూరు జిల్లా కసుమూరులో 39.5, చిత్తూరు జిల్లా నింద్ర, రెడ్డిగుంటలో 39.4, రేణిగుంటలో 39 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అనేక ప్రాంతాల్లో 35 నుంచి 38 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. ఇదిలావుండగా వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలు, మౌలిక వసతులకు జరిగిన పూర్తి నష్టాన్ని ఆ జిల్లాల్లో అధికారుల బృందాలు అంచనా వేస్తున్నట్లు ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు.



శ్రీశైలంలోకి 1,821.13 టీఎంసీలు

శ్రీశైలం ప్రాజెక్టులోకి 2014-15 నుంచి వచ్చిన ప్రవాహం..

సంవత్సరం	ప్రవాహం (టీఎంసీల్లో)
2014-15	614.05
2015-16	58.69
2016-17	337.95
2017-18	423.93
2018-19	541.39
2019-20	1,673.66
2020-21	1,511.07
2021-22	1,087.92
2022-23	1,821.13

- ప్రాజెక్టు చరిత్రలో ఇది మూడో అతిపెద్ద వరద ప్రవాహం
- 1994-95లో గరిష్ఠంగా 2,039.22 టీఎంసీలు
- ఆ తర్వాత 2005-06లో 1,830.65 టీఎంసీల ప్రవాహం
- 2014-15 నుంచి 2018-19 మధ్య ఐదేళ్లలో కనిష్ఠ వరద
- 2015-16లో ప్రాజెక్టులోకి కనిష్ఠంగా 58.69 టీఎంసీల ప్రవాహం

సాక్షి, అమరావతి: శ్రీశైలం ప్రాజెక్టులోకి ప్రస్తుత నీటి సంవత్సరం (జూన్ 1న ప్రారంభమై మే 31న ముగుస్తుంది)లో 1,821.13 టీఎంసీల ప్రవాహం వచ్చింది. ప్రాజెక్టు చరిత్రలో ఇది మూడో అతిపెద్ద వరద ప్రవాహంగా రికార్డుల్లోకి ఎక్కింది. గత మూడేళ్ల తరహాలోనే ఈ ఏడాదీ బచావత్ ట్రిబ్యునల్ 75 శాతం లభ్యత ఆధారంగా ఉమ్మడి రాష్ట్రానికి కేటాయించిన 811 టీఎంసీల కంటే కృష్ణాలో అధికంగా నీటి లభ్యత ఉంది. దీంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో రైతులు భారీ ఎత్తున పంటలు సాగు చేశారు. కాగా 1994-95లో ప్రాజెక్టులోకి 2,039.22 టీఎంసీల ప్రవాహం వచ్చింది. శ్రీశైలం చరిత్రలో ప్రాజెక్టులోకి వచ్చిన అతిపెద్ద వరద ప్రవాహం ఇదే. ఆ తర్వాత 2005-06లో ప్రాజెక్టులోకి 1,830.65 టీఎంసీల ప్రవాహం వచ్చింది. ప్రాజెక్టు చరిత్రలో ఇది రెండో అతిపెద్ద వరద ప్రవాహం.

ఆ ఐదేళ్లే కనిష్ఠ ప్రవాహం..

శ్రీశైలం ప్రాజెక్టును నిర్మించిన తర్వాత 2014-15 నుంచి 2018-19 మధ్య ఏటా అతి తక్కువ వరద ప్రవాహం వచ్చింది. 2015-16లో కేవలం 58.69 టీఎంసీల ప్రవాహం మాత్రమే రావడం గమనార్హం. ప్రాజెక్టు చరిత్రలో కనిష్ఠ ప్రవాహం ఇదే. ఆ ఐదేళ్లూ బచావత్ ట్రిబ్యునల్ కేటాయించిన నికర జలాల్లో సగ భాగం కూడా లభ్యత లేకపోవడంతో రాష్ట్రంలో కృష్ణా బేసిన్‌లో కరవుతో రైతులు తల్లడిల్లారు. సాగునీటి మాట దేవుడెరుగు.. తాగునీటికే తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

నాలుగేళ్లు కృష్ణమ్మ పరవళ్లు..

పరీవాహక ప్రాంతంలో సమృద్ధిగా వర్షాలు కురుస్తుండటం.. కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతుండటంతో నాలుగేళ్లుగా శ్రీశైలం ప్రాజెక్టులోకి భారీగా వరద ప్రవాహం చేరుతోంది. కృష్ణా ప్రధాన పాయపై జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల, ప్రకాశం బ్యారేజ్‌ల వద్ద నీటి లభ్యత పెరిగింది.

ఏఐలో మనదే హవా!

దేశ వృద్ధి రేటులో కీలకం కానున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్

- భారీగా ఉద్యోగావకాశాలు..
- వెల్లడించిన టీమ్‌లీజ్ డిజిటల్ సర్వే



సాక్షి, అమరావతి: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) రానున్న రోజుల్లో భారత ఆర్థిక వృద్ధికి కీలక ఉత్ప్రేరకంగా మారనుంది. దేశ జీడీపీకి 10 శాతం వాటాను సమకూర్చనుంది. భారీగా ఉద్యోగ అవకాశాలను కూడా కల్పించనుంది. ప్రపంచంలోనే అత్యుత్తమ ఏఐ నిపుణులకు భారత్ కేంద్ర స్థానంగా రూపాంతరం చెందుతోంది. ఈ విషయాలను 'ఐసెట్ ఫోర్సెస్ షేపింగ్ ఫ్యూచర్ ఆఫ్ టెక్నాలజీ' పేరుతో ప్రముఖ రీసెర్చ్ సంస్థ 'టీమ్‌లీజ్ డిజిటల్' వెల్లడించింది. 2027-28 నాటికి ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఏర్పడాలన్నది భారత్ లక్ష్యం. 2025 నాటికే దేశ జీడీపీకి ఏఐ దాదాపు 500 బిలియన్ డాలర్లు సమకూర్చనుందని ఈ నివేదిక పేర్కొంది. 2035 నాటికి ఏకంగా 967 బిలియన్ డాలర్లు సమకూరుస్తుందని కూడా అంచనా వేసింది. ఏఐ రంగంలో పెట్టుబడులు భారీగా పెరుగుతున్నాయి. 2020లో కొత్తగా 36 బిలియన్ డాలర్ల పెట్టుబడులు రాగా.. 2021లో 77.5 బిలియన్ డాలర్ల కొత్త పెట్టుబడులు వచ్చాయి. 2022లో ఏఐ రంగంలోని పెట్టుబడుల్లో భారత్

మిగతా 2వ పేజీలో ▶

'చెక్క'టి బొమ్మలకు చక్కని ప్రోత్సాహం

కొండపల్లి బొమ్మల తయారీ కార్మికులకు ప్రత్యేక శిక్షణ

- ఇందుకోసం రూ.1.90 కోట్లు కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం
- నిర్మాణంలో సొసైటీ భవనం, శిక్షణ కేంద్రం
- తెల్లపొనికి కర్ర పెంపకానికి చర్యలు



వివరాలు 2లో

మహిళలకు మరింత భద్రత

- ప్రభుత్వ కార్యాలయాల్లో అంతర్గత ఫిర్యాదుల కమిటీలు
- ఎప్పటికప్పుడు ఫిర్యాదులపై విచారించి చర్యలు
- మహిళా ఉద్యోగులు, సిబ్బంది సౌకర్యాలపై ప్రత్యేక శ్రద్ధ



సాక్షి, అమరావతి: ప్రభుత్వ కార్యాలయాల్లో విధులు నిర్వర్తించే మహిళలకు మరింత భద్రత కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా.. మహిళల రక్షణ చట్టం(పోష్ యాక్ట్)-2013 ప్రకారం అంతర్గత ఫిర్యాదుల కమిటీలను ఏర్పాటు చేస్తోంది. రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లా కేంద్రాల వరకు అన్ని కార్యాలయాల్లోనూ ఈ కమిటీలు మహిళల సమస్యలను, వారి ఇబ్బందులను తెలుసుకుంటాయి. మహిళా ఉద్యోగుల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించి శాఖాపరమైన చర్యలు తీసుకుంటాయి. పోష్ చట్టం అమలుకు సంబంధించి రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ, మహిళా కమిషన్ ఇటీవల ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించాయి. ఇప్పటికే పలు ప్రభుత్వ శాఖల రాష్ట్ర స్థాయి కార్యాలయాల్లోనూ, పలు జిల్లాల్లోనూ అంతర్గత ఫిర్యాదుల కమిటీలను ఏర్పాటు చేశారు. మిగిలిన శాఖల్లో, జిల్లాల్లో పూర్తి స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది.

ప్రభుత్వ ఆదేశాలివీ..

పని ప్రదేశాల్లో మహిళల రక్షణకు అంతర్గత ఫిర్యాదుల కమిటీలను కచ్చితంగా ఏర్పాటు చేయాలి. రాష్ట్ర స్థాయిలో అంతర్గత ఫిర్యాదుల

మిగతా 2వ పేజీలో ▶

ఏయూతో స్వీడన్ వర్సిటీ ఎంవోయూ



ఒప్పంద పత్రాలతో ఏయూ, బీటీహెచ్ ప్రతినిధులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం (ఏయూ)తో స్వీడన్‌కి చెందిన బ్లెకింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (బీటీహెచ్) అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. మంగళవారం ఏయూ పాలక మండలి సమావేశ మందిరంలో ఏయూ వీసీ ప్రసాదరెడ్డి సమక్షంలో ఒప్పంద పత్రాలపై ఏయూ రిజిస్ట్రార్ కిశోర్‌బాబు, బీటీహెచ్ వీసీ మేట్స్ విబర్గ్ సంతకాలు చేసి, ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. 2 వర్సిటీలు కలిపి నాలుగేళ్ల వ్యవధితో డబుల్ డిగ్రీ కోర్సును నిర్వహిస్తారు. కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మెషిన్ లెర్నింగ్ కోర్సును అందించే దిశగా ఈ ఎంవోయూ చేసుకున్నారు. ఏయూ వీసీ మాట్లాడుతూ బీటీహెచ్ ఆచార్యులను ఏయూలో ఒక సెమిస్టర్ బోధనకు పంపాలని సూచించారు. భవిష్యత్తులో ఏయూ ఆచార్యులను సైతం బీటీహెచ్‌కు పంపిస్తామన్నారు. బీటెక్‌లో ఎన్విరాల్‌మెంటల్ ఇంజనీరింగ్ కోర్సును ప్రారంభించామని, వచ్చే ఏడాది నుంచి ఫుడ్ టెక్నాలజీ కోర్సును కూడా ప్రారంభిస్తామన్నారు. అనంతరం ఏయూ తరఫున బీటీహెచ్ ప్రతినిధులను సత్కరించారు.

అమరావతి జేఏసీ ఉద్యమంలో పాల్గొనడం లేదు

ఎస్సీ ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సురేష్‌బాబు

పామర్రు: అమరావతి జేఏసీ పేరుతో ప్రభుత్వ ఉద్యోగులు చేస్తున్న ఉద్యమంలో రాష్ట్ర ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంఘం పాల్గొనడం లేదని ఎస్సీ ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్‌బాబు స్పష్టం చేశారు. కృష్ణాజిల్లా పామర్రులోని తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ఉద్యోగుల సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల ప్రధాన సమస్య పీఆర్సీ సాధన విషయంలో ఉద్యోగ ఉపాధ్యాయులు నిర్మించిన బలమైన ఉద్యమాన్ని జేఏసీలోని ప్రధాన సంఘాలు విఫలం చేశాయన్నారు. అమరావతి జేఏసీ సంఘం నేతల నిబద్ధత, చిత్తశుద్ధి పట్ల ఉద్యోగుల్లో పలు అనుమానాలున్నాయని చెప్పారు. ఉద్యోగుల పట్ల ప్రభుత్వ వైఖరి గతంలో కంటే భిన్నంగా క్రమేపీ మారుతున్నదని అన్నారు. ఉద్యోగులకు రావలసిన బకాయిలు మొదటి విడతగా 3 వేల కోట్లరూపాయలు చెల్లింపులు జరుగుతున్నాయన్నారు. విడతల వారీగా రావాల్సిన అన్ని బకాయిలను కొన్ని నెలల్లో చెల్లిస్తారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. నేతలు జే ఏసురత్నం, ఎం.సునీల్, బి హరీష్‌బాబు, డి దుర్గాప్రసాద్, విజయ్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మైక్రో బయాలజీకి 5 పీజీ సీట్లు మంజూరు



జాహ్నవికి ఉత్తర్వులు అందజేస్తున్న పద్మావతి దేవి

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల మైక్రో బయాలజీ వైద్య విభాగానికి 5 పీజీ సీట్లు మంజూరయ్యాయి. మంగళవారం వైద్య కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయానికి నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) నుంచి ఉత్తర్వులు అందాయి. వైద్య కళాశాల మైక్రోబయాలజీ విభాగంలో 4 పీజీ సీట్లు ఉండగా, 5 అదనంగా కావాలంటూ కళాశాల అధికారులు ఎన్‌ఎంసీకి లేఖ రాశారు. ఎన్‌ఎంసీ అధికారులు ఫిబ్రవరిలో వైద్య కళాశాలలో తనిఖీలు చేసి నిబంధనల మేరకు వసతులు వైద్య కళాశాలలో ఉండటంతో పీజీ సీట్లు మంజూరు చేశారు. ఇటీవల కాలంలో ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగంలో 4, పెథాలజీ విభాగంలో 5, జనరల్ మెడిసిన్ విభాగంలో 13 పీజీ సీట్లు మంజూరు చేస్తూ ఎన్‌ఎంసీ అధికారులు వైద్య కళాశాలకు ఉత్తర్వులు పంపారు. తాజాగా మరో 5 మైక్రోబయాలజీ సీట్లకు అనుమతి ఇవ్వడంతో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చాగంటి పద్మావతి దేవి హర్షం వ్యక్తం చేశారు. డాక్టర్ పద్మావతి దేవి ఎన్‌ఎంసీ అధికారులు పీజీ సీట్లు మంజూరు చేస్తూ ఇచ్చిన ఉత్తర్వులను మైక్రోబయాలజీ విభాగాధిపతి డాక్టర్ జాహ్నవికి అందజేశారు.

కేజీ లిక్విడ్ గంజాయి స్వాధీనం

మరో 4 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు

నూజివీడు: పాడేరు నుంచి గుంటూరుకు గంజాయిని తరలిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసిన ఏలూరు జిల్లా నూజివీడు రూరల్ పోలీసులు.. వారినుంచి ఒక కేజీ లిక్విడ్ గంజాయిని, మరో నాలుగు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ ఇ.అశోక్‌కుమార్ గౌడ్ నూజివీడు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. గంజాయి తరలిస్తున్నారన్న ముందస్తు సమాచారంతో రూరల్ ఎస్ఐ తలారి రామకృష్ణ తన సిబ్బంది, డిప్యూటీ తహసీల్దార్‌తో కలసి మంగళవారం ఉదయం నూజివీడు మండలంలోని మర్రిబంధం వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. బైక్‌పై నూజివీడు వైపు వస్తున్న ముగ్గురు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించారు. దీంతో ఎస్ఐ రామకృష్ణ, సిబ్బంది కలిసి వెంటాడి వారిని అదుపులోకి తీసుకుని.. వారి వద్ద ఉన్న కిలో గంజాయి లిక్విడ్, 4కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ఇద్దరు గుంటూరుకు చెందిన షేక్ ఫయాజ్ అహ్మద్ (29), షేక్ గౌస్ (22) కాగా, మరొకరు వీరికి గంజాయిని సరఫరా చేసిన విశాఖ జిల్లా హుకుంపేట మండలం రంగశీల పంచాయతీ శివారు నందివలస గ్రామానికి చెందిన తాంగుల బుద్ధు (45)గా గుర్తించారు. గంజాయితో పాటు బైక్, ఐదు ఏటీఎం కార్డులు, మూడు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు.

మహా సరస్వతి అలంకారంలో భ్రామరి

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలంలో ఉగాది మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. మంగళవారం శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు విశేష పూజలు నిర్వహించారు. శ్రీభ్రమరాంబాదేవి మహాసరస్వతి అలంకారంలో కటాక్షించారు. ప్రత్యేక అలంకృతులైన మహాసరస్వతి అమ్మవారికి, నందివాహనాధీశులైన స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు వాహన సేవ పూజలు చేశారు. గ్రామోత్సవం కనులపండువగా సాగింది. సాయంత్రం స్వామి అమ్మవార్లను పుష్పాలతో అలంకరించిన ప్రభపై వేంచేపు చేయించి అర్చక స్వాములు ప్రత్యేక పూజాహారతుల అనంతరం గంగాధర మండపం నుంచి నందిమండపం వరకు ప్రభోత్సవం నిర్వహించారు. రాత్రి వీరాచార విన్యాసాలు అబ్బురపరిచాయి. కన్నడ భక్తులు తాళ్లు, ఇనుపరాడ్లను నాలుకకు, శరీరానికి గుచ్చుకున్నారు. భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు.

అసెంబ్లీ స్పీకర్‌కు పీఏసీ చైర్మన్ లేఖ

పబ్లిక్ అకౌంట్స్ కమిటీలో ఖాళీలు భర్తీ చేయాలని విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: పబ్లిక్ అకౌంట్స్ కమిటీలో ఖాళీలను భర్తీ చేయాలని కోరుతూ అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాంకు పీఏసీ చైర్మన్ పయ్యావుల కేశవ్ మంగళవారం లేఖ రాశారు. పబ్లిక్ అకౌంట్స్ కమిటీలో 12 మంది సభ్యులకు ఐదుగురే ఉన్నారని తెలిపారు. శాసన సభ నుంచి ఐదు, మండలి నుంచి రెండు ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. కోలగట్ల వీరభద్ర స్వామి డిప్యూటీ స్పీకర్ అవడం, మేరుగ నాగార్జున, కరణం ధర్మశ్రీ, జోగి రమేష్, కేవీ ఉషశ్రీ చరణ్ మంత్రివర్గంలో చేరడంతో పీఏసీలో ఖాళీలు ఏర్పడినట్లు తెలిపారు. వెంటనే వాటిని భర్తీ చేయాలని కోరారు. సభ్యులు పూర్తి స్థాయిలో లేకపోవడం వల్ల పీఏసీ తన విధులను నిర్వహించలేకపోతోందని పేర్కొన్నారు.

'చెక్క'టి బొమ్మలకు చక్కని ప్రోత్సాహం

కొండపల్లి బొమ్మల తయారీ కార్మికులకు ప్రత్యేక శిక్షణ	ఇందుకోసం రూ.1.90 కోట్లు కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం
	తెల్లపొనికి కర్ర పెంపకానికి చర్యలు

సృజనాత్మకతకు మారుపేరుగా నిలుస్తున్న కొండపల్లి కొయ్య బొమ్మలకు దేశంలోనే ఓ ప్రత్యేకత ఉంది. ఇక్కడి బొమ్మల తయారీ పరిశ్రమకు రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహం తోడవటంతో పురోగమనం వైపు పయనిస్తోంది. కొండపల్లి బొమ్మలకు ఆదరణ పెరుగుతుండగా.. తయారీదారుల సంఖ్య మాత్రం పెరగటం లేదు. బొమ్మల తయారీపై యువత ఆసక్తి చూపకపోవడంతో ఈ పరిశ్రమను వారసత్వంగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ, అంతర్జాతీయ లేస్ ట్రేడ్ సెంటర్, కేంద్ర ప్రభుత్వ గురుశిష్య హస్తకళల పరిరక్షణ్ నడుం బిగించాయి. యువతకు, మహిళలకు బొమ్మల తయారీపై ప్రత్యేక శిక్షణ ప్రారంభించాయి. 16వ శతాబ్దంలో రాజస్థాన్ నుంచి వలస వచ్చిన కళాకారులు అడవిలో లభించే తెల్ల పొనికి కర్రతో గ్రామీణ జీవనం ఉట్టిపడే బొమ్మలు తయారీని జీవనోపాధిగా మలుచుకున్నారు. ఏనుగు అంబారీ, తాటిచెట్టు, గోపీకృష్ణ బృందం, బ్యాండ్ సెట్, దశావతారాలు, జోడెడ్ల బండి వంటి బొమ్మలను 102 రకాల బొమ్మలు ప్రస్తుతం తయారు చేస్తున్నారు.

– సాక్షి ప్రతినిధి, విజయవాడ

చిగురిస్తున్న ఆశలు

నిర్మాణంలో సొసైటీ భవనం, శిక్షణ కేంద్రం

కొన్నేళ్లుగా కొండపల్లి బొమ్మల పరిశ్రమపై ప్రభుత్వాలు శ్రద్ధ చూపలేదు. దీంతో బొమ్మల తయారీదారుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. యువకులు ఇతర పనుల వైపు మళ్లారు. పరిశ్రమ ఒడిదొడుకులకు గురైంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 2021 నుంచి కొండపల్లి బొమ్మలను ఆన్‌లైన్ ద్వారా విక్రయించేందుకు లేపాక్షి సంస్థ ప్రోత్సహించింది. ప్రభుత్వం హస్త కళాకారుల నైపుణ్య శిక్షణకు రూ.1.90 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో సొసైటీ భవనం, యంత్రాలు, దుకాణాలు, శిక్షణ కేంద్రం ఏర్పాటు జరుగుతున్నాయి. తెల్ల పొనికి చెట్లను పెంచేందుకు చర్యలు తీసుకున్నారు. ఇతర ప్రాంతాల్లో నుంచి తెల్ల పొనికి కర్ర తెచ్చుకునేందుకు అభ్యంతరాలను కూడా తొలగించారు.





ప్రభుత్వ ప్రోత్సాహంతో..



కొండపల్లి హస్తకళల పరిశ్రమ నిర్వీర్యమైంది. యువత పరిశ్రమపై ఆసక్తి చూపటం లేదు. కనుమరుగవుతున్న తరుణంలో ప్రభుత్వ ప్రోత్సాహంతో బొమ్మల తయారీపై మహిళలు, యువకులు చొరవ చూపుతున్నారు.

– సీహెచ్.కేశవాచారి, అధ్యక్షుడు, స్ఫూర్తి బొమ్మల సొసైటీ

పరిశ్రమ స్థాపిస్తా



కొండపల్లి బొమ్మల తయారీలో శిక్షణ పొందుతున్నాను. నిత్యం క్రమం తప్పకుండా శిక్షణకు హాజరవుతున్నాను. బొమ్మల పరిశ్రమ స్థాపించాలనే పట్టుదలతో ఉన్నాను.

– షేక్ మౌలాబీ, శిక్షణ పొందుతున్న మహిళ

ప్రోత్సాహాన్ని ఉపయోగించుకుని..



కొండపల్లి బొమ్మల పరిశ్రమలో 36 ఏళ్లుగా ఉన్నా. గతం కంటే అమ్మకాలు పెరిగాయి. ప్రభుత్వ ప్రోత్సాహాన్ని వినియోగించుకుని ఈ రంగంలో ముందుకెళతా.

– కె.వెంకటాచారి, వైఎస్సార్ ఎచీవ్‌మెంట్ అవార్డు గ్రహీత

అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం



కొండపల్లి బొమ్మల పరిశ్రమ అంతరించిపోకుండా తయారీదారులను ప్రత్యేకంగా ప్రోత్సహిస్తున్నాం. బొమ్మల తయారీకి అవసరమైన అరుదైన తెల్లపొనికి చెక్క సేకరించుకునే విధానాన్ని సరళతరం చేశాం. చెట్లు అంతరించిపోతున్న తరుణంలో అటవీ ప్రాంతంలోనే వీటి వనాలను పెంచేలా ప్రణాళిక రూపొందించాం. బొమ్మల తయారీపై నేటి తరానికి శిక్షణ ఇస్తున్నాం. లేపాక్షి, ఆన్‌లైన్ ద్వారా అమ్మకాలను ప్రోత్సహిస్తున్నాం.

– ఎస్.ఢిల్లీరావు, కలెక్టర్, ఎన్టీఆర్ జిల్లా

రైతులకు పెరగనున్న రుణపరపతి

మొదటి పేజీ తరువాయి

ప్రకారమే ఈ ఏడాది పంట రుణాలు ఇవ్వనున్నారు. కానీ, డ్రాగన్ ఫ్రూట్స్ సాగుకోసం ఈ ఏడాది నుంచి రుణాలు ఇవ్వనున్నారు. పంటల వారీగా నిర్దేశించిన స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ వివరాలను రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆర్బీకేల్లోనూ గురువారం నుంచి ప్రదర్శించనున్నారు. పెంచిన రుణ పరపతిపై ఆర్బీకేల ద్వారా గ్రామస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేస్తారు. జిల్లా, మండల స్థాయిల్లో బ్యాంకర్ల సమావేశాలు నిర్వహించి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రుణాలు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటారు.

ఏప్రిల్ 1 నుంచి పంట రుణాల పెంపు



2023–24 ఆర్థిక సంవత్సరంలో వివిధ రకాల పంటల సాగుతో పాటు పాడి, పౌల్ట్రీ, ఆక్వా రైతులకు పంట రుణాల మంజూరు కోసం స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను ఖరారు చేశాం. పెంచిన పంట రుణాలను ఏప్రిల్ 1 నుంచి బ్యాంకులు మంజూరు చేయనున్నాయి. వీటిపై ఆర్బీకే స్థాయిలో విస్తృత ప్రచారం చేయాలని ఆదేశాలిచ్చాం.

– గోపాలకృష్ణ ద్వివేది, ముఖ్య కార్యదర్శి, వ్యవసాయ శాఖ

జీ–20 సదస్సుకు విశాఖ ముస్తాబు



బీచ్ రోడ్డులో డెస్టినేషన్ ఆంధ్రా..విశాఖపట్నం సిటీ

డాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): జీ–20 దేశాల సదస్సుకు విశాఖ ముస్తాబవుతోంది. ఇందుకోసం నగరంలో సుందరీకరణ పనులు జరుగుతున్నాయి. డివైడర్లకు రంగులు వేశారు. డివైడర్ల మధ్యలో ఉన్న చెట్లకు వేసిన జాతీయ జెండా రంగులు అందరినీ అలరిస్తున్నాయి. దాదాపు పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులు మరో 3 రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు వెల్లడించారు. అతిథులు విశాఖ నగరంలో పర్యటించే సమయంలో జీవీఎంసీ చేపడుతున్న పలు ప్రాజెక్టులను వారికి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరిస్తామని చెప్పారు. జీ–20 సదస్సు జరిగే ప్రాంతాలు తెలిపేందుకు సంబంధించి టోల్ ఫ్రీ ఏర్పాటు చేశామని తెలిపారు.

మహిళలకు మరింత భద్రత

మొదటి పేజీ తరువాయి

కమిటీ, జిల్లా స్థాయిలో లోకల్ కంప్లైంట్స్ కమిటీని నియమించాలి. ఫిర్యాదుల కమిటీలో కీలక బాధ్యతలు మహిళా అధికారులకే అప్పగించాలి. ప్రభుత్వ, ప్రైవేట్, పబ్లిక్ కార్యాలయాలన్నింటిలోనూ ఫిర్యాదులను 90 రోజుల్లోగా పరిష్కరించాలి. మూడు నెలలకు ఒకసారి ఫిర్యాదుల కమిటీ సమావేశం జరగాలి. ఉద్యోగినులకు ఈ కమిటీలపై అవగాహన కల్పించాలి. పని ప్రదేశాల్లో మహిళలకు ప్రత్యేక మరుగుదొడ్లు.. లాకింగ్ సిస్టంతో ఉండాలి. శిశువులకు పాలిచ్చే ప్రత్యేక గదులు ఏర్పాటు చేయాలి. గర్భిణులు, పాలిచ్చే తల్లులకు తప్పనిసరిగా విశ్రాంతి గదులు.. భోజనానికి ప్రత్యేక స్థలం ఉండాలి. ఆస్పత్రుల్లో పనిచేసే వారికి తక్షణ వైద్య సహాయం అందించేలా చర్యలు తీసుకోవాలి.

మహిళల సమస్యల పరిష్కారమే లక్ష్యం..

సీఎం జగన్ ఆదేశాలతో ప్రభుత్వ యంత్రాంగం మహిళల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అంతర్గత ఫిర్యాదుల కమిటీల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తోంది. మహిళా కమిషన్ ఆధ్వర్యంలో 'సబల' అనే కార్యక్రమాన్ని చేపట్టి విశాఖ, గుంటూరు, ఏలూరు, కడపలో ప్రాంతీయ వర్క్‌షాప్‌లు నిర్వహించాం. ఈ సందర్భంగా మహిళలు పలు సమస్యలను మా దృష్టికి తెచ్చారు. వాటిని సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లడంతో అంతర్గత కమిటీల ఏర్పాటుకు ఆదేశాలిచ్చారు. త్వరలోనే అన్ని కార్యాలయాల్లోనూ పూర్తిస్థాయి కమిటీలు ఏర్పాటై పని ప్రాంతాల్లో మహిళల భద్రతకు మరింత భరోసా దక్కుతుంది.

– వాసిరెడ్డి పద్మ, ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్

ఏఐలో మనదే హవా!

మొదటి పేజీ తరువాయి

వాటా 1.5 శాతంగా ఉంది. 2025 నాటికి ఇది 5 శాతానికి పెరుగుతుందని భావిస్తున్నారు.

భారీగా ఉద్యోగాలు..

దేశంలో కొత్త ఉద్యోగాల కల్పనలోనూ ఏఐ రంగం ప్రధాన పాత్ర పోషిస్తోంది. 2023 ప్రారంభంలోనే కొత్తగా 45 వేల ఉద్యోగాల భర్తీకి కంపెనీలు నియామక ప్రక్రియను ప్రకటించాయి. డేటా సైంటిస్టులు, మెషీన్ లెర్నింగ్ ఇంజనీర్లకు డిమాండ్ ఎక్కువగా ఉంది. వివిధ స్థాయిల్లో ఉద్యోగులకు ప్రారంభ వార్షిక వేతనాలే రూ.10 లక్షల నుంచి 14 లక్షల వరకు ఉన్నాయి. 8 ఏళ్ల అనుభవం ఉన్న ఉద్యోగులకు వార్షిక వేతనాలు రూ.25 లక్షల నుంచి 45 లక్షల వరకు ఉన్నాయి. ఏఐ రంగానికి నిపుణులను అందించడంలో భారత్ ప్రపంచంలోనే మూడో స్థానంలో ఉంది. భారత్‌లో ఇప్పటికి 4 లక్షల మంది ఏఐ నిపుణులు ఉన్నట్టు అంచనా. ప్రపంచంలో 16 శాతం మంది నిపుణులు భారత్‌లో ఉన్నారు. ఈ రంగంలో నైపుణ్యవంతమైన మానవ వనరులున్న నగరాల్లో బెంగళూరు ప్రపంచంలోనే 5వ స్థానంలో ఉండగా.. ఢిల్లీ 18, హైదరాబాద్ 19, ముంబై 27 స్థానాల్లో ఉన్నాయి. దీంతో భారత్ ఏఐ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రపంచవ్యాప్తంగా పలు కంపెనీలు ఆసక్తి కనబరుస్తున్నాయి.

గ్రంథాలయ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు

ఏపీ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు



మల్లెతీగ ఉగాది పురస్కాల సభలో మందపాటి శేషగిరిరావు, గజల్ శ్రీనివాస్, వేమూరి విశ్వనాథ్, పురస్కార గ్రహీతలు

విజయవాడ కల్చరల్: ఏపీ గ్రంథాలయ వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయని, గ్రంథాలయాలను పాఠకులకు చేరువ చేస్తున్నామని ఏపీ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు చెప్పారు. నవ్యాంధ్ర రచయితల సంఘం, మల్లెతీగ సాహిత్యసేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడలోని ఠాగూర్ గ్రంథాలయంలో ప్రపంచ కవితా దినోత్సవం, శోభకృత్ నామ సంవత్సర ఉగాది సందర్భంగా మల్లెతీగ ఉగాది పురస్కారాలు, వర్ణాలులేని వాక్యాలు కవితా సంపుటి ఆవిష్కరణ సభ నిర్వహించాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న శేషగిరిరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని 10,960 గ్రంథాలయాలను డిజిటలైజ్ చేశామన్నారు. కడపలో వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీ జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చుకుందని, గ్రంథాలయ పరిషత్ ద్వారా జగన్ డిజిటల్ శోభకృత్ నామ సంవత్సరంగా నిర్ణయించి కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. గజల్ గాయకుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న గ్రంథాలయ ఉద్యమానికి తాను గీతం పాడి రాష్ట్ర ప్రజలకు అంకితం చేస్తానని పేర్కొన్నారు. మల్లెతీగ సాహిత్యవేదిక నిర్వాహకుడు కలిమిశ్రీ సంస్థ లక్ష్యాలను వివరించారు. ఆంధ్రప్రదేశ్ అధికార భాషాసంఘం సభ్యుడు డాక్టర్ కత్తి వెంకటేశ్వరరావు, వివిధ రంగాలకు చెందిన వేమూరి విశ్వనాథ్, కరుమూరి దాసు, ఆర్.ఆర్.గాంధీనాగరాజన్ పాల్గొన్నారు.

మల్లెతీగ ఉగాది పురస్కారాలు

తెలుగు సాహిత్యంలో విశేషమైన కృషిచేసిన గానుగపెంట హనుమంతరావు, మందరపు హైమావతి, అమూల్యాచందు, ఘంటా విజయకుమార్, సరికొండ నరసింహరాజు, శిఖా ఆకాష్, రామరాజు శ్రీనివాస్‌లకు మల్లెతీగ ఉగాది పురస్కారాలను, తంగిరాల సోనికి ఉగాది యువ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా పలువురు కవులు స్వీయకవితా గానం చేశారు. వారిని నిర్వాహకులు సత్కరించారు. ఈ కార్యక్రమాన్ని మల్లెతీగ సాహిత్యసేవాసంస్థ నిర్వహణాసంఘం సభ్యులు యేమినేని వెంకటరమణ, డాక్టర్ తూములూరి రాజేంద్రప్రసాద్, కుర్రా సురేష్‌బాబు, చొప్పా రాఘవేంద్రశేఖర్ నిర్వహించారు.

పారిశ్రామికాభివృద్ధికి నవరత్నాలు

ఇవీ 9 మిషన్లు


- ఎకనామిక్ గ్రోత్: విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులతో పాటు స్థానిక పెట్టుబడులను ఆకర్షించే విధంగా పూర్తిస్థాయి ఇండస్ట్రియల్ ఎకో సిస్టమ్‌ను అభివృద్ధి చేయడం. ప్రపంచస్థాయి పారిశ్రామిక మౌలిక వసతులతో పాటు లాజిస్టిక్ కల్పన, సులభతర వాణిజ్యం, ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించనున్నారు.
- పోర్టు ఆధారిత అభివృద్ధి: పోర్టు ప్రాంతాలు అభివృద్ధికి మూల స్థంభాలుగా ప్రణాళికలు. వీసీఐసీ, సీబీఐసీ, హెచ్‌బీఐసీ కారిడార్స్‌తో పాటు రైలు, రోడ్డు, అంతర్గత జలరవాణా మార్గాలను ప్రస్తుత పోర్టులతో పాటు కొత్తగా నిర్మించే పోర్టులకు అనుసంధానిస్తారు.
- లాజిస్టిక్స్ వ్యవస్థను పెంచడం: సరుకు రవాణా వ్యయం తగ్గించే విధంగా రోడ్ రైల్ నెట్‌వర్క్‌ను పెంచడం. కోస్టల్ షిప్పింగ్, అంతర్గత జలరవాణా మార్గాలను ప్రోత్సహించడం. లాజిస్టిక్ పార్కుల అభివృద్ధితో పాటు గిడ్డంగులు, శీతలీకరణ గిడ్డంగులు సౌకర్యాలను పెంచడం.
- రెడీ టు బిల్ట్ పార్కులు: పరిశ్రమలు తక్షణం వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభించే విధంగా ప్రస్తుత పారిశ్రామిక పార్కులతో పాటు కొత్తగా వచ్చే పార్కుల్లో రెడీ టు బిల్ట్ ఫ్యాక్టరీలు, ప్లాటెడ్ ఫ్యాక్టరీ స్పేస్‌లు, స్టాండర్డ్ డిజైన్ ఫ్యాక్టరీస్‌ను అభివృద్ధి చేయడం. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో పారిశ్రామిక పార్కులు, మౌలిక వసతుల కల్పనతో పాటు ప్రైవేట్ పారిశ్రామిక, ఎంఎస్ఎంఈ పార్కులను నెలకొల్పడం.
- పారిశ్రామిక సేవలన్నీ ఒకేచోట: ప్రభుత్వ విభాగాలకు చెందిన సేవలు, అనుమతులన్నీ ఒకేచోట లభించే విధంగా వైఎస్సార్ ఏపీ వన్‌ను అభివృద్ధి చేస్తారు.
- ఉద్యోగ కల్పన: రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఉపాధి కల్పించేలా ఎంఎస్ఎంఈ రంగానికి ప్రోత్సహించడంతోపాటు ఇబ్బందుల్లో ఉన్న ఎంఎస్ఎంఈలకు చేయూతనివ్వడం. లార్జ్, మెగా, అల్ట్రా మెగా పరిశ్రమలకు నిపుణులైన మానవ వనరులను అందించే విధంగా శిక్షణ, ఉపాధి కోసం ఆన్‌లైన్ పోర్టల్ ఏర్పాటు.
- నైపుణ్యం కలిగిన మానవ వనరులు: కనీస చదువులు పూర్తి చేసుకున్న యువతకు పరిశ్రమల్లో అవసరమైన రంగాల్లో ప్రాక్టికల్ శిక్షణ అందించేలా నైపుణ్య శిక్షణ కోర్సులను అందుబాటులోకి తెచ్చి సాఫ్ట్ స్కిల్స్‌ను పెంపొందిస్తారు.
- స్టార్టప్ కల్చర్‌ను ప్రోత్సహించడం: యువతను నూతన పారిశ్రామికవేత్తలుగా తీర్చి దిద్దే విధంగా మెంటారింగ్ కార్యక్రమాలు, స్టార్టప్ జోన్స్, స్టార్టప్‌లకు రాయితీలు, స్టార్టప్ ఫైనాన్సింగ్ ఎకో సిస్టమ్‌ను అభివృద్ధి చేయడం
- మహిళలు, బడుగు వర్గాలకు ప్రోత్సాహం: మహిళలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేలా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయడం. వారిని గుర్తించి పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా చేయూతనివ్వడం.

మొదటి పేజీ తరువాయి

చెందే విధంగా పాలసీలో చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇందులో భాగంగా జిల్లాల వారీగా వివరాలు సేకరించి పరిశ్రమలు తక్కువగా ఉన్న చోట్ల మరిన్ని ఏర్పాటయ్యేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

ప్రతిపాదన నుంచి ఉత్పత్తి దాకా..

రాష్ట్రంలో పెట్టుబడి ప్రతిపాదనలతో వచ్చిన దగ్గర నుంచి ఉత్పత్తి ప్రారంభమయ్యే వరకు సింగిల్ విండో విధానంలో త్వరితగతిన అన్ని అనుమతులను ప్రభుత్వం మంజూరు చేయనుంది. భూముల కోసం పరిశ్రమలు దరఖాస్తు చేసుకున్న 21 రోజుల్లోనే ఏపీఐఐసీ భూమిని కేటాయిస్తుంది. పరిశ్రమలకు 33 – 66 ఏళ్ల కాలానికి లీజు విధానంలో భూమిని కేటాయిస్తారు. వాణిజ్య ఉత్పత్తి ప్రారంభించిన 10 ఏళ్ల తర్వాత భూములను కొనుగోలు చేసుకునే హక్కును కల్పించనున్నారు. ప్రభుత్వ సేవలన్నీ ఒకే గొడుగు కింద అందించే విధంగా వైఎస్సార్ ఏపీ వన్ వ్యవస్థను అభివృద్ధి చేశారు. ఎంఎస్ఎంఈలు, ఎస్సీ ఎస్టీలకు ప్రత్యేక ప్రోత్సాహకాలతో పాటు లార్జ్, మెగా, అల్ట్రా మెగా ప్రాజెక్టులకు పెట్టుబడి సామర్థ్యం, ఉపాధి కల్పనను బట్టి రాయితీలు, ప్రోత్సాహకాలను కల్పిస్తారు. మెగా, అల్ట్రా మెగా ప్రాజెక్టులకు సంబంధించి వేగవంతంగా కార్యరూపం దాల్చేలా సీనియర్ అధికారిని ప్రత్యేకంగా కేటాయిస్తారు. ప్రాజెక్టు అమలులో ఈ అధికారి అంబాసిడర్‌గా వ్యవహరిస్తారు. విశాఖ గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్‌లో కుదిరిన ఒప్పందాలను త్వరితగతిన వాస్తవ రూపంలోకి తెచ్చేలా సీఎస్ అధ్యక్షతన కమిటీని నియమించిన రాష్ట్ర ప్రభుత్వం దీనికి సంబంధించి ప్రత్యేక రాయితీలను ప్రకటించింది. ఒప్పందం జరిగిన రోజు నుంచి ఆర్నెల్లలో నిర్మాణ పనులు ప్రారంభించే సంస్థలకు ఎర్లీ బర్డ్ కింద ప్రోత్సాహకాలను కల్పించనున్నారు.

పరిశ్రమలు ఇలా	జిల్లాలు
తక్కువ పరిశ్రమలు ఉన్నవి 	అనంతపురం, అన్నమయ్య, బాపట్ల, అంబేద్కర్ కోనసీమ, కర్నూలు, కృష్ణా, నంద్యాల, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, వైఎస్సార్, అల్లూరి సీతారామరాజు పాడేరు
మధ్యస్థాయిలో పరిశ్రమలు ఉన్నవి 	చిత్తూరు, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, గుంటూరు, కాకినాడ, ఎన్టీఆర్, పల్నాడు, ప్రకాశం, ఎస్పీఎస్ఆర్ నెల్లూరు, సత్యసాయి, విజయనగరం
అధికంగా పరిశ్రమలున్నవి	అనకాపల్లి, తిరుపతి, విశాఖ

పెట్టుబడుల ఆకర్షణకు దృష్టిసారించే ప్రధాన రంగాలు

- కెమికల్స్–పెట్రోకెమికల్స్
- ఫార్మాస్యూటికల్స్–బల్క్ డ్రగ్స్
- టెక్స్‌టైల్స్ అండ్ అప్పరెల్స్
- ఆటోమొబైల్ అండ్ ఆటో కాంపోనెంట్స్
- ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ
- ఆగ్రో, ఫుడ్ ప్రోసెసింగ్
- ఇంజనీరింగ్
- మెడికల్ డివైసెస్
- డిఫెన్స్ అండ్ ఎయిరోస్పేస్
- మెషినరీ అండ్ ఎక్విప్‌మెంట్
- భవిష్యత్తు నాల్గవ తర్గతి పరిశ్రమలు తయారీ రంగం, బయోటెక్నాలజీ, గ్రీన్ హైడ్రోజన్, ఎలక్ట్రికల్ వెహికల్స్
- రెన్యువబుల్ ఎనర్జీకి సంబంధించిన పరికరాల తయారీ





దుర్గమ్మ సేవలో తమ్మినేని

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): రాష్ట్ర శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాం దంపతులు దుర్గమ్మను మంగళవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు.



వైఎస్సార్ సీపీ శ్రేణుల నిరసన

భవానీపురం(విజయవాడపశ్చిమ): అసెంబ్లీలో టీడీపీ ఎమ్మెల్యేల దౌర్జన్యాన్ని నిరసిస్తూ తుమ్మల పల్లి కళాక్షేత్రం వద్ద మంగళవారం వైఎస్సార్ సీపీ శ్రేణులు నిరసన చేపట్టారు



లోక కల్యాణార్థం కోటి రుద్రాక్ష..

మధురానగర్(విజయవాడసెంట్రల్): లోక కళ్యాణార్థం ఈనెల 28న తలపెట్టిన కోటి రుద్రాక్ష అభిషేకంను విజయవంతం చేయాలని త్రిదండి చిన్న జీయర్ స్వామి కోరారు.

న్యూస్‌రీల్

గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి విస్తరణలో రైతులకు న్యాయం



విజయవాడరూరల్: విజయవాడ - ఖమ్మం గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి విస్తరణకు భూసేకరణ విషయంలో రైతులకు న్యాయం చేస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్‌కుమార్ స్పష్టం చేశారు. విజయవాడ రూరల్ మండలం రాయనపాడు గ్రామంలో జాతీయ రహదారి విస్తరణకు అవసరమైన భూ సేకరణ విషయంపై రైతులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ రైతులతో మాట్లాడి భూయజమానుల నుంచి భూమికి సంబంధించిన అంగీకార పత్రాలను స్వీకరించారు. రైతులకు ఎటువంటి నష్టం లేకుండా పరిహారం చెల్లిస్తామన్నారు. సమావేశంలో రైతులు, అధికారులు పాల్గొన్నారు.

నలుగురు విద్యార్థుల డీబార్

చిలకలపూడి(మచిలీపట్నం): ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరం పరీక్షలకు సంబంధించి ఎన్టీఆర్ జిల్లాలో మంగళవారం నలుగురు విద్యార్థులను డీబార్ చేసినట్లు ఆర్‌ఐఓ పి.రవి కుమార్ తెలిపారు. గంపలగూడెంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో స్లిప్‌లు పెట్టి పరీక్షలు రాస్తున్న ఇద్దరు విద్యార్థులను ఇన్విజిలేటర్లు గుర్తించారు. అదే కళాశాలలో మరో విద్యార్థిని ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం గుర్తించింది. విజయవాడలోని కేబీఎన్ కళాశాలలో మాల్ ప్రాక్టీస్ చేస్తున్న విద్యార్థిని అదనపు డిపార్ట్‌మెంటల్ అధికారి గుర్తించారు. ఈ నలుగురు విద్యార్థులను డీబార్ చేశారు. మంగళవారం పరీక్షలకు సంబంధించి కృష్ణాజిల్లాలో 17,022 మంది విద్యార్థులకు 16,645 మంది హాజరయ్యారు. 377 మంది హాజరుకాలేదు. ఎన్టీఆర్ జిల్లాలో 31,913 మందికి 31,212 మంది హాజరయ్యారు. 701 మంది గైర్హాజరయ్యారు. పరీక్షల్లో విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే చర్యలు తప్పవని ఆర్‌ఐఓ రవికుమార్ హెచ్చరించారు.

కార్తికేయుడిని దర్శించుకున్న సుమన్



మోపిదేవి(అవనిగడ్డ): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మోపిదేవి శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని సినీనటుడు సుమన్ మంగళవారం దర్శించుకున్నారు. ఆయనకు దేవదాయ శాఖ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తొలుత సుమన్ ఆలయ ప్రదక్షిణ చేసి పుట్టలో పాలుపోసి మొక్కు చెల్లించుకున్నారు. ఆలయ ఏసీ ఎన్.ఎస్.చక్రధరరావు స్వామివారి చిత్రపటం, లడ్డూప్రసాదాలను సుమన్‌కు అందజేశారు. ఎంతో మహిమగల సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకోవాలని ఎప్పటి నుంచో అనుకున్నానని, ఆ కోరిక ఇప్పుడు నెరవేరిందని ఈ సందర్భంగా సుమన్ అన్నారు. ఈడే మురళీ, చల్లపల్లి జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి కల్యాణి, శివప్రసాద్, రాజులపాటి నాగేశ్వరరావు, మోర్ల శ్రీనివాసరావు, లోకేష్, ఆది రాంబాబు, పఠాన్ కరీముల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రిపై ఆర్జిత సేవలకు డిమాండ్



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో నిర్వహించిన పలు ఆర్జిత సేవలకు రికార్డు స్థాయిలో ఉభయదాతలు పాల్గొని పూజలు జరిపించుకున్నారు. కొత్త అమావాస్య, మంగళవారం నేపథ్యంలో ఆది దంపతులకు ఆర్జిత సేవలు నిర్వహించారు. తెల్లవారుజామున అమ్మవారి అంతరాలయంలో నిర్వహించిన ఖడ్గమాలార్చన, లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన, రాహుకేతు పూజతో పాటు చండీహోమానికి 250 మంది ఉభయ దాతలు పాల్గొన్నారు. ఆర్జిత సేవల్లో పాల్గొన్న వారికి ప్రత్యేక క్యూలైన్ మార్గం ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు.

నేటి ఉదయం 9 గంటలకు దర్శనం

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని అమ్మవారికి స్నపనాభిషేకం, అలంకరణ నేపథ్యంలో బుధవారం ఉదయం 9 గంటలకు దర్శనానికి అనుమతిస్తారు. తెల్లవారుజామున అమ్మవారికి సుప్రభాత సేవ అనంతరం స్నపనాభిషేకం జరుగుతుంది. స్నపనాభిషేకం నేపథ్యంలో తెల్లవారుజామున జరిగే ఖడ్గమాలార్చన, నవగ్రహ హోమాన్ని దేవస్థానం రద్దు చేసింది. మిగతా సేవలు యథావిధిగా జరుగుతాయి.



శ్రీశోభకృత్‌కు స్వాగతం

నగరంలో ఉగాది పండుగ సందడి నెలకొంది. తెలుగు వారి నూతన సంవత్సరాది అయిన ఉగాది ప్రకృతితో మమేకమై నిర్వహించే పండుగ. షడ్రుచుల సమ్మేళనంతో తెలుగు లోగిళ్లలో ఉగాది పండుగ కొంగొత్త శోభను తీసుకువచ్చింది. శ్రీశోభకృత్ నామ సంవత్సరానికి స్వాగతం పలుకుతూ చిన్నారులు సంప్రదాయ దుస్తులు ధరించి, ఆనందోత్సాహాలతో వేడుకలను జరిపారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ.

పోటీ పరీక్షలకు 'విజన్'

- 2015 నుంచి ఉచిత శిక్షణ ఇస్తున్న విజన్ ఫౌండేషన్
- ఇప్పటి వరకు 2,600 మంది అభ్యర్థులకు శిక్షణ
- 900 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు
- ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాల నిర్వహణ



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న అధ్యాపకుడు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): యువత జీవిత లక్ష్యం ప్రభుత్వ ఉద్యోగం. అయితే ఆ ఉద్యోగాన్ని పొందాలంటే ఎలా ప్రిపేర్ కావాలి, ఏమి చదవాలి, ఎగ్జామ్ నిర్వహించే విధానం తదితర అంశాలపై పూర్తిగా అవగాహన ఉంటేనే పోటీ పరీక్షల్లో విజయం సాధించగలుగుతాం.

పోటీ పరీక్షల్లో విజయం సాధించాలనే పట్టుదలతో పాటుగా కోచింగ్ కోసం వేలాది రూపాయలను వెచ్చించాలి, ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న పట్టుదల ఉన్నా ఆర్థికంగా వనరులు లేకపోవడంతో చాలా మంది యువత సొంతంగానే ఇంట్లోనే ప్రిపేర్ అవుతుంటారు. వివిధ శాఖలు నిర్వహించే పోటీ పరీక్షల సిలబస్, ఎగ్జామ్ విధానంపై అవగాహన లేక పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేకపోతుంటారు. అలాంటి వారి కోసమే 2015 సంవత్సరంలో అధ్యాపకుడు జి.విజయ్‌కుమార్ విజన్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న యువతీయువకులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. తాను స్వయంగా శిక్షణ ఇవ్వడమే కాకుండా మరికొంత మంది అధ్యాపకులకు తన లక్ష్యాన్ని చెప్పి వారిని కూడా ఈ తరగతుల్లో భాగస్వామ్యం చేస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు 2,600 మంది విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వగా వారిలో 900 మందికి పైగానే యువతీయువకులు వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు పొందారు. ఉచిత శిక్షణకు అభ్యర్థులు విద్యాదర్శిని.ఇన్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి. ఏప్రిల్ 1 తేదీ నుంచి ఎన్టీఆర్ జిల్లా విజయవాడ బెంజిసర్కిల్ సమీపంలోని ఫౌండేషన్ కార్యాలయంలో ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నాయి.

విజన్ ఫౌండేషన్ కార్యక్రమాలు

- వివిధ ప్రభుత్వ శాఖల్లోని ఉద్యోగాలకు, వార్డు, గ్రామ సచివాలయం, బ్యాంకులు, ఆర్‌ఆర్‌బీ, స్టాఫ్ సెలక్షన్ కమిషన్, గ్రూప్-4 మొదలైన ఉద్యోగాలకు ఇక్కడ ఉచిత శిక్షణ ఇస్తారు.
- వేసవి సెలవుల్లో పలు కళాశాలల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తారు. ఏ కళాశాలలో చదువుతున్న వారు అయినా ఈ ఉచిత శిక్షణ తరగతులకు హాజరు కావచ్చు.
- ప్రభుత్వ ఉద్యోగాలకు యువతను ప్రిపేర్ చేయడంతో పాటుగా విజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమాల్లోని వారికి అవసరమైన సహాయ కార్యక్రమాలు నిర్వహించడం, డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలంటూ ప్రచారం, మత్తు పదార్థాలకు అలవాటు పడిన వారికి కౌన్సెలింగ్ ఇప్పించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఫౌండేషన్ సహకారంతో..



ప్రభుత్వ ఉద్యోగం పొందాలన్నా లక్ష్యానికి విజన్ ఫౌండేషన్ ఎంతగానో సహాయం చేసింది. పోటీ పరీక్షలపై అవగాహన కల్పించారు. ఆ సమయంలో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వార్డు సచివాలయాల వ్యవస్థను తీసుకువచ్చారు. ఆ పరీక్షలో ఉత్తీర్ణత సాధించాను. ప్రస్తుతం రామవరప్పాడు గ్రామ సచివాలయంలో పంచాయతీ సెక్రటరీగా విధులు నిర్వర్తిస్తున్నాను.

– ఎస్.వరలక్ష్మి, పంచాయతీ సెక్రటరీ ఉద్యోగం పొందిన యువతి

నా కల నెరవేరింది..



బ్యాంకు పోటీ పరీక్షలకు సంబంధించిన శిక్షణ తరగతులకు హాజరయ్యాను. ఫౌండేషన్ సహకారంతో బ్యాంకు ఉద్యోగం పొందాలన్న నా కల నెరవేరింది. ప్రస్తుతం యూనియన్ బ్యాంక్‌లో క్లర్క్‌గా ఉద్యోగం చేస్తున్నాను.

– ఎం.రవితేజ, బ్యాంక్ ఉద్యోగం పొందిన యువకుడు

ప్రభుత్వ ఉద్యోగాలపై యువత దృష్టి



ప్రభుత్వ ఉద్యోగం పొందాలన్నదే ప్రతి ఒక్కరి కల. సరైన గైడెన్స్ లేకపోవడం వల్ల యువత ప్రభుత్వ ఉద్యోగాలకు దూరం అవుతున్నారు. వారికి అవగాహన కల్పించడంతో విజయం సాధిస్తున్నారు. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్స్ ఇస్తున్నారు. యువత ప్రభుత్వ ఉద్యోగాలపై దృష్టి పెడుతున్నారు.

– జి.విజయ్‌కుమార్, విజన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు.

విద్యార్థినులపై హెచ్‌ఎం అసభ్యకర ప్రవర్తన..

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించిన ప్రధానోపాధ్యాయుడికి దేహశుద్ధి చేసి దిశ పోలీసులకు అప్పగించిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలంలోని షాబాద్ ఎంపీపీ స్కూల్‌లో కె.రామసాయి ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఎంపీపీ పాఠశాలలో మంగళవారం వార్షికోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులందరినీ హెచ్‌ఎం ఒక గదిలో సమీకరించి వారి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో విద్యార్థినులు భయాందోళనలకు గురై ఇంటికి వెళ్లిపోయారు. ఇంటికి వచ్చిన వారిని ఆరా తీసిన తల్లిదండ్రులు గ్రామస్తుల సాయంతో హెచ్‌ఎం రామసాయికు దేహశుద్ధి చేశారు. ఘటనపై బాలికల తల్లిదండ్రులు దిశ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు వైద్య పరీక్షల నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

హెచ్‌ఎం సస్పెన్షన్..

విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన హెచ్‌ఎం రామసాయిని సస్పెండ్ చేస్తూ డీఈఓ సీవీ రేణుక ఉత్తర్వులు జారీ చేశారు. ఘటనపై విజయవాడ రూరల్ ఎంఈఓ సమర్పించిన నివేదిక ఆధారంగా హెచ్‌ఎంను సస్పెండ్ చేసినట్లు డీఈఓ తెలిపారు.

సంపూర్ణ పోషకాహారమే
ప్రభుత్వ లక్ష్యం



మొగల్రాజపురం బీఎస్‌ఆర్‌కేఎం హైస్కూల్‌లో రాగి జావ అందుకున్న ఆనందంలో విద్యార్థినులు

జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులకు సంపూర్ణ పోషకాహారాన్ని అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. విద్యార్థులు ఆరోగ్యవంతులుగా ఉంటేనే చదువుపై శ్రద్ధ పెట్టగలరని, ఆ సంకల్పంతోనే జగనన్న గోరుముద్దలో మరో పోషకాహారమైన రాగి జావ పంపిణీ కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులకు రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని నగరంలోని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ ఢిల్లీరావు ప్రజాప్రతినిధులు, విద్యార్థులతో కలిసి ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. అనంతరం విద్యార్థులకు రాగి జావ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన పథకంలో సమూల మార్పులు చేసిందన్నారు. జగనన్న గోరుముద్ద ద్వారా రోజుకో మెనూ అమలు చేస్తూ పోషక విలువలతో కూడిన రుచికరమైన ఆహారాన్ని అందిస్తోందని చెప్పారు. ప్రతి మంగళ, గురు, శనివారాల్లో బెల్లంతో కూడిన రాగి జావను అందించే కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు.



విద్యార్థులతో ఎమ్మెల్సీ రుహుల్లా, కలెక్టర్ ఢిల్లీరావు, ఎమ్మెల్యేలు వెలంపల్లి, విష్ణు తదితరులు

జిల్లాలో 1.25 లక్షల మందికి గోరుముద్ద

జిల్లా వ్యాప్తంగా 921 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలకు చెందిన 1.25 లక్షల మంది విద్యార్థులకు మూడు రోజులు రాగి జావను అందించనున్నట్లు కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణువర్ధన్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా సీఎం వైఎస్ జగన్ 38 లక్షల మంది విద్యార్థులకు రాగి జావను అదనపు పోషకాహారంగా అందిస్తున్నారన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల తరఫున సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా మార్చాలన్నదే జగనన్న లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, డీఈఓ సీవీ రేణుక, డీఐ రవికుమార్, కార్పొరేషన్ల చైర్మన్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలి

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



ఎమ్మెల్యే మల్లాది విష్ణు చేతుల మీదుగా పురస్కారాలు అందుకున్న ప్రముఖులు


విజయవాడ కల్చరల్: ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. కళామంజరి సాంస్కృతిక సేవా సంస్థ, సి రామ్మోహనరావు కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శోభకృత్ ఉగాది వేడుకల సందర్భంగా దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ కళాశాలలో కళామంజరి విశిష్ట పురస్కారాల కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఏటా వివిధ రంగాల్లోని ప్రముఖులను గుర్తించి వారికి విశిష్ట సేవా పురస్కారాలను ప్రదానం చేస్తున్న నిర్వాహకుల కృషిని అభినందించారు. శాతవాహన కళాశాల కరస్పాండెంట్ రమాసత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం కవులు కళాకారుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ కళాకారుల జీవితాలు సాంస్కృతిక రంగానికి అంకితం చేయాలన్నారు. ఉత్సవంలో జిల్లా వినియోగదారుల సంఘం సభ్యులు ఏవీ రమణ పాల్గొన్నారు.

పురస్కారాల ప్రదానం

కళామంజరి వ్యవస్థాపకుడు పీవీఎల్ నృసింహం, రామ్మోహనరావు కల్చరల్ ఆర్గనైజేషన్ నిర్వాహకుడు చివుకుల హరగోపాల్ నిర్వహణలో వివిధ రంగాలకు చెందిన ఏబీ ఆనంద్, రాళ్లబండి శ్రీరామమూర్తి, నోరి నారాయణమూర్తి, వేమూరి నాగేశ్వర శర్మ, పీవీఆర్ శివశర్మ, పీ ప్రసూనా రామన్, ఎన్‌సీహెచ్ లక్ష్మి, పి.లక్ష్మీతులసి, బొర్రా వెంకటనారాయణ, ఎం.శశికుమారి, జె.శరణ్యకు కళామంజరి విశిష్ట పురస్కారాలను ప్రదానం చేశారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా శరణ్య కూచిపూడి నృత్య ప్రదర్శన, నోరి నారాయణ మూర్తి ఉగాది వైశిష్ట్యం ఆధ్యాత్మిక ప్రసంగం, ఎన్‌సీహెచ్ లక్ష్మి సంగీతార్చన, గంగుల నాగేశ్వరరావు సీతారామరాజు ఏక పాత్రాభినయం ఆకట్టుకున్నాయి

ఏ ఒక్క రైతూ నష్టపోకూడదు

మంత్రి జోగి రమేష్



పెడనలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్

పెడన: ఇటీవల కురిసిన వర్షాలకు ఏ ఒక్క రైతూ నష్టపోకుండా వ్యవసాయశాఖ పటిష్ట చర్యలు తీసుకోవాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖమంత్రి జోగి రమేష్ ఆదేశించారు. స్థానిక పెడన మార్కెట్ కమిటీ సమావేశం హాలులో మంగళవారం జిల్లా, మండల అధికారులు ప్రజాప్రతినిధులతో వివిధ శాఖలపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో పంటను పరిశీలించి వాస్తవ పరిస్థితులను చూసి పంటను నమోదు చేయాలని స్పష్టం చేశారు. పంట నమోదు విషయంలో రైతులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మినుము, వేరుశనగ సహా అన్ని పంటల నష్టం వివరాలను తనకు అందజేయాలని అధికారులకు సూచించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను తెరిచినా ఆన్‌లైన్ కాకుండా ఆఫ్‌లైన్‌కు అవకాశం కల్పించాలని పలువురు ప్రజాప్రతినిధులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటామని మంత్రి వారికి హామీ ఇచ్చారు. రానున్న పంటలకు ముందుగా పంట కాలువలు, డ్రెయినేజీల ద్వారా సాగు, మురుగునీరు పారుదల సక్రమంగా ఉండేలా ఇప్పటి నుంచే పటిష్ట చర్యలు చేపట్టాలని ఆయా శాఖల అధికారులను మంత్రి ఆదేశించారు. రానున్న వేసవి దృష్ట్యా తాగునీటికి ఇబ్బందులు లేకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం రెవెన్యూ, మున్సిపల్, వెలుగు తదితర శాఖలపై సమీక్షించారు. సమావేశంలో మచిలీపట్నం ఆర్డీఓ ఐ.కిషోర్, జిల్లా వ్యవసాయశాఖాధికారి మనోహరరావు, సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ శ్రీధర్, ఎంపీపీలు వాణి, మధుసూదనరావు, చినబాబు, గరుడప్రసాద్, జెడ్పీటీసీలు రత్నకుమారి, సురేష్ రంగబాబు, తహసీల్దార్‌లు, ఎంపీడీఓలు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

నందిగామ ఇక మునిసిపాలిటీ



నందిగామ: మునిసిపాలిటీగా నందిగామ అప్‌గ్రేడ్ అయిందని నగర పంచాయతీ కమిషనర్ డాక్టర్ జయరాం మంగళవారం రాత్రి తెలిపారు. పట్టణాన్ని సెకండ్ గ్రేడ్ మునిసిపాలిటీగా ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొన్నారు. 1930 నుంచి గ్రామ పంచాయతీగా ఉన్న నందిగామ 2011లో నగర పంచాయతీగా అవతరించింది. పెరిగిన జనాభా, వస్తున్న ఆదాయాన్ని బట్టి ప్రభుత్వం మునిసిపాలిటీగా మారుస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని కమిషనర్ తెలిపారు. నందిగామ నియోజకవర్గ కేంద్రంగా, ప్రధాన వ్యాపార కూడలిగా ఉంది. ఇటీవల ప్రభుత్వం నందిగామను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా చేసింది. ఈ నేపథ్యంలో పట్టణం మరింతగా విస్తరించనుంది. ఇప్పటికే 50 వేల మందికి పైగా జనాభా ఉంది. ఈ జనాభా రాబోయే రోజుల్లో మరింత పెరగనుంది. అందుకు తగినట్లు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యం

గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్



పెడన బీజీకే జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేస్తున్న మంత్రి జోగి రమేష్

పెడన: విద్య పరంగా ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ప్రథమ స్థానంలో నిలబెట్టేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు చేపట్టారని గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. పెడనలోని భట్ల జ్ఞానకోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం రాగిజావ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి రమేష్ జ్యోతి ప్రజ్వలన చేసి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్య పరంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇప్పటికే సంచలనాత్మక మార్పులు తీసుకొచ్చారని కొనియాడారు. పేద విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్యను అందించడానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుక కిట్‌లు, జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, మన బడి నాడు – నేడు కింద పాఠశాలలు ఆధునికీకరణ వంటి ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తున్నారని వివరించారు. విద్యార్థుల బంగారు భవిష్యత్ కోసం ముఖ్యమంత్రి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. తాజాగా ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను అందించారని గుర్తు చేశారు. ఇప్పుడు ట్యాబ్‌లు తీసుకున్న విద్యార్థులు సీబీఎస్‌ఈ సిలబస్ ద్వారా 2025 సంవత్సరం నాటికి దేశంలోని ఇతర విద్యార్థులకు దీటుగా పోటీ పడతారని ఆకాంక్షించారు. ఇప్పుడు విద్యార్థులకు బలవర్ధకమైన పోషకాహారంగా రాగిజావను ఉదయం పూట అందించేలా చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు. కృష్ణా జిల్లా వ్యాప్తంగా 1,365 పాఠశాలల్లో సుమారు లక్ష మందికిపైగా విద్యార్థులకు రాగి జావ అందుతుందని తెలిపారు. పెడన నియోజకవర్గంలో 16,689 మంది విద్యార్థులకు రాగి జావ అందుతుందని వివరించారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులను ప్రేమగా చూసుకోవాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ స్థాయి ప్రదర్శనకు ఎంపికైన 'స్మార్ట్ సొల్యూషన్ ఫర్ ఏకో పొల్యూషన్' ప్రాజెక్టును రూపొందించిన ఉపాధ్యాయిని లక్ష్మీదేవి, విద్యార్థులు మణికంఠ, వినయ్‌కుమార్‌ను, అథ్లెటిక్స్‌లో అంతర్జాతీయ స్థాయికి ఎంపికైన పాఠశాల పూర్వ విద్యార్థిని భండారు అనురాధను మంత్రి జోగి రమేష్ సభా ముఖంగా అభినందించి సత్కరించారు. అనంతరం తొమ్మిదో తరగతిలో అత్యధిక మార్కులు పొందిన విద్యార్థినులు సుమ, త్రయంబకకు కోరమండల్ ఫెర్టిలైజర్స్ తరఫున రూ.5 వేల చొప్పున నగదు బహుమతులను మంత్రి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజులపాటి వాణి, ఏఎంసీ చైర్‌పర్సన్ గరికిపాటి చారుమతి, మునిసిపల్ చైర్‌పర్సన్ భళ్ల జ్యోత్స్నరాణి, మునిసిపల్ వైస్ చైర్మన్లు ఎండీ ఖాజా, బి.జ్యోతి, ఫ్లోర్ లీడర్ కటకం ప్రసాద్, తహసీల్దారు పి.మధుసూదనరావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ సుబ్బారావు, మునిసిపల్ కమిషనర్ అంజయ్య, డీవైఈఓ యు.వి.సుబ్బారావు, ఎంఈఓ మెటల్దారాణి, హెచ్ఎం జయలక్ష్మి, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కంచికచర్ల పీహెచ్‌సీ వైద్యుల సేవలు స్ఫూర్తిదాయకం

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



కంచికచర్ల పీహెచ్‌సీ వైద్యులను సత్కరిస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆరోగ్య నాణ్యతా ప్రమాణాల నిర్వహణలో నిర్దేశించిన లక్ష్యాలను సాధించి జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకు పొందిన కంచికచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది సేవలు స్ఫూర్తి దాయకమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే వైద్యులు, సిబ్బంది వారిని స్ఫూర్తిగా తీసుకుని పని చేయాలని సూచించారు. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దేశంలోని వివిధ ఆరోగ్య సంస్థల జాతీయ నాణ్యత ప్రమాణాల గుర్తింపులో భాగంగా అత్యుత్తమ ర్యాంక్ సాధించిన కంచికచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బందిని కలెక్టరేట్‌లో కలెక్టర్ ఢిల్లీరావు మంగళవారం సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆరోగ్య సంస్థల జాతీయ నాణ్యత ప్రమాణాల గుర్తింపులో కంచికచర్ల పీహెచ్‌సీ దేశంలోనే 90.15 శాతం మార్కులతో జిల్లాకు గుర్తింపు తీసుకురావడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య, ఆరోగ్య రంగానికి అత్యధికంగా కోట్లాది రూపాయలు కేటాయిస్తోందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుని వైద్యాధికారులు సేవలందించాలన్నారు. ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రవేశ పెట్టి ప్రతి పేదలందరికీ మెరుగైన వైద్య సేవలను చేరువచేసిందన్నారు. ప్రజలకు వైద్యులే నిజమైన దేవుళ్లని, సమాజం ఆరోగ్యంగా ఉండాలంటే మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. గ్రామాల్లో నిర్వహించే విలేజ్ క్లినిక్‌లు, గ్రామీణ, పట్టణ ఆరోగ్య కేంద్రాలు ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రుల ద్వారా రోగులకు మెరుగైన సేవలందించి ప్రజల మన్ననలను పొందాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజల్లో నమ్మకం పెంచేందుకు వైద్యాధికారులు, సిబ్బంది కృషి చేయాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుహాసిని పర్యవేక్షణలో జాతీయ నాణ్యత ప్రమాణాలు గుర్తింపులో అత్యుత్తమ ర్యాంక్ సాధించిన కంచికచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ శ్రావణ్, డాక్టర్ మధురిమ, వైద్య సిబ్బంది డి.షీబా, జాతీయ హెల్త్ మిషన్ డీపీఎంఓ డాక్టర్ నవీన్‌ను కలెక్టర్ ఢిల్లీరావు సత్కరించారు.

ఘనంగా శోభకృత్ నామ సంవత్సర వేడుకలు




ఉగాది పురస్కార గ్రహీతలతో మేయర్ రాయన భాగ్యలక్ష్మి, హజరత్తయ్యగుప్తా తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, అన్న సంతర్పణ సమితి ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం శోభకృత్ నామ సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. విజయవాడ మహాత్మాగాంధీ రోడ్డు లోని నలంద డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మైనారిటీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఏఎండీ ఇంతియాజ్ మాట్లాడుతూ.. సంస్కృతి, సంప్రదా యాలకు భారతదేశం పుట్టినిల్లు వంటిదన్నారు. ఉగాది కవి సమ్మేళనంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ మహిళ గురించి కవిత వినిపించారు. ప్రముఖ సాహితీవేత్త హజరత్తయ్య గుప్తా నవ వర్ష శుభాకాంక్షలు అనే కవితను చదివారు. మరో అతిథి మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. ఉగాది ప్రాముఖ్యతను వివరించారు. తొలుత కవి సమ్మేళనాన్ని నిర్వహించారు. అనంతరం వివిధ రంగాల ప్రముఖులను సత్కరించారు. గన్నవరానికి చెందిన డాక్టర్ లాల్ సాహేబ్ సయ్యద్, విజయవాడకు చెందిన అనీష, తాడేపల్లి గూడెంనకు చెందిన గుదే సుబ్బారావు, ఈదరకు చెందిన అయ్యంకి సురేష్‌బాబు, నెల్లూరుకు చెందిన అవధానం భారతిని ఉగాది పురస్కారాలతో సత్కరించారు. నలంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ, నిర్వాహకులు కె.మురళీమోహన్‌రాజు, దిలీప్, రెజీనా, పలువురు కవులు, రచయితలు పాల్గొన్నారు.



కోదండరాముడిగా నృసింహస్వామి

మంగళగిరి: నగరంలో వేంచేసియున్న శ్రీ లక్ష్మీ నృసింహస్వామి ఆస్థాన అలంకారోత్సవాల్లో భాగంగా మంగళవారం కోదండరాముడి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం శ్రీరామ పట్టాభిషేకం నిర్వహించిన అర్చకులు సాయంత్రం స్వామిని కోదండరాముడి అలంకారం చేసి ప్రత్యేక పూజలు జరిపించారు. స్వామి వారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. శ్రీరామ పట్టాభిషేకం కైంకర్యపరులుగా గుంటూరుకు చెందిన కారుమంచి మురళీసాయి, కోదండ రాముడి అలంకారానికి కైంకర్యపరులుగా మంగళగిరికి చెందిన కుంచాల హరినాథ ప్రసాద్ బ్రదర్స్ వ్యవహరించారు.



యువకుడి బలవన్మరణం

పెనమలూరు: మండల కేంద్రమైన పెనమలూరులో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. సీఐ గోవిందరాజు కథనం మేరకు.. పెనమలూరులో బీజేఆర్‌గర్‌కు చెందిన జంపన సౌజన్య కుమారుడు జంపన సందీప్(24), కుమార్తె సౌమ్య ఉన్నారు. ఆమె భర్త సుధీర్ 13 సంవత్సరాల క్రితం మృతిచెందాడు. సందీప్ తరచూ కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. మంగళవారం మధ్యాహ్నం తల్లి ఇంట్లో లేని సమయంలో సందీప్ సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకున్నాడు. ఇంటికి వచ్చిన సౌజన్యకు సందీప్ ఉరికి వేలాడుతూ కనిపించడంతో భోరున విలపించింది. ఇరుగుపొరుగు వారు వచ్చి సందీప్‌ను కిందకు దించి, 108 అంబులెన్స్‌లో విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే సందీప్ మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

యార్డులో 1,10,930 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): మిర్చి మార్కెట్ యార్డుకు మంగళవారం 1,08,513 బస్తాల మిర్చి వచ్చింది. నిల్వలతో కలిపి ఈనామ్ విధానంలో 1,10,930 బస్తాలు విక్రయించారు. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి క్వింటా సగటు ధర రూ.9 వేల నుంచి రూ.25,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9 వేల నుంచి రూ.27,500 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,500 నుంచి రూ.13,500 వరకు ధర లభించింది. మంగళవారం నాటి విక్రయాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 87,961 బస్తాల మిర్చి నిల్వ ఉందని యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

30 కల్లా పంట నష్టం నమోదు పూర్తికావాలి

కృష్ణా జిల్లా వ్యవసాయాధికారి మనోహరరావు

కంకిపాడు(పెనమలూరు): అకాల వర్షానికి జరిగిన పంట నష్టం నమోదు ప్రక్రియను ఈ నెల 30వ తేదీ నాటికి పూర్తి చేయాలని కృష్ణా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్.వై.వి.ఎస్.మనోహరరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ గోపాలకృష్ణ ద్వివేది, స్పెషల్ కమిషనర్ హరికిరణ్ మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాఖ జిల్లా కార్యాలయం నుంచి మనోహరరావు పాల్గొన్నారు. అకాల వర్షాలు, పంట నష్టం నమోదు తదితర అంశాలపై గోపాలకృష్ణ ద్వివేది, హరికిరణ్ పలు సూచనలు చేసి, మార్గదర్శకాలు జారీ చేశారు. అనంతరం నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి మనోహరరావు మాట్లాడుతూ.. కోస్తాంధ్రపై ఏర్పడ్డ ద్రోణి ప్రభావంతో గురువారం నుంచి జిల్లా వ్యాప్తంగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడ్డాయన్నారు. వర్షాల కారణంగా మినుము, పెసర, మొక్కజొన్న, జొన్న, వేరుశనగ, పసుపు ఇతర పంటలకు జరిగిన నష్టాలను సమర్థంగా నమోదు చేయాలని ఆదేశించారు. నమోదు ప్రక్రియ ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా ఈ నెల 30వ తేదీ నాటికి పూర్తి కావాలని స్పష్టంచేశారు. ఏప్రిల్ ఒకటి నుంచి మూడో తేదీ వరకూ సామాజిక తనిఖీ నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. నాలుగో తేదీన తుది జాబితాను కమిషనరేట్‌కు సమర్పించాల్సి ఉందన్నారు. గ్రామస్థాయి, మండల స్థాయి, డివిజన్ స్థాయి బృందాలు అకాల వర్షాల కారణంగా జరిగిన పంట నష్టాన్ని సమగ్రంగా, సమర్థంగా నమోదు చేసి నివేదికలను రూపొందించాలని స్పష్టంచేశారు. సమీక్షలో జిల్లా ఉద్యానశాఖ అధికారి జ్యోతి, పలువురు డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యాభివృద్ధికి పోషణ్ పక్వాడా

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): చిన్నారుల్లో రక్తహీనత, బరువు, పౌష్టికాహార లోపాలను నివారించి, వారి ఆరోగ్యాన్ని పరిరక్షించేదుకు ఎన్టీఆర్ జిల్లాలో 15 రోజుల పాటు పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. పోషణ్ పక్వాడా కార్యక్రమ నిర్వహణపై నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో ఆయన మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఏప్రిల్ మూడో తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించే ఈ కార్యక్రమాన్ని అధికారుల సమన్వయంతో విజయవంతం చేయాలని సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో గ్రామాల్లో చిరుధాన్యాల ప్రదర్శన నిర్వహించి వాటి వినియోగాన్ని వివరించాలని పేర్కొన్నారు. గర్భిణులు, కౌమార దశ బాలికలు, చిన్నారులకు పౌష్టికాహారంపై నిపుణులతో కమ్యూనిటీ ఆధారిత కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఆరు సంవత్సరాలు పైబడిన పిల్లల ఎత్తు, బరువు నమోదు చేసి వారిలో పౌష్టికాహారం లోపం ఉన్న పిల్లల వివరాలు సేకరించాలని ఆదేశించారు. పక్వాడా ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి విజయకుమారి, డీఈఓ సి.వి.రేణుక, డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పెనమలూరులో మాజీ బిల్లు కలెక్టర్ చేతివాటం

రూ.47 లక్షల మేర గోల్‌మాల్

పెనమలూరు: మండల కేంద్రమైన పెనమలూరు పంచాయతీలో గతంలో బిల్లు కలెక్టర్‌గా పని చేసిన షేక్ షంషుద్దీన్ చేతివాటం చూపారు. ఆయన పని చేసిన సమయంలో దాదాపు రూ.47 లక్షల మేర స్వాహా చేశారు. ఈ వ్యవహారం ఆలస్యంగా వెలుగు చూసింది. అతను ఐదు నెలల క్రితం చోడవరం గ్రామ పంచాయతీకి బదిలీ అయ్యారు. అక్కడ రెండు నెలలు పనిచేసిన తరువాత పరారయ్యారు. షంషుద్దీన్ 2016 సంవత్సరం నుంచి పెనమలూరులో బిల్లు కలెక్టర్‌గా విధులు నిర్వహించారు. ఇంటి పన్నుల రూపంలో వసూలు చేసిన సొమ్మును ట్రెజరీకి జమ చేయలేదు. గత ఏడాది జూలైలో అతను చోడవరం పంచాయతీకి బదిలీ అయ్యారు. పెనమలూరులో రికార్డులు అప్పగించ లేదు. అక్కడ రెండు నెలలు పనిచేసి పరారయ్యారు. పరారీకి ముందు తన కుమార్తెకు విజయవాడలో భారీగా ఖర్చుచేసి వివాహం జరిపించారని సమాచారం.

అన్నీ అనుమానాలే...

బిల్లు కలెక్టర్ పెద్ద మొత్తంలో ఇంటి పన్నుల సొమ్ము ట్రెజరీకి జమ చేయకపోయినా పంచాయతీలో పని చేసిన కార్యదర్శులు, ఆడిట్ అధికారులు ఏమి చేశారనే ప్రశ్న తలెత్తుతోంది. అతనికి చోడవరం బదిలీ అయిన సమయంలో రికార్డులు అప్పగించకుండా ఎలా రిలీవ్ చేశారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బకాయిల జాబితా(ఏడీఆర్)ను ఎందుకు తనిఖీ చేయలేదని, దీనికి బాధ్యులు ఎవరని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఇంత వరకు అధికారులు విచారణ చేయకపోవడం, సొమ్ము రికవరీ చేసి, అతనిపై శాఖపరమైన చర్యలు ఎందుకు తీసుకోలేదన్న ప్రశ్నలు వస్తున్నాయి. బిల్లు కలెక్టర్ షంషుద్దీన్‌పై ఉన్నతాధికారులకు పంచాయతీ కార్యదర్శి రాధాకృష్ణ ఫిర్యాదు చేసినా ఇంత వరకు చర్యలు తీసుకోలేదని సర్పంచి లింగాల భాస్కరరావు ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి విచారణ జరిపించి, సొమ్ము రికవరీకి చేయాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

విచారణ చేసి చర్యలు తీసుకుంటాం

పెనమలూరులో పని చేసిన బిల్లు కలెక్టర్‌పై పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు అందిందని డీపీఓ నాగేశ్వరనాయక్ తెలిపారు. బిల్లు కలెక్టర్‌ను సస్పెండ్ చేస్తామని, విచారణ అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

సామాజిక ప్రవర్తనలో మార్పు తీసుకురావాలి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సోషల్ బిహేవియర్ చేంజ్ కమ్యూనికేషన్ (ఎస్‌బీసీసీ) సెల్ సభ్యులు సమర్థవంతంగా విధులు నిర్వర్తించి సామాజిక మార్పునకు కృషి చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు సూచించారు. జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్‌బీసీసీ సెల్‌ను నగరంలోని తన కార్యాలయంలో కలెక్టర్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులను ఉద్దేశించి కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ.. సమాజంలో సామాజిక ప్రవర్తనలో మార్పు తీసుకొచ్చేందుకు దోహదపడే కార్యక్రమాల నిర్వహణకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్య, వైద్యం, ఆరోగ్య రంగాలపై ఈ సెల్ ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. బాల్య వివాహాల నివారణ, లైంగిక వేధింపులు, మత్తు పదార్థాలను అరికట్టడంతో పాటు చిన్నారులు, కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతల్లో రక్త హీనత లోపాన్ని నివారించడం వంటి కార్యక్రమాలను చేపట్టి సామాజిక ప్రవర్తనలో మార్పులు తీసుకురావాలన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. సామాజిక ప్రవర్తనపై ప్రజల్లో అవగాహన కల్పించేలా పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించాని అధికారులకు కలెక్టర్ ఢిల్లీరావు సూచించారు. గ్రామ/వార్డు సచివాలయ ప్రత్యేక అధికారి కె.అనురాధ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.సుహాసిని, డెప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ నళిని, డీఈఓ సి.వి.రేణుక, మార్పు ట్రస్ట్‌చైర్మన్ ఆర్.సూయిజ్, చైల్డ్ లైన్ జిల్లా కో ఆర్డినేటర్ అరవ రమేష్, టాటా ట్రస్ట్ ప్రతినిధి శ్రీనివాస్, ఎస్‌బీసీసీ సెల్ జిల్లా కో ఆర్డినేటర్ ఎన్.నీలాకాంతి తదితరులు పాల్గొన్నారు.

నేడు పన్నులు చెల్లించవచ్చు

పటమట(విజయవాడతూర్పు): ఉగాది సందర్భంగా బుధవారం సెలవు ఉన్నప్పటికీ విజయవాడ నగరపాలక సంస్థ మూడు సర్కిళ్ల పరిధిలోని ఆయా క్యాష్ కౌంటర్లల్లో వీఎంసీకి చెల్లించాల్సిన ఆస్తి పన్ను బకాయిలు కట్టించుకుంటామని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ మంగళవారం తెలిపారు.

విద్యార్థులందరికీ పౌష్టికాహారం

ఆటోనగర్(విజయవాడతూర్పు): జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా మంగళవారం 15వ డివిజన్ రామలింగేశ్వరనగర్ గాయత్రిరోడ్డులోని వీఎంసీ రౌండ్ టేబుల్ స్కూల్ విద్యార్థులకు డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ రాగి జావ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న గోరుముద్ద పథకం ద్వారా ప్రతి విద్యార్థికీ పౌష్టికాహారం అందుతోందన్నారు. హెచ్ఎం వి.రవిశంకర్ పాల్గొన్నారు.

గుణదలలో..

గుణదల(విజయవాడ తూర్పు): పాఠశాల విద్యార్థులకు పౌష్టికాహారం అందించే దిశగా ప్రభుత్వం జగనన్న గోరుముద్ద పథకాన్ని అమలు చేస్తోందని మూడో డివిజన్ కార్పొరేటర్ భీమిశెట్టి ప్రవల్లిక అన్నారు. గుణదలలోని దాసరి గిరిధర్ కుమార్ అవంతి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం చిన్నారులకు రాగి జావ అందజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి పాల్గొన్నారు.



విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేస్తున్న డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ



రాగి జావ పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ కొండారెడ్డి

కృష్ణలంకలో..

కృష్ణలంక(విజయవాడతూర్పు): కృష్ణలంక, 22వ డివిజన్‌లోని ఎస్.వి. రెడ్డి హైస్కూల్, మలేరియా హాస్పిటల్ వద్ద ఉన్న ఉర్దూ స్కూల్ విద్యార్థులకు స్థానిక కార్పొరేటర్ తాటిపర్తి కొండారెడ్డి మంగళవారం రాగిజావ పంపిణీ చేశారు.

నేడు సిద్ధార్థ ఆడిటోరియంలో పంచాగ శ్రవణం

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): శోభకృత్ నామ సంవత్సర ఉగాది సందర్భంగా బుధవారం ఉదయం 9.30 గంటలకు తమ సంస్థ ఆధ్వర్యంలో సిద్ధార్థ ఆడిటోరియంలో డాక్టర్ కప్పగంతు రామకృష్ణ ఆధ్వర్యంలో పంచాగ శ్రవణం నిర్వహిస్తున్నామని ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం అధ్యక్షుడు సీ నాగేశ్వరరావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

కమ్మని దక్షిణాది రుచుల ఫెస్టివల్



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఉగాది సంబరాల పేరుతో ఎంజీ రోడ్డులోని హోటల్ ఫార్చ్యూన్ మురళీ పార్క్‌లో కమ్మని దక్షిణాది రుచుల ఫుడ్ ఫెస్టివల్ మంగళవారం ప్రారంభమైంది. హోటల్‌లోని జుడియాక్ రెస్టారెంట్‌లో ఏర్పాటు చేసిన ఫెస్టివల్‌లోని వంటకాలు నోరూరిస్తున్నాయి. ఉగాదిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ ఫెస్టివల్‌లో ఆంధ్రా రీజియన్, రాయలసీమ, కోనసీమ, తెలంగాణాలో ప్రసిద్ధి చెందిన వంటకాలను అందుబాటులో ఉంచారు. నగర వాసులు కోసం విభిన్న రుచులతో ఫెస్టివల్‌ను ఏర్పాటు చేసినట్లు హోటల్ జీఎం ఎంవీఎస్ విజయ్‌కృష్ణ తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం



అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న దేవినేని అవినాష్

ఆటోనగర్(విజయవాడతూర్పు): అసెంబ్లీలో వైఎస్సార్ సీపీ ఎస్సీ ఎమ్మెల్యేపై దాడిని నిరసిస్తూ రామలింగేశ్వనగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి మంగళవారం విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్, డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గా పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా దేవినేని అవినాష్ మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో టీడీపీ ఎమ్మెల్యేలు గూండాలుగా ప్రవర్తించారన్నారు. చంద్రబాబు అహంకారంతో టీడీపీ ఎమ్మెల్యేలు కక్షను మనసులో పెట్టుకుని ప్రతి అసెంబ్లీ సమావేశాల్లో స్పీకర్ ను అవమానపరిచే విధంగా వ్యవహరించడం మంచి పద్ధతికాదన్నారు. పేపర్లు చింపి స్పీకర్‌పై వేయడం, అసభ్య పదజాలంతో దూషించడం హేయమైన చర్యగా ఆయన అభివర్ణించారు. అసెంబ్లీ సమావేశాలకు రాని చంద్రబాబు ఆ పార్టీ ఎమ్మెల్యేలను ఆదేశాలిస్తూ ఇలాంటి విధానాలకు పాల్పడటం ప్రజలు చూస్తున్నారన్నారు.

పార్టీలకతీతంగా పథకాల అమలు



సంక్షేమ పథకాలను వివరిస్తున్న దేవినేని అవినాష్, బెల్లం దుర్గ

ఆటోనగర్(విజయవాడతూర్పు): పార్టీలతో సంబంధం లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేసున్నామని తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ పేర్కొన్నారు. 15వ డివిజన్ రామలింగేశ్వరనగర్‌లోని రజిత్ భార్గవ్, రఘు రోడ్డు ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విజయవాడ వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందిన తీరును ఆయన పలు వీధు ల్లోని మహిళలను అడిగి తెలుసుకున్నారు. ఏ ఇంటికి వెళ్లినా సంక్షేమ పథకాలు రావడంతో ఆనందంగా ఉన్నామని చెప్పారు. ఈ ప్రాంతంలో తాగునీరు సన్నధారగా వస్తున్నాయని, వేసవిలో ఈ సమస్య రాకుండా నగరపాలక సంస్థ అధికారులు చర్యలు తీసుకుని పరిష్కరించాలని పలువురు మహిళలు కోరారు. అనంతరం అవినాష్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 15వ డివిజన్‌లో సుమారు రూ.12 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. మౌలిక సదుపాయాలు కల్పించినట్టు చెప్పారు. గత స్థానిక కార్పొరేషన్ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థిని ఓడించేందుకు పక్క పార్టీలతో కుమ్మక్కయినప్పటికీ ఫలితం లేకుండా పోయిందన్నారు. ప్రజల నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా నిరంతరం ఇక్కడ అభివృద్ధి చేస్తున్నామన్నారు. డిప్యూటీ మేయ ర్ బెల్లం దుర్గ మాట్లాడుతూ ప్రజలు అడిగిన ప్రతి సమస్యను పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. నిరంతరం స్థానికులకు అందుబాటులో ఉంటామన్నారు. కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ వెంకట సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు చెల్లారావు, సత్యనారాయణ, కొప్పినేని సీతయ్య, మస్తాన్ పాల్గొన్నారు.

మొబైల్ కోర్టులో పలువురికి జరిమానా



విచారిస్తున్న జడ్జి రామ్మోహనరావు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరవీధులలో ప్రజలకు అవాంతరం కలగించే వారికి మున్సిపల్ కోర్టు న్యాయమూర్తి రామ్మోహనరావు జరిమానా విధించారు. మంగళవారం ఆయన సర్కిల్-1 పరిధిలోని శానిటరీ ఇన్‌స్పెక్టర్ 25 మందిపై కేసులు నమోదు చేయగా వారిని విచారించారు. అందులో ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహిస్తున్న వారిని, పశువులను రోడ్ల పైకి వదిలే వారిని, రోడ్లపై చెత్త వేసే వారిని విచారించి వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం వారందరికీ జరిమానా విధించి హెచ్చరించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి రామ్మోహన్ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలను అమలు చేయాల్సిన బాధ్యత అందరిపై ఉంది, ప్లాస్టిక్ రహిత నగరంగా మార్చేందుకు శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సెక్రెటరీలు, కూడా నిత్యం ఆయా డివిజన్లలో ప్లాస్టిక్ విక్రయ షాపులను తనిఖీ చేసి విధిగా ప్లాస్టిక్ బ్యాన్ అమలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ సురేష్‌బాబు, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సెక్రెటరీలు పాల్గొన్నారు

ధ్యాన సాధనతో ఆధ్యాత్మిక వికాసం

కృష్ణలంక(విజయవాడతూర్పు): సహజయోగ ధ్యాన సాధనతో శారీరక, మానసిక, భౌతిక, ఆధ్యాత్మిక వికాసం పొందవచ్చని ఆధ్యాత్మిక వికాసం సహజయోగ ట్రస్ట్ ప్రతినిధి పి.విజయలక్ష్మి పేర్కొన్నారు. కృష్ణలంకలోని పచ్చమేడ బజార్‌లో గత మూడు రోజులుగా జరుగుతున్న ఉచిత సహజ యోగ సామూహిక ధాన్య శిక్షణ తరగతులు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా ప్రపంచానికి సహజయోగ ధ్యానాన్ని అందించిన మాతాజీ నిర్మలాదేవి 100వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని దీపోత్సవం నిర్వహించారు.

ముస్లిం మైనారిటీల సంక్షేమానికి పెద్ద పీట



మసీదు పన్ను బకాయిలు చెల్లించిన రసీదును కమిటీ సభ్యులకు అందజేస్తున్న దేవినేని అవినాష్

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాష్ట్రంలోని ముస్లిం మైనారిటీల సంక్షేమానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేశారని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. రాణిగారితోట, 17వ డివిజన్‌లోని మస్జిద్ ఇ దారుస లాంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మసీదు పన్ను బకాయిల మాఫీ పత్రాన్ని, దేవినేని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా చెల్లించిన రసీదును మసీదు కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డివిజన్‌లో పర్యటించినప్పుడు మసీదు కమిటీ సభ్యులు పన్ను బకాయిలను తన దృష్టికి తీసుకొచ్చారని, వెంటనే కలెక్టర్, వీఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. తక్షణమే వారు స్పందించి రూ.3.30 లక్షల పన్ను మినహాయింపు ఇచ్చారని, మిగిలిన రూ.1.50 లక్షలను దేవినేని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా చెల్లించి రసీదును కమిటీ సభ్యులకు అందజేశామన్నారు. మసీదు కమిటీ ట్రెజరర్ షేక్ షంసుద్దీన్ మట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ముస్లింలు అండగా ఉంటారన్నారు. 17, 18 డివిజన్ల కార్పొరేటర్లు వెంకట సత్యనారాయణ, తంగిరాల రామిరెడ్డి, మస్జిద్ కమిటీ సభ్యులు ఖాసీం, షంసుద్దీన్, షేక్ బాజీ పాల్గొన్నారు.

వృక్ష సంపదను కాపాడుకోవాలి

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): వృక్ష సంపదను కాపాడుకోవాలని అటవీ శాఖ డెప్యూటీ కన్జర్వేటర్ వి.కృష్ణమూర్తి చెప్పారు. సిద్ధార్థ కళాశాల ఎకో క్లబ్, గ్రీన్ క్లబ్, కళాశాలలోని వాటర్ కన్జర్వేషన్ క్లబ్ సంయుక్తంగా ప్రపంచ అటవీ దినోత్సవాన్ని మంగళవారం కళాశాల ఆవరణలోని సెమినార్ హాల్లో నిర్వహించారు. కృష్ణమూర్తి విద్యార్థులకు అటవీ సంరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. మానవ అవసరాల కోసం వృక్ష సంపదను విచక్షణా రహితంగా తొలగించడంతో క్రమేపీ అటవీ విస్తర్ణం తగ్గిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సమీపంలోని అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి అటవీ సంపదపై కళాశాల యాజమాన్యం విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రిన్సిపాల్ రమేష్, కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ ప్రొఫెసర్ రాజేష్ సీ.జంపాల, వృక్ష శాస్త్ర విభాగాధిపతి పి.శ్రీనివాసరావు, అధ్యాపకులు డి.శ్రావణి, వి.విశాలాక్షి, నాగార్జునతో పాటుగా విద్యార్థులు పాల్గొన్నారు. కాలేజీ ఆవరణలో కళాశాల ప్రతినిధులు, అధ్యాపకులతో కలిసి కృష్ణమూర్తి మొక్కను నాటారు.

విద్యార్థులు ఆర్థికవేత్తలుగా ఎదగాలి

గుణదల (విజయవాడ తూర్పు): విద్యార్థులు భవిష్యత్ లో పారిశ్రామిక రంగంలో అభివృద్ధి సాధించి ఆర్థిక వేత్తలుగా ఎదగాలని మూప్స్ కన్సెల్టెన్సీ మేనేజింగ్ డైరెక్టర్ విజయకుమార్ అన్నారు. ఆంధ్రలయోల కళాశాలలో విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యత అనే అంశం పై విద్యార్థులకు అవగాహనా సదస్సు, శిక్షణా కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. విద్యార్థి దశలో ఉన్నప్పుడు పాఠ్యాంశాలపై పట్టు సాధించాలని పేర్కొన్నారు. చదువు పూర్తి చేసుకుని వాణిజ్య,వ్యాపార,పారిశ్రామిక రంగాలలో అభివృద్ధి సాధించాలని సూచించారు. ఆర్థిక రంగంపై ఎప్పటికప్పుడు అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. లయోల కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ కిషోర్ పాల్గొన్నారు.

నేడు యూత్ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ప్రారంభం

గుణదల (విజయవాడ తూర్పు): ఆంధ్ర లయోల కళాశాలలో బుధవారం యూత్ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ సంస్థను ప్రారంభించనున్నట్లు కళాశాల యూత్ ఎంపవరింగ్ సర్వీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఫాదర్ బాల బొల్లినేని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల ఆవరణలోని ప్రియదర్శిని ప్రాంగణంలో ఈ సంస్థను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం 4.30 గంటలకు విజయవాడ కతోలిక పీఠం బిషప్ తెలగతోటి రాజారావు, సాంఘిక సంక్షేమ శాఖామంత్రి మెరుగ నాగార్జున ముఖ్యఅతిథులుగా హాజరవుతారని తెలిపారు.

చిరు ధాన్యాలతో పోషకాహారం

లబ్బీపేట(విజయవాడతూర్పు): చిరుధాన్యాలు, ఆకుకూరలు, మునగాకు వంటి వాటితో తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవచ్చని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఉమాదేవి అన్నారు. జిల్లాలో నిర్వహిస్తున్న పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా మంగళవారం లబ్బీపేటలోని అమరజీవి మదర్ థెరిస్సా మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మిల్లెట్స్ గురించి విద్యార్థులకు అవగాహన కలిగించి ర్యాలీ నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, తల్లులకు సదస్సు నిర్వహించి పోషకాహారంపై అవగాహన కలిగించారు. సీడీపీఓ మంగమ్మ, సూపర్‌వైజర్ శ్యామలత, సరిత పాల్గొన్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	446	58,074
నిఫ్టీ ▲	119	17,108

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	11,816	▲ 141
డోజోన్స్	32,463	▲ 182
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,536	▲ 132
డాక్స్	15,195	▲ 262
షాంఘై	3,256	▲ 21
నికాయ్ (సోమవారం ముగింపు)	26,946	▽ 388

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో — ముంబై	
బంగారం (24 క్యారెట్)	59,188
బంగారం (22 క్యారెట్)	58,951
వెండి (కిలో)	68,499

ఐటీకి బ్యాంకింగ్ షాక్!



రెండు వారాలుగా అమెరికా, యూరప్ ప్రాంతాల బ్యాంకింగ్ రంగంలో ఒకేసారి సంక్షోభ పరిస్థితులు తలెత్తాయి. పలు బ్యాంకులు మూత పడుతున్నాయి. దీంతో దేశీ ఐటీ రంగానికి సమస్యలు ఎదురుకా వచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. పరిశ్రమ ఆదాయంలో అత్యధిక వాటాకు ప్రాతినిధ్యం వహించే బీఎఫ్ఎస్ఐ విభాగం ఇందుకు కారణం కానున్నట్లు అంచనా.

- విదేశీ బ్యాంకుల వైఫల్యం ఎఫెక్ట్
- భవిష్యత్‌లో డీల్స్, ధరలపై ఒత్తిడి
- వచ్చే ఏడాది ప్రతికూల ఫలితాలు
- సాఫ్ట్‌వేర్ రంగ నిపుణుల అంచనాలు

సాక్షి, బిజినెస్ డెస్క్: కొద్దిరోజులుగా అటు అమెరికా, ఇటు యూరప్ బ్యాంకింగ్ రంగాలలో ప్రకంపనలు పుడుతున్నాయి. అమెరికాలో ఉన్నట్టుండి సిల్వర్‌గేట్ క్యాపిటల్ మూతపడగా.. వైఫల్యాల బాటలో ఉన్న సిలికాన్ వ్యాలీ బ్యాంక్‌ను ఫెడరల్ డిపాజిట్ ఇన్సూరెన్స్ కార్ప్(ఎఫ్‌డీఐసీ) టేకోవర్ చేసింది. ఈ బాటలో సిగ్నేచర్ బ్యాంక్ సైతం దివాలాకు చేరగా.. న్యూయార్క్ కమ్యూనిటీ బ్యాంక్ ఆదుకుంది. అనుబంధ సంస్థ ఫ్లాగ్‌స్టార్ బ్యాంక్ ద్వారా ఆస్తుల కొనుగోలుకి అంగీకరించింది. ఇక మరోపక్క యూరోపియన్ బ్లూచిప్ క్రెడిట్ సూసీ దివాలా స్థితికి చేరడంతో స్విస్ కేంద్ర బ్యాంకు కల్పించుకుని ఫైనాన్షియల్ రంగ దిగ్గజం యూబీఎస్‌ను రంగంలోకి దించాల్సి వచ్చింది. ఇక తాజాగా ఫస్ట్ రిపబ్లిక్ బ్యాంకును ఆదుకోవాలని జేపీ మోర్గాన్ ఇతర దిగ్గజాలతో చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ప్రపంచవ్యాప్తంగా 2008 తదుపరి మరోసారి ఫైనాన్షియల్ రంగంలో సంక్షోభ పరిస్థితులు నెలకొన్నట్లు బ్యాంకింగ్ వర్గాలు పేర్కొంటున్నాయి. కాగా.. ఈ ప్రభావం దేశీ సాఫ్ట్‌వేర్ సేవల రంగాన్ని దెబ్బ తీసే వీలున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

కోలుకుంటున్న వేళ

కోవిడ్–19 సవాళ్లలో ఊపందుకున్న సాఫ్ట్‌వేర్ రంగం ఇటీవల రష్యా– ఉక్రెయిన్ యుద్ధం, ద్రవ్యోల్బణం, అధిక వడ్డీ రేట్లతో కొంత అనిశ్చిత వాతావరణాన్ని చవిచూస్తోంది. దీంతో కొద్ది రోజులుగా ఉద్యోగ నియామకాలు మందగించగా.. వచ్చే ఏడాదిపై ఆశావహ దృక్పథాన్ని ప్రదర్శిస్తున్నాయి. అయితే ఇంతలోనే బ్యాంకింగ్ రంగ సంక్షోభం ద్వారా మరో షాక్ తగలనున్నట్లు పరిశ్రమ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఫలితంగా ప్రపంచ బ్యాంకింగ్ రంగంలో కుదుపుల కారణంగా దేశీ ఐటీ దిగ్గజాలకు వచ్చే ఆర్థిక సంవత్సరం (2023–24)లో మరోసారి ప్రతికూల పరిస్థితులు ఎదురుకానున్నట్లు చెబుతున్నారు.

బీఎఫ్ఎస్ఐ దెబ్బ

దేశీ ఐటీ సేవల రంగంలో బ్యాంకింగ్, ఫైనాన్షియల్, ఇన్సూరెన్స్(బీఎఫ్ఎస్ఐ) విభాగం ప్రధాన పాత్ర పోషిస్తుంటుంది. సాఫ్ట్‌వేర్ రంగ సమాఖ్య నాస్కామ్ గణాంకాల ప్రకారం మొత్తం ఆదాయంలో 20–40 శాతం వాటాను ఆక్రమిస్తుంటుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022–23)లో ఈ వాటా 41 శాతాన్ని తాకనున్నట్లు అంచనా. ఇటీవల సవాళ్లు ఎదుర్కొంటున్న బ్యాంకులకు ప్రధానంగా దేశీ దిగ్గజాలు టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఎల్‌టీఐమైండ్‌ట్రీ, ఎంఫసిస్ సేవలు అందిస్తున్నాయి. ఉదాహరణకు సిలికాన్ వ్యాలీ బ్యాంక్, క్రెడిట్ సూసీ, యూబీఎస్‌లకు టీసీఎస్ ఐటీ సర్వీసులు సమకూర్చుతోంది. ఇన్ఫోసిస్, ఎల్‌టీఐఎం సైతం సేవలు అందిస్తున్నాయి. దీంతో ప్రస్తుత ఏడాది క్యూ4(జనవరి–మార్చి)లోనే ఈ కంపెనీలు ప్రొవిజన్లు చేపట్టే వీలున్నట్లు నిపుణులు భావిస్తున్నారు. అయితే 2008లో లేమన్ బ్రదర్స్ దివాలా తదుపరి బ్యాంకులు వ్యయాల తగ్గింపు, బిజినెస్ పెంపు ప్రాజెక్టులపై దృష్టి సారించడంతో దీర్ఘకాలంలో ఐటీ రంగం బలపడిన విషయాన్ని నిపుణులు ప్రస్తావిస్తున్నారు. స్వల్ప కాలం నుంచి మధ్యకాలానికి డీల్స్ తగ్గనుండగా.. కాంట్రాక్ట్ ధరలపై సైతం ఒత్తిడి తలెత్తవచ్చని అంచనా. దేశీ ఐటీ దిగ్గజాల ఆదాయాల్లో ఉత్తర అమెరికా, యూరోపియన్ ప్రాంతాలు ప్రధాన పాత్ర పోషించే సంగతి తెలిసిందే. వెరసి ఈ ఏడాది క్యూ4పై పెద్దగా ప్రభావం పడనప్పటికీ వచ్చే ఏడాది ప్రతికూలతలు కనిపించవచ్చని నిపుణులు తెలియజేశారు.

మందగమనం

అంతర్జాతీయంగా బ్యాంకింగ్ రంగం సంక్షోభ పరిస్థితుల్లో చిక్కుకోవడంతో కొత్త డీల్స్ మందగించవచ్చని యాక్సిస్ సెక్యూరిటీస్ నిపుణులు పేర్కొంటున్నారు. ఆధునిక ఆటోమేషన్ ప్రాసెస్, ట్రాన్స్‌ఫార్మేషన్ ప్రణాళికలు తదితరాలకు తాత్కాలికంగా బ్రేక్ పడే వీలున్నట్లు తెలియజేశారు. ఇది ఐటీ కాంట్రాక్టులు ఆలస్యమయ్యేందుకు కారణంకావచ్చని విశ్లేషించారు. తాజా ఐటీ వ్యయ ప్రణాళికలు వాయిదా పడవచ్చని, కొత్త ఆర్డర్లకు విఘాతం కలగవచ్చని రిలయన్స్ సెక్యూరిటీస్ విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. బీఎఫ్ఎస్ఐ అతిపెద్ద విభాగమని దీంతో దేశీ సాఫ్ట్‌వేర్ సేవలకు దెబ్బ తగలవచ్చని పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో... రూ. 1,750 కోట్ల పెట్టుబడులు

- యాంప్లస్ సోలార్ రూ. 1,500 కోట్లు
- ఎలిస్టా రూ. 250 కోట్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇటీవల గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌తో ఇన్వెస్టర్ల దృష్టిని మరింతగా ఆకర్షించిన ఆంధ్రప్రదేశ్‌లో మరో రెండు భారీ పెట్టుబడులు రానున్నాయి. యాంప్లస్ సోలార్ రూ. 1,500 కోట్లు, ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థ ఎలిస్టా ఇండియా రూ. 250 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నాయి. 7.5 కేపీటీఏ (వార్షికంగా కిలో టన్నులు) సామర్థ్యంతో హరిత హైడ్రోజన్ ప్లాంట్ల ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకున్నట్లు యాంప్లస్ సోలార్ తెలిపింది. పారిశ్రామిక వినియోగ అవసరాల కోసం వీటిని నెలకొల్పనున్నట్లు సంస్థ ఎండీ, సీఈవో శరద్ పుంగాలియా వివరించారు. అంతర్జాతీయ హరిత హైడ్రోజన్ హబ్‌గా ఎదగాలన్న భారత లక్ష్య సాకారంలో తాము కూడా పాలుపంచుకోనున్నట్లు ఆయన వివరించారు. ఆ దిశగా ఈ ఎంవోయూ తొలి అడుగు అని శరద్ చెప్పారు. పెట్రోకెమికల్స్, సిమెంటు, ఎరువులు తదితర రంగాల సంస్థలకు ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక హబ్‌గా మారిన నేపథ్యంలో ఆయా పరిశ్రమల అవసరాల కోసం పునరుత్పాదకత విద్యుదుత్పత్తికి పుష్కలంగా అవకాశాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. యాంప్లస్ పోర్ట్‌ఫోలియోలో 1.4 గిగావాట్ల సోలార్ అసెట్లు ఉన్నాయి.

కడపలో ఎలిస్టా ప్లాంటు..

దేశీయంగా అమ్మకాలు, ఎగుమతుల కోసం కడపలో తయారీ ప్లాంటును ఏర్పాటు చేయనున్నట్లు ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థ ఎలిస్టా ఇండియా వెల్లడించింది. దీనిపై వచ్చే అయిదేళ్లలో దశలవారీగా రూ. 250 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు సంస్థ సీఎండీ సాకేత్ గౌరవ్ తెలిపారు. తొలుత రూ. 50 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్లాంటులో ఏటా పది లక్షల పైచిలుకు స్మార్ట్ యూనిట్లు, మానిటర్లను తయారు చేయనున్నట్లు ఆయన వివరించారు. అ తర్వాత ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషీన్లు, డిష్‌వాషర్లు వంటి గృహోపకరణాల విభాగాల్లోకి కూడా ప్రవేశించనున్నట్లు గౌరవ్ చెప్పారు. ప్రస్తుతం రూ. 200 కోట్ల స్థాయిలో ఉన్న తమ ఆదాయాలు ఈ ప్లాంటు పూర్తిగా అందుబాటులోకి వస్తే రూ. 1,500 కోట్లకు చేరగలవని ఆయన పేర్కొన్నారు. దీనితో 500 పైగా ఉద్యోగాల కల్పన జరుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్లాంటు నుంచి వచ్చే ఆదాయంలో 60 శాతం వాటా ఎగుమతుల మార్కెట్ నుంచే ఉంటుందని అంచనా వేస్తున్నట్లు గౌరవ్ తెలిపారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కి చెందిన టెక్నోడోమ్ గ్రూప్‌లో భాగంగా 2020లో ఎలిస్టా ఏర్పాటైంది.

హ్యుందాయ్ కొత్త వెర్నా




హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ సంస్థ హ్యుందాయ్ మోటార్ ఇండియా మధ్య స్థాయి సెడాన్ కొత్త వెర్నా ప్రవేశపెట్టింది. ఎక్స్‌షోరూంలో ధర రూ.10.89 లక్షల నుంచి మొదలుకుని రూ.17.37 లక్షల వరకు ఉంది. హోండా సిటీ, స్కోడా స్లావియా, ఫోక్స్‌వ్యాగన్ వర్టస్, మారుతీ సుజుకీ సియాజ్‌కు ఈ కారు పోటీనిస్తుంది. ఇంజన్ రకాన్నిబట్టి మైలేజీ లీటరుకు 18.6–20.6 కిలోమీటర్లు ఇస్తుందని కంపెనీ ప్రకటించింది. ఆరు ఎయిర్‌బ్యాగ్స్‌తో సహా 30 రకాల భద్రత, 17 రకాల లెవెల్–2 అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్స్ జోడించారు. ఇప్పటికే 8,000 బుకింగ్స్ నమోదయ్యాయి. 2006లో భారత్‌లో వెర్నా అడుగుపెట్టింది. 4.65 లక్షల కార్లు ఇక్కడి రోడ్లపై పరుగెడుతున్నాయి. భారత్ నుంచి 4.5 లక్షల యూనిట్లు వివిధ దేశాలకు సరఫరా అయ్యాయని హ్యుందాయ్ మోటార్ ఇండియా ఎండీ, సీఈవో ఉన్సూ కిమ్ తెలిపారు. 2023లో రెండింతలకుపైగా వృద్ధితో 40,000 వెర్నా కార్లను విక్రయించాలన్నది కంపెనీ లక్ష్యం.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

22-3-2023	
విశాఖ	450–00
చిత్తూరు	473–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	438–00
విజయవాడ	438–00
రిటైల్ ధర (డజను)	66.00
21-3-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	425–00
వరంగల్	427–00
రిటైల్ ధర	4.95

మళ్లీ లాభాల్లోకి..

- కలిసొచ్చిన ప్రపంచ మార్కెట్ల రికవరీ
- ఫైనాన్స్ బ్యాంకింగ్ షేర్లలో కొనుగోళ్లు
- సూచీల ర్యాలీకి రిలయన్స్ దన్ను
- 58 వేల స్థాయి పైకి సెన్సెక్స్
- నిఫ్టీ లాభం 119 పాయింట్లు



ముంబై: అధిక వెయిటేజీ రిలయన్స్‌తో పాటు ఫైనాన్స్, బ్యాంకింగ్ షేర్లు రాణించడంతో స్టాక్ సూచీలు మళ్లీ లాభాలు ఆర్జించాయి. ప్రపంచ బ్యాంకింగ్ రంగ సంక్షోభ నివారణకు ఆయా దేశాలు తీసుకుంటున్న చర్యలు ఇన్వెస్టర్లలో విశ్వాసాన్ని నింపాయి. అలాగే ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల పెంపు 25 బేసిస్ పాయింట్లు మాత్రమే ఉండొచ్చనే ఆశావహ అంచనాలు నెలకొన్నాయి. ఫలితంగా అంతర్జాతీయ మార్కెట్లలోని రికవరీ దేశీయ సూచీలకు దన్నుగా నిలిచింది. క్రూడాయిల్ ధరలు ఏడాదిన్నర కనిష్టానికి దిగిరావడం కూడా కలిసొచ్చింది. ఉదయం సెన్సెక్స్ 334 పాయింట్ల లాభంతో 57,963 వద్ద మొదలైంది. ఇంట్రాడేలో 57,730 వద్ద కనిష్టాన్ని, 58,133 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. ఆఖరి 446 పాయింట్లు ఎగసి 58,074 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 17,016–17,128 శ్రేణిలో ట్రేడైంది. చివరికి 119 పాయింట్ల లాభంతో 17,108 వద్ద నిలిచింది. ఐటీ, ఎఫ్ఎంసీజీ షేర్లు మాత్రమే అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. విస్తృత స్థాయి మార్కెట్లో నెలకొన్న కొనుగోళ్లతో బీఎస్ఈ మిడ్, స్మాల్‌క్యాప్ సూచీలు 0.5% చొప్పున లాభపడ్డాయి. ఎఫ్‌పీఐలు రూ.1455 కోట్ల షేర్లను అమ్మేశారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1946 కోట్ల షేర్లను కొన్నారు.



ఎంబాపె సారథ్యంలో బరిలోకి ఫ్రాన్స్...

ఫ్రాన్స్ ఫుట్‌బాల్ జట్టు కొత్త కెప్టెన్‌గా స్టార్ ఫార్వర్డ్ కిలియాన్ ఎంబాపె నియమితుడయ్యాడు. 24 ఏళ్ల ఎంబాపె 2018 ప్రపంచకప్‌లో ఫ్రాన్స్‌కు టైటిల్ దక్కడంలో... 2022 ప్రపంచకప్‌లో రన్నరప్‌గా నిలువడంలో కీలకపాత్ర పోషించాడు. పదేళ్లకంటే ఎక్కువ కాలం నుంచి ఫ్రాన్స్ జట్టుకు కెప్టెన్‌గా ఉన్న గోల్‌కీపర్ హ్యూగో లోరిస్ ప్రపంచకప్ ముగిశాక సారథ్య బాధ్యతల నుంచి వైదొలిగాడు. 2024 యూరో క్వాలిఫయింగ్ టోర్నీలో భాగంగా శుక్రవారం నెదర్లాండ్స్‌తో జరిగే మ్యాచ్‌లో ఎంబాపె కెప్టెన్‌గా బరిలోకి దిగుతాడు.

క్లాసెన్ మెరుపు శతకం

వెస్టిండీస్‌తో జరిగిన మూడో వన్డేలో దక్షిణాఫ్రికా నాలుగు వికెట్లతో గెలిచి సిరీస్‌ను 1–1తో ముగించింది. హెన్రిక్ క్లాసెన్ (61 బంతుల్లో 119 నాటౌట్; 15 ఫోర్లు, 5 సిక్స్‌లు) మెరుపు శతకంతో దక్షిణాఫ్రికాను గెలిపించాడు. విండీస్ 48.2 ఓవర్లలో 260 పరుగులకు ఆలౌటైంది. దక్షిణాఫ్రికా 29.3 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 264 పరుగులు చేసి గెలిచింది.

ఫైనల్లో ఢిల్లీ

ముంబై ఇండియన్స్, యూపీ వారియర్స్ మధ్య ఎలిమినేటర్ మ్యాచ్



ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నీలో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు ఫైనల్లోకి దూసుకెళ్లింది. మంగళవారంతో లీగ్ దశ మ్యాచ్‌లు ముగిశాయి. చివరి రౌండ్ లీగ్ మ్యాచ్‌ల్లో ఢిల్లీ క్యాపిటల్స్ ఐదు వికెట్ల తేడాతో యూపీ వారియర్స్‌ను ఓడించగా... ముంబై ఇండియన్స్ నాలుగు వికెట్లతో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టుపై గెలిచింది. ఢిల్లీ, ముంబై 12 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచాయి. అయితే మెరుగైన రన్‌రేట్ ఆధారంగా ఢిల్లీ (1.856) 'టాపర్'గా నిలిచి ఫైనల్ చేరింది. మరో ఫైనల్ బెర్త్ కోసం శుక్రవారం జరిగే ఏకైక ఎలిమినేటర్ మ్యాచ్‌లో యూపీ వారియర్స్‌తో ముంబై తలపడుతుంది.

ఢిల్లీతో మ్యాచ్‌లో తొలుత యూపీ 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 138 పరుగులు చేసింది. తాలియా (58 నాటౌట్; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీ చేసింది. ఢిల్లీ బౌలర్లలో అలైస్ క్యాప్సీ (3/26) ఆకట్టుకుంది. ఢిల్లీ 17.5 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 142 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది. క్యాప్సీ (34; 4 ఫోర్లు, 1 సిక్స్), మరిజాన్ కాప్ (34 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్), లానింగ్ (23 బంతుల్లో 39; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) నిలకడగా ఆడి ఢిల్లీ విజయంలో కీలకపాత్ర పోషించారు. ముంబైతో మ్యాచ్‌లో తొలుత బెంగళూరు 9 వికెట్లకు 125 పరుగులు చేసింది. ముంబై 16.3 ఓవర్లలో 6 వికెట్లకు 129 పరుగులు చేసి గెలిచింది.

డబ్ల్యూపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	మ్యా	గె	ఓ	పా	నె.ర.
ఢిల్లీ	8	6	2	12	1.856
ముంబై	8	6	2	12	1.711
యూపీ	8	4	4	8	–0.200
బెంగళూరు	8	2	6	4	–1.137
గుజరాత్	8	2	6	4	–2.220

నోట్: మ్యా–మ్యాచ్‌లు, గె–గెలిచినవి, ఓ–ఓడినవి, పా–పాయింట్లు, నె.ర–నెట్ రన్‌రేట్

'వన్డే' విజేత ఎవరో?



- నేడు భారత్, ఆస్ట్రేలియా చివరి మ్యాచ్
- గెలిచిన జట్టు ఖాతాలో సిరీస్
- మధ్యాహ్నం గం.1:30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

అంతర్జాతీయ క్రికెట్‌లో రెండు అగ్రశ్రేణి జట్ల మధ్య సమరం చివరి ఘట్టానికి చేరింది. టెస్టు సిరీస్‌ను గెలుచుకొని భారత్ ఆధిక్యం ప్రదర్శించగా, ఒక విజయంతో ఆసీస్ కూడా సంతృప్తిగా ముగించింది. ఇప్పుడు వన్డేల్లో ఇరు జట్లు సమంగా నిలిచిన స్థితిలో సిరీస్ విజేతను తేల్చే ఆఖరి సమరానికి సమయం ఆసన్నమైంది. విశాఖలో ఎదురైన ఘోర పరాజయానికి బదులు తీర్చుకుంటూ ఘనంగా ముగించాలని టీమిండియా భావిస్తుండగా... భారత్‌లో సిరీస్ సాధించే అరుదైన అవకాశాన్ని వదులుకోరాదని కంగారూలు పట్టుదలగా ఉన్నారు. ఇరు జట్లు సమ ఉజ్జీలుగా కనిపిస్తున్న నేపథ్యంలో ఆసక్తికర పోరుకు చెన్నై వేదిక కానుంది.

ప్రాక్టీస్ సెషన్‌లో భారత కెప్టెన్ రోహిత్ శర్మ

చెన్నై: ఆస్ట్రేలియాతో తొలి వన్డేలో ఎంతో శ్రమించి నెగ్గిన భారత రెండో వన్డేలో పూర్తిగా చేతులెత్తేసింది. టెస్టు సిరీస్ ఫలితం ఎలా ఉన్నా మన వన్డే టీమ్ బలహీనతలను గత మ్యాచ్ చూపించింది. వరల్డ్ కప్ ఏడాదిలో ఆస్ట్రేలియాలాంటి పటిష్టమైన జట్టు ఎదురైతే పరిస్థితి ఎలా ఉంటుందనేది మనకు తాజా ఫలితం చూపించింది. ఈ నేపథ్యంలో ఆసీస్‌ను ఓడించి సిరీస్‌ను తమ ఖాతాలో వేసుకోవడం భారత జట్టు తక్షణ లక్ష్యం. అయితే గత మ్యాచ్ ఇచ్చిన ఉత్సాహంతో స్మిత్ సేన కూడా సిరీస్ గెలుపుపై దృష్టి పెట్టింది. ఇలాంటి స్థితిలో భారత్, ఆసీస్ నేడు జరిగే చివరి వన్డేలో తలపడబోతున్నాయి.

సుందర్‌కు చాన్స్!

'సూర్యకుమార్‌కు మేం కనీసం 7–10 వన్డేల్లో అవకాశం కల్పిస్తాం' వరుసగా రెండు మ్యాచ్‌లలో తొలి బంతికే అవుటైన తర్వాత కూడా కెప్టెన్ రోహిత్ చేసిన వ్యాఖ్య ఇది. దీనిని బట్టి చూస్తే భారత బ్యాటింగ్‌కు సంబంధించి టీమ్‌లో మార్పులు ఉండకపోవచ్చు. ఈ బ్యాటింగ్ బలగంతోనే విజయాన్ని అందుకోవాలని రోహిత్ పట్టుదలగా ఉన్నాడు. బౌలింగ్ విషయంలో భారత్ ముందు ఇతర ప్రత్యామ్నాయాలేవీ లేవు కాబట్టి పేసర్లుగా షమీ, సిరాజ్ ఖాయం. పాండ్యా ఆల్‌రౌండర్‌గా తన పాత్ర నెరవేర్చగలడు. అక్షర్, జడేజాలాంటి స్పిన్ బౌలింగ్ ఆల్‌రౌండర్లకు తోడు గా మరో స్పిన్ బౌలింగ్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌కు ఈ మ్యాచ్‌లో చోటు దక్కవచ్చు. పెద్దగా ఆకట్టుకోని కుల్దీప్ యాదవ్ స్థానంలో సుందర్ తన సొంతగడ్డపై తొలి మ్యాచ్ ఆడే అవకాశాలున్నాయి.

వార్నర్ సిద్ధం...

మరోవైపు సిరీస్ గెలిచే అవకాశాన్ని కోల్పోరాదని భావిస్తున్న ఆస్ట్రేలియా దానికి తగిన వ్యూహరచన చేస్తోంది. స్పిన్‌కు అనుకూలించే అవకాశం ఉండటంతో ఒక పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్ అబాట్‌ను తప్పించి అతని స్థానంలో మ్యాక్స్‌వెల్‌ను ఆడించనుంది. దూకుడైన బ్యాటర్ వార్నర్ గాయం నుంచి కోలుకోవడం జట్టు బలం పెంచింది. టెస్టుల్లో వార్నర్ విఫలమైనా... పరిమిత ఓవర్ల క్రికెట్‌లో అతను ఇప్పటికీ స్టార్ బ్యాటరే. మార్ష్, హెడ్ విజయవంతమైన ఓపెనింగ్ జోడీనే అయినా వార్నర్ ఆడితే మార్ష్ మిడిలార్డర్‌కు మారతాడు. స్టొయినిస్, గ్రీన్‌లాంటి ఆల్‌రౌండర్లతో ఆసీస్ పటిష్టంగా ఉంది.

పిచ్, వాతావరణం

చాలా కాలంగా చెపాక్ మైదానం స్పిన్‌కు అనుకూలం. భారీ స్కోర్లు ఎక్కువగా నమోదు కాలేదు. ఈసారీ అలాగే కనిపిస్తోంది. మ్యాచ్ రోజు వర్షసూచన లేదు.

తుది జట్లు వివరాలు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), గిల్, కోహ్లి, సూర్యకుమార్, రాహుల్, పాండ్యా, జడేజా, అక్షర్, సుందర్, షమీ, సిరాజ్.

ఆస్ట్రేలియా: స్మిత్ (కెప్టెన్), వార్నర్, హెడ్, మార్ష్, క్యారీ, గ్రీన్, మ్యాక్స్‌వెల్, స్టొయినిస్, అగర్, స్టార్క్, జంపా.

అక్టోబర్ 5 నుంచి వన్డే వరల్డ్‌కప్!

నవంబర్ 19న అహ్మదాబాద్‌లో ఫైనల్

న్యూఢిల్లీ: పుష్కర కాలం తర్వాత భారత్ ఆతిథ్యం ఇవ్వనున్న వన్డే వరల్డ్‌కప్ టోర్నీకి సంబంధించి తేదీలు దాదాపుగా ఖరారయ్యాయి. బీసీసీఐ దీనిపై అధికారిక ప్రకటన చేయకపోయినా, గత వారం దుబాయ్‌లో జరిగిన అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) సమావేశంలో ఈ వివరాలు అందించినట్లు సమాచారం. దీని ప్రకారం అక్టోబర్ 5న ప్రపంచ కప్ ప్రారంభమవుతుంది. నవంబర్ 19న అహ్మదాబాద్‌లో ఫైనల్ నిర్వహిస్తారు. 10 జట్లు టోర్నీలో పాల్గొంటుండగా, 46 రోజుల పాటు మొత్తం 48 మ్యాచ్‌లు నిర్వహిస్తారు. వేదికల విషయంలో అహ్మదాబాద్ కాకుండా మరో 11 నగరాలను బీసీసీఐ ప్రాథమికంగా 'షార్ట్ లిస్ట్' చేసింది. ముంబై, బెంగళూరు, చెన్నై, ఢిల్లీ, ధర్మశాల, గువాహటి, హైదరాబాద్, కోల్‌కతా, లక్నో, ఇండోర్, రాజ్‌కోట్ ఈ జాబితాలో ఉన్నాయి. అక్టోబర్–నవంబర్ నెలలో భారత్‌లో ఉండే వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని మ్యాచ్‌లు, వాటి వేదికల వివరాలకు సంబంధించి పూర్తి స్థాయి షెడ్యూల్‌ను బీసీసీఐ ఇంకా ఖరారు చేయలేదు. అయితే త్వరలోనే దీనిని వెల్లడిస్తామని ఐసీసీకి బోర్డు సమాచారమిచ్చింది. పాకిస్తాన్ జట్టుకు వీసా మంజూరు, భారత ప్రభుత్వం నుంచి పన్ను రాయితీ అందించడం వంటి అంశాలపై కూడా బీసీసీఐ మరింత స్పష్టతనివ్వాల్సి ఉంది. 2011లో చివరిసారిగా భారత్‌లో వన్డే వరల్డ్ కప్ జరగ్గా... ఫైనల్లో శ్రీలంకను ఓడించి మన జట్టే విజేతగా నిలిచింది.

పతకానికి విజయం దూరంలో...

క్వార్టర్ ఫైనల్లో నిఖత్ జరీన్, నీతూ, మనీషా, జాస్మిన్



న్యూఢిల్లీ: ప్రపంచ సీనియర్ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్లు నిఖత్ జరీన్ (50 కేజీలు), మనీషా మౌన్ (57 కేజీలు), నీతూ (48 కేజీలు), జాస్మిన్ (60 కేజీలు) క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. క్వార్టర్ ఫైనల్లో గెలిచి సెమీఫైనల్ చేరితే ఈ నలుగురికీ కనీసం కాంస్య పతకాలు ఖాయమవుతాయి. మరోవైపు శశి చోప్రా (63 కేజీలు), మంజు బంబోరియా (66 కేజీలు) ప్రిక్వార్టర్ ఫైనల్లో ఓడిపోయారు. ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో నిఖత్ 5–0తో పాట్రిసియా (మెక్సికో)పై, కొసిమోవా (తజికిస్తాన్)పై నీతూ, తుర్హాన్ (తుర్కియే)పై మనీషా, సమదోవా (తజికిస్తాన్)పై జాస్మిన్ గెలుపొందారు. శశి చోప్రా 0–4తో మాయ్ కిటో (జపాన్) చేతిలో, ఖమిదోవా (ఉజ్బెకిస్తాన్) చేతిలో మంజు ఓడిపోయారు.

సెంచరీతో నెదర్లాండ్స్‌ను గెలిపించిన తేజ



హరారే: జింబాబ్వేతో మంగళవారం జరిగిన తొలి వన్డేలో నెదర్లాండ్స్ జట్టు మూడు వికెట్ల తేడాతో గెలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన జింబాబ్వే 47.3 ఓవర్లలో 249 పరుగులకు ఆలౌటైంది. మదాండే (74; 6 ఫోర్లు) టాప్ స్కోరర్. అనంతరం నెదర్లాండ్స్ 49.5 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 255 పరుగులు చేసి విజయం సాధించింది. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో జన్మించి నెదర్లాండ్స్ జట్టుకు ఆడుతున్న అనిల్ తేజ నిడమనూరు కెరీర్‌లో తొలి శతకం సాధించడం విశేషం. తేజ 96 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్స్‌లతో 110 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. 64 పరుగులకు 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన నెదర్లాండ్స్‌ను తేజ ఆదుకున్నాడు. తేజ ఆరో వికెట్‌కు అకెర్‌మన్ (50; 4 ఫోర్లు)తో కలిసి 46 పరుగులు... షారిజ్ (30; 2 ఫోర్లు)తో కలిసి ఏడో వికెట్‌కు 110 పరుగులు జోడించాడు. 1994 ఆగస్టు 22న విజయవాడలో జన్మించిన తేజ ఆ తర్వాత న్యూజిలాండ్‌కు వెళ్లి అక్కడ విద్యాభ్యాసం చేసి స్థానిక ఆక్లాండ్ జట్టుకు ఫస్ట్‌క్లాస్ క్రికెట్ ఆడాడు. అనంతరం 2019లో నెదర్లాండ్స్‌కు వెళ్లి ఉద్యోగం చేస్తూనే క్రికెటర్‌గా కొనసాగుతున్నాడు. గత ఏడాది అంతర్జాతీయ వన్డే, టి20 క్రికెట్‌లో నెదర్లాండ్స్ తరఫున అరంగేట్రం చేశాడు. ఇప్పటి వరకు తేజ 9 వన్డేలు, 6 టి20లు ఆడాడు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794.